సాహిత్యశాస్త్రమాలిక : ౨

సంపాదకుడు : ఆచార్య రాయప్రోలు సుబ్బారావు

ఆంధ్రప్రతాపరుద్రీయము

శ్రీ విద్యానాథుని కృతికి అనువాదము

ద్వితీయ భాగము

సాహిత్యాచార్య, లాక్షణికశిరోమణి

జమ్ములమడక మాధవరామశర్మ

పండితుడు

ఆంధ్ర క్రైస్తవ కళాశాల, గుంటూరు.

నవ్యసాహిత్య పరిషత్తు

△ గుంటూరు △

సాహిత్యశాస్త్రమాలిక : ౨

సంపాదకుడు : ఆచార్య రాయప్రోలు సుబ్బారావు

ఆంధ్ర ప్రతాపరుద్రీయము

శ్రీ విద్యానాథుని కృతికి అనువాదము

ద్వితీయ భాగము

సాహిత్యాచార్య, ప్రాతఃణికశిరోమణి

జమ్ములమడక మాధవరామశర్మ

పండితుడు

ఆంధ్ర క్రైస్తవ కళాశాల, గుంటూరు.

నవ్యసాహిత్యపరిషత్తు

△ గుంటూరు △

సూచిక

౧	దోషప్రకరణము	౧—౫౩
౨	గుణప్రకరణము	౫౪—౭౮
౩	శబ్దాలంకార ప్రకరణము	౭౯—౧౦౬
౪	అర్థాలంకార ప్రకరణము	౧౦౭—౩౪౩
౫	మిశ్రాలంకార ప్రకరణము	౩౪౪—౩౫౨

శ్రీ ర్జయతు

ఆంధ్ర ప్రతాపరుద్రీయము

దోష ప్రకరణము

కావ్య జీవితభూత మయిన రసము నిరూపిత మయింది. ఇక రసోపస్కారకము లయిన గుణాలంకారాలను నిరూపించ వలసి ఉన్నది. అయినా ప్రస్తుతము దోషాలను నిరూపించు తాము. రసోపస్కారకము లయిన గుణాలంకారముల వివే కము బాగా కలుగ వలెనన్నట్లయితే ముందుగా దోషాలను నిరూపించడము ఆవశ్యకము. కాకపోయి నట్లయితే గుణ వివేకము బాగా ప్రరూఢము కాదు. ముందుగా దోష స్వరూపమును తెలిసి కొన్నట్లయితే అనంతరము గుణవిజ్ఞా నము చక్కగా అలవడుతుంది. కాబట్టి ఈ ప్రకరణములో దోషనిరూపణము అవకాశము పొందుతుంది.

దోష స్వరూపము

దోషాలు అనేకము లున్నవి. దోష స్వరూపమును తెలియడానికి ఇది సమర్థమయిన సామాన్య లక్షణము..

దోషః కావ్యాపకర్షస్య హేతుః శబ్దార్థగోచరః.

కావ్యమునకు అపకర్షమును కలుగజేయడములో హేతువగు నది దోషము. అది ముఖ్యమయిన అర్థమును బోధించేది అవుతుంది. రసాపకర్షకము దోషము అని భావము. దోషము ఉన్నట్లయితే ముఖ్యార్థమయిన రసము నిర్మలినముగా ప్రతీతము కాదు. కాబట్టి దోషము రసమును అపకర్షించుతుంది అనేమాట యుక్తమే. రసాపకర్ష ద్వార

ంగా ఇది కావ్యాపకర్ష హేతు వవుతున్నది. కనుక
షము కావ్యాపకర్ష హేతువు అని ఇక్కడ చెప్ప బ
న్నది.

ఇట్టి ఈ దోషము శబ్దగోచరదోష మని అర్థగోచ
ష మని రెండు విధాలు. దోషము శబ్దార్థగోచర వ
డము విభాగపరమె కాని లక్షణపరము కాదు. కావ్యవ
ర్థమయము కదా! తదపకర్ష హేతువు లయిన దోషా
డా శబ్దగతముగా అర్థగతముగా ద్వివిధములు అ
న్నవి. వానిలో శబ్దగతదోషాలు పదగతములని వాక్యగ
లని ద్వైవిధ్యము పొందుతున్నవి. రసాదిప్రతీతి విభ
ద్వార మూలకము. విభావాది ప్రతీతి వాక్యాధీనము
క్యము పదముచే ప్రారంభింప బడుతుంది. కాబట్టి పదా
కమభావులు. అందువలన పదగతదోషాలను ముందుగ
ాపించుతాము.

పదగత దోషములు

అప్రయుక్తము, అపుష్టార్థము, అసమర్థము, నిరర్థకము
ూర్థము, చ్యుతసంస్కారము, సందిగ్ధము, అప్రయో
ం, క్లిష్టము, గూఢార్థము, గ్రామ్యము, అన్యార్థము
పతీతికము, అశ్లీలము, పరుషము, అని పదగత దోషము
యేడు దోషములు ప్రసిద్ధములై ఉన్నవి. ఇక వీని లక్ష
ణములను నిరూపించుతాము.

౧ అప్రయుక్తము

శబ్దకోశములలో ప్రసిద్ధమై ఉన్నప్పటికీ కవుల
యోగముల ద్వారా ఆదరింపక పోయి నట్లయితే అది అ
క్త మవుతుంది. ఈ దోషప్రకరణములో వనవృత్తితో

ఉన్న ప్రతాప శత్రుయువతుల వచనాల లోని దోషాలు ఉదహరింప బడుతవి. ఉదా–

విముఖా దైవతా స్సర్వే తే నో దుశ్చ్యవనాదయః,
అరణ్య గృహమేథినో్య యై ర్వ్యయం హంత! కల్పితాః.

ఆ దుశ్చ్యవనుడు మొదలయిన దైవతు లందరూ మాకు విముఖు లయినారు. వారిచే మేము అరణ్య గృహ మేథినులము చేయబడి నారము కదా! అయ్యో! దీనిలో "దైవతాః" అని దైవత శబ్దము పుంలింగముగా ప్రయుక్త మయింది. అది దుష్టము."బృందారకా దైవతాని పుంసి వా" అని అమరసింహుడు అమరకోశములో దైవత శబ్దము పుంలింగముగా కూడా అవుతుందని చెపుతున్నాడు. అయినా దానిని కవులు పుంలింగముగా ప్రయోగించడము లేదు. అందువలన ఇది అప్రయుక్తము. అట్లే దుశ్చ్యవన పదప్రయోగమున్నూ. దుశ్చ్యవనుడు అంటే ఇంద్రుడు. ఇంద్ర పర్యాయముగా దీనిని అమరసింహుడు తన నిఘంటువులో చెప్పుకున్నాడు. కాని కవులు దుశ్చ్యవన పదమును ఇంద్రపరముగా ప్రయోగించడము లేదు. కావున దోషము. ఇవి పదములందు ఉన్నవి కాబట్టి పదదోషములు.

౨ అపుష్టార్థము

ప్రకృతానుపయుక్తార్థ మపుష్టార్థం త దుచ్యతే.

ప్రకృతములో ఉపయోగింపని అర్థము అపుష్టార్థ మవుతుంది. అపుష్టము పోషింపబడనిది. ప్రకృతములో సరైన ఆనుకూల్యము ఉండక పోవడమె అపరిపోషము. అటువంటి అర్థము నిచ్చే పదము ప్రయోక్త మయితే అపుష్టార్థ మన్న మాట. ఉదా–

వ్యర్థాష్టార్ధార్ధ బాహూనా మమీషా మీదృశీం దశాం,
కథం సహామహే! ధిక్! ధిక్!! కఠినం హంత! జీవితమ్.

వ్యర్థములయిన అష్టార్ధార్ధ బాహువులు కల ఇట్టి మా యొక్క ఈ దశను ఎట్లా సహింపగలము? ఛీ! ఛీ!! అయ్యో!. మా జీవితము కఠినముగా ఉన్నది కదా! అష్ట ఎనిమిది. దానిలో అర్థము నాలుగు. అందు అర్థము రెండు. మొత్తము మీద వ్యర్థబాహు ద్వయము కలిగిన అని అర్థము. అసలు ఇక్కడ వ్యర్థబాహు ద్వయము కలిగిన అని వివక్షితము కాగా; "అష్టార్ధార్ధ బాహూనాం" అని అనడము అనుపయుక్తము. ఇది ప్రకృతములో ఏమీ ఉపయుక్తము కాదు. కాబట్టి అపుష్టార్థ మనే దోషము ఉన్నదని ఊహించాలి.

౩ అప్రయుక్తము

యోగమాత్ర ప్రసిద్ధం య దసమర్థం త దుచ్యతే.

కేవలము శాస్త్రములో మాత్రమె ప్రసిద్ధముగా ఉండేది అసమర్థము అనే దోషము. అది శాస్త్రములోనే ప్రసిద్ధ మవుతుంది. కాని చెప్పదలచిన అర్థమును చెప్పటలో సమర్థము కాదు. ప్రకృతాభీష్ట మయిన అర్థమును చెప్ప డానికి ఆ పదములో వాచకశక్తి ఉండదన్నమాట. ఉదా:-

విహాయ వసుధా మేతాం చతురంబుధరావృతాం,
క్వ ను గంతవ్య మస్మాక మరణ్యే ప్యసుఖా స్థితిః.

నాలుగు అంబుధరములచే ఆవరింపబడి ఉన్న ఈ వసుధను విడిచి మేము ఎక్కడకు వెళ్ళవలెను? మాకు అరణ్యములోకూడా స్థితి సుఖకరముగా లేదుకదా? ఈపద్యములో అంబుధరము అనగా సముద్రము. అంబుధరశబ్దము

వలస సముద్రము అనే అర్థమును శాస్త్రప్రసిద్ధిచే గ్రహింప వలసినదే కాని ఇక్కడ వాచకశక్తి ఏమీ లేదు. కాబట్టి ఇది అసమర్థ మవుతున్నది.

४ నిరర్థకము

పాదపూరణమాత్రం య త్ర న్నిరర్థక ముచ్యతే.

పద్యపాదమును పూరించుటకు మాత్రమే ఉపయోగించే పదము నిరర్థక మవుతుంది. దానిలాగ అర్థము ఏమీ ఉండదు. ఉదా:—

విహాయ చ గృహా న్తాన్వై వ్యత్యస్త నవవృత్తయః,
కదా భవిష్యతే వాసః కటకేషు మహీభృతామ్?

ఆగృహములను విడిచిపెట్టి వ్యత్యస్తములయిన నవ వృత్తులు కలవారమై ("నవ" వ్యత్యస్తమయినట్లయితే "వన" అవుతుంది. కాగా వనవృత్తులుకలవారమై అని అర్థము) ఉన్న మాకు మహీభృత్కటకములందు నివాసము ఎప్పుడు కలుగుతుందోకదా! (మహీభృత్కటకములు=పర్వతముల చరియలు రాజుల శిబిరములు) ఈపద్యములో 'వై' అనే పదము కేవలము పాదపూరణానికే స్వీకృతమయింది. కాబట్టి నిరర్థకము.

౫ నేయార్థము

స్వసంకేత ప్రసిద్ధార్థం నేయార్థం పరికీర్త్యతే,

కేవలము తమ సంకేతములోమాత్రము ప్రసిద్ధ మయిన అర్థము కలది నేయార్థము అవుతుంది. తాము ఏదో ఏర్పరచుకొన్న అర్థమును ఆపదము అధీనము చేసికొంటుంది. ఉదాహరణము పూర్వపద్యము. దానిలో

"వ్యత్యస్తనవ" శబ్దమువలన వనప్రతీతి కలుగుట అనేది కేవలమూ స్వసంకేతాయత్తము. కాబట్టి అది నేయార్థము.

౭ చ్యుతసంస్కారము

శబ్దశాస్త్రవిరుద్ధం యత్ చ్యుతసంస్కార మిష్యతే.

శబ్దశాస్త్రానికి విరుద్ధముగా ఉండేది చ్యుతసంస్కారము. వ్యాకరణముచేత చేయబడిన సంస్కారము ఎక్కడ చ్యుత మవుతుందో అక్కడ చ్యుతసంస్కారము. అని సార్థకనామత ఉన్నది. ఉదా:— పూర్వపద్యమె. దీనిలో 'భవిష్యతే' అనే ప్రయోగము శబ్దశాస్త్రవిరుద్ధము. భూ ధాతువు పరస్మైపదమె కాని ఆత్మనేపదము కాదు. ఇక్కడ ఆత్మనేపదముగా ప్రయుక్తము కావడము దుష్టము. 'భవిష్యతి' అని ఉండడము సాధువు. ఆవిధముగా ఉంటే ఛందస్సు చెడిపోతుంది. అనుష్టభచ్ఛందములో ఆరవ అక్షరము గురువుగా ఉండవలెనని నియమము. దానిని గురువుగా చేయడానికై 'భవిష్యతే' అని అన్నట్లయితే దుష్ట మవుతున్నది.

౮ సందిగ్ధము

సందిగ్ధం తన్మతం యత్స్యా త్సంధిగ్ధార్థప్రతీతికృత్.

సందిగ్ధమయిన అర్థప్రతీతిని కలుగచేసేది సందిగ్ధమని సమ్మతము. ఈవాక్యానికి ఈపదానికి అర్థము ఇదేనా? వేరొకటి అవుతుందా? అనే సందేహమును కలుగచేసేది అని భావము. ఉదా:— పూర్వపద్యమె. దీనిలో "మహీభృతాం కటకేషు వాసః" మహీభృత్కటకములలో నివాసము' అనేదానివలన రాజుల శిబిరములందు నివాసమా? పర్వతముల చరియలందు నివాసమా? అని సదేంహము

కలుతుగుంది కాబట్టి సందిగ్ధము. ఈవిధముగా ఒకే పద్యములో అనర్థక-నేయార్థ-చ్యుతసంస్కార-సందిగ్ధములు అనే నాలుగుదోషాలు ఉన్నవని గ్రహించాలి.

౭ అప్రయోజకము

త దప్రయోజకం యత్స్యా దవిశేషవిధాయకమ్.

విశేషార్థమును విశదముగా విధానించి చెప్పుటకు సమర్థముకానిది అప్రయోజకము అనే దోషము. ఉదా:—

హంత ! వర్తామహే వజ్రఘట్టనా త్ప్రాక్చలాత్మసు
నభస్వదశనారాతిధ్వజాగ్రజవిరోధిషు.

వాయువు ఆహారముగా కలిగిన సర్పములకు శత్రువు గరుడుడు. ఆతడు ధ్వజముగా కలవాడు విష్ణుదేవుడు. విష్ణుదేవునకు అగ్రజుడు ఇంద్రుడు. అట్టి ఇంద్రునకు విరోధులు అయినట్టిన్ని, వజ్రఘట్టనమునకు పూర్వము చలించు స్వరూపములు కల పర్వతములందు మేము సంచరించుచున్నాము కదా! అయ్యో!! ఈపద్యములో పర్వతములందు వర్తనము దుఃఖావహము అనేది ప్రకృతము. కాగా వజ్రఘట్టనమునకు పూర్వము చలించు స్వరూపములుకల అనే పర్వతవిశేషణము ఏమాత్రమూ ఉపయోగించడము లేదు. ఏవిశేషము కూడా దానివలన గోచరించడము లేదు. కాబట్టి ఇది అప్రయోజకదోషదుష్ట మవుతున్నది.

౮ క్లిష్టము

క్లిష్టం తదర్థావగతి ర్దూరదూరా యతో భవేత్,

అర్థావగమనము అత్యంతమూ దూరదూర మయినట్లయితే క్లిష్టము అనే దోషము. ఎంతో దూరము ఆలోచించితేనే కాని అర్థము గోచరము కాకపోవుట అని

భావము. ఉదా:— పూర్వపద్యములోని ఉత్తరార్థము. దానిలో నభస్వత్-వాయువు. అది అశన-ఆహారముగా కలవి సర్పములు. వానికి అరాతి - శత్రువు గరుడుడు. గరుడుడే ధ్వజముగా కలవాడు విష్ణువు. ఆతని అగ్రజుడు ఇంద్రుడు. "ఉపేంద్రఇంద్రావరజః" అనే నిఘంటువు వలన విష్ణువు ఇంద్రుని తమ్ముడు అని స్పష్టమవుతున్నది గదా! ఇంద్రవిరోధము కలవి పర్వతములు. ఈ అర్థప్రతీతి ఆయాకథలను అనుసంధానము చేసికొంటేనే కాని కలుగదు కనుక అత్యంతమూ దూరము. అందువలన క్లిష్టము అనే దోషము అని గ్రహించాలి.

౧౦ గూఢార్థము

ప్రయుక్త మప్రసిద్ధార్థే గూఢార్థం పరికీర్త్యతే.

పదములవలన బోధింపబడే అర్థము ప్రసిద్ధమూ అవుతుంది; అప్రసిద్ధమూ అవుతుంది. ఒకపదము అప్రసిద్ధార్థములో ప్రయోగింపబడినది అయినట్లయితే గూఢార్థమవుతుంది. ఉదా:—

శోణితాబ్జదృశః కామం శ్యామగల్లకటిస్థలాః
విదగ్ధహృదయాః శోకవహ్నినా రాజకన్యకాః.

రాజకన్యలు శోకాగ్నిచే మిక్కిలి దగ్ధహృదయ లయినారు. వారిదృక్కులు ఎర్రని పద్మసదృశములు. వారి కపోలభాగములు కటిస్థలములున్నూ మిక్కిలి శ్యామములు అయిఉన్నవి. శోణితశబ్దము రుధిర (నెత్తురు) రూపార్థములో ప్రసిద్ధము. ఇక్కడ పాటలవర్ణపరముగా ప్రయుక్తమయినది. ఈవిధముగా ఇది అప్రసిద్ధార్థములో ప్రయుక్తమయినందువలన గూఢార్థము.

౧౧ గ్రామ్యము

పామరవ్యవహారైకప్రసిద్ధం గ్రామ్య ముచ్యతే,

పామరుల వ్యవహారములోమాత్రమే ప్రసిద్ధమయిన అర్థము కలది గ్రామ్య మవుతుంది. విజ్ఞులయినవారు ఆ పదములను ఆ అర్థములలో ఉపయోగింపరు. ఉదా:— పూర్వ పద్యము. దీనిలో కపోలజఘనపరములైన గల్ల—కటిశబ్దములు పామరుల వ్యవహారములోనే ప్రసిద్ధములు. వానిని పండితులు ఆ అర్థములలో ప్రయోగింపరు. ఇవి గ్రామ్యప్రయుక్తములు.

౧౨ అన్యార్థము

య ద్రూఢిప్రచ్యుతం నామ త దన్యార్థ ముదాహృతమ్.

రూఢ్యర్థమునుండి ప్రచ్యుత మయినట్టిది అన్యార్థము. ఒకశబ్దానికి ప్రసిద్ధమయిన రూఢ్యర్థము ఉండగా దానిని విడిచి అన్యార్థములో అంటే అప్రసిద్ధార్థములో ఆశబ్దమును ప్రయోగించుట అన్యార్థ మనే దోషము. ఉదా:—పూర్వోదాహృతపద్యము. దీనిలో "విదగ్ధహృదయాః" అనేచోట ఈదోషము ఉన్నది. విదగ్ధపదము చతురము అనే అర్థములో ప్రసిద్ధము. రూఢమూ అయిఉన్నది. ఇక్కడ దహింపబడిన అనే అర్థములో ప్రయుక్తము. దగ్ధహృదయరూపార్థానికి ఇది వాచకము కాజాలదు. కాబట్టి అన్యార్థము అనే దోషము. ఇట్లా ఈపద్యములో గూఢార్థము గ్రామ్యార్థము అన్యార్థము అనే దోషత్రయము నిరూపిత మయింది.

౧౩ అప్రతీతికము

శాస్త్రమాత్రప్రసిద్ధం య దప్రతీతిక ముచ్యతే.

శాస్త్రములందు మాత్రము ప్రసిద్ధమై ఉండేది అప్రతీతికము. శాస్త్రీయసాంకేతికపదాలు (పారిభాషిక

ములు) కావ్యమార్గములో ప్రసిద్ధములు కావు. అటువంటివి అప్రతీతికములు అన్నమాట. ఉదా:—

మనూపదేశాః క్వ గతాః కులాచార్యై రుదీరితాః?

కులాచార్యులు ఉపదేశించిన మంత్రోపదేశములు ఎక్కడకు పోయినవో కదా! ఇక్కడ మనుశబ్దానికి మంత్రమని అర్థము. ఇది మంత్రపరముగా మంత్రశాస్త్రములోనే ప్రసిద్ధము. కావ్యమార్గములో ప్రసిద్ధముకాదు. మంత్ర శాస్త్రపారిభాషికము.

౧౪ అవిమృష్టవిధేయాంశము

అవిమృష్టవిధేయాంశం గుణీభూతవిధేయకమ్.

ప్రధానముగా విధింపతగిన అంశము గుణీభూతము (అప్రధానము) అయినట్లయితే అవిమృష్టవిధేయాంశము అవుతుంది. విమృష్టముకాని విధేయాంశము ఎక్కడఉంటుందో అక్కడ అవిమృష్టవిధేయాంశ మన్నమాట. విమృష్టము కాని విధేయాంశము ఉంటే; విధేయముగా చేయదగిన అంశము విమర్శింపబడకపోయినట్లయితే ఈదోషమని తాత్పర్యము. ఉదా:— అపుష్టార్థమునకు లక్ష్యముగా చూపిన పద్యములో "వ్యర్థాష్టార్థబాహూనాం" అనే భాగము. దీనిలో బాహుద్వయము ఏవిధముగా వ్యర్థ మయిందో ప్రధానముగా చెప్పవలసింది. ఆబాహుద్వయ వైయర్థ్యమే విధేయము. సమాసములో కలిపి చెప్పడము వలన అది అవిమృష్ట మయింది. గుణీభూత మయింది. ఇక్కడ బహువ్రీహిసమాసము. అది అన్యపదార్థప్రధానము. ఆ అన్యపదార్థములో వ్యర్థపదముచేత సూచింపబడిన

వ్యర్థత ఉపసర్జనము అవుతున్నది. కాబట్టి ఇది అవిమృష్ట విధేయాంశ మనే దోషదుష్టము.

౧౫ విరుద్ధమతికృత్

విపరీతార్థధీ ర్యస్మా ద్విరుద్ధ మతికృ న్మతమ్.

ఏ పదమువలన విపరీతమయిన అర్థప్రతీతి కలుగుతుందో ఆపదము విరుద్ధమతికృత్ అనే దోషముకలది అవుతుంది. విరుద్ధమయిన మతిని కలుగజేయునది. ఉదా:—

అంబికారమణస్యాంఘ్రిసేవా వ్యర్థా కథం భవేత్,
రాజ్ఞా మకార్యమిత్రాణాం వినాశం సముపేయుషామ్?

అకార్యమిత్రులయిన వినాశముపొందిన రాజులకు అంబికారమణుని అంఘ్రిసేవ వ్యర్థము ఎట్లా అవుతుంది? ఈపద్యములో అంబికారమణశబ్దమువలన మాతృ సంభోగముచేయువాడు అనే అర్థము ప్రతీతమవుతున్నది. ఇట్లాగే అకార్యమిత్రశబ్దమువలనకూడా అకార్యములలో (దుష్టకార్యములు) మిత్రులేకాని యోగ్యకార్యములందు మిత్రులు కారుఅనే అర్థము గోచరమవుతున్నది. వినాశశబ్దము ఇక్కడ వియోగదుఃఖపరముగా ప్రయోగింపబడింది. అయినా విశేషముకల నాశము అనే అర్థము ప్రతీత మవుతుంది. ఆయా పదములు ఆయాఅర్థములలో ప్రయోగింపబడినప్పటికీ ప్రకృతములో అత్యంతమూ విపరీతమయిన అర్థములను చెప్పేవి కావడముచేత విరుద్ధమతికృత్తులు అవుతున్నవి.

౧౬ అశ్లీలము

అశ్లీలం య దమాంగల్యజుగుప్సావ్రీడధీకరమ్,

అశ్లీలదోషము మూడువిధాలు. అమంగళ ప్రతీతికరము, వ్రీడాప్రతీతికరము, జుగుప్సాప్రతీతికరమూ అని.

త్రివిధాశ్లీలమునకు ఉదా :-

అభిప్రేతపదావాసః కదా నః సంభవిష్యతి,
నీచం సాధన మేతేషాం పరోత్సర్గైకజీవినామ్.

ఇష్టస్థానములలో నివాసము మాకు ఎపుడు లభించుతుందో కదా! ఇతరులుచేసిన త్యాగమునె ముఖ్యముగా అవలంబించి జీవనముచేసే వీరి సాధనము (సైన్యరూపమయిన సహాయసంపత్తి) నీచముగా ఉన్నది. దీనిలో అభిప్రేతపదావాసపదమువలన 'ప్రేతలోకపదనివాసము' అనే అర్థము ప్రతీతమవుతున్నది. అది అమంగళరూపము. 'నీచం సాధనం' అనేదానివలన తుచ్ఛమగు శిశ్నము (పురుషావయవము) అనే అర్థము గోచరమవుతున్నది. ఇది లజ్జాకరమయిన అర్థము. 'పరోత్సర్గైకజీవినాం' అనేచోట ఉత్సర్గశబ్దమువలన అధోవాయువు (అపానవాయువు) అనే అర్థము గోచరమవుతున్నది. ఇది జుగుప్సాకరము. ఇట్లా ఒకే పద్యములో త్రివిధమయిన అశ్లీలము ప్రదర్శితమయింది.

౧౭ పరుషము

పరుషం తత్ యత్స్యా ద్విహితం పరుషాక్షరైః

పరుషములయిన అక్షరాలచే నిర్దేశింపబడేది పరుషము అనే దోషమవుతుంది. నిరూపింపబడే అర్థానికి అనుగుణముకాని పరుషాక్షరఘటనము ఉన్నప్పుడు పరుషమనే దోషము. ఉదా:-

కుతః కాంతారవృత్తీనాం కార్తార్థ్యార్థిత్వ మస్తి నః?

అరణ్యజీవనము కలిగిన మాకు కృతార్థత ఏవిధముగా ఉంటుంది? దీనిలో కార్తార్థ్యార్థిత్వమనేది పరుష

వర్ణాలచే ఘటితమయింది. కరుణరసానుగుణములు శ్రుతి కటువులూ అయిన వర్ణములు ఉన్నవి. రేఫసంయోగము ద్వితీయాక్షరసంయోగము ఉంటే వర్ణాలు పరుషములవుతవి. కాబట్టి పరుష మనేదోషము. ఈ నిరూపితములన్నీ పదగత దోషములని గ్రహించాలి.

వాక్యదోషములు

ఇక వాక్యదోషాలను నిరూపించుతాము.

శబ్దహీనము	క్రమభ్రష్టము	విసంధి
పునరుక్తము	వ్యాకీర్ణము	వాక్యసంకీర్ణము
అపూర్ణము	వాక్యగర్భితము	భిన్నలింగము
భిన్నవచనము	న్యూనోపమ	అధికోపమ
భగ్నచ్ఛందము	యతిభ్రష్టము	అశరీరము
అరీతికము	విసర్గలుప్తము	అస్థానసమాసము
వాచ్యవర్జితము	సమాప్తపునరాత్తము	సంబంధవర్జితము
పతత్ప్రకర్షము	అధికపదము	ప్రక్రమభంగము

అనే ఈ ఇరవైనాలుగూ వాక్యమును ఆశ్రయించి ఉండే దోషాలు. వీనిస్వరూపములను ఉదాహరణములనూ ఈక్రింది విధముగా తెలుసుకోవాలి.

౧౮ శబ్దహీనము

శబ్దశాస్త్రహతం వాక్యం శబ్దహీనం ప్రచక్షతే.

శబ్దశాస్త్రహతమయిన వాక్యము శబ్దహీనము అనే దోషముకలది అవుతుంది. వాక్యము వ్యాకరణశాస్త్ర సంప్రదాయమునకు విరుద్ధమై ఉన్నట్లయితే అది శబ్దహీనము అని భావము. ఉదా:— ప్రతాపరుద్రశత్రువాక్యములలో గ్రహించాలి.

న సంశృణుమహే హంత ! హిత మాప్తై ర్నిమంత్రితం,
యేన కాకతిభూభర్తుః సేవాం హిత్వా హతా వయమ్.

ఆప్తులయినవారు ఉపదేశించిన హితమును మేము వినకపోతిమికదా! అయ్యో! మేము అట్లా వినక కాకతి భూనాథుని సేవను విడిచి చెడిపోయినాము. హితము విన నందువలన వెంటనే రాజ్యభ్రంశము కలిగింది. దీనిలో "హితం న సంశృణుమహే" అనే వాక్యము శబ్దశాస్త్ర హతము కాబట్టి శబ్దహీనమనే దోషదుష్టము. ఈవాక్య ములో సంశ్రవణము క్రియ. హితము కర్మ. "హితం" సంశృణుమహే" అని సకర్మకముగా ప్రయోగించడము దోషము. సమ్ అనేది ఉపసర్గ. సంపూర్వకమయిన శ్రుధాతువు ఆత్మనే పది అయినట్లయితే సకర్మకము కారా దని వ్యాకరణము శాసించుతున్నది. "అర్తిశ్రుదృశిభ్యశ్చేతి వక్తవ్యం" అని వార్తికము. అకర్మకములు సమ్‌పూర్వక ములూ అయిన "అర్తి-శ్రు-దృశిర్" అనే ధాతువులకుకూడా ఆత్మనేపదత్వమును సంపాదించే 'తజ్' ప్రత్యయము వస్తుందని వార్తికార్థము. ఈ ఆత్మనేపద విధాయక శాస్త్రములు "అకర్మకాత్" అనే అధికారములో ఉన్న వైనందువలన సమ్‌అనే ఉపసర్గ పూర్వమున్నపుడు ఆత్మనే పదము (తజ్) ఉన్నప్పుడు ఈచెప్పిన ధాతువులు అకర్మకములై కావాలికాని సకర్మకములుకారాదు అని తాత్పర్యము. ప్రకృ తములో ఇది సకర్మకము అయినందువలన దుష్టమవుతున్నది.

ఇక్కడ కేవలమూ "సంశృణుమహే" అనేపదమే వ్యాకరణదుష్టము కాబట్టి ఇది పదదోషమె అవుతుంది అని శంకించవచ్చు. కాని అది సముచితముకాదు. "హితం

సంశృణుమహే" అనే పదద్వయము ప్రయోగము పొంది నపుడె ఈదోషము ఆవిష్కృతము అవుతున్నది. కాని కేవలము ఏకపదప్రయోగములో దోషము లేదు. "సంశృణుమహే" అనేపదము దుష్టముకాదు. అది సకర్మకముకావడమె దుష్టము. 'హితం' అనేపదము ప్రక్కన ప్రయుక్తమయినపుడు అది సకర్మక మవుతున్నది. అప్పుడే దుష్టము. కనుకనే ఇది వాక్యదోషమెకాని పదదోషము కాదని గ్రహించాలి. 'రక్షాంసీతి పురాపి సంశృణుమహే' అని భట్టమురారికవి తన అనర్ఘరాఘవనాటకములో 'సంశృణుమహే'అనే దానిని సకర్మకముగా ప్రయోగించాడు. అక్కడకూడా ఈదోషమునే గ్రహించాలి.

౧౯ క్రమభ్రష్టము

క్రమభ్రష్టం భవే దార్థః శాబ్దో వా యత్ర న క్రమః.

క్రమము లేకపోయినట్లయితే అది క్రమభ్రష్టము అనే దోషమవుతుంది. ఇది రెండువిధాలు. అర్థగతమయిన క్రమ భంగమని శబ్దగతమయిన క్రమభంగమని. క్రమభంగమే క్రమభ్రష్టము. ఉదా:—

ప్రభవే కాకతీంద్రాయ తురగా కరిణోఽథవా
ఉపాయన మకుర్వాణా వయం దైవేన వంచితాః.

ప్రభువయిన కాకతీంద్రునకు తురగములను కాని లేక ఏనుగులను కాని ఉపాయనము (కానుక) గా చేయని మేము దైవముచే వంచితులము అయినాముకదా! ఏవయినా వస్తువులను ఒకరికి ఇచ్చేపక్షములో ముందుగా గొప్పవానిని చెప్పాలి. అవి సులభములుకాని పక్షములో తక్కువవానిని చెప్పడము లోకమర్యాద. ఇక్కడ ఉపాయనము ఇవ్వడ

ములో ఏనుగులనుకాని అవి లేకపోయినట్లయితే అశ్వము లనుకాని చెప్పవలసిఉన్నది. గజములు దుర్లభములు. అశ్వ ములు సులభములుకదా! అశ్వములకన్న గజములు గొప్పవి కదా! గజములు అశ్వములు అని చెప్పడము క్రమము. అటువంటి క్రమము ఈపద్యములో లేదు. 'తురగములను లేక కరులను' అని ఆక్రమము వ్యుత్క్రమముగా చెప్పబడింది. గుఱ్ఱములనుగాని లేకపోయినట్లయితే ఏనుగులనుకాని అని అనడమువలన ఇది అర్థక్రమభంగము.

పాఠక్రమముకన్న అర్థక్రమము బలీయము అని నియమము ఉన్నది. శబ్దములవరుస ఏవిధముగా ఉన్నప్పటికీ అర్థక్రమానుసారంగా శబ్దములను విన్యసించుకొనడము ఆవ శ్యకము. "అగ్నిహోత్రం జుహోతి యవాగూన్ పచతి" అని వైదికవాక్యము ఉన్నది. ఈవాక్యములో అగ్నిహోత్ర హోమము మొదట, యవాగూపాకము తరువాతనూ, నిరూ పింపబడింది. క్రమము ఈవిధముగా ఉన్నప్పటికీ క్రియానుష్ఠా నము ఆవిధముగా లేదు. యవాగూపాకము లేకపోయినట్ల యితే అగ్నిహోత్రహోమము జరుగనేరదు. కాబట్టి ముందుగా యవాగూపాకమునె చేయాలి. అనంతరము అగ్నిహోత్రహోమమును చేయాలి. ఇట్లా పాఠక్రమము ఉపపన్నము కానిస్థలములో అర్థక్రమమును స్వీకరించడము సముచితము. అట్లాగే ప్రకృతములోకూడా యథాయోగ్య ముగా అన్వయమును అంగీకరింపవచ్చునుకదా! "తురగాన్ కరిణోఽథవా" అని పాఠము ఉన్నప్పటికీ అర్థక్రమమును అనుసరించి గజములనుకాని లేకపోయినట్లయితే అశ్వము లనుకాని అని అన్వయమును స్వీకరించినట్లయితే దోషము

ఏమీరాదే! అట్లాచేయరాదా? దీనిని దోషమని అనడము ఎందుకు? అని ఒకశంక.

సత్యమె. ఈ విధానమంతా అపౌరుషేయములయిన వేదవాక్యములలో సముచితము. పౌరుషేయవాక్యాలలో ఈ విధానసమన్వయము సుందరముకాదు. ఇప్పుడు ఈపద్యములో ఉన్నవరుసను వినగానె దీనిని ప్రయోగించినవానికి తార తమ్యము తెలియదు అని గోచరమవుతుంది. భావకప్రతీతి అన్వయవిలంబనమును సహింపదు. కాబట్టి ఇది దుష్టమె అవుతుందని సమాధానమును భావించాలి.

శబ్దక్రమభంగము

ఉదా:-

> కా నామ గణనాస్మాసు కాకతీయస్య భూపతేః.
> యశఃప్రతాపయో ర్మగ్నౌ సూర్యాచంద్రమసావపి.

కాకతీయభూపతికి మావిషయమై గణనము ఏమి ఉన్నది? సూర్యాచంద్రమసులు వీరరుద్రుని యశః ప్రతాప ములలో మగ్నులయినారు. కాకతీయుని యశములో చం ద్రుడు మగ్నుడయినాడు. ప్రతాపములో సూర్యుడు నిమగ్ను డయినాడు. అని భావము. ఈపద్యములో యశః ప్రతాప ములలో చంద్రసూర్యులు నిమగ్నులయినారు. అనే శబ్దక్ర మము ఉచితము. ఈపద్యములో అట్లా చెప్పలేదు. అందు వలన దోషము.

యశః ప్రతాపములు ఒకసముదాయము. సూర్యా చంద్రమసులు వేరొకసముదాయము. ఈసముదాయద్వయ మునకు అన్వయము చెప్పవచ్చు. అపుడు యథాయోగ్యముగా అర్థములకు అన్వయము కలుగుతుంది. శబ్దములు ఏక్రమాన

ఉంటే అర్థాలకు అదే క్రమము ఉండడము సముచితముగా ఉంటుంది; కాని కవిసమయసిద్ధమయిన ఉపమానోపమేయ భావమును ఇక్కడ అనుసరింపవలసిఉన్నది. యశశ్చంద్రులకు ప్రతాపసూర్యులకూ ఉపమానోపమేయభావము కవి సమయప్రసిద్ధమై ఉన్నది. దానిని అనుసరించి అన్వయము చెప్పాలి. అపుడు వ్యుత్క్రమంగా సంబంధము ఉన్నప్పటికీ బాధ లేదు. కాబట్టి ఇది అర్థక్రమభంగము కాదు. ఇక్కడ శబ్దప్రయోగములోనే క్రమభంగము ఉన్నదని గ్రహించాలి. యశస్సులో చంద్రునకు ప్రతాపములో సూర్యునకూ మగ్నత ఉంటుందని యథాసంఖ్యన్యాయనియతము. ఈపద్యములో అటువంటి యథాసంఖ్యన్యాయనియతి ఉల్లంఘింపబడింది. ఆ ఉల్లంఘనములో హేతువుగా ఉన్న శబ్దప్రయోగము దుష్టమవుతున్నది. కాబట్టి ఇది శబ్దక్రమభంగానికే ఉదాహరణము అని గ్రహించాలి.

ద్వంద్వసమాసములో ఉండే ఏ ఒకపదమయినా మిగిలిన సర్వార్థమునూ చెపుతుందని ఒక నియమము ఉన్నది. ఇక్కడ యశఃపదము యశఃప్రతాములను చెప్పగలదు. ప్రతాపపదము ప్రతాపయశస్సులను చెప్పగలదు. ఇట్లాగే సూర్యాచంద్రమసౌ అనేచోటకూడ గ్రహించాలి. ఇప్పుడు మిథోన్వయము (పరస్పరము) చెప్పినట్లయితే అర్థక్రమ భంగము లేనే లేదు. శబ్దక్రమభంగముకూడా కలుగదు. కాని ఈవిషయము ఇక్కడ పరిగ్రాహ్యము. ద్వంద్వసమాసములో ఉండని కేవలపదాలు ఒక్కొక్క అర్థమునే చెప్పడము సర్వప్రసిద్ధముగా ఉన్నది. ఒకేపదము అన్నిఅర్థాలనూ చెపుతుంది అనేది అంతగా అనుభవానికి అందడము లేదు. ఇట్లాగే

ద్వంద్వసమాసేతరస్థలములో ద్వంద్వసమాసస్థలములోనూ ఉంటే వ్యవహారము ఉపపన్నమవుతుంది. సమాసములలోని ఒక్కొక్కపదమె సర్వార్థబోధకము అనే నియమమును అందరూ సిద్ధాంతముగా అంగీకరించడము లేదు. కాబట్టి పైద్వంద్వవ్యవహారమును అనుసరించి సర్వవ్యవహారమును వ్యాకులము చేయడము సముచితముకాదు.

౨౦ విసంధి ౩

విసంహితో విరూపో వా యస్య సంధి ర్విసంధి తత్

విసంధిపదానికి రెండుఅర్థాలు. విగతమయిన సంధి కలది అని ఒకఅర్థము. ఇదె విసంహితము. వర్ణముల పరస్పరసన్నికర్ష సంహిత అవుతుంది. అటువంటి పరస్పరసన్నికర్ష లేకపోయి నట్లయితే ఒకవిధమయిన విసంధి అవుతున్నది. దీనికె విశ్లిష్టము అనిపేరు. విరూపమయిన సంధి ఉన్నట్లయితే విసంధి అవుతుందని రెండవఅర్థము. విరూపము అనగా కర్ణకఠోరము. సంధివశాన కటుశబ్దాలు కలిగేటట్లయితే విసంధి అని భావము. అసలు సంధి లేకపోయినా దోషమె అవుతుంది. ఉన్నా అది కఠోరముగా ఉన్నప్పటికీ దోషమె అవుతుంది. అని తెలుసుకోవాలి. ఉదా :-

శౌర్యాణి ఈదృశా న్యాసన్ పృథ్వైశ్వర్యం క్వవాగతమ్.

శౌర్యములు ఇటువంటివి అయినవి. ఆ మహదైశ్వర్యము ఎక్కడికిపోయిందోకదా! శౌర్యాణి ఈదృశాని అనే స్థలములో ఇకారమునకు (ణి) పరముగా సవర్ణమయిన ఈకారము ఉన్నది కాబట్టి "అకస్సవర్ణేదీర్ఘః" అనే పాణినీయసూత్రానుసారముగా సవర్ణదీర్ఘసంధి చేయాలి. సంధి ఉన్నట్లయితే 'శౌర్యాణీదృశాని' అని అవుతుంది. అట్లే

అయితే అనుష్టుప్ ఛందము తప్పిపోతుంది. సంధిచేయ వలసిన పదాలకు సంధిచేయకపోవడము విసంహితాత్మకమయిన విసంధి దోషమని గ్రహించాలి. ఇక్కడ ఈసంధి చేయకపోవడమును వ్యాకరణదోషముగా తలచరాదు. సంధి ఏకపదములో నిత్యము. ధాతూపసర్గలకుకూడా సంధి నిత్యము. సమాసములోనూ సంధి నిత్యమె. వాక్యములోమాత్రము సంధి వివక్షాధీనము కాని నిత్యముకాదు. వాక్యములో సంధిచేస్తే చేయవచ్చును. మానితెమానవచ్చును. అందుచేత ఇక్కడ సంధి చేయబడకపోయినప్పటికీ వ్యాకరణవిరుద్ధముకాదు. ఇది విసంధిదుష్టమె. వాక్యములోని విసంహితత్వము వివక్షాధీనము అగుటవలన ఇది దుష్టముకాదని అనవచ్చును. కాని 'శౌర్యాణి ఈదృశాని" అని పట్టిపట్టి పలకడము అశ్రవ్యముగా ఉండడముచేత దోషమె అని పరిగ్రాహ్యము. "పృథైవైశ్వర్యం" అనే స్థలములో పృథు+ఐశ్వర్యపదాలకు "ఇకోయణచి" అనే సూత్రానుసారముగా యణాదేశసంధి వచ్చింది. ఇది శాస్త్రీయమె అయినప్పటికీ విరూపముగా కర్ణకఠోరముగా ఉండడముచేత విరూపాత్మకమయిన విసంధి అవుతున్నది.

౨౧ పునరుక్తిమత్ ౪

శబ్దార్థపౌనరుక్త్యే తు తద్వాక్యం పునరుక్తిమత్.

శబ్దార్థములకు పౌనరుక్త్యము ఉన్నప్పుడు ఆవాక్యము పునరుక్తి కలది అవుతుంది. శబ్దపౌనరుక్త్యము ఉన్నట్లయితే శబ్దాలంకారము అవుతుంది. పునరుక్తపదాభాసము అని ఆ అలంకారము పేరు. శబ్దము పునరుక్తమయినా అర్థము అపునరుక్తముగానే ఉంటుందికాబట్టి అది అలంకారము.

అర్థపౌనరుక్త్యము అర్థగతదోషమని ముమ్ముందు నిరూపిత మవుతుంది. శబ్దార్థములు రెండింటికీ పౌనరుక్త్యము ఉన్నట్లయితే ఈ వాక్యగతదోష మవుతుందని గ్రహించాలి.
ఉదా:—

జీర్ణకాననసంకీర్ణే వింధ్యే కాననవృత్తయః.

జీర్ణారణ్యవ్యాప్తమయిన వింధ్యాద్రియందు మేము అరణ్యజీవనము కలవారమయినాము. ఈ ఉదాహరణములో కానన–కానన అని కాననశబ్దము పునరుక్తమయింది. అరణ్యము అనే దాని అర్థముకూడా పునరుక్తమె. ఇట్లా శబ్దార్థపౌనరుక్త్యము ఉండడము కవిఅశక్తి సూచకము. కాననసంకీర్ణములో కాననవృత్తులమై ఉన్నాము అని అనడము పునరుక్తిమత్తను వాక్యదోషము.

౨౨ వ్యాకీర్ణము ః

వ్యాకీర్ణం తద్విభక్తీనాం వ్యాకీర్ణే చ మిథోన్వయే.

విభక్త్యంతములయిన పదములయొక్క పరస్పరాన్వయము పదాంతరములతో సంబంధము కలిగి వ్యాకీర్ణము అయినట్లయితే వ్యాకీర్ణమనే దోషము. ఉదా:—

సుఖార్థినో మహీపాలా వర్తధ్వం కాకతీశితుః,
ఆజ్ఞా మురసి బిభ్రాణాః శిరసి క్రోడముద్రికాం.

సుఖమును అభిలషించే ఓమహీపాలకులారా! కాకతీశ్వరుని ఆజ్ఞను శిరస్సున, క్రోడాకారముగా ఉన్న ముద్రికను ఉరమునా ధరించినవారై వర్తించండి. పరాజితులు విజేత ముద్రను ఉరమున ధరించాలి అనడము దాస్యలక్షణముగా నిర్దిష్టము. ఇక్కడ ముద్రిక కాకతీయధ్వజమున ఉండే వరాహ ముద్ర అని గ్రహించాలి. క్రోడముద్రను వక్షస్థలాన

ధరించడము ఆజ్ఞను శిరస్సున ధరించడమూ ఉండాలి. అట్లాగే ఆయా పదాలకు అన్వయసంబంధము వివక్షితము. కాని పద్యములో ఆజ్ఞను ఉరమున ధరించడము క్రోడముద్రికను శిరస్సున ధరించడము ఉన్నది. అందువలన దోషము.

౨౩ వాక్యసంకీర్ణము ః

వాక్యాంతరపదైః కీర్ణం వాక్యసంకీర్ణ ముచ్యతే,

ఇతరవాక్యములోని పదాలతో వ్యాప్తమయినపుడు వాక్యసంకీర్ణము అనే దోషము. వేరొకవాక్యములో ఉండవలసినపదాలు ప్రకృతవాక్యములో కలిసిఉన్నపుడు ఈదోషమవుతుంది. ఉదా:—

మానేన మహతాఽస్మాభి ర్వనే వక్త్రే న తిష్ఠతాం
వింధ్యస్య జీవితం తన్నో జాత మద్య తృణం కృతమ్.

గొప్పఅభిమానముతో ఏ గడ్డిపోచనయినా ముఖాన ఉంచుకోలేమో ఆగడ్డిపోచయే ఇప్పుడు వింధ్యారణ్యములో తిరుగుతున్న మాకు జీవితమయింది. ఈ పద్యములో "మహతా మానేన యత్ తృణం వక్త్రే న కృతం" అని ఒకవాక్యము. "అద్య వింధ్యస్య వనే తిష్ఠతాం నో జీవితం జాతం" అనేది వేరొకవాక్యము. ఈవాక్యద్వయములోని పదాలు అటూ ఇటూ అన్యోన్యమూ సంకీర్ణములై ఉన్నవి. కాబట్టి వాక్యసంకీర్ణము.

౨౪ అపూర్ణము ః

అపూర్ణం తద్భవే ద్యత్ర న సంపూర్ణః క్రియాన్వయః.

ఏవాక్యములో క్రియాన్వయము సంపూర్ణము కాదో అక్కడ అపూర్ణము అనే దోషము. వాక్యపరిపూర్ణతకొరకు

అవసరములయినవి అన్నీ కలియకపోయినట్లయితే క్రియాన్వయము సంపూర్ణత్వము పొందదు. అపుడు ఈదోషము.
ఉదా :—

శైలే ష్వస్మాక మావాసః వన్యైః సోచ్ఛ్వసితా వయం,
మృగై ర్బంధుమత శ్చాస్మా౯ పశ్య౯ ధాతా ప్రమోదతామ్.

మాకు పర్వతములలో నివాసము. మేము వనాలలో ఉత్పన్నములయిన కందమూలాదులతో ఉచ్ఛ్వాసముకలిగి ఉన్నాము. వానిచేతనే ప్రాణాలుకలిగి ఉన్నాము. మృగములతో బంధువులుకలవారమయినాము. మమ్ములను చూస్తూ విధాత ప్రమోదము పొందుగావుత. ఈపద్యములో "మృగైః బంధుమతశ్చ" అనే మూడోపాదములో 'చ' శబ్దము ఉన్నందువలన అది ఇతరవిశేషణాలను సముచ్చితము చేస్తున్నది. "అస్మా౯" అనే విశేష్యపదానికి 'బంధుమతః' అనేది ఒకవిశేషణము. ఈసరసతనుబట్టి పూర్వార్థములోనివికూడా విశేషణములు కావలసింది. అవి ఆవిధముగా నిరూపితములు కాలేదు. 'శైలవాసా౯–వన్యవృత్తీ౯–మృగబాంధవా౯ అస్మా౯ పశ్య౯' అనేది ప్రకృతపద్యములో వివక్షితసంబంధము. ఇది కలుపుకొంటేనే కలగడము లేదు. అందువలన క్రియాన్వయము సంపూర్ణము కావడము లేదు. ఉత్తరార్థములోఉన్న పశ్య౯ అనే క్రియతో పూర్వార్థానికి ఉండవలసిన సంబంధము ఏమీ నిరూపితము కానందువలన అపూర్ణమనే దోషము.

౨౫ వాక్యగర్భితము ౮

త ద్వాక్యగర్భితం యస్య మధ్యే వాక్యాంతరం భవేత్,

ఒకవాక్యమధ్యములో వాక్యాంతరము కూడిఉన్నట్లయితే అది వాక్యగర్భితము అనేదోషము. ప్రకృతవాక్య

ములో సంబంధించనట్టి వేరొకవాక్యము ప్రకృతవాక్య మధ్యములో ప్రవేశించి గర్భితముగా ఉన్నట్లయితే ఈదోషము అవుతుంది. ఒకవాక్యార్థమధ్యములో వేరొక వాక్యార్థము చేరినా ఈదోషమె అవుతుంది. అపుడు దీనిని అర్థదోషముగాకూడా చెప్పవచ్చు. కాగా ఈవాక్యగర్భిత మనేది ఉభయదోషము కావచ్చును అన్నమాట. అర్థదోషమని అనడముకంటె ముందుగా శబ్దదోషమని అనడము అంతరంగంగా ఉంటుంది. కాబట్టి ఇక్కడ ఇది శబ్దదోషాలలో పరిగణింపబడింది. ఉదా:—

> జ్ఞాత్వా ప్యంధ్రపురీంద్రస్య క్రోధాగ్ని మతిదుస్సహం,
> యద్వా న లంఘ్యతే దైవం తస్మిన్నిపతితా వయం.

ప్రతాపరుద్రుని క్రోధాగ్ని అత్యంతమూ దుస్సహము అని తెలిసికూడా మేము ఆఅగ్నిలో పడిపోయినాము కదా! ఇట్లా చెప్పుకొని ఏమిప్రయోజనము? దైవము ఎవరికీ లంఘింప శక్యముకాదు. ఈపద్యములో "అతి దుస్సహం క్రోధాగ్నిం జ్ఞాత్వాపి తస్మిన్ నిపతితా వయం" అనేది ఒక వాక్యము. ఈవాక్యమధ్యములో "యద్వా న లంఘ్యతే దైవం" అనే వాక్యాంతరము అనుప్రవేశము పొందినది. కాబట్టి ఇది వాక్యగర్భితము.

౨౭, ౨౮, భిన్నలింగము; భిన్నవచనము ౯, ౧౦.

> యత్రోపమా భవేత్ భిన్నవచనా భిన్నలింగకా
> త ద్భిన్నవచనం భిన్నలింగం చాహు ర్మనీషిణః.

ఉపమలో ఉపమానము ఉపమేయమున్నూ సమాన వచనములు కలవై సమానలింగములు కలవై ఉండాలి. అట్లాకాక ఎక్కడనయినా ఉపమ భిన్నవచనములో ఉన్నప్పుడు

అనగా ఉపమానము ఒకవచనములోఉంటే ఉపమేయము వేరొక వచనములో ఉన్నప్పుడు భిన్నవచనము అనేదోషము కలుగుతుందని పండితులు పలుకుతున్నారు. ఏదయినా వాక్యములో ఉపమ భిన్నలింగకముగా ఉన్నపుడు అనగా ఉపమానము ఒకలింగములోనూ ఉపమేయము వేరొకలింగములోనూ ఉన్నపుడు భిన్నలింగము అనే దోషమవుతుంది. ఈ రెండిటికి ఉదా :

సముద్రా ఇవ గంభీరం మనో యాదవభూభుజః,
గిరిణేవాంధ్రనృపతిధ్వజిన్యా కలుషీకృతమ్.

యాదవభూమీశుని మనస్సు సముద్రాలవలె గంభీరము. ఆమనస్సు పర్వతముచేవలె ప్రతాపరుద్రుని సేనచే కలుషము చేయబడింది. ఈపద్యములో "సముద్రాఇవ గంభీరం మనః" అనేచోట భిన్నవచనమనే దోషమున్నది. ఇక్కడ ఉపమానము 'సముద్రాః'. ఇది బహువచనములో ఉన్నది. ఉపమేయము 'మనః'. ఇది ఏకవచనములో ఉన్నది. కాబట్టి ఈఉపమ భిన్నవచనము అయింది. ఇక్కడనే ఉపమానోపమేయములయిన సముద్రమనస్సులు భిన్నలింగములుగాకూడ ఉన్నవి. అనగా ఉపమానము పుంలింగములోనూ ఉపమేయము నపుంసకలింగములోనూ ఉన్నది. అయినప్పటికీ ఇది భిన్నలింగానికి ఉదాహరణము కాదు. భిన్నలింగత్వము ఉద్వేగజనకముగా ఉండకపోయినట్లయితే దోషముకాదు. 'ముఖం చంద్రః' అన్నప్పుడు భిన్నలింగత ఉన్నది. అయినా ఉద్వేగము కలుగనందువలన దోషము లేదు. ఆచార్యదండి ఈవిధముగానే అంగీకరించుతున్నాడు. ఆ అభిప్రాయముతో ఇక్కడ భిన్నవచనము అనే దోషమునే విద్యానాథుడు

చెప్పినాడు. 'గిరిణేవ ధ్వజిన్యా' అనేచోట భిన్నలింగత్వము ఉన్నది. అనగా గిరిశబ్దము పుంలింగములోనూ ధ్వజినీ శబ్దము స్త్రీలింగములోనూ ఉన్నది. ఇక్కడఉన్న భిన్న లింగత ఉద్వేజకముగా తలచబడుతున్నది. కాబట్టి ఈ అంశ ములో భిన్నలింగము అనేదోషమును ఊహించాలి.

౨౮, ౨౯, అధికోపమ - న్యూనోపమ ౧౧, ౧౨

యత్రోపమాన మధికం న్యూనం వా స్యా ద్విశేషణైః,
తత్రాధికోపమం పూర్వం న్యూనోపమ మతఃపరమ్.

ఉపమానోపమేయాంశములు న్యూనములు అధికములూ కాకుండాఉన్నపుడు ఉపమ అలంకార మవుతుంది. ఆ భేదాలు వచ్చినప్పుడు దోష మవుతుంది. ఏ వాక్యములో ఉపమానము విశేషణాలతో అధికమవుతుందో అక్కడ అధికోపమము అనేదోషము వాటిల్లుతున్నది. ఉపమానము విశేషణాలతో న్యూన మయినట్లయితే న్యూనోపమ అవుతుంది. ఈరెండిటికీ యథాక్రమముగా ఉదాహరణములను పర్శించాలి. అధికోప మకు ఉదా:—

క్షామక్షామముఖాః కాంతాః కాననే మాలవేశితుః,
గ్రీష్మే నద్య ఇవ మ్లానపద్మోత్పలబిసావిలాః.

అరణ్యములో మాళవేశ్వరుని ప్రియురాండ్రు, గ్రీష్మ ఋతువులో పద్మములు ఉత్పలములు బిసములూ వాడి పోవడమువలన పంకిలములై ఉన్న నదులవలె, బాగా ఎండి పోయిన ముఖము కలవారయినారు. దీనిలో కాంతలు ఉప మేయము. నదులు ఉపమానము. ముఖములు ఉపమేయము. పద్మములు ఉపమానము. క్షామక్షామముఖములు కలిగిన కాంతలకు ఉపమానములయిన నదులలో మ్లానపద్మత్వ

మును మాత్రము చెప్పితేచాలు. "మ్లానోత్పలబిసావిలాః" అనేది అంతా అధికమె. దానికి తగిన ఉపమేయములు ఏవీ లేవు. ఇట్లా ఆ విశేషములచేత ఉపమానము అధికమయి నందువలన ఇది అధికోపమ అవుతున్నది.

న్యూనోపమ

హారాంగరాగసుభగా నగరేషు యథా వయం,
తథైతే నిర్ఝరాకీర్ణా విభాంతి ధరణీభృతః.

పట్టణాలలో మేము హారాలు అంగరాగాలచేత మనోహరముగా ఉన్నట్లే పర్వతములు అదేవిధముగా సెలయేళ్ళతో వ్యాప్తములై భాసించుతున్నవి. ఈ శ్లోకములోని 'యథాతథా' శబ్దముల సన్నివేశమునుబట్టి పర్వతములు ఉపమేయములుగాను. అస్మత్పదార్థము ఉపమానముగానూ గోచరమవుతున్నది. కాని విద్యానాథుని సమన్వయము చూస్తే పర్వతాలు ఉపమానములని అస్మత్పదార్థము ఉపమేయమని తెలుస్తున్నది. దానినిబట్టి "యథాతథా" శబ్దాలకు స్థానమును మార్చుకొనడము సముచితముగా ఉంటుంది. హారాలకు నిర్ఝరాలకూ ఉపమానోపమేయభావము అనుకూలముగా ఉన్నది. ఉపమేయములో అంగరాగము ఉన్నది. కాని దానికి తగిన ఉపమానము లేదు. హారస్థానములో నిర్ఝరములు చెప్పబడినప్పుడు అంగరాగస్థానములో బాలాతపముకాని ధాతురాగముకాని చెప్పబడవలసింది. అట్లా ఏమీ ఉక్తముకాలేదు. అందువలన ఇది న్యూనోపమ. అధికోపమ న్యూనోపమ అనే పేరులలో ఉపమాశబ్దము ఉపమానపరము. కరణవ్యుత్పత్తినిబట్టి అది ఉపమానమును చెపుతుంది. అధికవిశేషణోపమానము ఉన్నట్లయితే అధి

కోపము అని, న్యూనవిశేషణోపమానము ఉన్నట్లయితే న్యూనోపమ అని గ్రహించవచ్చును. కాగా సాధారణధర్మాధిక్యము ఉన్నప్పుడు అధికోపమ, ధర్మన్యూనత్వము ఉన్నపుడు న్యూనోపమ అని ఫలితార్థము.

౩౦, ౩౧ భగ్నచ్ఛందము : యతిభ్రష్టము ౧౩, ౧౪

ఛందోభగ్నం వచో యత్ర తద్భగ్నచ్ఛంద ఉచ్యతే,
యత్ర స్థానే యతిభ్రంశః తద్యతిభ్రష్ట ముచ్యతే,

ఛందస్సు అనగా వృత్తలక్షణము. అది భగ్నమయినపుడు భగ్నచ్ఛందము అనేదోషము. ఏ స్థానములో యతి అనగా విరతి, విచ్ఛేదము, పదచ్ఛేదముకలుగుట అన్నమాట. అది చెడిపోతుందో అక్కడ యతిభ్రష్టము అనే దోషము ఉంటుంది. వీని ఉదా :-

వింధ్యారణ్యకృత కుటుంబరక్షణస్య,
కింభద్రం భవతి జనస్య మాదృశస్య.

వింధ్యారణ్యములో కుటుంబరక్షణము చేసికొన్న మాకు మావంటి జనునకు భద్రము ఏమయినా కలుగుతుందా ? ఈ పద్యములో పై రెండుదోషాలూ కూడిఉన్నవి. భగ్నచ్ఛందమును ఈవిధముగా సమన్వయించుకోవాలి. ఇది ప్రహర్షిణీవృత్తముయొక్క పూర్వార్థము. ప్రహర్షిణీ వృత్తములో మగణ నగణ జగణ రగణములున్నూ ఒక గురువున్నూ ఉండాలి. మూడు పది ఈ స్థానములలో యతి ఉండాలి. 'మ్నౌ జ్రౌ గ స్త్రిదశయతిః ప్రహర్షిణీయం' అని వృత్తరత్నాకరములోని ప్రహర్షిణీలక్షణము. కాగా ప్రకృత పద్యములో 'స్య' అనే పాదాంతవర్ణము లఘువు అయిందే కాని గురువుకాలేదు. ద్వితీయపాదాంతములోని 'స్య' అనే

అక్షరము ప్రకృతములో ఉదాహరణము కాదు. ఒక్కొక్క చోట అవసానమందున్న లఘువు ఐచ్ఛికంగా గురువు కావచ్చును. కాగా 'మాదృశస్య' పదములోని 'స్య' వర్ణము ఇచ్ఛాధీనముగా గురువు అవుతుందని అంగీకరించితే ప్రహర్షిణీవృత్తలక్షణము కుదిరిందికాబట్టి దోషోదాహరణము కాదు. అయితే ప్రథమపాదాంతములో ఉన్న 'స్య' అనే వర్ణమే ప్రకృతము లక్ష్యముగా చెప్పదగిఉన్నది. గురువు కావలసినది లఘువు అయినందువలన ఇది భగ్నచ్ఛందము. ఇదికూడా పాదాంతవర్ణమె అయినప్పటికీ గురుత్వము పొందదు. ప్రథమ తృతీయ పాదాంతములలోని లఘువులయిన వర్ణాలు సంయుక్తవర్ణాలు పరములుగా ఉన్నపుడే గురువులవుతవి. కాని ద్వితీయ చతుర్థ పాదాంతవర్ణాలవలె ఐచ్ఛికంగా గురుత్వము పొందవు. ఈ ప్రథమపాదాంతవర్ణము సంయుక్తపరముగా లేనందువలన గురుత్వమును పొందదు. ఇక్కడ ఈవిషయమును ఈవిధముగానే గ్రహించాలి. వేరొక విధముగా గ్రహించడము అంతగా సముచితము కాదు.

ఇక యతిభ్రష్టము. ప్రథమపాదములో మూడవ అక్షరములు అయినపిమ్మట విచ్ఛేదాత్మకమయిన యతి ఉండవలసింది. 'వింధ్యాఽర' అనే మూడక్షరాలకు విచ్ఛేదము లేదు. అందువలన యతిభ్రష్టము అవుతున్నది.

౩-౨ అశరీరము ౧౪

క్రియాపదేన రహిత మశరీరం ప్రకీర్త్యతే

క్రియాపదముతో శూన్యముగా ఉండేది అశరీరము అనేదోషము. వాక్యములో క్రియాపదము ఉన్నప్పుడే వాక్యానికి శరీరముఉన్నట్లు. క్రియాపదము లేకపోతే అది

అశరీరమె. దీనినే అనన్వయము అనేదోషముగా చెప్పు
తున్నారు. క్రియాపదము లేనప్పుడు అన్వయమే ఉండదు
అందువలన ఈపేరు సార్థకము. ఉదా:—

హంత ! నిష్కరుణో ధాతా క్రీడతో మణికుట్టిమే,
కాననే కంటకాకీర్ణే స్థితాన్ పాండ్యశిశూనిమాన్.

దయలేని ఆవిధాత, మణిమయకుట్టిమప్రదేశాలలో
క్రీడించుచుండు ఉన్న, కంటకాకీర్ణమయిన అరణ్యమందుఉన్న
ఈపాండ్యదేశపురాజుయొక్క ఈశిశువులను.... ఎంతకష్టము
ఈఅర్థముకల పైశ్లోకములో క్రియాపదము విధింపబడలేదు
సౌధాంగణములలో క్రీడించు ఈ శిశువులను దయలేనిధా
అరణ్యాలలో ఉండేవారినిగా చేసినాడుకదా ! ఎంతకష్టము
అనే అన్వయము ఇక్కడ కవికి వివక్షితమె కావచ్చును
కాని అది ఈ పద్యములో కుదురుపాటు పొందలేదు. తగి
క్రియాపదము లేదుకాబట్టి ఇది అశరీరమయింది.

33 అరీతికము ౼౼

రసాననుగుణా రీతి ర్యత్రారీతి స్తదుచ్యతే.

రసానికి అనుగుణము కానట్టి రీతి ఉన్నట్లయితే అ
అరీతి అవుతుంది. ఇదే విరుద్ధరీతికమున్నా అవుతుంది
ఒక్కొక్క రసానికి ఒక్కొక్కవిధమయిన రచన అనుగుణము
అనుగుణరచన ఉండక విరుద్ధరచన ఉన్నట్లయితే అది అరీతి
మనే దోష మవుతుంది. ఉదా :—

అఖర్వగర్వదుర్వార దోరర్గళనిరర్గళాః,
హా ! బంధువర్గాః ! సర్వేపి కృతాంతాతిథయః కృతాః.

అతిశయించిన గర్వముకలవారు వారింపశక్యముకాని
అర్గళములవంటి భుజములుకలవారు అడ్డులేని పరాక్రమము

కలవారూ అయిన ఓ! బంధుజనులారా! మీరందరూ యమునకు అతిథులుగా చేయబడినారుకదా. దీనిలో కరుణ స్థాయిఅయిన శోకము ఉన్నది. కరుణములో వర్ణపారుష్యముకాని దీర్ఘసమాసముకాని ఉండరాదు. గౌడీరీతి కరుణోచితముకాదు. అయినప్పటికీ ఇక్కడ అనుచితమయిన వర్ణాడంబరము ఉన్నది. దీర్ఘసమాసమూ ఉన్నది. కాబట్టి ఇది అరీతికము.

౩౪ విసర్గలుప్తము ౧౭

ఓత్వం లోపో విసర్గస్య అసకృ ల్లుప్తవిసర్గకం.

లుప్తవిసర్గము విసర్గలుప్తము రెండూ సమానార్థకములె. విసర్గ లోపించిపోయినట్లయితే ఈదోషము అవుతుంది అని అభిప్రాయము. విసర్గ లోపించిపోవుట అనేక విధాల ఉంటుంది. ఒక్కొకచోట సంధివశాన విసర్గ లోపించుతుంది. వేరొకచోట విసర్గస్థానములో వేరొకవర్ణము వస్తుంది. కాబట్టి అప్పుడున్నూ విసర్గ లోపించుతుంది. వేరొకవర్ణము వచ్చినా అదీ లుప్తవిసర్గమె. ఓత్వముకలిగినా విసర్గకు లోపముకలిగినా అది లుప్తవిసర్గక మనే దోషము అని లక్షణార్థము. ఇది కేవలమూ ఒకపర్యాయము వస్తే దోషము కాదు. వాక్యములో అసకృత్తుగా ఓత్వము లోపమూ వచ్చినట్లయితే దోషము అవుతుంది. ఉదా:—

వ్యర్థో మనోరథో యాతో జాతో వాసో ధృవో మరౌ,
ప్లానా దీనా హతా జీర్ణా వనాంతే క్షీవదృశా వయం.

మా మనోరథము వ్యర్థమయింది. ఆ కోరికంతా పోయింది. మరుభూమిలో శాశ్వతవాసము కల్గింది. వనాంతములో వాడిపోయి దీనులమై జీర్ణులమై హతులమయినాము.

ఇదివరకు భోగభాగ్యాలను అనుభవించిన మేము ఇప్పుడు ఇటువంటివార మయినాము. ఈపద్యము పూర్వార్ధములో ఆరుపర్యాయములు విసర్గకు ఓత్వము వచ్చింది. ఉత్తరార్ధములో అయిదుపర్యాయములు విసర్గ లుప్తమయింది ఇటువంటి అనేకపర్యాయములు ఉన్నందువలన దోషము

౩౫ అస్థానసమాసము ౧౮

అపదస్థసమాసం తత్సమాసో యత్ర నోచితః.

అస్థానసమాసము అపదస్థసమాసము రెండూ సమానార్థకములు. సమాసము ఉచితముకానిస్థలములో సమాసము ఉంటే అస్థానసమాసము అవుతుంది. ఉండవలసిన చోట సమాసము లేకపోవడము అక్కరలేని చోట సమాసము ఉండడము ఈ దోషస్థానము. ఉదా:—

కుతో వైముఖ్య మస్మాసు బ్రహ్మణః పురుషాత్మనః,
ఇత్యుగ్రతరభ్రామ్య ద్భ్రూకుటీకుటిలాననాః.

కరిసహృదయుడయిన ఆ బ్రహ్మకు మామీద వైముఖ్యము ఎందుకు? అని తీవ్రతరముగా భ్రమించుతూ ఉన్న, కనుబొమలచే కుటిలములయిన ముఖములు కలవారయినారు. దీనిలో, ప్రతాపరుద్రనిర్జితులయిన శత్రువులు బ్రహ్మను కోపించుతూ ఇట్లా పలికారు. ఆవిధముగా పలుకుతూఉన్న ఆ శత్రురాజుల వచనాలలో కోపోద్రేకమును అనుసరించిన సమాసము ఉండవలసింది. వారివచనాలలో సమాసము లేదు. ఉత్తరార్ధమంతా కోపోద్రిక్తశత్రుస్థితిని వర్ణించే కవివచనము. కవివచనములో సమాసము ఉండ నక్కరలేదు. అది అస్థానము. అక్కడనేసమాసము ఉంది. కాబట్టి ఇది అస్థానసమాసము.

౩౨ వాచ్యవర్జితము ౧౯

నోక్తం స్యా ద్యత్ర వక్తవ్యం తదాహు ర్వాచ్యవర్జితం.

వక్తవ్యము ఉక్తము కానప్పుడు వాచ్యవర్జిత మనే దోషము కలుగుతుంది. వాచ్యము చెప్పబడవలసినది. అది వర్జితమయి ఉన్నప్పుడు ఈదోషము. ఉదా:—

దుర్దశాం ప్రతిపన్నానా మస్మాకం జీవితం మతం.

దుర్దశను పొందిన మాకు జీవితము ఇష్టము. ఈపద్య పాదములో "దుర్దశాం ప్రతిపన్నానా మపి" అని "అపి" శబ్దము ఉండవలసింది. దుర్దశను పొందినప్పటికిన్ని అని దాని అర్థము. ఈ అపిశబ్దప్రయోగము ఉన్నప్పుడే జీవితము లోని హేయత్వము స్పష్టమవుతుంది. కాకపోతే వివక్షిత మయిన ఆ అర్థము రాదు. అందుచేత ఇది వాచ్యవర్జిత మనేదోష మవుతున్నది.

౩౩ సమాప్తపునరాత్తము ౨౦

సమాప్య పున రాదానే సమాప్తపునరాత్తకం.

అన్వయముద్వారా వాక్యమును సమాప్తము చేసి మళ్లా వేరొకవిశేషణమును కూర్చడముతో వాక్యమును మరల స్వీకరించినట్లయితే సమాప్తపునరాత్తకము అనే దోషము అవుతుంది. ఉదా :

ధావన్మృగేషు సంభ్రామ్య త్కరిషూ వ్యత్తరక్షుషు,
వింధ్యారణ్యేషు తిష్ఠామః క్షుభ్య ద్భల్లూకపంక్తిషు.

పరుగెత్తేమృగాలు కలిగినట్టిన్ని, సంభ్రమముపడుతూ ఉన్న ఏనుగులుకలిగినటువంటిన్ని, అతిశయించే చిరుతపులులు కలిగిన వింధ్యారణ్యములలో నివసించుతున్నాము. ఆ అర ణ్యములు ఇంకా క్షోభపడే భల్లూకముల పంక్తులు కలిగి

ఉన్నవి. ఈ పద్యములో 'వింధ్యారణ్యేషు తిష్ఠామః' అనే చోట అన్వయము సమాప్తమయింది. వాక్యము అక్కడికి కుదిరింది. "శుభ్య ద్భల్లూకపంక్తిషు" అని వింధ్యారణ్య విశేషమును మళ్లా స్వీకరించడమువలన పూర్వవాక్యము ఆకృష్టమయింది. కాగా ఇది సమాప్తపునరాత్తక మనే దోషము.

౪౮ పతత్ప్రకర్షము ౨౧

పతత్ప్రకర్షం తత్ప్రాహుః ప్రకర్షో యత్ర విశ్లథః.

ప్రకర్షము శిథిల మయినపుడు పతత్ ప్రకర్షమనే దోషము. ఒక్కొకవర్ణనవిధానాన్నిబట్టి ఒక్కొక్కచోట ప్రకర్ష కలుగుతున్నది. ఆ ప్రకర్ష భిన్నరీతివర్ణనమువలన చెడి పోయినపుడు ఈదోష మవుతున్నది. ఉదాహరణము "ధావ న్మృగేషు" అనే పైపద్యమె. దానిలో మృగ గజ తరక్షువుల క్రమము నిర్దిష్టమయింది. దానివలన వింధ్యారణ్యానికి వివక్షించిన ప్రకర్ష కలగడము లేదు. కరి తరక్షుమృగాల క్రమములో ఒక ప్రకర్ష ఉంది. తరక్షువులకన్న గజములు ప్రకృష్టములు. మృగాలు అన్నిటికన్నా అపకృష్టాలు. కాబట్టి "సంభ్రామ్యత్కరిషు, ఉద్వృత్తతరక్షుషు, ధావన్మృగేషు" అని క్రమాన్ని చెప్పవలసింది. అట్లాచెప్పక మృగాలను మొదటగా ఉపాదానము (స్వీకారము) చేయడమువలన వివక్షితప్రకర్ష భ్రంశమైపోయింది. అందుచేత ఈఅంశములో పతత్ప్రకర్ష అనేదోషము ఉన్నది.

౪౯ సంబంధవర్జితము ౨౨

సంబంధవర్జితం తత్స్యాత్ యత్రేష్టేనాన్వయో హతః,

సంబంధము- ఇష్టయోగము. తద్రహిత మయినది

సంబంధవర్జితము. దీనినే కొందరు అభవన్మతయోగము అని అంటున్నారు. ఎక్కడ ఇష్టమయిన దానితో అన్వయము హతమయిపోతుందో అంటే, ఎక్కడ ఇష్టమయినట్టిది ఉండవలసిన విధాన ఉండదో అక్కడ సంబంధవర్జిత మనే దోషము ఉన్నది. అని భావము. ఉదా :

భద్రాసనాని దృషదః ఛత్రాణి చ మహీరుహాః,
దుర్దశారాజ్యమూర్ధాభిషిక్తాః పున రహో! వయమ్.

శిలాఫలకములు భద్రాసనములు. వృక్షములు ఛత్రములు. మళ్లా మేము దుర్దశారాజ్యమూర్ధాభిషిక్తులము అయినాము. ఎంత ఆశ్చర్యము. ఈ పద్యములో దుర్దశారాజ్య శబ్దము సమాసములో గుణీభావము పొందింది. అందువలన భద్రాసనాదులతో సంబంధించదు. ఈదుర్దశారాజ్యములో మాకు భద్రాసనములు శిలాఫలకములు. అనే ఇష్టార్థయోగము దీనిలో లేదు. కాబట్టి ఇది సంబంధవర్జిత మనే దోషము.

౪౦ అధికపదము ౨౩

యత్రాధికపదోక్తిః స్యా త్తత్రాధికపదం మతం.

ఏ వాక్యములో అధికముగా పదాలు చెప్పబడుతవో అక్కడ అధికపద మనే దోషము. ఉండవలసిన పదాలకంటె అవసరముకాని అధికపదాలు కూర్పబడినప్పుడు అధికపదము అనే దోషము అవుతుంది. ఉదా:—

విముక్తా వల్లభై రేతా వనాంతే ఘూర్జరస్త్రీయః,
సుధాంశుమండలాకార రూపక్రమవిపాండురాః.

ఈఘూర్జరస్త్రీలు చంద్రమండలముయొక్క ఆకారము లోని రూపక్రమమువలె విశేషముగా పాండువర్ణము కల

న్వారై ప్రియులచే వనాంతములో విడువబడినారు. దీనిలో స్త్రీవర్ణనములో "సుధాంశుమండలాకారాః" అంటే చాలు. అంతమాత్రాన మండలాకారవిపాండురత్వము పరిపూర్ణ మవుతూనేఉన్నది. అయినప్పటికీ "రూపక్రమ" అని అధిక ముగా చెప్పడమువలన అధికపదము అనేదోషము.

౪౧ భగ్నప్రక్రమము ౨౪

ప్రక్రాంతనియమత్యాగే భగ్నక్రమ మిహేష్యతే.

మొదటగా ఉపక్రమించిన నియమమును పరిత్యజించి నప్పుడు భగ్నప్రక్రమము అనేదోష మవుతుంది. మొదట నిరూపించిన క్రమమునే చివరవరకూ నిర్వహించాలి. కాక మధ్యలో అది చెడిపోయినట్లయితే ఈదోషము కలుగుతుంది. ఉదా:—

గుహా గృహాణి శబరా బాంధవా వింధ్యభూః పురీ,
సరితో దీర్ఘికాః కష్ట మాక్రీడాః కాననాని నః.

మాకు గుహాలు గృహాములు. శబరులు బాంధవులు. వింధ్యభూమి పట్టణము. నదులు దిగుడుబావులు. అరణ్యా ములు క్రీడావనాలు. అయినవికదా! ఎంతకష్టము!! ఈ పద్యములో అయిదు అంశాలు నిరూపితములు అయినవి. మొదట బహువచనముతో ప్రక్రమము ఉన్నది. మధ్యలో "వింధ్యభూః పురీ" అని ఏకవచనముతో ఒకవిషయము చెప్పబడింది. అందువలన మొదటిక్రమము భ్రష్టము. కాబట్టి ఇది భగ్నప్రక్రమము.

అధికపదము అనే దోషముదగ్గర న్యూనపదము అనే వేరొక దోషాన్నికూడ కలిపికొనడము ఉచితముగా ఉంటుం దని వ్యాఖ్యాతల సూచనము.

వ్యాధైః సహోషితం వింధ్యే హంత వల్కలధారిభిః.

వింధ్యారణ్యములో వల్కలములు ధరించిన (మాచే) వ్యాధులతో కూడా నివసింపబడెను. అనే అర్థము కలిగిన దీనిలో "వల్కలధారిభిః" అనే విశేషణానికి "అస్మాభిః" అనే పదము విశేష్యముగా ఉండవలసింది. అది లేదు. అందు వలన న్యూనపదము అనేదోషము. ఇప్పటికి ఇట్లా చతుర్వింశతి వాక్యదోషాలు నిరూపితము లయినవి. ఇక అర్థదోష ములను చెప్పవలసిఉన్నది.

అర్థదోషములు

అపార్థము	వ్యర్థము	ఏకార్థము
ససంశయము	అపక్రమము	భిన్నము
అతిమాత్రము	పరుషము	విరసము
హీనోపమ	అధికోపమ	అసదృశోపమ
అప్రసిద్ధోపమ	హేతుశూన్యము	నిరలంకృతి
అశ్లీలము	విరుద్ధము	సహచరచ్యుతము

అని అర్థసమాశ్రయములయిన దోషాలు అష్టాదశ విధములుగా కీర్తితము లవుతున్నవి. వీని స్వరూపోదాహరణ ములను ఇటుపై ప్రదర్శించుతాము.

౭౨ అపార్థము ౧

సముదాయార్థశూన్యం య దపార్థం తత్ప్రకీర్త్యతే.

సముదాయార్థరహితమయినది అపార్థ మనిచెప్పబడు తున్నది. వాక్యములో ప్రత్యేకప్రత్యేకముగా అర్థముఉన్నా సముదాయరూపముగా అర్థము లేకపోయినట్లయితే ఈ దోషము వాటిల్లుతుంది. ఉదా:—

కుత శ్శృష్యదపా నద్యః కా వార్తా చోళమండలే,
ఫణాః సహస్రం శేషస్య భారః కతి కులాచలాః.

నదులఉదకము ఎందువలన ఎండిపోయింది? చోళ మండలములో వార్తఏమిటి? సహస్రఫణాలు ఆదిశేషునకు భారము. కులపర్వతాలు ఎన్ని? దీనిలో ప్రత్యేకప్రత్యేక వాక్యాలకు ఏదోఅర్థము ఉన్నది. సముదాయముగా విశిష్ట వాక్యార్థము ఏదీలేదు. ఇక్కడ వాక్యార్థము ఏదీ ప్రతీయ మానము కాదు. అందువలన అపార్థము.

౪౩ వ్యర్థము ౨

యత్ ప్రయోజనశూన్యం స్యా ద్వ్యర్థం తత్పరికీర్త్యతే.

ప్రయోజనరహితముగా ఉండేది వ్యర్థము అనబడు తుంది. నిరూపింపబడేవానికి ప్రయోజనసంపాదకత్వము ఉండితీరాలి. అట్లా ప్రయోజనకారిత లేకపోయినట్లయితే ఈదోషము వాటిల్లుతుంది. ఉదా :-

నిర్మలం కుల ముద్వేలం శౌర్యం వః ప్రథితం యశః,
కిమి త్యంధ్రపతేః పాదపీఠం పాండ్యై ర్న సేవ్యతే?

కులము నిర్మలమయినది. శౌర్యము వేలాతిక్రాంతము. మీయశస్సుకూడా ప్రఖ్యాతమె. ఆంధ్రపతిఅయిన ప్రతాపరుద్రుని పాదపీఠమును పాండ్యులు ఏల సేవించడము లేదు? దీనిలో 'ప్రతాపరుద్రుని పాదసేవ చేయదగినది' అనేది ఉపదేశములో "నిర్మలం కులం" అనేమొదటిప్రశంస ఈ ఉపదేశములో ఏమీ ఉపయోగించడములేదు. అందువలన అదిఅంతా వ్యర్థమై వ్యర్థదోషానికి అవకాశము ఇచ్చింది.

౪౪ ఏకార్థము ౩

ఉక్తాభిన్నార్థకం యత్ స్యా దేకార్థం త న్నిగద్యతే.

చెప్పినఅర్థముకన్న అభిన్నమయిన అర్థమే ఉన్నపుడు ఏకార్థము అనేదోషము. ఇదే పునరుక్తార్థము. ఉదా :-

విశీర్ణం శతధా చేతః మూర్ఛితా న్వీక్ష్య బాలకాన్,
శిశూ న్నిశ్చేతనాన్ దృష్ట్వా ఖండితం శతశో మనః,

మూర్ఛపొందిన బాలకులను చూచి మనస్సు శతధా శీర్ణ మయింది. నిశ్చేతనులయిన శిశువులను చూచి మనస్సు నూరువిధాల ఖండితమయింది. దీనిలో పూర్వోత్తరార్థము లలో ఒకేఅర్థ మున్నది. అందువలన ఏకార్థము.

౪౩ ససంశయము ౪

వాక్యార్థసంశయో యత్ర తత్ససంశయ మిష్యతే,

వాక్యార్థమువిషయమై సందేహము ఉన్నపుడు ఇది వాక్యార్థమవుతుందా? అది వాక్యార్థమవుతుందా? అని వాక్యార్థసందేహము కలిగినపుడు ససంశయము అని అర్థము. సంశయముతో కూడుకొనిఉన్నది కాబట్టి ఇది సార్థకము. ఉదా:-

కరికుంభౌ స్తనావద్య జయేతాం క్షమతాం గతౌ,
లతా వపుఃశ్రియ స్త్రీణాం హసంతు మ్లానతాం గతాః.

ఇపుడు కృశత్వము పొందిన కరికుంభములు స్తనములను జయించుగావుత. అట్టివే అయిన స్తనములు కరికుంభములను జయించుగావుత. మ్లానత్వముపొందిన లతలు స్త్రీల శరీరశోభలను హసించుగావుత. అట్టివేఅయిన స్త్రీల వపుశ్శ్రీలు లతలను హసించుగావుత. ఈపద్యములో:- "కరికుంభౌ స్తనౌ జయేతాం" "లతా వపుఃశ్రియః హసంతు అని రెండువాక్యములు ఉన్నవి. వీనిలో కర్మ ఏదో కర్త ఏదో స్పష్టముగాలేదు. కరికుంభములు కర్త స్తనములు కర్మ. లతలు కర్త. వపుఃశ్రీలు కర్మ. ఈదృష్టితో వాక్యార్థ నిర్ణయము చేయవలయునా? అట్లాకాక స్తనాలు కర్త,

కరికుంభాలు కర్మ. వపుఃశ్రీలు కర్త. లతలుకర్మ. ఈదృష్టితో వాక్యార్థమును నిర్ణయము చేయవలెనా ? అనే సందేహము కలుగుతున్నది. ఏ అర్థనిర్ణయానికిగాని సాధకము లేదు. బాధకమూ లేదు. ఇట్లా కర్మకర్తృత్వసంశయము ఉన్నందు వలన ఈదోషము వాటిల్లుతున్నది.

४౯ అపక్రమము ४౯

యత్ర పూర్వాపరీభావవిహతి స్తదపక్రమం.

క్రియలలో కొన్ని పూర్వము ఉంటవి. కొన్ని తరువాత ఉంటవి. అట్లా ఆక్రియలు పూర్వాపరీభావముతో ఉండడము ఒక నియమము. అది ఒక క్రమము. ఇటువంటి పూర్వాపరీభావానికి విహతి కలిగితే అపక్రమము అనేదోష మవుతుంది. ఉదా :-

హంత ! వ్యాదాయ వక్త్రాణి నిద్రాంత్యం తర్పణం స్త్రియః,
తృణై స్తత్పతితై రస్మా& శిక్షయంత్య స్తథాక్రమం.

వనమధ్యములో స్త్రీలు ముఖాలను తెరచుకొని నిద్రించుతున్నారు. ఆముఖాలలో గడ్డిపోచలు పడుతున్నవి. మమ్మల్నికూడా అదేపద్ధతిని శిక్ష నేర్పుతున్నారా ? అన్నట్లున్నది. అంటే, మీరుకూడా ఈవిధంగా గడ్డికరిచినట్లయితే ఈబాధలు ఉండవు. చక్కగా జీవించవచ్చును. అని ఉపదేశించుతున్నట్లుగా ఆస్త్రీలు ఉన్నారు. అని భావము. ఈ పద్యములో నిద్రపోవుటతరువాత ముఖము తెరచుకొనుట అనే లోకప్రసిద్ధమయిన పూర్వాపరీభావము తారుమారయింది. నిద్రోత్తరకాలములో ఉండవలసిన ముఖవ్యాదానము పూర్వకాలములో ఉన్నట్లు చెప్పబడింది. అందువలన అపక్రమ మనే దోష మవుతున్నది.

ఈవిషయమును కొంత విమర్శించి గ్రహించవలసి ఉన్నది. సామాన్యముగా మానవులు ముఖముద్రతో నిద్రించుతారు. నిద్రించగానే శరీరము అవశమవుతుంది. అప్పుడు ముఖము తెరవబడుట సిద్ధమవుతుంది. ఇది మామూలుగా ఉన్నమర్యాద. ముందుగానే ముఖము తెరచుకొని నిద్రపోవడము ఉన్నట్లయితే ఈపద్యములో అదే విధముగా ఉన్నది కాబట్టి ఇది దోషోదాహరణము కాదు. దీనిని దోషానికి ఉదాహరించుతున్న కర్త ఆశయమును మనము ఊహించవలసిఉన్నది. "వక్త్రం వ్యాదాయ స్వపితి" అనే ఉదాహరణములో ఒక చిత్రమయిన చర్చ ఉన్నది. దానిని ప్రకృతములోకూడా సమన్వయించుకుంటే తత్వము వెలుపడుతుంది. ఇక్కడ వ్యాదానము స్వాపము అనే రెండు క్రియలు ఉన్నవి. వ్యాదానము స్వాపము అనే ఈరెండు క్రియలకూ ఒకవ్యక్తియే కర్తగా ఉన్నప్పుడు మొదటిక్రియకు వాచకమయిన పదమునకంటె 'క్త్వా' ప్రత్యయము వస్తుంది. అని వ్యాకరణానుశాసనము. 'వ్యాదాయ స్వపితి, అన్నప్పుడు, నిద్రానంతరమే వ్యాదానము సంభవించుతుందిగాని ముందుగా వ్యాదానము సంభవించదుగదా! అప్పుడు వ్యాదానానికి పూర్వకాలత్వము లేదే! పూర్వకాలత్వము లేకపోతే క్త్వాప్రత్యయము ఎట్లావచ్చింది? అని ఒకశంక. లోకప్రసిద్ధముగా ముందు నిద్రపోవడము, తరువాత ముఖవ్యాదానమూ ఉంటుంది. దానిని అనుసరించి ఈ ప్రశ్న ఉత్పన్నమవుతుంది. దీనిని ఈ విధముగా సమన్వయించుకోవచ్చు. ఒక మనుష్యుడు ముందుగా నిద్రపోయినాడు. తరువాత ముఖమును తెరుచుకున్నాడు. ముఖము తెరువబడిన

తరువాత కూడా ఆతడు నిద్రపోతూనే ఉన్నాడు. ఇపుడు ముఖవ్యాదానమునకు పూర్వనిద్ర ఒకటి, తరువాతనిద్ర రెండు. ఇట్లా మొదటినిద్ర రెండవనిద్ర అని పరిగణనకై అనుకోవచ్చు. రెండవనిద్రకంటె ముఖవ్యాదానము పూర్వ కాలములో ఉన్నది కాబట్టి క్త్వాప్రత్యయము రావచ్చును. అందువలన 'వక్త్రం వ్యాదాయ స్వపితి' అనేస్థలంలో ఏఅనుపపత్తిన్నీ లేదు. ఈ విధముగానే వైయాకరణులు అంగీకరించుతున్నారు. ఇంతకూ ప్రకృతపద్యములో అదే విధముగా చూస్తే రెండుక్రియలకూ పౌర్వాపర్యవిహతి ఏమీ లేదే! ఇది దోషము ఎట్లాఅవుతుంది? అని శంకించడానికి వీలుఉన్నది. క్త్వాప్రత్యయమును ఉపపాదించుకొనడానికై రెండవనిద్రకంటె ముఖవ్యాదానము పూర్వక్షణవృత్తి అవుతుందని అనడము సమ్మతమె కాని దోషసమన్వయము కొరకై రెండవనిద్రను గ్రహించకుండా మొదటినిద్రనే స్వీకరించాలి. అయితే స్వాపముకంటె వ్యాదానము మొదట్లో ఉండడానికి వీలులేదు. వీలులేనిదానిని పద్యములో నిబంధించడమువలన పౌర్వాపర్యవిఘాత ఉండనే ఉంటున్నది. అందువలననే ఇది అపక్రమ మనేదోష మవుతుంది.

౪౭ భిన్నము ౬.

సంబంధవర్జితం యత్ స్యా త్తద్భిన్నం పరికీర్త్యతే.

సంబంధరహితమయిన అర్థము భిన్నము అనే దోషము కలది అవుతుంది. పద్యములో నిరూపింపబడే అర్థాలకు పరస్పరము హేతుహేతుమద్భావము ఉండాలి. ఈ హేతుహేతుమద్భావరూపమయిన సంబంధము, నిరూపించిన అర్థానికి లేనపుడు ఈ చెప్పినదోషము కలుగుతుంది. హేతువు-

కారణము; హేతుమత్-కార్యము. కార్యకారణసంబంధము అని భావము. ఉదా:—

నూనం ఫాలేషు లాటానాం న ధాత్రా లిఖితా లిపిః,
యదస్మాకం కుటుంబాని విషీదంతి మరుస్థలే.

లాటదేశీయుల ఫాలములందు బ్రహ్మ లిపిని లిఖించ లేదు. ఎందువలనంటే మాకుటుంబాలు మరుభూములలో విషాదము పొందుతున్నవికదా! ఈపద్యములో మరుస్థలనివాస విషాదమునకు ఫాలస్థలమున లిపి లేకపోవడమునకూ ఏమీ సంబంధము లేదు. మరుస్థలనివాసవిషాదము పొందవలసినదని ధాత లిపి లిఖించినందువలననె అది జరిగిందికదా! అందు వలన లిపి లిఖితముకాలేదు అనడమునకు, కుటుంబాలు మరుస్థలంలో విషాదము పొందుతున్నవి అని అనడమునకూ కార్యకారణభావము కనబడడములేదు. ప్రతీయమానమవుతూఉండే హేతు హేతుమద్భావము వాస్తవముకాదు కాబట్టి అది పరిగ్రాహ్యముకాదు. ఇట్లా దోషసమన్వయమును దర్శించాలి.

౨౮ అతిమాత్రము ౭

యత్సర్వలోకాతీతం త దతిమాత్రం ప్రకీర్త్యతే.

సర్వలోకాలనూ అతిక్రమించిఉన్న అర్థము అతిమాత్రము అవుతుంది. ఏమాత్రమూ ఏలోకములోనూ సంబంధించిఉండకుండా ఉండేఅర్థమును వర్ణించితే అది ఈదోషదుష్టము. ఉదా:

మాభూ దేకార్ణవం విశ్వ మితి సంకోచితాశ్రుభిః,
అరణ్యే లాటనారీభి రసంఖ్యా నిమ్నగాః కృతాః.

ఈప్రపంచమంతా ఒకే మహాసముద్రముగా కాకుండు

గావుత అనే అభిప్రాయముతో లాటదేశపుస్త్రీ
కన్నీటిని తగ్గించుకొన్నారు. ఉన్నకన్నీటిని అంత
రింపచేసినట్లయితే ప్రపంచమంతా మహాసముద్ర
వారు చాలావరకు కన్నీటిని తగ్గించడముచేత
సంఖ్యలేనన్ని నదులు అరణ్యములో సిద్ధములయిన
ములో కన్నీటిని సంకోచింపచేసికొన్నప్పటికీ కొద్ది
విడిచిపెట్టినా లెక్కలేనన్ని నదులువచ్చినవని చెప్ప
ఈఅర్థము లోకాతీత మయింది. కన్నీటిచే జగత్తు ఏ
అవుతుందని అనడమున్నూ అత్యుక్తి అని గ్రహిం

౪౯ పరుషము ౮

అతిక్రూరార్థసహితం పరుషం పరికీర్త్యతే.

అతిక్రూరార్థముతో కూడినట్టిది పరుషము
దోషము. మృదువయిన అర్థముతో నిరూపింప
ములో క్రూరముగాచెప్పడము ఉచితముకాదు.

దావానలేంధనం సద్యః క్రియంతా మర్భకా ఇమే.

ఫలములను కోరుతూఉన్న పిల్లలను గురిం
క్యము ప్రవృత్తమయింది. ఈఅర్భకుల సందరి
చ్చులో కట్టెలనుగా పడవేయండి. ఫలములను
వారిని ఇంతక్రూరముగా మాట్లాడడము పరుష
పోతుందా?

౫౦ విరసము ౯

అప్రస్తుతరసం యత్ర ద్విరసం పరికీర్త్యతే.

సమయముకాని సమయములో రసప్రవృ
డము విరసము అనేదోషము. ఒక్కొక్క ర

ఒకొక్కసమయము తగిఉంటుంది. అట్లాకాక అసమయములో రసప్రసారమును సూచించితే విరసము. ఉదా :-

చంద్రాననాః కటాక్షై ర్నః పశ్యతామృతవర్షిభిః
శోచిత్వా అల మితి క్లిష్టాః కిరాతై శ్చోళసుభ్రువః.

పురుషవియోగమువలన స్త్రీలు ఖిన్నలైఉండగా వనచరులు చుట్టుముట్టుకొని ఈవిధముగా సంభోగముకొరకై ప్రార్థనముచేస్తున్నారు. ఓ! చంద్రవదనల్లారా! అమృతమును వర్షించు కటాక్షాలతో మమ్మలను చూడండి. మీరు దుఃఖపడవద్దు. మేము ఉన్నాములే! అని చోళదేశస్త్రీలను కిరాతులు క్లేశపెట్టుతున్నారు. భర్తృవిరహంవలన వారు దుఃఖించుతూఉంటే వీరు విరసంగా ఈవిధంగా అనడము ఏమిటి? ఇదంతా విరసంగాఉంది.

౫౧ హీనోపమము ౧౦

హీనం యత్రోపమానం స్యా త్తద్ధి హీనోపమం మతం.

ఉపమానము జాతిచేకాని ప్రమాణముచేకాని హీనముగా ఉన్నట్లయితే అది హీనోపము అనేదోష మవుతుంది. ఉపమానోపమేయములు జాతిప్రమాణాది విషయములలో సమానములుగా ఉన్నపుడే ఉపమ సముచిత మవుతుంది. అట్లాకానప్పుడు దోషము.

శునకై రివ సారంగా భవద్భి ర్నిహతా ద్విషః,
క్వగతం పౌరుషం తద్వః కాననైకనివాసినాం?

కుక్కలు లేళ్లను కొట్టినట్లు మీరు శత్రువులను కొట్టినారు. అరణ్యములోనే ముఖ్యముగా నివసించుతూ ఉన్న మీయొక్క ఆ ప్రసిద్ధపౌరుషము ఎక్కడకు పోయింది?

దీనిలో "శునకై రివ భవద్భిః" అని హీనోపమ ఉన్నది. ఉప మానముగా ఉన్న శునకములు జాతిహీనములు.

౫౨ అధికోపమము ౧౧

యత్రోపమాన మధికం తద్భవే దధికోపమం.

జాతిచేగాని ప్రమాణముచేగాని ఉపమానము అధిక మయినపుడు అధికోపమము అనేదోష మవుతుంది. ఉదా:-

అమీ పారే సరస్తీరం బకా నిశ్చలమూర్తయః,
మహర్షయ ఇవాస్మాభి రద్య సోపద్రవాః కృతాః.

సరస్తీరముదగ్గరగా నిశ్చలరూపముతో ఉన్న ఈకొంగ లను మహర్షులనువలె మేము ఉపద్రవపెట్టినాము. మహర్షు లను ఉపద్రవము కలుగజేసి వెళ్లగొట్టినట్లు కొంగలను రాళ్లు రువ్వి పోగొట్టినాము. "బకా మహర్షయ ఇవ" అని అధి కోపమము. ఉపమానముగా మహర్షులు జాత్యధికులు. ఈ చెప్పిన రెండుశ్లోకాలలోనూ జాతిన్యూనతకు జాత్యాధిక్యము నకూ ఉదాహరణములు ఇవ్వబడినవి. ఇదేవిధముగా ప్రమాణహీనత్వానికి ప్రమాణాధిక్యమునకు లక్ష్యములను చూచుకోవాలి. ఏదో ఒక సాధర్మ్యమును నిరూపించి చమ త్కారమును సంపాదించాలని కవి వివక్షించుతాడు. ఆ వివక్షితార్థానికి జాతిప్రమాణములను అనుసరించిన ఈ హీన త్వాధిక్యములు కదర్థీకృతిని సంపాదించుతున్నవి. అందువలన అనౌచిత్యము ఒకటి సంభవించుతున్నది. ఇటువంటి దోషా లలో అనౌచిత్యమె దూషకతాబీజమని పెద్దలంటున్నారు.

౫౩ అసదృశోపమము ౧౨

యదతుల్యోపమానం తద్భవే దసదృశోపమం

అసమానమయిన ఉపమానము ఉంటే అది అసదృ

శ్లేషమము అనేదోష మవుతుంది. దేనిని ఉపమానముగా నిరూపించుతున్నామో అది ఉపమానముగా ఉండడానికి ఏ మాత్రమూ తగనిదిగా ఉన్నపుడు అంటే ఉపమానోపమేయ ములకు సంబంధించిన ధర్మాలు ఏవీకూడా ఎటువంటి సామ్య మునూ నిరూపించేవిగా లేనపుడు ఈదోషము అవుతుందన్న మాట. ఉదా :-

ఏష వింధ్యాచలః సాంద్రకుంజోచ్ఛలితనిర్ఝరః,
ఫాలేక్షణస్ఫురద్వహ్నిశిఖాటోపా ఇవేశ్వరః.

దట్టమయిన నికుంజములలోనుండి పైకి వెలువడిన ప్రవాహములుకల ఈవింధ్యపర్వతము, ఫాలనేత్రములో స్ఫురించుతున్న అగ్నిశిఖాతిశయముకల ఈశ్వరునివలెఉన్నది. దీనిలో కుంజోచ్ఛలిత నిర్ఝరమయిన వింధ్యాచలానికి ఫాలే క్షణస్ఫురద్వహ్నిఅయిన ఈశ్వరునకున్నూ ఏమీ సాదృశ్య ము లేదు. ఉపమానోపమేయాలకు ఏమీ సాదృశ్యప్రసిద్ధి లేదు. తద్ధర్మాలయిన నిర్ఝరవహ్నులకున్నూ ఏమీ సాదృ శ్యము లేదు. అందువలన ఉపమానము తగియుండలేదు. దోషసమన్వయము స్పష్టము.

౨౪ అప్రసిద్ధోపమము ౧౩

అప్రసిద్ధోపమానం య దప్రసిద్ధోపమం మతం.

ఉపమానము అప్రసిద్ధమయినది అయినపుడు అనగా కవిలోకక్షుణ్ణము కానపుడు అప్రసిద్ధోపమము అనేదోష మవుతుంది. ఉదా :

బాష్పాంబుక్లిన్ననేత్రాణి ముఖాన్యంగ ! మృగీదృశాం
హిమదూషితపత్రాణి కుముదానీవ నిర్మదాం.

సంతోషములేని ఈమృగనయనలయొక్క బాష్పోద కములచే తడిసిన నేత్రాలుకల ముఖములు, మంచుచే చెడిన

పత్రాలుకల కుముదాలవలె ఉన్నవి. దీనిలో ముఖాలకు కుముదాలకూ ఉపమానోపమేయభావము ఉన్నది. ముఖాలకు కుముదాలు ఉపమానములుగా ఉండడము కవిలోకములో ఎక్కడా ప్రసిద్ధము కాదు.

౨౨ హేతుశూన్యము ౧౪

హేతో ర్వినార్థకథనం హేతుశూన్యం ప్రచక్షతే.

హేతువు లేకుండా ఒకవిషయమును చెప్పడము హేతుశూన్య మనేదోషము. ఏదయినా ఒకదానిని నిరూపించితే హేతువు ఉండాలి. అపుడే అది సమంజసము. అహేతుకమయిన విషయవిన్యాసము దుష్టము. ఉదా :-

ముఖానుధావనం జాతం మార్గేస్మిన్ మౌక్తికాంకితే
అన్వేష్ట మన్యతో యామి పదవీయం న సుభ్రువః.

ముత్యాలతో చిహ్నితమయిన ఈ మార్గములో నేను వ్యర్థముగా పరుగెత్తడమయింది. ఇది ఆ సుభ్రూమార్గము కాదు. ఆమెను వెతకడానికి వేరొకమార్గాన వెళ్లుతాను. ప్రియురాలి మెడలోని ముత్యాలహారమందలి ముక్తామణులు జారి క్రిందపడినవి కాబోలు. ఇటు ప్రియురాలు వెళ్లిఉంటుంది, అని భ్రాంతిపడి ఇటువచ్చాను. కాని ఈమార్గము ప్రియురాలిది కాదు. ఇక్కడిముత్యాలు ఆమెవి కావు. సింహము కరికుంభమునుండి తన హస్తముతో ఈముత్యాలను లాగింది. అవి దారిలో పడినవి. అంతే అయియుంటుంది. కాని ఇది ప్రియామార్గము ఎట్లా అవుతుంది. అనిభావము. ఇది సుభ్రూమార్గము కాదనడములో హేతువును చెప్పలేదు, అందువలన హేతుశూన్యము.

౫౬ నిరలంకృతి ౧౫

అలంకారేణ రహితం నిరలంకార ముచ్యతే.

అలంకారరహితమయినట్టిది నిరలంకారము అవుతుంది. అలంకారము కాదగిన అలంకారమును కూర్చినపుడే శోభ కలుగుతుంది. ఏమీ అలంకారము లేకుండా చెప్పితే దోషము. ఉదా:—

ఆఘ్రాయ సురభేర్యోని ముక్షైర్దీర్ఘ మేహనైః
మహోక్షైః లంబమానాండై ర్విష్వగ్వ్యాకులితం వనం.

గోవుయోనిని ఆఘ్రాణించి ముఖాలను పైకెత్తినవై మేహనములను అనగా పుంవయవములను దీర్ఘములను చేసికొని అండములను వ్రేలాడవేసికొంటూ ఆబోతులు ఈ వనమునంతా వ్యాకులము చేసినవి. దీనిలో అలంకారము ఏమీ లేదు. చమత్కారవిశేషము ఏమీ ఇక్కడ లేదు. వర్ణ్యమానవస్తుస్వభావము గ్రామ్యముగా ఉన్నందువలన సహృదయులకు శ్లాఘాపాత్రము కాదు. శ్లాఘ్యవిశేషణాలున్నూ లేవు. అందువలన స్వభావోక్త్యలంకారమున్నూ లేదు. కాబట్టి ఇది నిరలంకృతి.

౫౭ అశ్లీలము ౧౬

అశ్లీలార్థస్య కథన మశ్లీలం పరికీర్త్యతే.

అశ్లీలమయిన అర్థమును చెప్పడము అశ్లీలము అనే దోషము. ఇది అమంగళరూపముగాను జుగుప్సాకరముగానూ వ్రీడాబుద్ధిజనకముగానూ ఉంటుందని ఇదివరలో నిరూపితమయింది. దీని ఉదాహరణముకూడా పూర్వమె ప్రదర్శితము. ఇపుడు ఇది అర్థదోషాలలో పరిగణింపబడుతున్నది. పూర్వము అశ్లీలము పదదోషముగా చెప్పబడింది. అయితే

అసలు అశ్లీలమనేది పదదోషమా ? అర్థ దోషమా ? అనే సందేహము కలుగవచ్చు. పదదోషముగా పరిగణించి ఇది వరకు ప్రదర్శించిన ఉదాహరణములను చూస్తే ఒకవి శేషము గోచరమవుతుంది. పదవినిమయమును సహించని పదాలతో వ్రీడ కలిగేటట్లు అశ్లీలనిబంధనము చేస్తే వ్రీడా జనకాశ్లీలము పదదోష మవుతుంది. పర్యాయపదాలతో వ్రీడ కలిగేటట్లుగా అశ్లీలమును నిబంధించితే వ్రీడాజనకమయిన అశ్లీలము అర్థ దోష మవుతుంది. ఈవి శేషమును పూర్వోదాహరణమువలన గ్రహించవచ్చు. ఇతరోదాహరణములనుకూడా ఈవిధము గానే అభ్యూహించుకొనవచ్చునని విద్యానాథుడు మూల ములో చెప్పలేదు.

౫౮ విరుద్ధము ౧౭

విరుద్ధం దేశకాలాది విరుద్ధం బహుధోచ్యతే.

దేశవిరుద్ధము కాలవిరుద్ధము విద్యావిరుద్ధము స్వభావ విరుద్ధమూ అయిన అర్థము విరుద్ధ మనే దోషదుష్టము. ఈ చెప్పినవిధముగా ఇది అనేకవిధాలు కావచ్చు అని సూచన. ఉదా:—

దిశ్యుత్తరస్యాం నేదీయా నుద్వేలో లవణార్ణవః,
మరుదేశేపి గంగా నః పిపాసాం శామయిష్యతి.

ఉత్తరపుదిక్కునందు దగ్గరగా వేలాతిగము అయిన లవణార్ణవము ఉన్నది. మరుభూమిలోకూడా గంగానది మా దప్పికను శమింపజేయగలదు. 'ఈఉదాహరణములో ఉత్తర దిక్కునందు ఉప్పుసముద్రము దగ్గరలో ఉన్నది' అని చెప్ప డము దిగ్విరోధము. మరుభూమిలో గంగ అని అనడము దేశవిరోధము. వేరొక ఉదా:—

అరణ్యమహిషోదగ్ర విషాణోదరజన్మనాం
మహత్యర్ఘేపి ముక్తానాం స్త్రియో ముక్తా విభూషణాః

అడవిదున్నపోతుల పెద్దకొమ్ములలో పుట్టిన ముత్యాలకు పెద్దఖరీదుఉన్నా స్త్రీలు ముత్యాలఆభరణాలనుపెట్టుకొంటున్నారు. మహిషవిషాణాలనుండి ముత్యాలు పుట్టుతవి అని అనడము లోకవిరుద్ధము. ఏనుగులు మేఘములు శంఖము ముత్యపుచిప్ప (శుక్తిక) వెదురు మొదలయినవానియందే ముత్యాలు పుట్టడము ప్రసిద్ధము. ఇట్లాగే విరుద్ధాంతరములను ఉదాహరించుకోవాలి.

౫౯ సహచరభ్రష్టము ౧౮

మతం సహచరభ్రష్ట మతుల్యానాం నిబంధనే.

అసమానములను నిబంధించినప్పుడు సహచరభ్రష్టము అనే దోషము. ఒకేస్థలాన నిబంధనములో సమాన ప్రతిపత్తికలవానిని కూర్చాలి. అట్లాకాక అతుల్యనిబంధనము ఉన్నప్పుడు ఈదోషము తప్పదు. ఉదా:—

శాంత్యా శ్రుతం హ్రియా నారీ మన్మథేన రతోత్సవః
శ్రుతేన ధిషణా వన్యవృత్త్యా జీవంతి శాత్రవాః.

శాంతిచే శ్రుతము, సిగ్గుచే యువతి, మన్మథునిచే రతోత్సవము, శాస్త్రముచే బుద్ధి, వన్యవృత్తిచే శాత్రవులూ జీవించెదరు. శాంత్యాదివిశేషములు ఉన్నప్పుడు శ్రుతాదులు బాగాఉంటవి అని భావము. ఈపద్యములో శ్రుతము ధిషణ వీనితో నారీరతోత్సవములు తుల్యములుగా ఉండదగవు. అవి అపకృష్టములు. శ్రుతధిషణలు అందరకూ అత్యంతమూ ఉపాదేయములు సర్వోత్కృష్టములు. నారీరతోత్సవములు కొందరకే ఉపాదేయములు. "వన్యవృత్త్యా జీవంతి శాత్ర

వాః'' అనేది అన్నిటికన్న అపకృష్టము. ఈవిధముగా ఇక్కడ సహచరభ్రష్టమును ఊహించాలి. ఇట్లాగే దోషాంతరము లను యథాసంభవముగా గ్రహించాలి.

రసదోషము

రసములుకాని భావములుకాని స్వశబ్దవాచ్యములు కావడము దోషము. శృంగారాది రసాలనుకాని నిర్వేదాది వ్యభిచారిభావాలనుగాని రత్యాది స్థాయిభావాలనుగాని స్వస్వశబ్దములతో ఎప్పుడూ చెప్పరాదు. శృంగారరసము పుట్టింది. హాస్యము తిరోహిత మయింది. శంక ఉత్పన్న మయింది. ఉత్సాహము జనించింది. అని ఈరీతిగా స్వస్వ శబ్దాలతో చెప్పకూడదు. సామాన్యముగానూ చెప్పరాదు. విశేషరూపముగానూ చెప్పరాదు. ఆవిధముగా శబ్దాభిధేయత దుష్టము.

విభావాదులు ఉంటేనే రసము ప్రతీత మవుతుంది. విభావాదులు లేకపోతే రసప్రతీతి లేదు. కాబట్టి విభావాది ద్వారకముగానె రసప్రతీతి ఉండాలని సిద్ధాంతము. విభా వాదిప్రతిపాదనము లేకపోతే రసముపుట్టింది భావముపుట్టింది అని వేయిపర్యాయములు చెప్పినా ఎంతబిగ్గరగా చెప్పినా రసము ప్రతీతము కాదు. రసభావాదులయొక్క స్వశబ్దములు లేకపోయినా విభావాదులు చక్కగా ప్రతిపాదింపబడినట్లయితే రసము ప్రతీత మవుతుంది. ఈవిధముగా చూస్తే రసము ఎప్పుడూకూడా స్వశబ్దవాచ్యము కాదని తేలుతుంది. రసము ఎప్పుడూ వ్యంగ్యమేకాని అది స్వప్నములోకూడా వాచ్యము కాదు. నిత్యవ్యంగ్యమయిన రసమును స్వశబ్దములచేత వాచ్యముగా చేస్తే దోషము కలుగుతుంది అన్నమాట.

విభావాది ప్రతిపాదనము ఉన్నప్పుడు స్వశబ్దప్రతిపాదనము ఉన్నా లేకపోయినా ఒక్కటే. అయినప్పటికీ స్వశబ్దాభిధానము ఉంటే వ్యంగ్యమవుతూఉన్న రసము కొంతవరకు అనూదిత మవుతుందేగాని అంతకంటె అధికంగా విశేషమయిన ప్రయోజనము ఏమీ లేదన్నమాట. విభావాదులు బాగా సుయోజితములు అయినప్పుడు ఒక్కొక్కపర్యాయము స్వశబ్దము ఉన్నప్పటికీ దోషము లేదు అనికూడా ప్రకృతములో గ్రహించాలి. అయితే విభావాదిప్రతిపాదనము లేకుండా కేవల స్వశబ్దప్రతిపాదనము ఉన్నప్పుడు దోషమవుతుందని గ్రహించాలి.

రసము అవాఙ్మానసగోచరము. బ్రహ్మానందసబ్రహ్మచారి. విభావాదుల అనుసంధానానంతరము రసప్రతిపత్తి కలుగుతూఉంటుంది. అది కేవలమూ చర్వ్యమాణైకసారము. ఇది వాచ్యము కావడానికి ఏమీ వీలు లేదు. అయినా బ్రహ్మానందము యథాతథాశబ్దప్రతిపాద్యము అవుతూఉన్నది కాబట్టి రసముకూడా ఎప్పుడయినా ఒకప్పుడు శృంగారాదిశబ్దవాచ్యమయినా ఏమీ దోషము లేదు. అని కొందరు భావించుతారు. ప్రాచీనులు రసమును స్వశబ్దము చేతకూడా చెప్పవచ్చు నన్నారు. అది యుక్తముకాదని గ్రహించాలి.

గుణప్రకరణము

ఇక గుణాలను నిరూపించుతాము. గుణాలు దోష ప్రతిభటములు. అనగా దోషాలకు విరుద్ధముగా ఉండేవి అని కొందరి భావము. కాని గుణాలకు ప్రత్యేకస్వరూపము లేకపోలేదు. ఈ విషయము మూలములోనే మున్ముందు విశద మవుతుంది. భామహుడు మొదలయినవారు మూడు గుణాలనే అంగీకరించుతారు. వామనాదులు పదిగుణాలను అంగీకరించారు. భోజరాజు తన సరస్వతీకంఠాభరణములో ఇరవై నాలుగు గుణాలను అంగీకరించి నిరూపించాడు. విద్యానాథుడున్నూ భోజరాజమతానుసారముగా చతుర్వింశతి గుణాలను అంగీకరిస్తాడు.

గుణములు

శ్లేష	ప్రసాదము	సమత	మాధుర్యము
సుకుమారత	అర్థవ్యక్తి	ఉదారత	కాంతి
ఉదాత్తత	ఓజస్సు	సౌశబ్ద్యము	ప్రేయస్సు
ఔర్జిత్యము	విస్తరము	సమాధి	సౌక్ష్మ్యము
గాంభీర్యము	సంక్షేపము	భావికము	సమ్మితత్వము
ప్రౌఢి	రీతి	ఉక్తి	గతి.

అనేవి గుణముల పేర్లు. వీనిలో కొన్ని దోషపరిహారకములు కాబట్టి గుణాలు అవుతున్నవి. కొన్ని స్వాభావికంగానే ఉత్కర్ష హేతువులు అగుటవలన గుణము లవుతున్నవి. సహజంగా తామంతట తాము చారుత్వాతిశయమును కలుగజేసే గుణాలు ఉత్కృష్టములు. దుష్టత్వ పరిహార హేతువులుగా ఉండేవానిని అందరూ గుణాలనుగా భావింపరు. దోషాభావరూపములు కావడమువలన గుణత్వము ఉన్నదని

అంగీకరించేవారి మతములోనే సౌకుమార్యము మొదలయినవి గుణాలు అవుతవి. గుణాలకు ప్రత్యేకస్వరూపము ఉన్నదని అనేవారి మతములో ఇవి గుణములు కావు అని గ్రహించవచ్చు.

దోషాభావరూప గుణములు

సౌకుమార్యము	కాంతి	అర్థవ్యక్తి
సమ్మితత్వము	ఉదాత్తత	ఔర్జిత్యము
రీతి	ప్రసాదము	ఉక్తి
సౌశబ్ద్యము	సమత	ప్రేయము

అనే ఈ పండ్రెండు గుణాలూ దోషాభావరూపములై దోషపరిహారకములుగా ఉండడమువలన గుణములు అవుతున్నవి. ఏ యే గుణము ఏ యే దోషపరిహారకమో ఈ విధముగా తెలుసుకోవాలి.

౧ శ్రుతికటురూప దోషమును నిరాకరించడానికై సౌకుమార్యము గుణముగా అంగీకృతము.

౨ గ్రామ్యదోష నిరాకరణానికి కాంతి అనే గుణము స్వీకృతము అవుతున్నది.

3 అపుష్టార్థము అనే దోషమును దూరీకరించడానికి అర్థవ్యక్తి సమర్థము.

౪ న్యూనపదము అధికపదము అనే దోషాలను నిరాకరించడానికి సమ్మితత్వగుణము అభిమతము.

౫ అనుచితార్థము అనే దోషమును పోగొట్టడానికి ఉదాత్తత స్వీకృతమయింది.

౬ విసంధిదోష నిరాకరణానికి ఔర్జిత్యము అనే గుణము కావాలి.

౭ పతత్ప్రకర్షము అనే దోషమును పోగొట్టడానికి రీతి గుణము అవసరము అవుతుంది.

౮ క్లిష్టదోష పరిహారమునకు ప్రసాదగుణము

౯ అశ్లీలదోషపరిహారానికి ఉక్తిగుణము.

౧౦ చ్యుతసంస్కృతిపరిహారార్థమై సౌశబ్ద్యము

౧౧ ప్రక్రమభంగనిరాకరణానికి సమత అనేది

౧౨ పరుషదోషనివృత్తికై ప్రేయోగుణము అంగీకృతములు అవుతున్నవి. ఇట్లాగే యథాసంభవంగా కొన్ని దోషపరిహారకములు అవుతున్నందువలన గుణములు అవుతున్న వని ఊహించాలి. ఇక ఈ చెప్పిన చతుర్వింశతి గుణాలకూ స్వరూపోదాహరణములను చెప్పుతాము.

౧ శ్లేష

మిథ స్సంశ్లిష్టపదతా శ్లేష ఇత్యభిధీయతే.

పరస్పరమూ పదాలు సంశ్లేషము పొంది ఉంటే శ్లేష అనే గుణ మవుతుంది. సంశ్లేషము పొందడము అంటే అనేకపదాలు ఏకపదము మాదిరిగా అవభాసించడము అని భావము. ఉదా:—

శ్రీమత్కాకతివీరరుద్ర మఖిలక్ష్మాపాల మౌళిస్ఫుర
న్మాణిక్యద్యుతి రంజితాంఘ్రి మఖిలప్రఖ్యాత శౌర్యోదయం
విశ్వత్రాణ వినిద్ర మక్షయగుణజ్యోత్స్నావితానావృత
వ్యోమాగార మనల్పవైభవ మముం స్తోతుం వయం నేశ్మహే.

శ్రీమత్కాకతివీరరుద్రుని పాదాలు, నిఖిలరాజన్యుల శిరములపై ఉన్న స్ఫురన్మాణిక్యద్యుతులచే రంజితములు అవుతున్నవి. సర్వలోకానికీ ఆతని శౌర్యోదయము ప్రఖ్యాత

మయింది. ఆతడు ప్రపంచ సంరక్షణంలో జాగరూకుడు. అతని అనశ్వరగుణజ్యోత్స్నావితానముచేత గగనాగార మంతా ఆవృతము అయింది. ఆతని వైభవము అనల్పము. ఆ వీరరుద్రుని స్తవము చేయడానికి మేముశక్తులము కాము. దీనిలో పాఠసమయములో పదాలు ఒకేపదమువలె అవభా సించుతున్నవి. ఒకపదమువలె అవభాసించడము అంటె అభి ప్రాయము ఇది-పదము పదమూ కలిసినప్పుడు సంధిసౌష్ఠవము వలన ఆపాతతః ఒకే విధానం చెవికి అవభాసించుతూ ఉంటవి. ఆపదాల కలయికలోని సముచ్చారణమున్నూ మసృణమై సంశ్లిష్టంగా వినపడుతుంది. శ్లేష అనే పదవ్యు త్పత్తి సరిసతకూడా ఈభావానికి దోహద మిస్తుంది. 'శ్లిష – సంయోగే' అనేధాతువునుండి శ్లేషపదము ఉత్పన్నమయింది. అనేకపదాలు ఒకటిగా కూడిఉండడము అని అభిప్రాయము.

౨ ప్రసాదము

ప్రసిద్ధార్థపదత్వం య త్ప్రసాదో వినిగద్యతే.

ప్రసిద్ధమయిన అర్థాన్ని చెప్పే పదాలు కలిగిఉంటే ప్రసాదము అనే గుణము అవుతుంది. శబ్దమువినగానే అర్థ ప్రత్యయము కలగాలి. ఈ ప్రసాదగుణము అన్నిరసాలకూ అనుకూలము. ఏరచనకయినా అనుగుణము. మాధుర్యగుణ ములో మాదిరిగా ప్రత్యేకంగా ఈ శబ్దాలే ఉండాలి అనే నియమం దీనిలో లేదు. ఉదా:—

ప్రతాపరుద్రదేవోఽయం భాతి లక్ష్మీపతిః స్వయం.
యేనాస్య లోచనే పుల్లపుండరీక మనోహరే.

ఈ ప్రతాపరుద్రదేవుడు తాను స్వయముగా లక్ష్మీ పతి అయి అవభాసించుచున్నాడు. ఈతనినేత్రాలు ప్రఫుల్ల

పుండరీక మనోహారములు కదా! శ్రీలక్ష్మీవల్లభుడు పుండరీకాక్షుడు. ప్రతాపరుద్రుడుకూడా పుండరీకాక్షుడు అందు వలన లక్ష్మీపతి. దీనిలో వినినంతనే అర్థమును సమర్పించే పదాలు ఉన్నవి. కాబట్టి ప్రసాదగుణము. దూరదూరార్థమును గోచరము చేసికోవలసిన క్లిష్టత ఇక్కడ లేదు.

౩ సమత

అవైషమ్యేణ భణనం సమతా సా నిగద్యతే.

విషమత్వము లేకుండా ఉండేటట్లు చెప్పడము సమత అనే గుణమని అంటున్నారు. పద్యములోని రచన ఎగుడు దిగుడుగా ఉండక అంతటా ఒకేవిధముగా ఉంటే సమత అన్నమాట. సమానశైలి ఉండాలి. శైలీభేదము ఉండరాదని తాత్పర్యము. ఉదా:—

వదాన్యతరుమంజరీసురభయః శ్రవఃపారణం
గుణా విదధతే సతాం జగతి వీరరుద్రప్రభోః
సుధామధురిమాధరీకరణ చాతురీచుంచవో
వియచ్చర తరంగిణీ విహరదూర్మిమర్మస్పృశః.

వీరరుద్రప్రభువుగుణాలు జగత్తులో సత్పురుషులకు శ్రవఃపారణము చేస్తున్నవి. ఆగుణాలు కల్పవృక్ష మంజరుల వలె సురభిళములు మనోహారములూను. అవి ఇంకా అమృత మాధుర్యమును అధఃకరించడములో చాతుర్యము కలిగి ఉన్నవి. ఆకాశగంగలో తిరుగాడుతూఉన్న తరంగాలవలె ఉన్నవి. ఈపద్యము నాలుగుపాదాలలోనూ సమానంగా చెప్పడము ఉన్నది. శైలి సమరీతిలో నడిచింది. కాబట్టి ప్రక్రమభంగదోషము లేదు. అది పరిహృతమయింది.

అంతటా అవిషమ మయినరీతి ఉన్నది కాబట్టి సమత అన్న మాట.

౪ మాధుర్యము

యా పృథక్పదతా వాక్యే తన్మాధుర్యం ప్రకీర్త్యతే.

వాక్యములో పదాలు విడివిడిగా ఉండడము మాధుర్యము అనే గుణము. పదాలలో పరస్పరము సంధిలేకపోవడమువలన ఒకటొకటి అతుతుకోనకుండా వేరువేరుగా ఉంటే మాధుర్యము. భోజదేవుడు మాధుర్యలక్షణమును ఈవిధము గానే అంగీకరించుతున్నాడు. ఉదా:—

యశశ్శ్రియః కాకతిభూపతేర్దిశాం
నితంబబింబేషు దుకూలరీతయః
ఉరోజయోర్మౌక్తికహారవిభ్రమాః
శిరస్సు జాతీకుసుమస్రగుజ్జ్వలాః.

కాకతిభూపతియశశ్శోభలు దిశానితంబ బింబములందు దుకూలరీతి కలవి అయినవి. వక్షోజములందు మౌక్తికహారవిలాసములు పొందుతున్నవి. శిరస్సులందు మల్లెపువ్వుల మాలలవలె సముజ్జ్వలములై ఉన్నవి. దీనిలో సామాసయాన పదాలు వేరువేరుగా ఉన్నట్లు ప్రతీత మవుతుంది. ఇక్కడ దీర్ఘసమాసాలు లేవు. కాబట్టి మాధుర్యము.

౫ సౌకుమార్యము

సుకుమారాక్షరప్రాయం సౌకుమార్యం తదుచ్యతే.

సుకుమారము లయిన వర్ణాలు ప్రచురంగా ఉన్నట్లయితే సౌకుమార్యము అవుతుంది. వర్ణాలలో సుకుమారత్వము అంటే అనుస్వారములతో కూడుకొన్న కోమలవర్ణాల

బంధము కలిగిఉండడము అని గ్రహించాలి. సౌకుమార్యము అపరుషత్వము అన్నమాట. ఉదా:—

అమన్దానన్దనిష్యంద సున్దరీవదనేన్దుభిః
నగరే కాకతీన్ద్రస్య దివాప్యాభాతి చంద్రికా.

కాకతీంద్రుని నగరములో అమందానందమును కలుగ జేసే సుందరుల ముఖచంద్రులు ఉండడము చేత పగటిసమయానకూడా వెన్నెల ప్రకాశించు తున్నది. దీనిలోని కోమల వర్ణబంధము సానుస్వారమై ఉన్నది కాబట్టి సౌకుమార్యమును గ్రహించవచ్చు.

౬ అర్థవ్యక్తి

యత్తు సంపూర్ణవాక్యత్వం అర్థవ్యక్తిం వదంతి తాం.

వాక్యము సంపూర్ణముగా ఉంటే అర్థవ్యక్తి అవుతుంది. వాక్యములో ఉండవలసిన అంశాలు అన్నీ ఉన్నప్పుడు ఇదేమిటి? ఇదెందుకు? అనే ఆకాంక్ష రాదు. సర్వాంశములూ ఉంటే సంపూర్ణత్వము. అప్పుడు అర్థవ్యక్తి. ఉదా:-

భాగ్యం మధ్యమలోకనిష్ఠ మధునా యేనాస్య సంరక్షితా
జాతః ఖేలతి వీరరుద్రనృపతిః నిస్సీమశౌర్యోదయః.
యద్వా త్రీణ్యపి విష్టపాని దధతే ధన్యత్వ మంశో హరేః
యత్సాక్షా దవతీర్య కాకతికులే స్వైరం సముజ్జృంభతే.

ఈపృథివీమండలానికి నిస్సీమశౌర్యోదయము కల వీరరుద్రనృపతి సంరక్షకుడయి శోభించుతున్నాడు. కాబట్టి ఇప్పుడు భాగ్యమంతా మధ్యమలోకాయత్తమై ఉన్నది. కేవలమూ ఈమధ్యమలోకమె అని అనడమెందుకు? మూడు భువనాలుకూడా ధన్యత్వమును ధరించు తున్నవి. ఏమంటే

శ్రీవిష్ణువు అంశమె కాకతికులములో సాక్షాత్తుగా అవతరించి సాక్షాత్తుగా సముజ్జృంభించుతున్నది. దీనిలో అర్థాన్ని నిరూపించుకొనేటప్పుడు వాక్యము నిరాకాంక్షముగా పరిపూర్ణము అవుతున్నది. క్రియాపదము సరిగా ఉండకపోతే అశరీరము మొదలయిన కొన్నిదోషాలు పరిపూర్ణత బాగాలేక సాకాంక్షములుగా ఉంటున్నవి. నిరాకాంక్షముగా వాక్యము పరిపూర్ణమయినప్పుడు అశరీరాది దోషాలకు అవకాశం ఉండదు. అందువలన ఈగుణము అశరీరాది దోషాలు లేకుండా చేస్తుందని వాటికి ఇది ప్రత్యుదాహరణము అనీ గ్రహించవచ్చు, అయితే అపుష్టార్థమనే దోషనిరాకరణానికి అర్థవ్యక్తిగుణము సమర్థమవుతుందని ఇదివరలో అన్నమాట నిజమె. అశరీరాదిదోషాలుకూడా క్రియాపదము లేనందువలన సరైన పరిపోషము లేనివె. కాబట్టి అవిన్నీ అపుష్టార్థములు కావచ్చు. వానిని ఇది నిరాకరించుతుంది అన్నమాట. ప్రకృతములో ఉపయోగించని అర్థము ఉంటే అపుష్టార్థ దోషము అని పూర్వోక్తలక్షణము. ప్రకృతములో ఉపయోగించినా లేకపోయినా అపుష్టార్థముకూడా నిరాకాంక్షముగానే పరిపూర్ణ మవుతున్నది. కాబట్టి అర్థవ్యక్తిగుణముకంటె అది విపరీతముకాదు. అందువలన అటువంటి అపుష్టార్థము ప్రత్యుదాహరణ మని అనుకోరాదు. కాబట్టి సాకాంక్షముగా ఉన్నందువలన అపరిపూర్ణముగా ఉంటే అశరీరాదులుకూడా ఉండవలసిన పరిపోషము లేకుండా ఉంటున్నవి. కాబట్టి అపుష్టార్థములె కావచ్చును అని గ్రహించితే వాని దూరీకరణానికి ఈ అర్థవ్యక్తి అర్హమవుతుంది అని గ్రంథసమన్వయము చూడాలి.

౭ కాంతి

అత్యుజ్జ్వలత్వం బంధస్య కావ్యే కాంతి రితీష్యతే.

కావ్యములో బంధము అత్యంతమూ ఉజ్జ్వలంగా ఉంటే కాంతి అనే గుణము. ఈ ఉజ్జ్వలత్వము లేకపోతే ప్రాతబడిన బొమ్మమాదిరిగా ప్రబంధచ్ఛాయ బాగా ఉండదు. ఇటువంటి ఉజ్జ్వలత ఉండడమె కాంతి. ఉదా:-

జేతుః కాకతివీరరుద్రనృపతేః జైత్రప్రయాణోత్థితే
క్షోణీరేణుభరే నభస్యతిభృశం భూవిభ్రమం బిభ్రతి,
జాతా మర్త్యనదీవిశంకటతటీ దీర్ఘావియద్దీర్ఘికా
గాఢం గూఢతమా చ గౌతమనదీ పాతాళగంగాయతే.

ఈపద్యము కావ్యప్రకరణములో నిరూపిత మయింది. దీనిలోని రచన ఉదాత్తముగా ఉజ్జ్వలముగా ఉన్నది. కనుక కాంతి అనే గుణము.

౮ ఔదార్యము

వికటాక్షర బంధత్వ మార్యై రౌదార్య మిష్యతే.

అక్షరబంధము వికటముగా ఉన్నప్పుడు ఔదార్యము అనేగుణము. పదాలు నర్తనము చేస్తున్నట్లుగా ఉండాలి అని భావము. వాక్యము పదాలతో కూర్పబడినప్పుడు అది మంచి నడకతో ఉన్నట్లు ఉండాలి. ఆపదాలు నృత్యం చేస్తూ ఉన్నట్లుగా కన్పడాలి. దీర్ఘములతో అనుస్వారములతో కలిసి సహృదయసంవేద్యములై విశాలములుగా ఆపదాలు ఉండాలి. అక్షరాలు ఆవిధముగా ఉన్నప్పుడే వికటాక్షరత. నృత్యములో అంగములు (అంగుళిమొదలయినవి) ఆకుంచన ప్రసారణముల క్రమవిన్యాసము కలిగి రంజకములుగా ఉంటవి. అట్లాగే

ప్రకృతంలోకూడా ముందు మాటలు నర్తనము చేస్తున్నట్లుగా గమించుతూ ఉంటే వెనక వస్తువు వస్తూఉంటుంది. ఉదా:—

జగ్ధ్వా భూయాంసి మాంసా న్యహమహమికయా బద్ధగార్ధ్యా స్సపీత్వాః
అస్రస్రోస్సైచ్ఛస్తురాష్ఠ్యుత్క్షణభవ కటత్కారరౌద్రా గ్రదంష్ట్రిః
సంబిభ్రాణాః క్షపాటా ద్విపగలితవసా నిర్ఝరాంత ర్నదీష్ణాః
కుర్వంత్యాయోధనోర్వ్యోభయ మవనిభృతా మంధ్రసైన్యేనసృష్టాః

అంధ్రసైన్యాలు సృజించిన యుద్ధభూములు సామంత భూపాలకులకు భయమును కలుగజేస్తున్నవి. ఆ యుద్ధభూము లలో పిశాచాలు మిక్కుటముగా మాంసమును భక్షించి రక్తపానగోష్ఠిలో "మేము ముందు మేము ముందు" అని అసూయాసహితములై ప్రవర్తించుతున్నవి. అవి పెద్దపెద్ద ఎముకలను గట్టిగా కొరకడముచేత "కటత్ కటత్" అని ధ్వని పుట్టుతున్నది. ఆ కటత్కారముచేత వాని ముందు కోరలు రౌద్రములై ఉన్నవి. చచ్చిపోయిన ఏనుగులనుండి స్రవించిన వసానదులలో ఆపిశాచాలు మునుకలు పెట్టు తున్నవి. ఇట్లా భూతప్రేతపిశాచాలతో కూడుకొన్న యుద్ధ భూములు భయజనకములు కదా! దీనిలో అక్షరాలు కదను తొక్కిన విధాన ఉండడముచేత ఔదార్యగుణము.

౯ ఉదాత్తత

శ్లాఘ్యై ర్విశేషణై ర్యోగో యస్తు సాస్యా దుదాత్తతా.

సముచితవిశేషణాలతోకూడిక ఉన్నట్లయితే ఉదా త్తత అనేగుణ మవుతుంది. కూర్చబడే విశేషణాలు మెచ్చ దగినవి విశేష్యాలకు తగినవిన్నీ కావాలని భావము. ఉదా:—

బృంహమాణగజాకీర్ణా ప్రేషమాణ హయాకులా
సంక్రీడత్స్యందనా క్ష్వేడభటా రుద్రవిభో శ్చమూః.

రుద్రవిభుసేనలో ఏనుగులు బృంహణము చేస్తూ వ్యాపించిఉన్నవి. అశ్వాలు హ్రేషలుపెట్టుతూ ఆకులములు అయిఉన్నవి. రథాలు సంక్రీడనము చేస్తున్నవి. భటులు సింహనాదము చేస్తున్నారు. దీనిలో గజాశ్వరథభటవిశేషణాలు ఉచితంగా ఉన్నవి. గజాలకు బృంహణము, అశ్వాలకు హ్రేష, రథాలకు సంక్రీడనము, భటులకు సింహనాదము అనేవి అనుగతములయిన ధర్మాలు అని శ్లాఘ్యముగా కూర్పబడినవి కాబట్టి ఉదాత్తత.

౧౦ ఓజస్సు

ఓజ స్సమాసభూయ స్త్వం.

సమాసాలు అధికముగా ఉండడము దీర్ఘసమాసాలు ఉండడమూ ఓజోలక్షణము. ఉదా:—

ఉద్దామద్విరదౌఘదానలహరీ సౌరభ్యలోభభ్రమత్
భృంగశ్రేణినిబద్ధఝుంకృతికలావాచాలితప్రాంగణాః
నిస్సీమప్రథమానభూమ విభవారంభప్రియంభావుకా
మోదంతే భువి వీరరుద్రనృపతేః విద్వద్గృహశ్రేణయః.

వీరరుద్రనృపతియొక్క విద్వాంసుల గృహపంక్తులు జగములో సమోదముతో కూడుకొని ఉన్నవి. ఆగృహప్రాంగణాలలో ఉద్దామద్విరదసమూహములు ఉన్నవి. ఆగజాల దానధారాప్రవాహములోని పరిమళలోభము చేత భ్రమరాలు బారులు తీర్చి భ్రమించుతూ ఝుంకారములు చేస్తున్నవి. ఆప్రాంగణములన్నీ ఆఝుంకృతికలావాచాలితములు అవుతున్నవి. ఇంకా ఆగృహాలు నిస్సీమమహిమాతిశయముతో ప్రఖ్యాతములు అయిఉన్నవి. అత్యంతమూ

అందరకూ ప్రియములు అయినవి. దీనిలో సమాస భూయస్త్వము ఉన్నది. కనుక ఓజస్సు.

౧౧ సౌశబ్ద్యము

సుపాం తిఙాం చ వ్యుత్పత్తిః సౌశబ్ద్యం పరికీర్త్యతే.

సుబంత తిఙంత విశేషములకు చక్కని వ్యుత్పత్తి ఉండడము సౌశబ్ద్యము అనేగుణము. నామపదాలు ధాతుపదాలున్నూ వ్యుత్పత్తిరమ్యములుగా కూర్పబడినప్పుడు ఈగుణము. ఉదా:—

ఆశామండలకూలముద్వహకథై రభ్రంకషై ర్వైభవైః
రక్షన్ సుప్రజసః ప్రజా స్త్రిభువనక్షేమంకరప్రక్రియః
దుష్టానాం భువి నిప్రహంతు మతులై రాఢ్యంభవిష్ణు ర్గుణైః
భూమ్నా సంచరతేఽద్య కాకతికులే రుద్రావతారో హరిః.

రుద్రావతారముగాఉన్న శ్రీహరి కాకతికులములో ఇప్పుడు మహిమతో సంచరించుచున్నాడు. ఆతని వైభవకథలు ఆశామండలకూలమును ఒరిపిడిచేస్తూ ఉన్నవి. అభ్రంకషముగా ఉన్నవి. వీనిచేత సుప్రజసులయిన అంటే మంచి సంతానముకలిగిన ప్రజలను రక్షించుతూ మూడులోకాలకూ క్షేమంకరమయిన ప్రక్రియకలవాడై ఉన్నాడు. భువిలో దుష్టులను నశింపజేయడానికి అసమానగుణాలతో పరిపూర్ణుడై ఉన్నాడు. దీనిలో "కూలముద్వహకథ, అభ్రంకష, సుప్రజస, క్షేమంకర, ఆఢ్యంభవిష్ణు" అనేపదాలు సుప్తిఙ్ వ్యుత్పత్తికలవి కాబట్టి సౌశబ్ద్యము అనేగుణము. "కూలం ఉద్వహంతీతి కూలముద్వహాః, అభ్రం కషంతీతి అభ్రంకషాః, శోభనాః ప్రజా యాసాంతాః సుప్రజసః, క్షేమం కరోతీతి క్షేమంకరః, ఆఢ్యో భవతీతి ఆఢ్యంభవిష్ణుః" ఈవిధము

లయిన వ్యుత్పత్తులు ఆయా వ్యాకరణసూత్రనియమాను సారంగా ఉన్నవి. ఈ సౌశబ్ద్యము అనేగుణము చ్యుతసంసంస్కారరూప దోషపరిహారార్థము అని అనడము యుక్తము కాదు. అపశబ్దాలు లేకపోతే చ్యుతసంస్కృతి ఉండదు. అంతమాత్రంతో ఆదోషాన్ని పరిహరించవచ్చు. ఈనిరూపితమయిన స్థలములో సకలసచేతస్కులకున్నూ చేతశ్చమత్కారమును కలుగజేసే విశిష్టపదప్రయోగము ఉన్నదికాబట్టి స్వతంత్రగుణత్వము ఉంటుందని ఊహింపవచ్చును. అని వ్యాఖ్యాతఅయిన కుమారస్వామిసోమపీథి అభిప్రాయపడుతున్నాడు.

౧౨ ప్రేయము

ప్రేయః ప్రియతరాఖ్యానం చాటూక్తౌ యద్విధీయతే.

చాటూక్తిలో విధానింపబడే ప్రియతరాఖ్యానము ప్రేయోగుణము అవుతుంది. చాటూక్తి అంటే ప్రియోక్తి. ఉదా:—

దాక్షిణ్యం త్వయి దక్షతా త్వయి దయా త్వయ్యున్నతత్వం త్వయి
ప్రాగల్భ్యం త్వయి పౌరుషం త్వయి కలాసంపత్త్వయి శ్రీస్త్వయి
ఔదార్యం త్వయి ధీరతా త్వయి జగద్ధౌరేయతా చ త్వయి
శ్రీమత్కాకతినాథ! పాలయ భువం వైరించకల్పాన్ శతం.

ఓ! కాకతిమహీనాథా! నీలో దాక్షిణ్యము ఉన్నది. నీలో దక్షత్వము ఉంది. దయ నీలోఉంది. ఉన్నతత్వము నీయందు ఉన్నది. ప్రగల్భత నీలో ఉంది. పౌరుషము నీలో ఉన్నది. నీయందు కలాసంపద ఉంది. నీలో శ్రీ ఉన్నది. నీయందు ఔన్నత్యము ఉంది. నీయందు ధీరత్వము ఉంది. నీలో జగద్ధౌరేయత్వము ఉన్నది. కాబట్టి నీవు నూరు

బ్రహ్మకల్పాలు భూమిని పరిపాలించు. ప్రేమాతిశయమున వచ్చేపలుకులు ఇక్కడ ఉన్నందువలన ప్రేయోగుణము. ఇది నిష్ఠురవచనాత్మకమయిన పరుషదోషానికి ప్రతిపక్షి.

౧౩ ఊర్జిత్యము

ఔర్జిత్యం గాఢబంధత్వం.

విసంధులు లేకుండా ఉండేటట్టుగా గాఢమయిన బంధము కలిగిఉండేటట్లయితే ఔర్జిత్య మనే గుణము. ఉదా:-

క్షోణీరక్షణదక్షిణాః క్షతజగత్క్షోభా ద్దురీక్షక్రమాః
క్షుద్రక్షత్రియపక్షశిక్షణవిధౌ ప్రోక్షి ప్తకౌక్షేయకాః,
ఉద్దామోద్యమనస్య రుద్రనృపతేః దోర్దండయో శ్చండయోః
గర్జద్దుర్జనగర్వపర్వతభిదా దంభోళయః కేళయః.

దీనిలో రచన గాఢముగా ఉన్నది. ఈ పద్యము కావ్యప్రకరణము శబ్దచిత్రప్రసంగములో నిరూపితము.

౧౪ సమాధి

సమాధి రన్యధర్మాణాం యదన్యత్రాధిరోపణం.

ఒకదాని ధర్మమును వేరొకదానియందు నిరూపించడము సమాధి. చేతనధర్మాలను అచేతనములందు నిరూపించడము కాని అచేతనధర్మాలను చేతనములందు నిరూపించడముకాని, రసనాధర్మములను కర్ణధర్మాలనుగా చెప్పడముకాని ఇట్లాగే అన్యధర్మాలను అన్యములకు చెప్పితే సమాధిగుణము అవుతుంది. ఉదా:—

పృచ్ఛంతీ దుగ్ధసింధుం కుశల మనుసరం త్యాదరా చ్ఛంకరాద్రిం
చాటూక్త్యా మానయంతీ ముహు రమరనదీం చంద్ర మాగ్రేహసంతీ
వైధాత్రీం యానహంసావలి మనుకృపయా స్వాగతం వ్యాహరంతీ
లోకేషు త్రిష్వమీషు ప్రభవతి మహతీ వీరరుద్రస్య కీర్తిః.

వీరరుద్రునికీర్తి పాలకడలిని కుశలము అడుగుతున్నది. కైలాసమును ఆదరముతో అనుసరించుతున్నది. వియన్నదిని మరలమరల చాటూక్తిచే సమ్మానించుతున్నది. ఎదట చంద్రుణ్ణి నవ్వుతున్నది. బ్రహ్మవాహనహంసపంక్తిని అనుసరించుతూ కృపతో స్వాగతము పలుకుతున్నది. మహనీయమయిన ఆకీర్తి ఇట్లా మూడు లోకాలలోనూ ప్రభావముతో కూడుకొని ఉంది. కుశలప్రశ్న మొదలయినవి చేతనధర్మాలు. అవి అచేతనము అమూర్తమూ అయిన కీర్తియందు ఉన్నట్లుగా వర్ణితములు అయినవి కాబట్టి సమాధి.

౧౫ విస్తరము

సమర్థనప్రపంచోక్తి రుక్తస్యార్థస్య విస్తరః,

చెప్పినఅంశమును సమర్థించడానికి స్వీకరించిన విస్తృత వచనము ఉన్నప్పుడు విస్తరము అనేగుణము. చెప్పవలసిన అర్థాన్ని విపులంగా చెప్పడము అన్నమాట. చెప్పదలచినది కొంచమె అయినా వచనపల్లవము చమత్కారమును కలుగజేసేదిగా ఉన్నప్పుడు విస్తరము. ఉదా:—

లోకేషు త్రిషు కాకతీశ్వరగుణాన్ స్తోతుం ముహు ర్వీక్షితుం
శ్రోతుం బహ్వభినందితుం చ ఫణినా మేకః క్షమో నాయకః,
యద్వక్త్రాణి సహస్ర మస్య కృతినో యద్ద్వేసహస్రే దృశః
తావేవ శ్రుతయః ఫణా దశశతా న్యత్యద్భుతాందోళనే.

ఈమూడులోకాలలోనూ కాకతీశ్వరుని గుణాలను స్తవముచేయడానికి, మళ్ళీమళ్ళీ చూడడానికి, వినడానికి, బాగా అభినందించడానికిన్నీ ఫణినాయకుడు ఆదిశేషువు ఒక్కడే సమర్థుడు. ఏమంటే? ఆసమర్థుని ముఖాలు వేయి ఉన్నవి. దృక్కులు రెండువేలు ఉన్నవి. చెవులుకూడా అవే.

అత్యద్భుతాందోళనములో పడగలు వేయి ఉన్నవి. పూర్వార్థములో చెప్పినఅర్థాన్ని సమర్థించడానికి పరార్థములో ఉపపత్తులు ప్రదర్శింపబడినవి కాబట్టి విస్తరగుణము ఉన్నది.

౧౭ సమ్మితత్వము

యావదర్థపదత్వం తు సమ్మితత్వ ముదాహృతం.

నిరూపించదలచిన అర్థానికి తగినంతగా పదాలు ఉంటే సమ్మితత్వము అవుతుంది. చెప్పదలచిన అర్థముకంటె ఒకపదము ఎక్కువా కారాదు. తక్కువా కారాదు. శబ్దార్థాలు రెండిటికీ సరిగా సామరస్యము ఉండడము అన్నమాట.
ఉదా:—

కాకతీయనరేంద్రస్య కీర్తిచందనచర్చనం,
దిగంగనా వితన్వంతి వతంసీకృతతద్గుణాః.

ఇది గతార్థము. సమన్వయము స్పష్టమె. అర్థానికి తగినన్ని శబ్దాలరచన ఉన్నదికదా!

౧౮ గాంభీర్యము

ధ్వనిమత్తా తు గాంభీర్యం.

ధ్వని కూడుకొనిఉంటే గాంభీర్యము అనేగుణము. ధ్వన్యమానార్థమును పొదుపుకుంటూ రచనఉండాలి. ఉదా:-

విషం కౌక్షేయకే గంగా కీర్తౌ దిగ్వసనం రిపౌ,
ఇందు ర్ముఖే చ రుద్రస్య కాకతీయస్య దృశ్యతే.

కాకతీయుడయిన రుద్రునకు ఖడ్గములో విషము, కీర్తియందు గంగానది, శత్రువులలో దిగ్వసనము, ముఖములో చంద్రుడూ, కనపడుతున్నారు. ఈపద్యములో శంకరునకు గళమున విషము ఉంది. శిరస్సున గంగ ఉంది. కటిస్థలమున

దిగ్వస్త్రము ఉన్నది. శిరమున చంద్రుడు ఉన్నాడు. అని ధ్వనించుతున్నది. ఇట్లా ధ్వని ఉన్నందువలన గాంభీర్యము.

౧౮ సంక్షేపము

సంక్షిప్తార్థాభిధానం య త్సంక్షేపః పరికీర్త్యతే.

సంక్షేపాత్మకమయిన అర్థమును చెప్పడము సంక్షేపము అనే గుణము. ఒకొక్కసారి విషయప్రతిపాదనములో విస్తృతిలేకుండా తగినంతగా కొద్దిగా చెప్పడము శోభించుతుంది. ప్రకృతౌచితీవశాన వాక్యసంకోచము చమత్కారకారణంగా ఉంటుంది. అప్పుడు అది సంక్షేపము. ఉదా:-

వంశోఽస్తి కాకతీయానాం తత్రాసన్ బహవో నృపాః
తేషాం భాగ్యవివర్తోయం వీరరుద్రో నరేశ్వరః.

కాకతీయులవంశము ఒకటి ఉంది. అందు అనేక రాజులు ఉండేవారు. ఆవీరరుద్రనరేశ్వరుడు వారందరి భాగ్యవివర్తము. దీనిలో అతివిస్తరముగా చెప్పడమునకు యోగ్యమయిన అర్థము సంక్షేపముగా చెప్పబడింది కాబట్టి సంక్షేపము అనేగుణము.

౧౯ సౌక్ష్మ్యము

అంతస్సంజల్పరూపత్వం శబ్దానాం సౌక్ష్మ్య ముచ్యతే.

శబ్దాలకు సంబంధించిన వివక్షితార్థము గర్భీకృతమయిన రూపముతో ఉన్నట్లయితే సౌక్ష్మ్యము అనేగుణము. శబ్దములద్వారా చెప్పదలచిన అర్థము స్పష్టముగా ఉండడము కాక లోలోపల దాగిఉన్నట్లుగాఉంటే ఈగుణమన్నమాట. కరి తురగాదిరూపములు పాషాణాదులలో చెక్కబడి ఒక విధమయిన అభివ్యక్తిని పొందుతున్నప్పటికీ గర్భీకృతమయిన

సూక్ష్మాకారముతో అవభాసించుతూ ఉంటవి. అట్లాగే వివక్షితార్థము లోలోపల దాగి లీనాలీనముగా గోచరించుతూ ఉండడమే కాక గర్భగూఢముగా ఉన్నట్లయితే ఈ గుణము అని భావము. ఉదా :-

అధ్యధఃపరిసంశ్లిష్టాః స్థాకృఞ్భూధాతవ స్సదా
వర్తంతే కాకతీయేంద్రే కర్తర్యన్యత్ర కర్మణి.

స్థా, కృఞ్, భూ అనే మూడుధాతువులూ అధి, అధః, పరి అనే ఉపసర్గలతో కూడుకొని నిత్యము కాకతీయ ప్రభువునందు కర్త్రర్థములో ఉంటున్నవి. కాకతీయేతర వ్యక్తియందు కర్మార్థములో ఉంటున్నవి. దీనిలో ధాతువులకూ ఉపసర్గలకూ యథాక్రమముగా అన్వయము ఉన్నది. కర్త్రర్థములో అధితిష్ఠతి, అధః కరోతి, పరిభవతి, అని వివక్షితరూపాలు మూడు నిష్పన్నములు అవుతున్నవి. కర్మార్థములో అధిష్ఠీయతే, అధఃక్రియతే-పరిభూయతే, అని మూడు ఇష్టరూపాలు కలుగుతున్నవి. వీనిని అనుసరించి వాక్యాలు ఇట్లా సిద్ధములవుతవి. "ప్రతాపరుద్రః సింహాసన మధితిష్ఠతి, శత్రూన్ అధఃకరోతి, అరీన్ పరిభవతి, ప్రతాపరుద్రేణ శత్రుపుర మధిష్ఠీయతే, శత్రుః అధః క్రియతే, అరిః పరిభూయతే" అని. ఇట్లా ఈపద్యములో అంతఃసంజల్ప రూపత్వము ఉన్నందువలన సౌక్ష్మ్యగుణము ఉన్నది.

౨౦ ప్రౌఢి

ప్రౌఢి రుక్తేః పరీపాక ఇతి కావ్యవిదో విదుః

ఉక్తిలోని పరిపాకము అనగా వైచిత్రీవిశేషము ప్రౌఢి అవుతుంది అని కావ్యవేత్తలు అంగీకరిస్తున్నారు. చెప్పే

మాటలో వైచిత్ర్యవిశేషము కూడుకొని ఉన్నట్లయితే ఈ గుణము ఉంటుందన్నమాట. ఉదా :-

వీప్సా పద్మభవస్య చంద్రముకుటస్యావృత్తి రామ్రేడితం
దైత్యారేః ప్రతిబింబనం సురగిరేః ఇందో స్సముత్తేజనం
కర్ణాదేః పునరుద్భవః సురతరో స్సర్వస్వ మావిష్క్రియా
స్వర్ధేనో రితి తర్కయంతి కవయః శ్రీవీరరుద్రప్రభుం.

శ్రీవీరరుద్రప్రభువును కవులు ఈవిధముగా వితర్కించుతూ ఉన్నారు. శ్రీవీరరుద్రుడు బ్రహ్మదేవుని ద్విర్భావము. ఈశ్వరుని ఆవృత్తి. శ్రీవిష్ణువునకు ఆమ్రేడితము. మేరుపర్వతానికి ప్రతిబింబము. చంద్రునకు సముత్తేజనము. కర్ణాదులకు మళ్లీఉత్పత్తి. కల్పవృక్షముయొక్క సర్వస్వము. కామధేనువు ఆవిష్కారము. అని. అంటే బ్రహ్మాదులు మళ్ళీ అవతరించివచ్చి వీరరుద్రరూపముగా ఉన్నారని తాత్పర్యము. దీనిలో అంతటా వీరరుద్రుడు ద్వితీయబ్రహ్మాది రూపముగా వైచిత్ర్యవిశేషముగా చెప్పబడడముచేత ప్రౌఢి గుణము.

౨౧ ఉక్తి

విదగ్ధభణితి ర్యాస్యా దుక్తిం తాం కవయో విదుః.

చతురులవచనము ఉక్తి అవుతుందని కవులు అంటారు. చాతుర్యముతో కూడుకొన్నవచనము ఉక్తి అని తాత్పర్యము. విశిష్టమయిన భణితి ఉంటుందన్నమాట. ఉదా:-

దిట్టా కమలాసత్తీ రణ్ణో తహసుహ అచిత్తచరిఅస్స
భాసంతో వితుమంతాం కువలఅలచ్ఛిం పసాహేసి.

సుభగుడవు చిత్రచరితుడవూ రాజువూ అయిన నీకు కమలాసక్తి కన్పడుతూనే ఉన్నది. నీవు భాస్వంతుడవూ అవు

తావు. ఆకువలయలక్ష్మిని అలంకరించుతున్నావు. రాజు - చంద్రుడు, కమలాసక్తి-పద్మాసక్తి, సంపదాసక్తి. చంద్రునికి పద్మాలలో ఆసక్తి అనడము చిత్రము. భాస్వంతుడు-సూర్యుడు. కువలయము-భూవలయము, కలువ. సూర్యునకు కలువల ప్రసాదనము చిత్రము. కాబట్టే సుభగచిత్రచరిత్రత. దీనిలో ఈవిదగ్ధభణితి ఉక్తిగుణము అవుతున్నది.

౨౨ రీతి

యథోపక్రమనిర్వాహో రీతి రిత్యభిధీయతే.

ఉపక్రమించిన విధాన నిర్వాహము ఉంటే రీతి అనే గుణము. మొదట ఏవిధాన ఉపక్రమము ఉంటుందో ఆవిధంగానే నిర్వహణము ఉండాలి అని భావము. ఉదా:-

షడ్గుణా న్సేవతే రాజా షడ్రిపూ నవమన్యతే
షడ్దర్శనా న్యుపాదత్తే షడ్బలాని చ వీక్షతే.

రాజు షడ్గుణాలను సేవించుతున్నాడు. షడ్రిపువులను శత్రువులను అవమానించుతున్నాడు. షడ్దర్శనాలను స్వీకరించుతున్నాడు. షడ్బలాలను చూస్తున్నాడు. సంధి, విగ్రహము, యానము, ఆసనము, ద్వైధము, ఆశ్రయము అనేవి షడ్గుణాలు. కామము క్రోధము లోభము మదము మోహము మాత్సర్యము అనేవి షడ్రిపువు లని ప్రసిద్ధము. న్యాయము వైశేషికము, సాంఖ్యము యోగము పూర్వమీమాంస ఉత్తరమీమాంస అనేవి షడ్దర్శనాలు. మూలబలము, భృత్యబలము, మిత్రబలము, శ్రేణీబలము, ఆటవికబలము, అమిత్ర (శత్రువులకు సంబంధించిన) బలము అని షడ్బలాలు. దీనిలో నాలుగుపాదాలలోనూ షట్పదోపక్రమము నిర్వహింప

బడినందువలన రీతిగుణము. ఇది పతత్ప్రకర్ష అనేదోషానికి పరిహారకము అని పూర్వము ఉక్తము.

౨౩ భావికము

భావతో వాక్యవృత్తి ర్యా భావికం తదుదాహృతం.

మంచి ప్రేమకలవాని వాక్యవ్యాపారము ఉన్నట్లయితే భావికము అనేగుణము. ఉదా:-

స్వామిన్ ! తాత ! కులోత్తంస ! వీరరుద్ర ! జగత్ప్రభో !
పుత్రిణాం ధుర మేషోహం పుత్రేణారోపిత స్త్వయా.

ఓ ! స్వామీ ! ఓ ! నాయనా ! కులాభరణుడా ! వీరరుద్రా ! జగత్ప్రభూ ! ఈ నేను పుత్రుడవయిన నీచేత పుత్రులుకలవారి అగ్రపీఠమును అధిరోహింపచేయబడితిని గదయ్యా ! దీనిలో ప్రేమరూపమును విశదముచేసే వాక్య రచన ఉన్నందువలన భావిక మనేగుణము. కుమారుని తండ్రి ఈవిధముగా పిలవడములో ప్రేమఉంటుందికదా !

౨౪ గతి

గతిర్నామ సురమ్యత్వం స్వరారోహావరోహయోః.

పద్యమును పలికేటప్పుడు ఉండే స్వరముల ఆరోహావరోహములయొక్క సురమ్యత ఉంటే గతి అనేగుణము. దీర్ఘాక్షరములు ఉన్నప్పుడు స్వరాలకు ఆరోహము ఉంటుంది. అట్లా లేకపోతే అవరోహము ఉంటుంది. అటువంటి ఆరోహావరోహాలలోకూడా మంచిరమ్యత ఉండాలి. ఉదా:—

ప్రకాశ్యే త్రైలోక్యే సతత మతులైః కాకతివిభోః
మహోభి ర్నిస్సీమై ర్దినకరకరాటోపపటుభిః,
తమఃకృత్స్నం శోకజ్వలదనలరోచిఃపరిచయం
దధత్స్వప్యద్వేలత్యరినృపమన స్స్వేవ సతతం.

సూర్యకిరణాలవలె అతిశయిత సామర్థ్యముకలిగిన, నిస్సీమములు అసమానములూ అయిన కాకతివిభుని తేజస్సులచేత మూడులోకాలూ నిత్యమూ ప్రకాశితములు అవుతూఉన్నా, శత్రురాజులమనస్సులు సతతము శోకాగ్ని రోచిఃపరిచయమును ధరించుతూఉన్నప్పటికీ, అంధకారము అంతా శత్రురాజుల మనస్సులలోనే అతివేలమై ఉన్నది. ఈపద్యము పూర్వార్ధములో దీర్ఘాక్షరములు ఉన్నందువలన స్వరము ఆరోహము పొందుతున్నది. ఉత్తరార్థములో అవరోహము ఉన్నది. గానానుగుణపాఠములో ఈ ఆరోహావరోహాలు విశదములు అవుతవి. ఇట్లా గతిని సమన్వయించుకోవాలి.

గుణాలంకారభేదము

ఈగుణాలు అర్థగతములుకూడా అవుతవని వామనాదులు అంగీకరించుతున్నారు. వామనుడు తన కావ్యాలంకారసూత్రవృత్తిలో శ్లేష, ప్రసాదము, సమత, మాధుర్యము, సుకుమారత, ఉదారత, కాంతి, ఉదాత్తత, ఓజస్సు, ప్రౌఢి, అనే పది శబ్దగుణాలను మొదటగా అంగీకరించి అవే అర్థగతములుకూడా అవుతవని నిరూపించాడు. ఇట్లా వామనుడు అంగీకరించడము ఉచితముగా లేదు. ఇట్లాగే అయితే గుణాలంకారాలకు భేదము కుదరదు. గుణములుశబ్దగతములు. అర్థగతములూను. అలంకారములుకూడా శబ్దగతములు అర్థగతములుగానే ఉన్నవి. కాగా భేదము ఎట్లాకుదురుతుంది? వామనుడు ఒకవిధముగా గుణాలంకారభేదమును అంగీకరిస్తున్నాడు కాని అది ఉపపన్నము కాదు.

వామనుడు అంగీకరించేభేదము ఇట్లా ఉంటుంది. గుణాలు కావ్యశోభాసంపాదకధర్మాలు. గుణాలు స్వతస్సిద్ధముగానే కావ్యశోభను ఆపాదించగలవు. అలంకారములు అట్లాకాదు. అవి తమంతటతాము శోభాకారులు కాలేవు. గుణాలు కావ్యములో సంపాదించిన శోభను అలంకారాలు అతిశయింపచేయగలవు. కాబట్టే అలంకారాలు శోభాతిశయాధాయకములు అని.

ఈవామనోక్తి వామనమెకాని వికల్పసహానముకాదు. చూడండి! రీతి కావ్యానికి ఆత్మ అని వామనమతము. రీతి అంటే ఆతనిమతంలో గుణవిశిష్టపదరచన. అది వైదర్భీరీతి గాడీరీతి పాంచాలీరీతి అని త్రివిధము. వైదర్భి సర్వగుణవిశిష్టము. గాడీపాంచాలీరీతులు కొన్నిగుణాలుమాత్రమె కలిగిఉంటవి. ఇదంతా వామనుడు అంగీకరించిన ప్రణాళిక. ఇది ఇట్లాఉండగా;

ఈవిషయమును ఇక్కడ పరిశీలించాలి. గుణాలు కావ్యశోభాహేతువులు అయితే సర్వగుణాలూ కావ్యశోభాహేతువులె అని అనాలికదా? అప్పుడు సర్వగుణవిశిష్ట అయిన వైదర్భియె కావ్యాత్మ అవుతుందికాని కతిపయగుణాలు కలిగినగాడీపాంచాలీరీతులు కావ్యాత్మ కాజాలవు. వానిని రీతిభేదములలో పరిగణించడము అసముచితము అవుతుంది. కాబట్టి సర్వగుణాలూ ఉంటేనే కావ్యశోభ కలుగుతుంది అని అనడము యుక్తముకాదు. గాడీపాంచాలీరీతులనుకూడా కలిపికొనడానికి కతిపయగుణాలు ఉన్నా కావ్యశోభ కలుగుతుంది అని అంగీకరించితే కేవలమూ ఓజస్సు శ్లేషగుణాలు కలిగి శుష్కశాస్త్రానుకూలార్థము కలిగిన నీరసస్థలములో

కూడా కావ్యత్వము ఉన్నదని అనవలసివస్తుంది. కేవలమూ అంతమాత్రాన కావ్యత్వము ఉంటుందని సహృదయులు ఎవరూ అనరు. కాబట్టి గుణాలు కావ్యశోభాకారులు అని అనడము యుక్తిసహము కాదు. అదే కుదరనపుడు తన్మూలకమయిన అలంకారాలశోభాతిశయాధాయకత్వమున్నూ ఉపపన్నము కాదు.

గుణాలంకారాలకు భేదకథనము ఆవశ్యకము కాబట్టి ప్రాచీనులయిన సాహిత్యాచార్యులమతమును అనుసరించి "గుణాలు సంఘటనాశ్రయములు" అని అనడము ఉచిత పక్షము. అలంకారసర్వస్వములో ఇట్లాగే నిరూపితము అయింది "గుణాలు సంఘటనాధర్మములు. అలంకారాలు శబ్దార్థధర్మములు. ఈవిధముగానే గుణాలంకారవ్యవస్థానము ఉన్నది" అని. ఈభంగిని అనుసరించియే గుణాలంకారాలకు స్వరూపభేదము నిరూపితమయింది. ఇట్లాకాకపోతే గుణాలంకారాల స్వరూపభేదము దుర్నిరూపమవుతుంది. ఏవిధముగానూ భేదము చెప్పడము కుదురదు. కావ్యానికి శోభ కలగజేయడము అనేది గుణాలకు అలంకారాలకూ సమానమె. ఈవిషయమునె రుద్రభట్టు ఈవిధంగా చెపుతున్నాడు.

యో హేతుః కావ్యశోభాయాః సోఽలంకారః ప్రకీర్త్యతే
గుణోపి తాదృశో జ్ఞేయః దోషః స్యాత్తద్విపర్యయః.

కావ్యానికి శోభాహేతువు అగునది అలంకారము. అని చెప్పబడుతున్నది. గుణముకూడా అటువంటిదే అని గ్రహించాలి. కావ్యశోభాకారికాకుండా తద్విపర్యయాత్మకముగా ఉండేది దోషము అవుతుంది అని. కాబట్టి గుణాలకు

సంఘటనాశ్రయత్వమును చెప్పడమె యుక్తము. అదే వానికి భేదకధర్మము.

ఈచెప్పిన గుణాలంకారభేదము ప్రాచీనమతానుసారి అని గ్రహించాలి. శ్లేషాదిగుణాలు పది ఉన్నవని అవి మాధుర్యాదులలో అంతర్భావింపవని అవి శబ్దధర్మములని ప్రాచీనులు అంగీకరిస్తారు. కాబట్టి ఉద్భటాదిమతములలోనే ఇది ఉపపన్నము అవుతుంది. భామహుడు మొదలయిన కొందరు శ్లేషాదిగుణాలను మాధుర్యాదిత్రికములో అంతర్భవింప చేస్తారు. వారిమతాన్నిబట్టి గుణాలు రసధర్మాలు, అలంకారాలు శబ్దార్థధర్మములు అని భేదమును అంగీకరించాలి. ఈవిధముగా వీనికి స్వరూపభేదము కలుగుతుంది. కాబట్టే పూర్వము కావ్యప్రకరణములో అనుప్రాసోపమాదులు హారాద్యలంకారములవంటివని శ్లేషాదిగుణములుశౌర్యాదుల వంటివని నిరూపిత మయింది. గుణాలంకారభేదనిర్వచనంలో విద్యానాథహృదయము కావ్యప్రకరణములోనే సునిరూపిత మయింది. ఈగుణప్రకరణములో ఈవిధముగా గుణములను నిరూపించడము గుణాలంకారభేదకథనములో వాదాంతరములను ప్రదర్శించడమూ అనేది అంతా, ప్రాచీనజరత్తరానుసారిత, అప్పటి పెద్దలను అనుసరించడమూ ఉన్నపుడు తన్మతప్రదర్శనముకూడా ఆవశ్యకమని సూచించడానికే అని గ్రహించాలి.

శబ్దాలంకార ప్రకరణము

అలంకారస్వరూపము

కావ్యసామగ్రిలో అలంకారాలు తప్ప మిగతావి అన్నీ నిరూపితము లయినవి. గుణాలను నిరూపించిన తరువాత అలంకారాలను నిరూపించవలసి ఉన్నది. అలంకార శబ్దముయొక్క వ్యుత్పత్తిని ప్రదర్శించితే సామాన్యంగా అలంకారలక్షణము చెప్పిన ట్లవుతుంది. 'అలంక్రియతే అనేన ఇత్యలంకారః' అని అలంకారపదవ్యుత్పత్తి. దేని నయినా అలంకరించేది అలంకారము అవుతుంది అని భావము. అలంకారములచేత సామాన్యముగా రసము అలంకరింపబడేది అవుతూ ఉంటుంది. ధ్వని ప్రస్థానానుయాయులు అంగీకరించే గుణాలు నియమంగా రసోపకారములు అవుతూ ఉంటవి. అలంకారాలు అట్లా కాదు. రసానికి ఇవి ఉపకారులు కావచ్చు కాకపోవచ్చు. గుణాలకు అలంకారాలకూ ఈ తేడా కనపడుతూ ఉంది. ఈవిషయంలో పెద్దలయిన కావ్యప్రకాశకర్తలున్నూ ఇట్లే అభిప్రాయపడుతున్నారు. అలంకారాలు కావ్యాంగము లయిన శబ్దార్థాలకు ఉత్కర్ష కలుగచేస్తూ వానిద్వారా అంగి అయిన రసము అనేది ఉన్నప్పుడు దానిని ఉపస్కరించుతూ ఉంటవి. వివక్షితంగా రసము లేని చిత్రకావ్యస్థలములో అలంకారాలు శబ్దార్థాలకు వైచిత్ర్యమును మాత్రము సంపాదిస్తూ అంతమాత్రములో పర్యవసానము పొందుతవి. అనుప్రాసాదిశబ్దాలంకారములుకాని ఉపమాదులయిన అర్థాలంకారములుకాని, ఈ

విధముగా ఉంటవి. కనుకనే ఇవి లోకప్రసిద్ధము లయిన హారకేయూరాద్యలంకారముల వంటివి. అనే ఈ అభిప్రాయము కల కారిక కావ్యప్రకాశలో;

ఉపస్కుర్వంతి తం సంతం యేఽంగద్వారేణ సంశ్రితాః,
హారాదివ దలంకారాః తేఽనుప్రాసోపమాదయః.

అని నిరూపిత మయింది. కరచరణాద్యవయవము లందు కూర్చబడే వలయనూపురాదులు అలంకారము లని ప్రసిద్ధముకదా! అవి ఆయా అవయవములందు ఉంటూ వానికి ఉత్కర్షను కలుగజేస్తూ తద్ద్వారా అవయవిని అలంకరించుతున్నవి. అట్లాగే కావ్యావయవము లయిన శబ్దార్థములందున్న అనుప్రాసోపమాదులు శబ్దా లంకారములుగా అర్థాలంకారములుగా ప్రసిద్ధి పొంది వానికి శోభను కలుగజేస్తూ అవయవి అయిన కావ్యమును ఉపస్కరించుతున్నవి. రసము వివక్షితముగా ఉంటూ ఉండగా ఈ అనుప్రాసోపమాదులు తమకు ఆశ్రయభూతము లయిన శబ్దార్థాలను అలంకరించడమె కాక అవయవి అయిన కావ్యాన్నికూడా శోభింపచేస్తూ ఉంట వనే అభిప్రాయమును గ్రహించాలి. లోకములో ఆశ్రయము అలంకార్యము అవుతుం దని, ఆశ్రయి అలంకారము అవుతుం దని ప్రసిద్ధి ఉన్నదికదా! అలంకార్యాలంకారభావము ఆశ్రయాశ్రయి భావముతో ఉండడము లోకములో ఉన్నట్లుగా కావ్యములోకూడా సమ్మతమె.

గుణాలంకారభేదము

గుణాలు అలంకారాలూ చారుత్వహేతువులె. అయినా ఆశ్రయభేదాన్నిబట్టి వానికి భేదము సిద్ధ మవుతున్నది. గుణ

ములు సంఘటనాశ్రయములు. శబ్దార్థాశ్రయములు అలంకారములు. ఇటువంటి గుణాలంకారభేదము ఇదివరలో నిరూపితమె. అయినా ఈఅంశమును కూడా ఇక్కడ గ్రహించాలి.

గుణములు

౧ గుణములు రసధర్మములు.

౨ గుణములు రసమును విడిచి ఉండవు.

3 గుణములు అవశ్యంగా రసోపస్కారములు.

౪ గుణములు తమంతట తామె సాక్షాత్తుగా రసములో ఉపకరించుతవి.

అలంకారములు

౧ అలంకారములు రసధర్మములు కావు.

౨ అలంకారములు రసము లేకపోయినా ఉంటవి.

3 అలంకారములు అవశ్యంగా ఉపస్కారకములె అనే నియమము లేదు.

౪ అలంకారములు రసములో అంగద్వారముగా ఉపకారకములు అవుతూ ఉంటవి.

అలంకార విభాగము

మొదటగా అలంకారాలు మూడు విధాలు. శబ్దాలంకారములు, అర్థాలంకారములు, ఉభయాలంకారములు, అని. అనుప్రాసాదులు మొదటిరకము. ఉపమాదులు రెండవవి. లాటానుప్రాస సంసృష్టి అనేవి ఉభయాలంకారాలు. విద్యానాథునినిరూపణానుసారముగా శబ్దాలంకారములు ఎనిమిది. అర్థాలంకారములు అరవై అయిదు. ఉభయాలంకారములుగా చెప్పబడేవి రెండు.

శబ్దాలంకారములు

౧ ఛేకానుప్రాస ౨ వృత్త్యనుప్రాస
౩ యమకము ౪ పునరుక్తవదాభాస
౫ లాటానుప్రాస ౬ పద్మబంధము
౭ చక్రబంధము ౮ నాగబంధము

అర్థాలంకారములు

౧ ఉపమ ౨ అనన్వయము ౩ ఉపమేయోపమ
౪ స్మరణము ౫ రూపకము ౬ పరిణామము
౭ సందేహము ౮ భ్రాంతిమత్తు ౯ అపహ్నుతి
౧౦ ఉల్లేఖ ౧౧ ఉత్ప్రేక్ష ౧౨ అతిశయోక్తి
౧౩ సహోక్తి ౧౪ వినోక్తి ౧౫ సమాసోక్తి
౧౬ వక్రోక్తి ౧౭ వినోక్తి ౧౮ స్వభావోక్తి
౧౯ మీలనము ౨౦ సామాన్యము ౨౧ తద్గుణము
౨౨ అతద్గుణము ౨౩ విరోధము ౨౪ విశేషము
౨౫ అధికము ౨౬ విభావన ౨౭ విశేషోక్తి
౨౮ అసంగతి ౨౯ విచిత్రము ౩౦ అన్యోన్యము
౩౧ విషమము ౩౨ సమము ౩౩ తుల్యయోగిత
౩౪ దీపకము ౩౫ ప్రతివస్తూపమ ౩౬ దృష్టాంతము
౩౭ నిదర్శన ౩౮ వ్యతిరేకము ౩౯ శ్లేష
౪౦ పరికరము ౪౧ ఆక్షేపము ౪౨ వ్యాజస్తుతి
౪౩ అప్రస్తుతప్రశంస ౪౪ పర్యాయోక్తము ౪౫ ప్రతీపము
౪౬ అనుమానము ౪౭ కావ్యలింగము ౪౮ అర్థాంతరన్యాసము
౪౯ యథాసంఖ్యము ౫౦ అర్థాపత్తి ౫౧ పరిసంఖ్య
౫౨ ఉత్తరము ౫౩ వికల్పము ౫౪ సముచ్చయము
౫౫ సమాధి ౫౬ భావికము ౫౭ ప్రత్యనీకము

౪౮ వ్యాఘాతము ౪౯ పర్యాయము ౫౦ సూక్ష్మము
౫౧ ఉదాత్తము ౫౨ పరివృత్తి ౫౩ కారణమాల
౫౪ ఏకావళి ౫౫ మాలాదీపకము ౫౬ సారము.

ఉభయాలంకారములు

౧ లాటానుప్రాస, ౨ శబ్దార్థోభయసంసృష్టి

మిశ్రాలంకారములు

౧ సంసృష్టి, ౨ సంకరము

ఈనిరూపితానుసారముగా లెక్కపెట్టితే ౭+౫౬+౨+౨=౬౭ అవుతున్నవి. వీనిలో పద్మచక్రనాగబంధము లను మూడింటినీ చిత్రాలంకార మని ఒకటిగానే పరిగణించితే లాటానుప్రాసను శబ్దాలంకారములలోనూ ఉభయాలంకార ములలోనూ లెక్కపెట్టడమునకన్న ఏఒకచోటనో లెక్కించితే ౬౭లో ౩ తగ్గుతవి. కాబట్టి అలంకారాలసంఖ్య ౬౪ అవు తుంది. మిశ్రాలంకారములుగా చెప్పిన సంసృష్టిసంకరములు రెండూ అర్థాలంకారములలోనివే కనుక అర్థాలంకారములు ౫౮ అన్నమాట. వీనిలో కొన్ని అలంకారాలకు అవాంతర భేదాలు ఉన్నవి. వానివాని నిరూపణములో అవి స్పష్టము లవుతవి. రసప్రకరణములో రూపించి ప్రదర్శించిన రసవ దాద్యలంకారములు ఏడింటినీకూడా కలిపితే మొత్తము విద్యానాథాభిమతాలంకారాలు ౭౨ అవుతున్నవి.

అర్థాలంకారవిభాగము

అర్థాలంకారములను నాలుగువిధాలుగా విభాగించ వచ్చు. కొన్నిటిలో వస్తురూపమయిన అర్థము ప్రతీయమాన మతుతూఉంటుంది. కొన్నిటిలో ఔపమ్యము ప్రతీయమాన

మవుతుంది. కొన్నిటిలో రసభావాదులు గోచరము లవుతూ ఉంటవి. కొన్నిటిలో ప్రతీయమానార్థము అస్ఫుటముగా ఉంటుంది. రసాదులు గోచరించే అలంకారాలలో రసాదులు గుణీభూతవ్యంగ్యములుగా ప్రతీయమానము లవుతూఉంటవి.

ప్రతీయమానవస్తుకములు ౧౦

ఈనిరూపించే అలంకారాలలో ప్రతీయమానము అవుతున్న వస్తువు కావ్యానికి ఉపస్కారకము అవుతుంది. వీనిలో ఉపస్కరింపబడే రసాదికము ముఖ్యముగా ఉంటుందన్న నియమము లేదు కాబట్టి అవయవి అయిన కావ్యము ఉపస్కృతము అవుతుంది. ఈ సమాసోక్త్యాదులలో ఏవిధముగా ప్రతీయమానము కావ్యోపస్కారత్వమును పొందుతుందో ఆవిషయము వాని లక్ష్యలక్షణప్రస్తావములో విశదమవుతుంది. ఇట్లాగే ఆయా అలంకారవర్గాలలో ఆయా విశేషములు వానివాని ప్రకరణములలో విస్పష్టము లవుతవని తలచాలి.

౧ సమాసోక్తి ౨ పర్యాయోక్తి ౩ ఆక్షేపము
౪ వ్యాజస్తుతి ౫ ఉపమేయోపమ ౬ అనన్వయము
౭ అతిశయోక్తి ౮ పరికరము ౯ అప్రస్తుతప్రశంస
౧౦ అనుక్తనిమిత్తవిశేషోక్తి.

ప్రతీయమానౌపమ్యములు ౧౬

ఈ అలంకారాలలో ఔపమ్యము గమ్యమానమవుతుంది.

౧ రూపకము ౨ పరిణామము ౩ సందేహము
౪ భ్రాంతిమత్ ౫ ఉల్లేఖము ౬ అపహ్నవము
౭ ఉత్ప్రేక్ష ౮ స్మరణము ౯ తుల్యయోగిత

౧౦ దీపకము ౧౧ ప్రతివస్తూపమ ౧౨ దృష్టాంతము
౧౩ సహోక్తి ౧౪ వ్యతిరేకము ౧౫ నిదర్శన
౧౬ శ్లేషాలంకారము.

ప్రతీయమానరసాదులు ౭

౧ రసవత్ ౨ ప్రేయస్సు ౩ ఊర్జస్వి ౪ సమాహితము
౫ భావోదయము ౬ భావసంధి ౭ భావశబలత.

వీనిలో రసభావాదులు వ్యజ్యమానములు అవుతవి. కాని అవి అప్రధానముగా అభివ్యక్తము లవుతవి. కాబట్టి గుణీభూతవ్యంగ్యములు అనే వ్యవహారము. రసాదులు ఎపుడూ స్వప్నములోనయినా వాచ్యములుకావు. అవి నిత్యవ్యంగ్యములు. ప్రధానముగా వ్యంగ్యములయితే అలంకార్యములే అవుతవికాబట్టి ధ్వని అనే వ్యవహారమె కలుగుతుంది. అప్రధానముగా వ్యంగ్యములయినపుడు స్వేతరమును అలంకరించేవి అవుతవికనుక అలంకారములు అనే పేరు పొందుతవి అని గమనిక.

అస్ఫుటప్రతీయమానములు ౩౯

ఈ ఉపమాద్యుదాత్తాంతములయిన ముప్పయితొమ్మిది అలంకారాలలో సహృదయులహృదయములను ఆహ్లాదపరిచే స్ఫుటమయిన ప్రతీయమానము ఉండదు. ఏదయినా ప్రతీయమానము దూరముగా అవభాసించినా అది అస్ఫుటము కాబట్టి అంతగా హృదయానంది కాదు. ఎక్కడనయినా సరే కొంచెముగా ప్రతీయమానము ఉండనే ఉంటుంది. అది వివక్షితముగా ఉండనపుడు అనుకొన్నంత అందముగా ఉండదు. కాగా, ఈ ఉపమాదులు సాధారణ

ముగా స్వరూపవిశ్రాంతములై చమత్కారమును కలుగ జేస్తూ ఉంటవి.

౧ ఉపమ ౨ వినోక్తి ౩ అర్థాంతరన్యాసము
౪ విరోధము ౫ విభావన ౬ ఉక్తగుణనిమిత్తవిశేషోక్తి
౭ విషమము ౮ సమము ౯ చిత్రము
౧౦ అధికము ౧౧ అన్యోన్యము ౧౨ కారణమాల
౧౩ ఏకావళి ౧౪ వ్యాఘాతము ౧౫ మాలాదీపకము
౧౬ కావ్యలింగము ౧౭ అనుమానము ౧౮ సారము
౧౯ యథాసంఖ్యము ౨౦ అర్థాపత్తి ౨౧ పర్యాయము
౨౨ పరివృత్తి ౨౩ పరిసంఖ్య ౨౪ వికల్పము
౨౫ సముచ్చయము ౨౬ సమాధి ౨౭ ప్రత్యనీకము
౨౮ ప్రతీపము ౨౯ విశేషము ౩౦ మీలనము
౩౧ సామాన్యము ౩౨ అసంగతి ౩౩ తద్గుణము
౩౪ అతద్గుణము ౩౫ వ్యాజోక్తి ౩౬ వక్రోక్తి
౩౭ స్వభావోక్తి ౩౮ భావికము ౩౯ ఉదాత్తము

అలంకారకక్ష్యావిభాగము

ఈచెప్పినట్లుగా అలంకారాలు నాలుగువిధాలుగా విభక్తములవుతున్నవి. ఇంకా వీనిలో అవాంతరవిభాగాలు ఉన్నవి. వానిని ఈవిధముగా గ్రహించాలి. సాధారణంగా అనేకాలంకారాలలో సాధర్మ్యము ఉంటుంది. ఆ సాధర్మ్యము మూడువిధాలు. భేదప్రధానసాధర్మ్యము, అభేదప్రధాన సాధర్మ్యము, భేదాభేదప్రధానసాధర్మ్యము, అని. సాధర్మ్యములో అభేదప్రధానత వాస్తవముకాదు. ఉపమానము ఉపమేయము అనే రెండూ వేరుపదార్థములై. అవి భేదము కలవి అయినపుడు వాని సాధర్మ్యములో అభేదము ఉన్నది

అంటే అది స్వాభావికము ఎట్లా అవుతుంది? అందువలన ఈ అభేదప్రధానత్వము శబ్దసిద్ధమై ఆరోపితముగా ఉంటుంది అని గ్రహించాలి. ఇటువంటి అవాంతరభేదములతో కూడు కొన్న విభాగమును ఒకవిధమయిన వర్గవిభాగముగా భావించ వచ్చును.

౧ అభేదప్రధానములు ౬

౧ రూపకము ౨ పరిణామము ౩ సందేహము
౪ భ్రాంతిమత్ ౫ ఉల్లేఖము ౬ అపహ్నవము

ఈ ఆరు అలంకారములలోనూ ఉండే సాధర్మ్యము అభేదప్రధానకముగా ఉంటుంది. అటువంటి అభేదప్రధాన సాధర్మ్యమును నిబంధనము ఆధారముచేసికొని ఈ అలం కారాలు స్వరూపలాభమును పొందుతవి. కనుక వీనిని అభేదప్రధానసాధర్మ్యమూలకములు అని అంటారు.

౨ భేదప్రధానములు ౮

౧ దీపకము ౨ తుల్యయోగిత ౩ దృష్టాంతము
౪ నిదర్శన ౫ ప్రతివస్తూపమ ౬ సహోక్తి
౭ ప్రతీపము ౮ వ్యతిరేకము

అనే ఈ ఎనిమిది అలంకారాలలో సాధర్మ్యము భేద ప్రధానకముగా ఉంటుంది. అటువంటి సాధర్మ్యమును నిబంధనముగా చేసికొని ఇవి ప్రవర్తించుతవి అని భావము. కనుకనే వీనిని భేదప్రధానసాధర్మ్యనిబంధనములయిన అలం కారములు అని పరిగణించుతారు.

౩ భేదాభేదప్రధానములు ౪

౧ ఉపమాలంకారము ౨ అనన్వయము
౩ ఉపమేయోపమ ౪ స్మరణము

౧౦ అపహ్నవమూలములు ౩

౧ వ్యాజోక్తి ౨ వక్రోక్తి ౩ మీలనము

ఈ మూడున్నూ అపహ్నవమూలకములు. ఒకదాని చేత ఒకదానిని కప్పిపుచ్చడము చమత్కారంగా వీనిలో ఉంటుంది.

౧౧ విశేషణవైచిత్ర్యమూలములు ౨

౧ సమాసోక్తి ౨ పరికరాలంకారము

అనే ఈ రెండూ విశేషణములలోని చమత్కారమును అనుసరించి ఉంటవి. అక్కడ విశేషణములలోని అభిప్రాయవిశేషత అనగా సాభిప్రాయత ఈ అలంకారాలకు స్వరూపమును సంపాదిస్తుంది. ఈవిధముగా అలంకారాలలో వర్గవిభాగమును గుర్తించవచ్చు. అర్థాలంకారాలలోని ఈవర్గవిభాగము ఇట్లా పదకొండువిధాలుగా ఉన్నది.

ఇటు మీదట ఈ ప్రసంగములోనే అర్థాలంకారముల పరస్పరవైలక్షణ్యము నిరూపితమయింది. అలంకారాలకు లక్ష్యలక్షణప్రదర్శనము చేయనిదీ పరస్పరభేదము ఎంతగా నిరూపించినా నవపాఠకులకు దురవగాహంగా ఉంటుంది కాబట్టి ఆయా అలంకారాల ప్రస్తావములో ఆ వైలక్షణ్యమును నిరూపిస్తాను. సౌకర్యాపేక్షమయిన ఈ మూలాతిక్రాంతి సహృదయులకు సమ్మతమె అవుతుంది కధా!

శబ్దాలంకారములు

ఇప్పటికి అలంకారాలకు సంబంధించిన పీఠికాబంధరచన అయింది. మొదట చెప్పిన క్రమమునుబట్టి శబ్దాలంకారములను నిరూపించడము సముచితముకదా. అలం

కారస్వరూపవిభాగమును చూస్తే శబ్దార్థములు కన్పడుతున్నవి కదా! ఆ శబ్దార్థాలలో అర్థముకంటె శబ్దము అంతరంగము. ముందుగా శబ్దము ప్రతీత మవుతుంది. తరువాత అర్థము ప్రతీత మవుతుంది. శబ్దప్రతీతి ఉంటేనేకాని వాక్యములో అర్థప్రతీతి ఉండదు. అందువలన ప్రతీతిలో శబ్దము అంతరంగము అవుతున్నది. కనుకనే శబ్దానికి ప్రాధాన్యము ప్రాథమ్యమూను. కేవలశబ్దమె శోభను కలుగచేసేటట్లయితే శబ్దాలంకార మని వ్యవహారము. అక్కడి చమత్కారము కేవలము శబ్దములోనే ఉంటుందన్నమాట. శబ్దాలంకారములో కూర్పబడిన శబ్దాలకు మార్పు ఉండదు. అక్కడ ఆశబ్దములు ఉంటేనే ఆ చమత్కారము ఉత్పన్నమవుతుంది. శబ్దములు మార్పుపొందితే ఆ చమత్కారము రాదు.

ఛేకానుప్రాస

అలంకారాలలో కర్తృవిభాగము శోభను కలుగజేస్తుంది. పౌనరుక్త్యము మూడువిధాలు. అర్థపౌనరుక్త్యము శబ్దపౌనరుక్త్యము శబ్దార్థపౌనరుక్త్యము అని. అర్థపౌనరుక్త్యము ప్రరూఢదోషమని అంటారు. శబ్దపౌనరుక్త్యములో అచ్చులు పునరుక్తములు కావచ్చు. హల్లులు పునరుక్తములు కావచ్చు. రెండూ పునరుక్తములు కావచ్చు. అలంకార ప్రస్తావములో కేవలము స్వర (అచ్చులు) పౌనరుక్త్యము చారుత్వము కలుగచేయదు కాబట్టి దానిని పరిగణించనక్కర లేదు. వ్యంజనమాత్రపౌనరుక్త్యము స్వరవ్యంజనసముదాయ పౌనరుక్త్యము చారుతాహేతువులు అవుతవి. స్వరవ్యంజనములు పునరుక్తములు కావడములో సంఖ్యానియమము ఉంటే ఛేకానుప్రాస అవుతుంది. లేకపోతే వృత్త్యనుప్రాస

అవుతుంది. అందువలన ముందుగా ఛేకానుప్రాసను నిరూపించడము యుక్తముగా ఉంటుందని అలంకారసర్వస్వకారుల భావము. తదనుసారముగా ప్రకృతము ఛేకానుప్రాసకు విద్యానాథుడు ఈలక్షణమును చెప్పుతున్నాడు.

భవే దవ్యవధానేన ద్వయో ర్వ్యంజనయుగ్మయోః,
ఆవృత్తి ర్యత్ర స బుధై శ్ఛేకానుప్రాస ఇష్యతే.

ఛేకులు వ్యవహరించే అనుప్రాస ఛేకానుప్రాస. ఛేకులు అంటే విదగ్ధ (చతుర) జనులు. వారి కిది వల్లభము. ఛేకానుప్రాస అంటే వేరొక అర్థముకూడా ఉంది. తమ గూటి (కులాయములో) పొదుపుగా ఆసక్తితో ఉండే పక్షులకు ఛేకములు అనిపేరు. కులాయాభిరతములై ఉండేవానికి ఇతరములు బాధపెట్టడము ఆయాసపెట్టడమూ ఉండదు. అందువలన ఈ అనుప్రాసతో సదృశమయిన మధురశబ్దము వెలువడుతుంది. కాబట్టి ఇది ఛేకానుప్రాస. అసలు అనుప్రాస అనేపదానికి ఈఅర్థమును గుర్తించాలి. ఒకటొకటి ఏకరూపము కలవై రసాద్యభివ్యక్తిలో ఉత్కర్షను పొందిన వర్ణములుకాని వర్ణసముదాయములుకాని కావ్యములో శోభాతిశయహేతువులుగా కూర్చబడుతూ ఉంటవి కాబట్టి అనుప్రాస అనే పదము సార్థకము. విదగ్ధులు ఉపలాలనము చేసే అనుప్రాస కనక ఛేకానుప్రాస అనడము యుక్తము. రెండురెండు వ్యంజనయుగ్మములకు వ్యవధానము లేకుండా ఆవృత్తి ఉన్నట్లయితే ఛేకానుప్రాస అని లక్షణార్థము. రెండు వ్యంజనాలకు సమానానుపూర్వితో ఆవృత్తి ఉండాలి. ఆ వ్యంజనయుగ్మానికి ఆవృత్తమయ్యే వ్యంజనయుగ్మానికీ మధ్యలో ఏమీ వ్యవధానము ఉండరాదు. వ్యవధానము

ఉంటే ఛేకానుప్రాస కాదు. అందువలన అవ్యవహితము లయిన రెండువ్యంజనయుగ్మాలకు పౌనరుక్త్యము ఉన్నప్పుడే ఛేకానుప్రాస అవుతుంది అని గ్రహించాలి. ఇక దీని ఉదాహరణము.

మహీ మహీనవిభవే ధత్తే క్షేమంకరే కరే,
రాజన్యజన్యవిజయీ రాజా రాజద్గుణోదయః.

క్షత్రియులను యుద్ధములో జయించినట్టిన్ని శోభించుతూఉన్న గుణోదయముకల ప్రతాపరుద్రమహారాజు (అహి-సర్ప-ఇన-ప్రభువు-సర్పరాజు ఫణీంద్రుడయిన ఆదిశేషుడు) ఫణీంద్రసదృశమయిన క్షేమంకరమగు తన హస్తము నందు భూమిని ధరించుతున్నాడు. అనే అర్థముకలిగిన ఈ పద్యములో నాలుగుపాదాలలోకూడా వ్యంజనయుగ్మములకు అవ్యవధానముగా ఆవృత్తిఉన్నది. మహీ-మహీ, కరే-కరే, జన్య-జన్య, రాజా-రాజ, అని. కనుక ఛేకానుప్రాస.

వృత్త్యనుప్రాస

వృత్తిఅంటే; రసవిషయమయిన వ్యాపారమునకు వృత్తి అనిపేరు. అటువంటి వ్యాపారముకలిగిన వర్ణరచనను ఇక్కడ వృత్తిగా గ్రహించడము ఔపచారికము. ఆ వృత్త్యుప లక్షితమయిన అనుప్రాస వృత్త్యనుప్రాస అవుతుంది. రసాదుల అభివ్యక్తిలో అనుకూలవ్యవహారముకల వృత్తులను మూడువిధాలుగా ప్రాచీనులు పరిగణనము చేశారు. పరుష ఉపనాగరిక గ్రామ్య అని వానిపేర్లు. వీనికే కూర్పబడే వర్ణాలను అనుసరించి మసృణ లలిత కోమల అని కూడా వ్యవహారము ఉన్నది. మొదటిదానిలో దీప్తములయిన అక్షరము లుంటవి కాబట్టి పరుష అనే పేరు బాగానే ఉంది. వైదగ్ధ్

భూషితఅయిన నాగరికవనితతో పోల్పబడుతున్నందువలన ఉపనాగరికాపదము సార్థకము. వైదగ్ధ్యవిహీనస్వభావము కలిగిన గ్రామ్యవనితాసాదృశ్యము ఉన్నందువలన గ్రామ్య అనే పేరున్నూ తగిఉంది. ఇవే కాలాంతరంలో గాడి వైదర్భి పాంచాలి వృత్తులుగా మారినట్లు తోస్తుంది. పరుషవృత్తిని గౌడదేశమువారు బాగా ఆదరించడముచేత గౌడీవృత్తి అనే పేరు వచ్చింది. ఇట్లాగే ఇతరములున్నూ. వృత్తిపదానికి వేరొక అర్థముకూడా ఉన్నది. "వర్తంతే అనుప్రాసభేదా ఆసు ఇతి వృత్తయః" అని వ్యుత్పత్తి. పరుషలలితమధ్యమ (గ్రామ్య) స్వరూపముతో వర్గత్రయము కలిగిఉన్న అనుప్రాస జాతులు వృత్తులు అని భావము. ఈ అభిప్రాయములను మనస్సులో పెట్టుకొని విద్యానాథుడు ఈవిధముగా లక్షణము చెప్పుతున్నాడు.

ఏకద్విప్రభృతీనాం తు వ్యంజనానాం యథా భవేత్,
పునరుక్తి రసౌ నామ వృత్త్యనుప్రాస ఇష్యతే.

సంఖ్యానియమము ఉంటే ఛేకానుప్రాస చెప్పబడింది. అటువంటి సంఖ్యానియమం లేకపోతే వృత్త్యనుప్రాస. ఒక వర్ణమునకుకాని రెండువర్ణాలకుగాని మూడువర్ణాలకుగాని ఇంకా అటుపైవర్ణాలకుగాని పునరుక్తి ఉన్నట్లయితే వృత్త్యను ప్రాస అవుతుంది. ఒకవ్యంజనమును ఒకపర్యాయము ఆవృత్తి చేస్తే అటువంటిది సామాన్యంగా సంభవిస్తూనే ఉంటుంది కాబట్టి ఏమీ చమత్కారం ఉండదు. అందువలన ఒకవర్ణము అనేక పర్యాయములు ఆవృత్తమయితేనే వృత్త్యనుప్రాసఅవు తుంది. రెండువర్ణాలకు ఆవృత్తి ఉండేటట్లయితే ఒకసారే ఆవృత్తి ఉండాలి. అట్లాకాక వ్యంజనయుగ్మములు అసకృదా

వృత్తములయితే ఛేకానుప్రాస అవుతుంది. మధ్యలో వ్యవధానము ఉంచుతూ రెండువర్ణాలకు అసకృదావృత్తి చెప్పినా చెప్పవచ్చు.

మూడువర్ణాలకు ఆవృత్తిని చెప్పడములో ఒకపర్యాయమూ చెప్పవచ్చు. అనేకపర్యాయములూ చెప్పవచ్చు. వ్యవధానం లేకుండా చెప్పవచ్చును. వ్యవధానసహితంగానూ చెప్పవచ్చును. నాలుగు అక్షరాలవిషయములోకూడా ఇదే రీతిని గ్రహించాలి. నాలుగక్షరాల పునరుక్తిదాకా వృత్త్యనుప్రాసను పరిశీలించితే ఈవిధముగా భేదములు కలుగుతున్నవి.

౧ ఏకవర్ణావృత్తిని అసకృత్తుగా చెప్పుట.

౨ వర్ణద్వయావృత్తిని వ్యవధానంలేకుండా ఒకసారి చెప్పుట.

౩ వర్ణద్వయావృత్తిని వ్యవధానముతో ఒకసారి చెప్పుట.

౪ వర్ణద్వయావృత్తిని వ్యవధానముతో అసకృత్తుగా

౫ మూడువర్ణాలను వ్యవధానరహితంగా ఒకసారి

౬ మూడువర్ణాలను వ్యవధానరహితంగా అనేకపర్యాయములు.

౭ మూడువర్ణాలను వ్యవధానంతో ఒకసారి

౮ మూడువర్ణాలను వ్యవధానంతో అనేకపర్యాయములు

౯ నాలుగువర్ణాలను అవ్యవధానంగా ఒకసారి

౧౦ ,, ,, అనేకపర్యాయములు

౧౧ ,, వ్యవధానముతో ఒకసారి

౧౨ ,, ,, అనేకపర్యాయములు.

వీనిని సంయుక్తాక్షరములతో చెప్పడము అసంయుక్తాక్షరములతో చెప్పడము అనే విభాగాలతోకూడా గ్రహించితే ౪౮ భేదము లవుతవి. ఈ ఛేకానుప్రాస వృత్త్యనుప్రాస అనే రెండూ వ్యంజనపౌనరుక్త్యముతో మాత్రమే ఉంటవి. ఎక్కడయినా స్వరపునరుక్తి ఉన్నదంటే అది వివక్షితము కాదు. ఆ అంశము లక్షణములో చేరదు. ఇక ఉదా:-

రే! రేః క్షుద్రమహీభృతః! క్షణ మితః శ్రీకాకతిక్ష్మాపతే
ర్వీక్షధ్వం ధ్వజినీం దురీక్ష్యసుభటాం ప్రోత్క్షిప్తకాక్షేయకైః
యోత్స్యధ్వే యది లభ్య మక్షయపదం కాంతారపక్షో వృథా
క్ష్మాభృత్కుక్షిచరత్తరక్షునికరా త్తత్రాత్మరక్షా కుతః?

ఓరీ! క్షుద్రరాజుల్లారా! క్షణకాలము ఇటు శ్రీకాకతి నాథుని సేనను చూడండి. ఎత్తిన ఖడ్గాలతో సుభటులు దుర్నిరీక్షంగా ఉన్నారు. మీరు యుద్ధము చేసేటట్లయితే శాశ్వతపదము లభిస్తుంది. అరణ్యాలకు పారిపోవడ మనేది అంతా వ్యర్థము. పర్వతగుహల్లో చిరుతపులుల గుంపులు తిరుగుతూఉంటే అక్కడ మీకు ఆత్మరక్ష ఎట్లా కలుగుందోయి? అరణ్యంలో పులివాతబడి దుర్మరణం పొందడముకంటె శుభోదర్కమయిన యుద్ధమరణము మంచిదికదా! ఇందులో క్షకారావృత్తి అసకృత్తుగా ఉన్నది కాబట్టి ఒకవిధమయిన వృత్త్యనుప్రాస.

యమకము

యమకములో అచ్చులు హల్లులూ రెండిటి సముదాయపౌనరుక్త్యము ఆశ్రితమవుతుంది. 'మహీమహీన విభవే' అనే ఛేకానుప్రాసోదాహరణములో "మహీమహీ" అని స్వరవ్యంజనసముదాయపౌనరుక్త్యము ఉన్నది. ఒక్కొక

చోట వృత్త్యనుప్రాసలోకూడా సముదాయపునరుక్తి ఉం
టుంది. అయినా అది ఆనుషంగికము. యమకలక్షణము—

యమకం పౌనరుక్త్యే తు స్వరవ్యంజనయుగ్మయోః,

స్వరములు వ్యంజనయుగ్మము అనే రెండిటికీ పౌన
రుక్త్యము ఉన్నట్లయితే యమకాలంకారము అవుతుంది.
ఛేకవృత్త్యనుప్రాసలలో స్వరపౌనరుక్త్యము ఆనుషంగికము.
యమకములో స్వరములకు ఆవృత్తి ఉండితీరాలి. వ్యంజన
యుగ్మానికీ ఆవృత్తి ఉండాలి. ఈ ఉభయావృత్తి మొదట
ఉండటము మధ్యలో ఉండడము చివర ఉండడములలోని
చమత్కారమునుబట్టి యమకము మూడువిధాలవుతుంది,
ఇట్లాగే ఒక శ్లోకములో సగము పాదము ఆవృత్తము, ఒక
పాదమె ఆవృత్తముకావడము మొదలయిన విధానాలవలన
కూడా భేదములు సిద్ధములవుతవి. మొదటచెప్పబడినది
ఆవృత్తమయినట్టిది అనే రెండిటిలో ఒక్కొకచోట రెండూ
వేరువేరు అర్థములుకలవి అవుతవి. ఒక్కొక చోట రెండిటికీ
ఒకే అర్థము ఉంటుంది. వేరొకచోట ఒకటి నిరర్థక మవు
తుంది. రెండవది సార్థక మవుతుంది. ఇటువంటి భేదాల
నన్నిటినీ పరిగణించడము చాలా శ్రమ. చాలాభేదాలున్నవి.
ఏదో కొంచెము దిఙ్మాత్రంగా ఒక ఉదా :—

ప్రతాపః కాకతీంద్రస్య మహామహిమతేజసః
శ్రియం దధాతి పద్మేష్టమహామహిమతేజసః.

గొప్ప మహిమ తేజస్సుకల కాకతీంద్రునియొక్క ప్రతా
పము (పద్మేష్టమహాం అహిమ తేజసః) పద్మములకు ప్రియో
త్సవమయిన సూర్యుని శోభను ధరించుతున్నది. దీనిలో

మహా "మహిమ తేజసః, మహామహిమ తేజసః" అని స్వర వ్యంజనసముదాయపౌనరుక్త్యము ఉన్నదికనుక యమకము.

పునరుక్తవదాభాస

పునరుక్తవదాభాసము అర్థాలంకారమని చిరంతన ప్రసిద్ధి. ఆదృష్టితో చూస్తే దీనిని అర్థాలంకారములలో పరిగణించడమే యుక్తము. అయినా ఇక్కడ నిరూపించడములో ఉపపత్తి లేకపోలేదు. ఈవిషయము ముందు స్పష్ట మవుతుంది. పునరుక్తమువలె ఆభాసించేది పునరుక్తవదాభాస. దీని లక్షణము.

> యత్రార్థః ప్రముఖే కించిత్ భాసతే పునరుక్తవత్
> పునరుక్తవదాభాసోఽలంకారః స సతాం మతః.

అర్థము మొదట్లో కొంత పునరుక్తమయినట్లుగా భాసించినట్లయితే అది పునరుక్తవదాభాసమనే అలంకార మవుతుందని అలంకారవిదులు అంగీకరించుతున్నారు. ఇంత వరదాకా శబ్దపౌనరుక్త్యమును ఆశ్రయించిన అలంకార కథన మయింది. ఈ అలంకారము మొదలుకొని అర్థపౌనరుక్త్య మూలకమయిన అలంకారాలకథనము ఉంటుంది. ఈ అలం కారములో అర్థము మొదట పునరుక్తమయినట్లుగా ఉంటుంది. సరిగా అన్వయించినట్లు కసపడదు. బాగా పరిశీలించితే అది పునరుక్తముకాదు. వేరువిధాన అది పర్యవసానము పొందు తుంది. అర్థపౌనరుక్త్యముఉంటే అది ప్రరూఢమయిన దోషము. దీనిలో అర్థము మొదట పునరుక్తమయినట్లుగా ఉన్నా అన్వయసమయములో ఆవిధంగా ఉండదు. అది ఇంకొకరూపాన మారుతుంది. అర్థము వేరురూపాన మారిన తరువాత చూస్తే ఈఅలంకారమే ఉండదు. మొదటగా

కలిగిన ప్రతీతియె అలంకారబీజము. పర్యవసానంలో కలిగే ప్రతీతినిబట్టి అలంకారనిర్ణయము ఉండదు. ఇక్కడ ప్రథమ ప్రతీతిలో పునరుక్తముగా కన్పడుతున్నదికాబట్టి అలంకార మవుతుంది. ఇది అర్థపౌనరుక్త్యాశ్రయము కాబట్టి అర్థాలంకారమె అని అనాలి. కాని పర్యాయశబ్దములను ఆశ్రయించి ఉన్నందువలన ఒకవిధంగా శబ్దపౌనరుక్త్యాశ్రితమెఅవుతుంది. ఇంద్రుడు పురందరుడు అనే పర్యాయశబ్దాలలోకూడా ఒకే అర్థసాదృశ్యము ఉంటుందికాబట్టి శబ్దపౌనరుక్త్యము అనేది ఇక్కడ ఔపచారికమని గ్రహించాలి. కావ్యప్రకాశకర్త దీనిని ఉభయాలంకారమని అంటున్నాడు. ఇది శబ్దాలంకార మన్న భావమె విద్యానాథునకు ఉన్నది. అయినా ఛేకవృత్త్యను ప్రాసలవంటి శబ్దాలంకారము కాదు. అలంకారసర్వస్వకారాదులు ఇది అర్థాలంకార మనే అభిప్రాయపడుతున్నారు. విద్యానాథుడు ఉద్భటమతానుసారముగా చిరంతనమతమును ఉల్లంఘించినట్లు కాకుండా ఉండడానికి దీనిని శబ్దాలంకారముగా నిరూపిస్తున్నాడని భావించవచ్చు. ఉదా :—

> జిష్ణు రింద్రః క్షితిభుజాం శ్రీపతిః పురుషోత్తమః
> భాస్వాన్ సూర్యస్ఫురత్తేజాః కాకతీంద్రో విరాజతే.

జయశీలుడు రాజేంద్రుడు శ్రీపతి పురుషులలో ఉత్తముడు దీప్తిమంతుడు సూర్యునివలె స్ఫురత్ప్రతాపుడూ అయిన కాకతీంద్రుడు ప్రకాశించుచున్నాడు. అనే పర్యవసానార్థముకలిగిన దీనిలో జిష్ణుః ఇంద్రః శ్రీపతిః పురుషోత్తమః భాస్వాన్ సూర్యపదములలో మొదట ఏకార్థము భాసించుచున్నది. అందువలన ఆముఖపౌనరుక్త్యము ఉన్నట్లు. ఇది అన్వయసమయములో పునరుక్తముకాదు. కనుక పునరుక్త

ము కాదు. కనుక పునరుక్తవదాభాస మనే అలంకార మవుతుంది. ఈఅలంకారవిషయమై ఆకరగ్రంథాలలో అధికర్చ ఉన్నది.

లాటానుప్రాస

శబ్దపౌనరుక్త్యమును ఆశ్రయించిన అలంకారాలు అర్థపౌనరుక్త్యమును ఆశ్రయించిన పునరుక్తవదాభాస నిరూపితమయిన తరువాత శబ్దార్థోభయపౌనరుక్త్యముమ ఆశ్రయించిన అలంకారమును చెప్పడము సముచితము. లాటానుప్రాస ఉభయమూలకము. లాటదేశములోని జనులు ఈఅనుప్రాసను బాగా ఉపలాలించుతారుకాబట్టి లాటానుప్రాస అని వ్యవహారము. శబ్దార్థాలకు పౌనరుక్త్యముఉంటే ప్రబంధదోషముగా ఎన్నుతారు. ఆదోషము అప్రరూఢమయితే లాటానుప్రాస అవుతుంది.

శబ్దార్థయోః పౌనరుక్త్యం యత్ర తాత్పర్యభేదవత్
స కావ్యతాత్పర్యవిదాం లాటానుప్రాస ఇష్యతే.

తాత్పర్యభేదము కలిగిన శబ్దార్థములపౌనరుక్త్యము ఉన్నట్లయితే అది లాటానుప్రాస అవుతుందని కావ్యతాత్పర్యవిదుల అభిప్రాయము. కేవలము శబ్దమె పునరుక్తమయితే ఛేకానుప్రాసకాని వృత్త్యనుప్రాసకాని కావచ్చు. అందువలన అర్థపునరుక్తికూడా ఉండాలి. శబ్దానికీ అర్థానికీ మామూలుగా పౌనరుక్త్యముఉంటే ప్రరూఢదోషము అవుతుంది. అందువలననే తాత్పర్యభేదము ఉండాలని లక్షణాంశము. దీనిలో శబ్దార్థములు పునరుక్తములయినపుడు స్వరూపములో భేదము ఉండకపోయినా అర్థభేదము ఉంటుంది కాబట్టి అర్థపునరుక్తి ఉండదు. ఈలాటానుప్రాసలో మొదట

శబ్దమువలె అర్థముకూడా ఒకేవిధముగా కనపడుతున్నప్పటికీ పర్యవసానములో వేరుగా భాసించుతుంది. ఒకపదముయొక్క అర్థము వాచ్యముగానే ఉండి అక్కడే విశ్రాంతమవుతుంది. రెండవపదముయొక్క అర్థము లక్ష్యార్థములోకాని వ్యంగ్యార్థములోకాని విశ్రాంతి పొందుతుంది. అందువలననే తాత్పర్యభేదము ఉంటుందని భావము. రెండూ వాచ్య విశ్రాంతములయితే అక్కడ దోషము లేకపోయినా అలంకారముకాదు. వాచ్యము లక్ష్యవ్యంగపరమయితేనే చమత్కారము ఉంటుంది కాబట్టి అటువంటిదే అలంకారము. అనన్వయాలంకారములో శబ్దార్థపౌనరుక్త్యము ఉంటుంది. అయినా అక్కడకూడా లాటానుప్రాస అని అనవక్కరలేదు. శబ్దైక్యంలేకపోయినా అనన్వయమును నిరూపించవచ్చు. అనన్వయములో శబ్దైక్యము లేకపోతే ఒక్కొక్కచోట ఔచిత్యము అంతగా ఉండకపోయినా ఒక్కొకచోట ఔచిత్యానికి ఏమీ భంగంరాదు. అందువలన అనన్వయంలో శబ్దైక్యము ఉండాలని నియమము లేదు. "ఇందురిందురివ" ఇత్యాదిస్థలాలలో శబ్దైక్యముకూడా ఉన్నా అది కేవలము ఆనుషంగికమే. అనన్వయాలంకారములో అర్థపౌనరుక్త్యము ఉంటేచాలు. నిర్దేశప్రతినిర్దేశాలలో ఏకరూపత్వము లేకపోతే ప్రక్రమభంగదోషమేమో? అని అంటారని అక్కడ శబ్దైక్యమును అనుసరించడమేకాని అది అనన్వయత్వసాధనానికికాదు. శబ్దైక్యము లేనిచోట అనన్వయప్రతీతి కొంత విఘ్నితమయితే అవుతుంది. అంతేకాని అటువంటి స్థలంలో

అనన్వయాలంకారము ఉండకపోదు. లాటానుప్రాసలో ఉభయపౌనరుక్త్యము అవశ్యంగా ఉండితీరాలి. ఇక ఉదా:—

గుణా గుణాస్తే గణ్యంతే యే రుద్రనృప మాశ్రితాః
నీతి ర్నీతి రసౌ తస్య లక్ష్మీ ర్లక్ష్మీశ్చ కథ్యతే.

రుద్రనృపుని ఆశ్రయించిన గుణములు ఏవి కలవో అవే గుణములు. గుణములని చెప్పతగిన ఉత్తమగుణములు ఆతనివే. ఇతరాశ్రయగుణములు ఉత్తమగుణములు కావు. అట్లాగే ఆప్రతాపరుద్రుని నీతియే నీతి. ఆతని లక్ష్మియే లక్ష్మి. దీనిలో రెండవగుణనీతిలక్ష్మీశబ్దాలు ఉత్తమగుణాదిపరములు. మొదటిగుణాదులు కేవలము వాచ్యార్థములోనే పర్యవసానముపొందుతున్నవి. రెండవగుణాదులు అర్థాంతరమును సూచించుతూ అన్యపరము లవుతున్నవి కాబట్టి తాత్పర్యభేదము ఉన్నది. ఇప్పటికి పౌనరుక్త్యమును ఆశ్రయించిన అలంకారాలు అయిదు అయినవి. శబ్దపౌనరుక్త్యాశ్రితములు మూడు. ఛేకానుప్రాస వృత్త్యనుప్రాస యమకము పునరుక్తవదాభాస అర్థపౌనరుక్త్యాశ్రితము లాటానుప్రాస ఉభయపౌనరుక్త్యాశ్రితము.

చిత్రము

పద్మాద్యాకారహేతుత్వే వర్ణానాం చిత్ర ముచ్యతే.

వర్ణములు పద్మాదుల ఆకారమును పొందడములో హేతువు లయినట్లయితే చిత్రాలంకార మవుతుంది. శ్రవణగోచరములయ్యే వర్ణాలకు పద్మాద్యాకార హేతుత్వము కుదరదే! అని అనుకోనక్కరలేదు. ఇక్కడ వర్ణములు అంటే వర్ణములను స్మరింపచేసే లిప్యక్షరములు అని గ్రహించితే ఈశంక కలుగదు. లిప్యక్షరాలకూ ముఖ్యవర్ణాలకూ

అభేదమును అంగీకరించాలి. లోకవ్యవహారము ఆవిధంగానే ఉన్నది. పద్మాదిబంధాలలో ఈవర్ణాలను కూర్చినపుడు కొన్నికొన్నిస్థానాలలో వర్ణాలకు పౌనరుక్త్యము వస్తూఉంటుంది. పౌనరుక్త్యమూలకములయిన అలంకారాలను చెప్పిన తరువాత చిత్రాలంకారమును చెప్పడములో ఇదే హేతువు. ఈచిత్రము పద్మబంధము చక్రబంధము నాగబంధము మురజబంధము ముసలబంధము గోమూత్రికాబంధము మాలాబంధము ఇట్లా అనేకవిధాలుగా ఉన్నది. వీనిలో మొదటి మూడింటికిమాత్రము ఇక్కడ నిబంధనము ఉంటుంది. ఇటువంటి చిత్రవిశేషాలను కవులు అక్కడక్కడ తమగ్రంథాలలో నిరూపించారు. వీనిలో ఆయా బంధకృత మయిన చమత్కారముమాత్రమె ఉంటుంది. అర్థనిబంధ నకంగా చమత్కారం ఉంటుందని అనలేము. సామాన్యంగా ఏదో అర్థము ఉంటుందికాని అది అట్టే వివక్షితము కాదు. ఈపద్మబంధాదులను ఏయేవిధంగా లిఖించి ఏయేవిధంగా వానిలో వర్ణాలను విన్యసించాలో పరిశిష్టములో ప్రదర్శి స్తాము. ఇక్కడే వానిని నిరూపించడము వరుసగా కలిగే ఆస్వాదములో విఘ్నము కలుగచేస్తుంది. వీతవిఘ్నమయిన ఆస్వాదము మంచిదికదా!

అష్టదళపద్మబంధము

యాతా యస్యాసమగ్రానతి మిహ కనకాస్థానసక్తాసనా యా
యానాసక్తాసనస్థా సుఖయతు కమలాభ్యాససుజ్ఞానమాయా
యా మానజ్ఞా సుసభ్యా క్షితిపతితిలకం జ్ఞాతిరక్తా సగేయా
యాగే సక్తా రతిజ్ఞా సుకృతిషు ఫలితగ్రామసస్యాయతా యా.

పద్మచిత్రము వేసి కర్ణిక మొదలుగా దిక్కువిదిక్కులలో వ్రాయవలసినవిధముగా ఈపద్యమును వ్రాసిచూస్తే పద్మా

కారవర్ణవిన్యాసము దీనిలో గోచరమవుతుంది. ఇటువంటి బంధకవిత్వాలలో అర్థము క్లిష్టముగా ఉంటుంది. దీని అర్థమును ఇట్లా గ్రహించాలి. కనకాస్థాన–సువర్ణమయసభా మంటపములో ఉన్న సింహాసనమును పొందిఉన్నట్టిన్ని, యానాసక్తాసన–తురగము మొదలయిన యానములందు కూడుకొన్న ఆసనములందు ఉన్నట్టిన్ని, అభ్యాస–ఉపాసన చేయడము చేత చక్కగా తెలియబడు స్వరూపవైచిత్ర్యము కలిగినట్టిన్నీ, మానజ్ఞాసాదకులు చేసిన పూజావిశేషమును తెలిసినట్టిన్నీ, సుసభ్యా–యోగ్యులయిన సభ్యులు కలిగినట్టిన్ని, జ్ఞాఽతిరక్తా–వివేకులయినవారియందు మిక్కిలి అభిమానము కలిగినటువంటి, సగేయా–స్వనామాంకముఉన్న అనేకగీతములు కలిగినటువంటిన్నీ, శ్రీయాగములో నిత్యమూ సంబద్ధరాలై ఉన్నటువంటిన్నీ, రతిజ్ఞా–తనయందు సాధకులు ప్రదర్శించు భక్తిరూపమయిన రతిని తెలిసిఉన్నటువంటిన్నీ, సుకృతులవిషయమై ఫలయుక్తముగా చేయబడిన గ్రామసస్యముల చేత గొప్ప శుభవిధానము కలిగినట్టి కమలాదేవి వీరరుద్ర ప్రభువునకు ఆసమగ్రానతిం–అతిసంపూర్ణమయిన వశ్యత్వమును పొందినదై ఈజన్మలో బాగా సుఖపెట్టుగావుత.

చక్రబంధము

లక్ష్మీవీక్షితవైభవస్య జగతాం నాధస్య భద్రశ్రియో
దిక్ష్వారబ్ధనిజప్రతాపజనితాం భాకృద్ధురాం యచ్ఛతః
నిత్యం రుద్రజనాధిపస్య జయినో భాతి ప్రకాశం స్థిరా
రాజత్పాలనమోదితాత్మని భుజే యోగ్యాశ్రితత్వా ద్ధరా.

జయస్వభావుడయిన రుద్రనరాధిపునిభుజమునందు భూమి నిత్యమూ భాసించుచున్నది. ఆతనిభుజము శోభాయమాన

మయిన పాలనము ఉండడముచేత అనుమోదితస్వరూప ముగా ఉన్నది. యోగ్యభుజమును ఆశ్రయించినందు వలన భూమి నిశ్చితస్థైర్యముకలదై ఉన్నది. ఇంకా జగన్నాథు డయిన వీరప్రతాపరుద్రుని విభవము లక్ష్మీకటాక్షముతో ఉన్నది. బాగా అభివృద్ధిపొందిన తన ప్రతాపముచేత సర్వ దిక్కులందూ భాస్కరకృత్యమును ఆయన నిర్వహించు తున్నాడు. ఇది పద్యభావము. చక్రాకారమయిన బంధ ములో ఈపద్యమును యోజనము చేసి బిగించవచ్చును. ఆ విధముగా బిగించి పద్యమును అటూ ఇటూ త్రిప్పి చూచే టట్లయితే ''వైజనాథకృతి''అని ఒకవిధంగా ప్రతీతమవుతుంది. ఈఅక్షరాలను పద్యములో చూడదలచితే మొదటి మూడు పాదాలలో చూడాలి. ప్రతిపాదంలోనూ ఆరవ అక్షరమును కూర్చి ప్రతిపాదంలోనూ పదునాల్గవఅక్షరాన్ని వరుసగా కూర్చితే మూడుమూడు ఆరు అక్షరాలూ వైజనాథకృతి అనేరూపముగా గోచరము లవుతవి. ఇట్లాగే''వీరరుద్రయశ'' అనికూడా ప్రతీత మవుతున్నది. దీనినికూడా మొదటి మూడు పాదాల్లోనే లక్షించాలి. ప్రతిపాదంలోనూ మూడవఅక్ష రాన్ని పదునేడవఅక్షరాన్ని వరుసగా కూర్చితే వీరరుద్రయశ అని వస్తుంది. ఈచమత్కారమంతా చక్రబంధాకారములో స్పష్టమవుతుంది. మొత్తానికి మూడుపాదాల్లోనూ 3, ౬, ౧౪, ౧౭ అక్షరాలను సావధానంగా నిబంధించాలని తేలుతుంది. నాల్గవపాదములో నిబంధింపబడే అక్షరాలు పాదత్రికాక్ష రాలతో సంబంధంకలిగి ఉంటవి. పరిశిష్టంలో ఇది స్పష్ట మవుతుంది.

నాగబంధము

ఓజస్యే రుద్రదేవే విభవతి మహిమత్యా జితాన్యప్రతాపే
విద్యావర్యేఽభినేతర్యురుహరిచరితం విశ్వవిస్తారభాజి
వైరివ్రాతా భజంతే వన మతిమలినఖ్యాతయో దేహవిద్ధా
వన్యై రధ్వన్యవారిక్షతిమతివివిధే జంతుభిః స్థానభాజః.

ఓజస్యే - ప్రబలుడయిన (సూర్యసదృశుడయిన) స్వమహిమచేత ఇతరుల ప్రతాపమును పరిత్యజింపచేసిన, వేదవేదాంగాది విద్యలచేత శ్రేష్ఠుడయిన, గొప్పదయిన శ్రీవిష్ణుచరితమును అనుకరించుచూఉన్నట్టి, విశ్వవిస్తృతిని పొందిఉన్న రుద్రదేవుడు ప్రభువై ఉండగా; అతిమలినఖ్యాతి కలిగిన శత్రుసంఘములు యుద్ధములో క్షతదేహులై వన్యములయిన సర్పమృగములతోపాటు క్షతికలిగిన నానావిధ దుఃఖభాజనమయిన ఉదకములేని మరుప్రదేశములో స్థితిని పొందినవారై వనమును సేవించుతున్నారు. అని ఈపద్యభావము. చుట్టలుచుట్టలుగా చుట్టుకొనిఉన్న పామువిన్యాసములో ఈపద్యాక్షరములను లిఖించాలి. వచ్చిన అక్షరములే మళ్ళీమళ్ళీరావడము పాదాక్షరములు సంకీర్ణములు కావడము దీనిలో ఉంటుంది. దీని రచన కవికి క్లేశకరము. మొత్తానికి ఈచిత్రబంధాలలో అర్థకృతమయిన చమత్కారము అంతగా ఉండదు. ఏదోవిధమయిన అర్థంఉంటుంది. అంతే, పద్యాక్షరముల విలేఖనములో చిత్రచమత్కారము గోచరమవుతూ ఉంటుంది. ఇటువంటి బంధభేదాలు చాలా ఉన్నవి. ఈనాగబంధోద్ధారముకూడా పరిశిష్టములో ప్రదర్శిత మవుతుంది.

అర్థాలంకార ప్రకరణము

ఇంతవరకూ శబ్దాలంకారములు నిరూపితములు అయినవి. ఇక అర్థాలంకారములు అవసరప్రాప్తములు. వానిని ఈప్రకరణములో నిరూపించాలి. అర్థాలంకారములలోకూడా ఉపమాలంకారము అనేకాలంకారబీజభూతము కాబట్టి మొదటగా ఉపమాలంకారమును నిరూపించడము సముచితము. అలంకారములు అనేకవిధాలుగా ఉన్నవి. కొన్ని వాచ్యౌపమ్యములు. అనన్వయము ఉపమేయోపమ మొదలయినవి ఇటువంటివి. వీనిలో ఔపమ్యము వాచ్యముగా ఉంటుంది. కొన్ని అలంకారాలు గమ్యౌపమ్యములు రూపకము పరిణామము మొదలయినవి ఇటువంటివె. వీనిలో ఔపమ్యము వాచ్యముగా ఉండక గమ్యముగా ఉంటుంది. మీలనము సామాన్యము మొదలయిన కొన్ని అలంకారాలు సాదృశ్యమూలకములె. ఈదృశాలంకారాలకు అన్నిటికీ ఉపమ నిదానభూతముగా ఉంటుంది. వీనిలో ఉపమ అంతటా గర్భీకృతమై ఉంటుందన్నమాట. కనుక ముందుగా ఉపమాలంకారమును నిరూపించాలి.

ఉపమాలంకారము

స్వతస్సిద్ధేన భిన్నేన సమ్మతేన చ ధర్మతః
సామ్య మన్యేన వర్ణ్యస్య వాచ్యంచే దేకదోపమా.

ఇది ఉపమాలంకారలక్షణము. ప్రకృతమునకు అప్రకృతముతోటి సాదృశ్యము వాచ్యముగా ఉన్నట్లయితే ఉపమాలంకారము అని సామాన్యముగా అభిప్రాయము. అన్య

ముతోటి వర్ణ్యమునకు సామ్యము ఒకేపర్యాయము వాచ్యమయినప్పుడు ఉపమ అని భావము. అన్యమనగా ఉపమానము. వర్ణ్యము ఉపమేయము లక్షణ పూర్వార్థములో ఉపమానవిశేషణములు ఉన్నవి. వాని తాత్పర్యమునుకూడా కలుపుకొంటే లక్షణము ఈవిధముగా పర్యవసన్న మవుతుంది. స్వతస్సిద్ధము, స్వతోభిన్నము, సహృదయసమ్మతమూ అయిన అప్రకృతముతోటి ప్రకృతమునకు గుణక్రియారూపమయిన సాదృశ్యమును ఒకపర్యాయమె వాచ్యముగా నిరూపించినట్లయితే ఉపమ అవుతుంది. అన్యశబ్దానికి ఉపమానమని వర్ణ్యశబ్దానికి ఉపమేయమనీ అర్థమును గ్రహించాలి. సాదృశ్యము=సామ్యము ఉండాలి అనేమాటవలన ఈఅర్థము లభించుతున్నది. సామ్యము అంటే సాధర్మ్యమనేది ఉపమానోపమేయములకె కుదురుబాటు పొందుతుంది కాని కార్యకారణములకు సామ్యము సంభవించదుకదా! ఈ ఉపమాలక్షణగతములయిన దళములన్నీ సాభిప్రాయములు. వాని అభిప్రాయవత్త్వమును ఈవిధముగా గ్రహించాలి.

ఉపమానము స్వతస్సిద్ధముగా ఉండవలెను. అని లక్షణార్థము. ఈవిధముగా అనడముచేత ఉత్ప్రేక్షాలంకారము వ్యావృత్తము అవుతున్నది. ఉత్ప్రేక్షలో ఉపమానము స్వతస్సిద్ధముగానె ఉండనక్కరలేదు. అప్రసిద్ధానికికూడా అక్కడ ఉపమానత్వము సంభవించుతుంది. ఉపమాలంకారములోనయితే ఉపమానము స్వతస్సిద్ధముగానె ఉండాలికాని కవికల్పితము కారాదు. స్వతస్సిద్ధముకాక కవికల్పితమై అప్రసిద్ధమయిన ఉపమానమె అయితే అక్కడ ఉపమాలంకారమని వ్యవహరించరాదు. ఈభావమును విశదపరచ

డానికే లక్షణములో "స్వతస్సిద్ధేన" అని నివేశితమయింది. కనుక ఉత్ప్రేక్ష వ్యావృత్తము అంటే మరలింపబడినది అవుతున్నది. ఈ అంశమును ఈ ఉదాహరణములో స్పష్టముగా గ్రహించవచ్చు.

> కీర్తిః కాకతీవీరరుద్రనృపతేః సింహాసనాధ్యాసినః
> ప్రాచాం భూమిభుజాం యశఃపిదధతీ కోటీందుతుల్యద్యుతిః
> రక్షాదక్షిణరాజలాభజనితామందప్రమోదోత్థితా
> త్రైలోక్యాట్టహాసప్రభేవ కకుభాం ప్రాంతేషు విద్యోతతే.

సింహాసనమును అధిష్ఠించిఉన్న కాకతీవీరరుద్రనృపతి కీర్తి ప్రాచీనులయిన భూపతుల యశస్సును పిధానించుతున్నదై (కప్పిపుచ్చుట) కోటిచంద్రసమానకాంతికలదై భాసించుతున్నది. బాగా రక్షించడములో సమర్థుడయిన రాజు లభించినాడుకదా! అని మూడులోకాలకున్నూ అమంద ప్రమోదము ఉదయించింది. అటువంటి అమందప్రమోదము వలన త్రైలోక్యమునకు అట్టహాసప్రభ కలిగింది. ఆ అట్టహాసప్రభవలె కీర్తి దిశాప్రాంతములలో ప్రకాశించుతున్నది. అని పద్యతాత్పర్యము. దీనిలో కీర్తి ఉపమేయము. అట్టహాసప్రభ ఉపమానము. విద్యోతన మనేది రెండిటికీ సాధర్మ్యము. త్రైలోక్యాట్టహాసప్రభ అనేది జాతిని చెప్పే శబ్దము. ప్రభాత్వము జాతి. ప్రభాశబ్దము జాతివచనము. ఇక్కడ ఉపమానముగా ఉన్న త్రైలోక్యాట్టహాసప్రభ స్వతస్సిద్ధము కాదు. మూడులోకాలకూ అట్టహాసప్రభ ఉదయించడము కవిప్రౌఢోక్తిసిద్ధము కావలసినదేకాని స్వతస్సిద్ధము ఎట్లా అవుతుంది? అందువలన ఈపద్యములో ఉపమాశంకకు ఏమీ అవకాశము లేదు. ఉపమానము తథా

విధము అయినందువలన ఉత్ప్రేక్ష అని గ్రహించాలి. కీర్తి అట్టహాసప్రభగా సంభావిత మవుతున్నదన్నమాట. ఉత్ప్రేక్ష లోని విశేషాంశాలను ఆ అలంకారప్రఘట్టములో గ్రహించ వచ్చును.

"స్వతో భిన్నేన" అనే విశేషణదళము చేత అనన్వయ వ్యావృత్తి కలుగుతున్నది. అనన్వయములో ఉపమానత్వము ఉపమేయత్వమున్నూ ఒకేవస్తువునకు సంభవించుతుంది. అంతేకాని ఉపమానము ఉపమేయమూ అక్కడ భిన్నముగా ఉండవు. ఉపమాలంకారములో రెండూ భిన్నభిన్నములుగా ఉండాలి. అనన్వయములో ఒకదానికే ఉపమానోపమేయత్వ సంభవమును ఈ లక్ష్యములో గ్రహించాలి.

సంతు లోకే సువర్ణాద్రిరత్నాకరసుధాకరాః
తథాపి వీరరుద్రోయం వీరరుద్ర ఇవ స్వయం,

లోకములో సువర్ణాద్రి సాగరము సుధాకరుడు అనే వీరు ఉంటేఉండనీ! అయినా ఈవీరరుద్రుడు వీరరుద్రునివలె ఉన్నాడు. ఈతనికిసాటి ఈతడేకాని మేరుసాగరచంద్రులు ఏమీ సాటికారు. అనేభావంకలిగిన దీనిలో వీరరుద్రుడనే ఒకేవ్యక్తికి ఉపమానత్వోపమేయత్వాలు ఉన్నవి. కాని ఉపమానము ఉపమేయముకంటె భిన్నముగా లేదు. అందువలన ఇక్కడ అనన్వయాలంకారమె కాని ఉపమకాదు.

లక్షణములో 'సంమతేన' అని ఉన్నది. ఉపమాలంకారములో సహృదయసమ్మతమయిన ఉపమానము ఉండాలి అని దాని భావము. ఈ 'సమ్మతేన' అని లక్షణములో ఉండడముచేత న్యూనోపమ అధికోపమ అనేవి దోషాలు. ఇవి దోషప్రకరణములో నిరూపితములు. వాటిలో ఉపమా

నము సహృదయసమ్మతంగా ఉండదు. ఉపమానానికి విశేష ణాలు ఉపమేయమునకంటె తక్కువగా ఉన్నప్పుడు ఎక్కువగా ఉన్నప్పుడున్నూ అది సహృదయులకు సంమతము కానేరదు. సహృదయసంమతితో ఉండే ఉపమానము అంటే ఈవిధంగా ఉండాలి.

> ఉదన్వానివ గంభీరః సువర్ణాద్రి రివోన్నతః,
> దిఙ్మహేభ ఇవ క్షోణీధౌరేయః కాకతీశ్వరః.

కాకతీశ్వరుడయిన ప్రతాపరుద్రుడు సముద్రమువలె గంభీరుడు. సువర్ణాద్రివలె సమున్నతుడు. దిగ్గజమువలే భూభారభరణసమర్థుడు. దీనిలో సముద్రసువర్ణాద్రి దిగ్గజములకు ఉపమానత్వము ఉచితముగా సంమతముగా ఉంది. కనుక ఇది ఉపమే. ఇట్లాగే ఉపమాలంకారములో సంమతోపమానౌచిత్యం ఉండాలి. ఈ భావమును సూచించడానికే "సంమతేన" అనే పదము.

"ధర్మతః" అనికూడా లక్షణంలో ఒకదళం ఉంది. ధర్మతః' అని ఉండడము చేత శ్లేషాలంకారముకంటె ఉపమాలంకారమునకు వైలక్షణ్యము సిద్ధించుతున్నది. ఉపమాలంకారములో గుణసామ్యముకాని క్రియాసామ్యముకాని ఉండాలి. శబ్దసామ్యము ఉండరాదు. శ్లేషాలంకారములో శబ్ద సామ్యము ఉండరాదు. శ్లేషాలంకారములో శబ్దసామ్యము మాత్రము ఉంటుందని అంగీకరించుతున్నారు. అంతేకాని అక్కడ గుణక్రియాసామ్యమును అంగీకరించరు. ఉపమలో ధర్మసామ్యము ఉండాలి. అంటే గుణక్రియలలో ఏదయినా ఉండవచ్చు నన్నమాట. ఉపమకు ఈనియమం ఉండడము చేత ఇటువంటి నియమంలేని శ్లేషాలంకారముకంటె వైలక్షు

ణ్యము సిద్ధమవుతున్నదని భావము. ఈవివేకము ఈలక్ష్య ములో విశదమవుతుంది.

నీరాజయంత్యంధ్రపురీరమణ్యః ప్రదీపజాలై ర్వరవీరరుద్రం
చంద్రాననా గోత్రపతిం రజన్యః తారాగణై ర్మేరుమివ స్ఫురద్భిః.

ఆంధ్రపురీయువతులు చంద్రాననలు గోత్రపతి=కుల పతి అయిన వరవీరరుద్రుని స్ఫురించుతున్న ప్రదీపజాలము లచే నీరాజనము చేస్తూన్నారు. ఏవిధముగానంటే, స్ఫురించు తున్న తారాగణములచేత మేరుపర్వతమును చంద్రానన లయిన రజనులు=రాత్రులు వలె. రజనులు మేరువునకు నక్ష త్రాలతో నీరాజన మిచ్చినట్లుగా రమణులు ప్రతాపరుద్రు నకు దీపకళికలతో నీరాజన మిస్తున్నారు. అని అభిప్రాయము. ఈపద్యములో "ప్రతాపరుద్రం పురస్త్రియః నీరాజయంతి మేరుం రజన్య ఇవ"అని అలంకారస్వరూపమును నిరూపించే వాక్యము. మేరువును రాత్రులువలె ప్రతాపరుద్రుని పుర స్త్రీలు నీరాజనము చేస్తూన్నారు అని ఆవాక్యర్థము. ధర్మ సామ్యము లేనందునవలన ఇది ఉపమాలంకారము కాదు. ఈపద్యములో "గోత్రపతిం" అనేది ప్రతాపరుద్రమేరు పర్వతములకు సమానధర్మమును రూపించే విశేషణముగా నిరూపితమయింది. "చంద్రాననాః" అనేది పురస్త్రీరజను లకు సమానధర్మమును రూపించే విశేషణముగా నిరూపిత మయింది. కాని వాటివలన ఉపమాలంకార ప్రయోజక మయిన గుణక్రియాసామ్యము సంభవించదు. అవి ఉపమా నోపమేయములకు అనుగతమయిన సమానధర్మమును సమ ర్పించలేవు. వానివలన గుణసామ్యమూ రాదు. క్రియా సామ్యమూ రాదన్నమాట. గోత్రపతి–చంద్రాననాశబ్దాలకు

ఉపమేయమునకు సంబంధించిన అర్థము ఒకటి. ఉపమానమునకు సంబంధించిన అర్థము వేరొకటి. రాజపక్షములో గోత్రపతి అంటే కులమునకు పతి అని అర్థము ప్రతీత మవుతున్నది. మేరుపక్షములో పర్వతపతి అని అర్థము ప్రతీత మవుతున్నది. అట్లాగే చంద్రాననాః అంటే స్త్రీపక్షములో చంద్ర ఇవ ఆననం యాసాం అని సమాసవిగ్రహము చెప్పవలె. కాబట్టి చంద్రునివంటి ముఖముకలవారు అని అర్థము. రాత్రిపక్షములో చంద్రఏవ ఆననం యాసాం" అని విగ్రహము చెప్పవలె. కాబట్టి చంద్రుడె ఆననముగా కలిగిన అని అర్థము. ఇట్లా అర్థము పక్షద్వయములో భిన్నభిన్నముగా ఉన్నదికాని ఉభయానుగతమై ఏకవిధముగా లేదు. అందువలన గుణక్రియాసామ్యము లేదని పర్యవసన్నము. రాజమేరువులకు గోత్రపతి అని రమణీరజనులకు చంద్రానన అని శబ్దసామ్య మయితే ఉంది. కాని ఆశబ్దమాత్రసామ్యముచేత ఉపమాప్రాప్తి లేదు. కనుక ఇది శ్లేషాలంకారమె.

ఇటువంటి స్థలములో శబ్దసామ్యముమాత్రము ఉన్నప్పటికీ ఉపమాలంకారము కావచ్చును, అని కావ్యప్రకాశకర్తలు అంగీకరిస్తారు. ధర్మసామ్యము ఉన్నప్పుడే ఉపమ కావడముకాక శబ్దసామ్యముఉన్నా ఉపమె అవుతుంది. అక్కడ ఉపమాలంకారమని అనడమె యుక్తము అని వారి భావము. అలంకారసర్వస్వకారుడయిన శ్రీరాజానక రుయ్యకుడు గుణక్రియాసామ్యమె ఉపమాప్రయోజకంకాని శబ్దమాత్రసామ్యము ఉపమాప్రయోజకం కాదంటాడు. ఇటువంటిస్థలంలో ఉపమాప్రతిభ ఉన్నప్పటికీ ఉపమాప్రతిభో

త్పత్తిలో హేతువయిన శ్లేషనే నిశ్చయించాలి. అనిన్నీ రుయ్యకుని భావము. విద్యానాథుడు సర్వస్వకారసిద్ధాంత శ్రద్ధాళువు కనుక ప్రకృతస్థలంలో శ్లేషాలంకారమే కాని ఉప మాలంకారము కాదు అని అంటున్నాడు.

"అన్యేన వర్ణ్యస్య సామ్యం" అని లక్షణములో ఉన్నది. అన్యముతో వర్ణ్యమునకు సామ్యము ఉన్నప్పుడు ఉపమఅవుతుంది. అనేదానివలన ప్రతీపాలంకారము వ్యావృత్త మవుతుంది. ప్రతీపాలంకారములో ప్రసిద్ధమయిన ఉపమా నోపమేయభావము విపర్యస్తమవుతుంది. చంద్రపద్మాదులు ఉపమానములని ముఖాదులు ఉపమేయములని ప్రసిద్ధి. ఉప మానముతో ఉపమేయానికి సామ్యకథనము ఉంటేనే ఉపమ. ప్రతీపములో ఇట్లాకాక ఉపమేయముతో ఉపమానమునకు సామ్యకథనము ఉంటుంది. ఈవిషయము ఈఉదాహరణ ములో స్పష్టమవుతుంది.

లోకోయ మవిశేషజ్ఞః కిం కుర్మః కస్య కథ్యతే
యత్ కాకతినరేంద్రేణ సుమేరు రుపమీయతే.

ఈలోకము విశేషము తెలుసుకొన్నది కాదు. మేము ఏంచెయ్యము? ఎవరికి చెప్పుతాము? కాకతీనరేంద్రునితో మేరువును ఉపమించుతున్నారుకదా! కాకతినరేంద్రునితో మేరువు సమానమని అంటున్నారె! దీనిలో అప్రకృతమయిన మేరువునకు ప్రకృతమయిన రాజుతో సాదృశ్యము చెప్పడము ఉంది. కాబట్టి ఇది ప్రతీపాలంకారమే కాని ఉపమ కాదు. దీనిలో అన్యముతో వర్ణ్యమునకు సామ్యము లేదు. వర్ణ్య ముతో అన్యమునకు సామ్యము ఉన్నది.

'ఏకదా సామ్యం' అని లక్షణములోని దళము.

ఉపమానోపమేయములకు నిరూపింపబడే సాదృశ్యము ఒక పర్యాయమె ఉండాలి అని అనడముచేత ఉపమేయోపమా లంకారవ్యవచ్ఛేదము కలుగుతుంది. ఉపమేయోపమాలంకారములో ఉపమానోపమేయములకు 'ఏకదా' సామ్యము ఉండడముకాక 'అనేకదా' సామ్యము ఉంటుంది. ఉపమానముతో ఉపమేయమునకు సామ్యము ఒకమారు, ఉపమేయముతో ఉపమానమునకు సామ్యము మరొకమారు, నిరూపితమవుతుంది కాబట్టి అనేకపర్యాయములు అక్కడ సామ్యకథనము ఉంటుంది. ఈవిషయము ఈపద్యములో స్పష్టమవుతుంది.

ధర్మోఽర్థఇవ పూర్ణశ్రీ రర్థో ధర్మఇవ స్థితః
కామస్తావివ తౌ కామఇవ రుద్రనరేశ్వరే.

రుద్రనరేశ్వరునియందు ధర్మము అర్థమువలె పూర్ణశ్రీకమై ఉన్నది. అర్థము ధర్మమువలె పూర్ణశ్రీకమై ఉన్నది. కామము వాని (ధర్మార్థముల) వలె ఉన్నది. అవి (ధర్మార్థములు) కామమువలె ఉన్నవి. ఏకదాసామ్యము ఉండాలి అనేదానికి ప్రథమార్థము ప్రత్యుదాహరణము. అక్కడనే ఉపమేయోపమకూడా చరితార్థమవుతున్నది. ధర్మమునకు అర్థసాదృశ్యము అర్థమునకు ధర్మసాదృశ్యమూ ఉన్నందువలన అనేకదాసాదృశ్యము ఉన్నది. 'అర్థఇవ ధర్మఇవ' అని శబ్దద్వయముచేత అనేకపర్యాయములు సాదృశ్యకథనము ఉన్నందువలన ఇది ఉపమేయోపమ.

సామ్యము వాచ్యముగా ఉండాలి అనిన్నీ లక్షణములో వివక్షితము. సామ్యము వాచ్యముగా ఉండని అలంకారములన్నీ దీనిచేత వ్యావృత్తము లవుతున్నవి.

రూపకము సందేహము భ్రాంతిమత్తు ఉల్లేఖము అపహ్నవము తుల్యయోగిత దీపకము ప్రతివస్తూపమ దృష్టాంతము సహోక్తి వ్యతిరేకము నిదర్శనము ఈఅలంకారములు ప్రతీయమానౌపమ్యములు. అంతేకాని వీనిలో సామ్యము వాచ్యముకాదు. కనుక వాచ్యౌపమ్యకమయిన ఉపమ వీని కంటె విలక్షణము. గమ్యౌపమ్యములుగా ఉండేవానిని కొన్నిటిని ఈఉదాహరణాలలో స్పష్టముగా తెలిసికోవచ్చును.

౧ ప్రతాపరుద్రనృపతే ర్మండలాగ్రవిధుంతుదః
అఖండవిక్రమోద్దామో గ్రసతే రాజమండలం,

ప్రతాపరుద్రభూపతియొక్క ఖడ్గమనే రాహువు అఖండమయిన విక్రమాతిశయము కలిగినదై సామంతరాజమండలమనే చంద్రమండలమును గ్రసించుతున్నది. ఈపద్యములో రూపకాలంకారము ఉన్నది. మండలాగ్రము=ఖడ్గమునందు విధుంతుదత్వము రాజమండలమునందు రాజమండలత్వము (చంద్రమండలత్వము) ఆరోపితమయినందువలన రూపకము. ఇక్కడ సాదృశ్యము ఏమీ వాచ్యముగా నిరూపితము కాలేదు. వానివానికి ఉండే సాదృశ్యము ఇక్కడ గమ్యమానమవుతున్నది. వాచ్యము కాకపోయినప్పటికీ సాదృశ్యము ఉన్నదని అంగీకరించాలి. గమ్యసాదృశ్యమును ఇక్కడ ఒప్పుకోకపోతే మండలాగ్ర-విధుంతుద ఈరెండిటికీ నిరూపితమై ఉన్న సామానాధికరణ్యము (ఏకార్థాశ్రయత్వము) ఏవిధంగానూ ఉపపన్నము కాదు. వాని ఆ సామానాధికరణ్యము వేరొకవిధంగా కుదరదు కనుక దాని కుదురుబాటును సంపాదించే సాదృశ్యము లక్షిత మవుతుంది. అన్యవిధంగా కుదరని ఈ సమానాధికరణత్వమును సాదృశ్యమె కుదుర్చు

తున్న దన్నమాట. అయితే ఈసాదృశ్యము లక్ష్యమాణము కాబట్టి ఉపమ కాదు. రూపకాలంకారమే.

౨ కిమేష నవమో హరిత్పతి రమందసంపత్ప్రదం
కిమేష దశమః ప్రజాపతి రపూర్వసర్గక్రమః
కిమేష హరి రుర్వరోద్ధరణచుంచు రేకాదశః
చిరాదితి విలోక్యతే జగతి కాకతీంద్రో జనైః.

అనల్పసంపత్తునకు స్థానమయిన ఈతడు తొమ్మిదో దిక్పాలకుడా ఏమి? అపూర్వసృష్టిప్రక్రియకలిగిన ఈయన పదో ప్రజాపతియా ఏమి? భూమీసముద్ధరణసమర్థుడయిన ఈయన పదకొండవ విష్ణువా ఏమి? ఈవిధముగా చాలా సేపటిదాకా కాకతీంద్రుడు జగతిలో జనులచే చూడబడు తున్నాడు. దీనిలో సందేహాలంకారము ఉన్నది. సంపదాది సాదృశ్యము ఉన్నందువలన వీరరుద్రుడు లోకపాలాది రూపముగా సందేహింపబడుతున్నాడు. కాకతీశ్వరునకు దిగీశ్వరాదులకున్నూ పరస్పరము అభేదము ప్రతీత మవు తున్నది. కనుకనే ఇక్కడకూడా సాదృశ్యము వాచ్యముగా లేదు. కాకతీశ్వరదిగీశ్వరాదులకు ఉండే సాదృశ్యము గమ్య మాన మవుతున్నది. గమ్యమయినా సాదృశ్యస్థితిని అంగీక రించాలి. అట్లా అంగీకరించకపోతే ఈతడు దిక్పతిఅవునా? ప్రజాపతిఅవునా? అనే సందేహానింబంధనము కుదరదు. ఈ గమ్యసాదృశ్యమువినా సందేహము వేరొకవిధంగా ఉప పన్న మవుతున్నందువలన సాదృశ్యము ఆక్షిప్యమాణము అవుతున్నది. కాబట్టి సందేహాలంకారము. సాదృశ్యము ఆక్షిప్యమాణము అని అనడములో ఈభావమును గ్రహిం చాలి. ఉపపన్నము కానిది నిరూపితమయినపుడు ఆనిరూప

ణము కుదరక ఉపపత్తిని (కుదురుబాటును) సంపాదించే దానిని తెలియచేస్తుంది. ఆ తెలియచేయడమునె ఆక్షేపమంటారు. దీనినే అర్థాపత్తిప్రమాణముచే గోచరము కావడము అనిన్నీ అంటారు. "ఆయన పగలు భోజనము చేయడు; బలిసిఉన్నాడు" అని ఉన్నదనుకోండి. భోజనము లేకపోతే బలిసిఉండడము కుదరదు. ఈఉపపన్నముకాని బలిసిఉండుట "ఈతడు రాత్రి భోజనము చేస్తున్నాడు" అనే ఉపపాదకార్థమును ఆక్షిప్యమాణముచేస్తుంది. ఇట్లాగే ప్రకృతంలోకూడా

> ౩ కాకతీయవిభోః కీర్తివిభవే వ్యాప్తరోదసి
> దివాపి చంద్రికాబుద్ధ్యా చకోరా యాంతి నిర్వృతిం.

ప్రతాపరుద్రుని కీర్తివిభవము భూమ్యాకాశములను వ్యాపించగా చకోరములు పగలుకూడా చంద్రికాబుద్ధితో తృప్తిని పొందుతున్నవి. దీనిలో భ్రాంతిమదలంకారము ఉన్నది. చకోరములకు కీర్తివిభవమును చూస్తే చంద్రికాబుద్ధి కలిగింది. అంటే వానికి వెన్నెల అనే భ్రాంతి కలిగిందన్నమాట. ఇక్కడకూడా సాదృశ్యము ఆక్షిప్తమె అవుతున్నది. కాని వాచ్యముగాలేదు. ఇటువంటి ఈసాదృశ్యము ఇక్కడ లేకపోతే వానికి చంద్రికాబుద్ధి కలగడము ఉపపన్నము కాదు. చంద్రికాసాదృశ్యమువలననే ఇది కుదురుతుంది. ఇట్లా సాదృశ్యాక్షేపము ఉన్నందువలన ఇక్కడ సందేహాలంకారమె కాని ఉపమ కాదు.

> ౪ లక్ష్మీనివాసగృహ మిత్యఖిలా నరేంద్రాః
> శౌర్యాతిభూమిఖనిరి త్యరివీరవర్గాః
> విద్యావిహారపదవీతిచ లబ్ధవర్ణాః
> శ్రీకాకతీంద్రనగరీ మనిశం స్తువంతి.

శ్రీ కాకతిప్రభుపుపట్టణమయిన వరంగలునగరమును శ్రీలక్ష్మీనివాసగృహము అని సర్వనరేంద్రులు, శౌర్యాతిశయమునకు గని అని శత్రువీరసమూహములున్నూ, విద్యలకు విహారపదవి అని విద్వాంసులున్నూ నిత్యము స్తవము చేస్తున్నారు. దీనిలో ఉల్లేఖాలంకారము ఉన్నది. ఒకే వస్తువును అనేకులు ఆయా నిమిత్తభేదమునుబట్టి అనేకవిధముగా అభ్యూహించడము ఈఅలంకారరూపము. సాదృశ్యము దీనిలోనూ వాచ్యముగాలేదు. సాదృశ్యము లేకపోయినట్లయితే నగరియందు ఆయా సమారోపము సంభవించదు. దానికి దీనికీ పరస్పరమూ సాదృశ్యము లేకపోతే ఒకపదార్థమందు వేరొకపదార్థసమారోపము చేయడము కుదరదుకదా! కాబట్టి ఇక్కడ సాదృశ్యమును కల్పించుకోవాలి కనుక ఉల్లేఖమె కాని ఉపమ కాదు.

౫ వీరరుద్రస్య భూపాలజయహోమం వితన్వతః
ధూమరాజి రియం భాతి న చమూరేణు రుత్థితా.

ఈ బయలుదేరినట్టిది భూపాలజయహోమం చేస్తున్న వీరరుద్రుని ధూమపంక్తియే భాసిస్తున్నది. అంతేకాని ఇది సేనాపరాగం కాదు. హోమంచేసేటపుడు పొగవరుస బయలుదేరుతుంది. జైత్రయాత్రలో ఆకాశవీధి వ్యాపించిన సేనాపరాగమును చూచి ఇది ధూమపంక్తే కాని పరాగం కాదు అని అపహ్నవము (కప్పిపుచ్చడము) ఉన్నందువలన ఇక్కడ అపహ్నవాలంకారము ధూమరాజిత్వమును ఆరోపించడము చమూరేణువు కాదని అపహ్నవించడమూ దీనిలో ఉన్నది. ఇక్కడకూడా సాదృశ్యము ఆక్షిప్తము కావలసినదే కాని వాచ్యముగాలేదు. ఆక్షిప్యమాణసాదృశ్యము ఇక్కడ ఉన్న

దని అంగీకరించాలి. కాకపోతే ఈఆరోపము అపహ్నవమూ కుదరదు. ఇక్కడి సమారోపము సాదృశ్యమూలకమె. ఇట్టి సాదృశ్యాక్షేపంవలన ఇక్కడ అపహ్నవమేకాని ఉపమకాదు. ఈచెప్పిన అయిదు ఉదాహరణాల్లోమాదిరిగా తుల్యయోగిత మొదలయిన వానిలోకూడా సాదృశ్యము గమ్యమెకాని వాచ్యముకాదు. అందువలన వాటిల్లోనూ ఉపమాశంకకు అవకాశం లేదు. కనుక సాధర్మ్యమూలకములయిన సర్వాలంకారాలకంటె ఈఉపమ విలక్షణమని గ్రహించాలి.

ఉపమావిభాగము

ఉపమ మొదట రెండువిధాలు. పూర్ణోపమ లుప్తోపమ అని. ఉపమానము ఉపమేయము సాధారణధర్మము సాదృశ్యము అనే ఈనాలుగూ ఉపమాశరీరము. వీనిప్రతిపాదకములు నాలుగూ కంఠోక్తిగా ప్రతిపాదింపబడినట్లయితే పూర్ణోపమ అవుతుంది. చంద్రాదిపదార్థములు ఉత్కృష్టగుణములు కలవి అని, అవి ఉపమానములని, కవికులప్రసిద్ధి. ముఖాదిపదార్థములు అపకృష్ట (తక్కువ) గుణములుకలవి అని, అవి ఉపమేయములని, ప్రసిద్ధి. గుణముకాని క్రియకాని ఉపమానోపమేయములకు సంబంధించిఉండేది సాధారణధర్మము అవుతుంది. సంస్కృతభాషలో 'ఇవ వా యథా' మొదలయినవి సాదృశ్యప్రతిపాదకశబ్దములు. ఈనాలుగూ ప్రయుక్తములయితే పూర్ణ. కతిపయములులోపించితే లుప్తోపమ. ఉపమాశరీరచతుష్కములో ఒకటి లోపించినా రెండు లోపించినా మూడు లోపించినా లుప్తఅవుతుంది. ఈలోపించడమనేది ఒక్కొకచోట శాస్త్రీయముగా ఉంటుంది. అంటే అక్కడి లోపము శాస్త్రముచేత విధింపబడేది (శాస్త్ర

మూ) అవుతుంది. ఒక్కొకచోట స్వారసికము. లోపించ
ం స్వారసికంగా ఉంటే ఇచ్ఛానుసారంగా దాన్ని లుప్త
వవచ్చు. దానినే ఐచ్ఛికము అనికూడా అంటారు. ఇక
అవాంతరభేదాలు___

పూర్ణావిభాగము

పూర్ణోపమ రెండువిధాలు. శ్రౌతీపూర్ణ, ఆర్థీపూర్ణ,
. సాదృశ్యప్రతిపాదకములయిన శబ్దములు రెండువిధాలుగా
టవి. కొన్ని విన్నవెంటనే సాదృశ్యమును ప్రతిపాదించేవి
ృతవి. 'యథా, ఇవ, వా' మొదలయినవి ఇటువంటివే.
ని సాక్షాత్సాదృశ్యప్రతిపాదకములు అని అంటారు.
ుతికి సంబంధించినది శ్రౌతి. శ్రుతిచే సాదృశ్యప్రతి
దకము ఉంటే శ్రౌతిఉపమ అవుతుంది. సాదృశ్యప్రతిపాదక
ులలో కొన్ని వెంటనే శ్రుతిమాత్రాన సాదృశ్యమును
తిపాదించేవికాలేవు. అవి ముందుగా సదృశమును
ాదృశ్యంకలదానిని) చెప్పి ఆధర్మివ్యవధానముతో సాదృశ్య
ును ప్రతిపాదించుతవి. సదృశ-సంకాశ-నీకాశ-ప్రతీకా
ాదిశబ్దములు ఇటువంటివే. సదృశపదానికి సమానము
ాదృశ్యముకలది) అని వెంటనే గోచరించే అర్థము.
అర్థమును భావించగా అనంతరసమయములో సదృశ
ుందు విశేషణముగా ఉన్న సాదృశ్యము వ్యవహితమై
ోచరిస్తుంది. ఇట్లా సదృశాభిధానద్వారకముగా సాదృశ్య
ును ప్రతిపాదించే సదృశాదిశబ్దములను ప్రయోగించినపుడు
ర్థి అవుతుంది. సదృశాదిశబ్దములు సాదృశ్య విశిష్టమయిన
ర్థపరములు అవుతున్నవి. యథేవాదిశబ్దములు సాదృశ్య
రము లవుతున్నవి. ఇవి సాదృశ్యపరము లయినా తాత్పర్య

ప్రభావంవలన సాదృశ్యము కలవానివిషయమై ప్రవర్తించేవి కాగలవు. ఇంతకూ శ్రుతిచే సాదృశ్యపరములయిన వానిని ప్రయోగించితే శ్రౌతి. శ్రుతిచే సాదృశ్యవిశిష్టపరములయినా అర్థమును అనుసరించి సాదృశ్యపరములయిన వానిని ప్రయోగించితే ఆర్థి అని ఈరెండిటి వివేకము. ఈ శ్రౌతి ఆర్థి అనేవి రెండూ వాక్యగతముగా సమాసగతముగా తద్ధితగతముగా విభాగముపొందితే మూడుమూడువిధములవుతున్నవి. ఇట్లా విభాగము పొందిన పూర్ణోపమ ఆరురకాలు. వానిపేర్లు;

౧ వాక్యగత శ్రౌతి పూర్ణోపమ
౨ సమాగత శ్రౌతి పూర్ణోపమ
౩ తద్ధితగత శ్రౌతి పూర్ణోపమ
౪ వాక్యగతార్థి పూర్ణోపమ
౫ సమాసగతార్థి పూర్ణోపమ
౬ తద్ధితగతార్థి పూర్ణోపమ

లుప్తా విభాగము

లుప్తోపమ పందొమ్మిదివిధము లవుతుంది. ఇతరాలంకారికులు విద్యానాథుడు అంగీకరించిన పద్ధతినేకాక వేరొక విధంగా ఇంకా భేదాలను పరిగణించారు. విద్యానాథోక్త లుప్తాభేదములపేర్లను ముందు ఈవిధముగా గ్రహించవచ్చు.

౧ వాక్యగత శ్రౌతి ధర్మలుప్త
౨ సమాసగత శ్రౌతి ధర్మలుప్త
౩ వాక్యగత ఆర్థి ధర్మలుప్త
౪ సమాసగత ఆర్థి ధర్మలుప్త
౫ తద్ధితగత ఆర్థి ధర్మలుప్త
౬ కర్మక్యచ్ ధర్మవాచక లుప్త

౭ ఆధారక్యచ్ ధర్మవాచకలుప్త
౮ కర్మణముల్ ధర్మవాచకలుప్త
౯ కర్తృణముల్ ధర్మవాచకలుప్త
౧౦ క్విప్ ధర్మవాచకలుప్త
౧౧ కర్తృక్యచ్ ధర్మవాచకోపమేయలుప్త
౧౨ కర్తృక్యచ్ ధర్మవాచకలుప్త
*౧౩ సమాసగత ధర్మవాచకలుప్త
౧౪ వాక్యగతోపమానలుప్త
౧౫ సమాసగతోపమానలుప్త
౧౬ వాక్యగత ధర్మోపమానలుప్త
౧౭ సమాసగతధర్మోపమానలుప్త
౧౮ సమాసగతవాచకలుప్త
౧౯ సమాసగత ధర్మవాచకోపమానలుప్త

వీనిలో పదమూడవది అయిన సమాసగతధర్మవాచకలుప్తను విద్యానాధుడు తన రచనలో నిరూపించలేదు. ఇప్పటికి ఉపలబ్ధము లవుతున్న గ్రంథాలలో దీని పాఠము లేదు. మొదట సంఖ్యానించడములో లుప్తోపమ ఏకోన వింశతి (౧౯) భేదము లవుతుందని ఉన్నది. దీనిని కలుపుకుంటే కాని ౧౯ భేదపూర్తికాదు. అందువలననె వ్యాఖ్యాత సోమవీధి దీనిని కలుపుకొని పరిగణింపవలసిందని సూచించాడు. ఈలుప్తాభేదములనె ప్రతిపత్తిసౌకర్యముకోసరము ఈవిధంగా కూడా గ్రహించడము యుక్తముగా ఉంటుంది. వీనిలో ఏకలుప్తలు ఎనిమిది, ద్విలుప్తలు తొమ్మిది. త్రిలుప్తలు రెండు.

ఏకలుప్తలు

౧ వాచకలుప్త సమాసగత
౨ ఉపమానలుప్త సమాసగత

౩ ఉపమానలుప్త వాక్యగత
౪ ధర్మలుప్త శ్రౌతి వాక్యగత
౫ ,, ,, సమాసగత
౬ ,, ఆర్థి వాక్యగత
౭ ,, ,, సమాసగత
౮ ,, ,, తద్ధితగత

ద్విలుప్తలు

౧ ధర్మవాచకలుప్త కర్మక్యచ్
౨ ,, ఆధారక్యచ్
౩ ,, కర్మణముల్
౪ ,, కర్తృణముల్
౫ ,, క్విప్
౬ ,, కర్తృక్యజ్
౭ ,, సమాసగత
౮ ధర్మోపమానలుప్త సమాసగత
౯ ,, వాక్యగత

త్రిలుప్తలు

౧ ధర్మోపమేయవాచకలుప్త క్యచ్
౨ ధర్మోపమానవాచకలుప్త సమాసగత.

పూర్ణావిభాగములో లుప్తావిభాగములోనూ తద్ధితగతముగా ఉండే భేదములు నిర్దిష్టము లయినవి. సంస్కృతములో 'వతి' అనేది తద్ధితప్రత్యయము. దీని ప్రయోగము రెండువిధాల కన్పించుతున్నది. వతిప్రత్యయ భేదమువలన కూడా ఉపమాభేదము సిద్ధమవుతుందన్నమాట. ''తేనతుల్యం

రాచేద్వతిః" అనే సూత్రముచేత 'వతి' ప్రత్యయము
శార్థములో విహిత మవుతున్నది. "తత్రతస్యేవ" అనే
త్రముచేత 'వతి' ప్రత్యయము 'ఇవా'ర్థములో విహిత
)తున్నది. సదృశార్థములో విహితమయితే 'అర్హ' అని,
ర్థమయిన సాదృశ్యపరముగా విహితమయినట్లయితే
తి అని తెలుసుకోవచ్చు. సాదృశ్యార్థములో విహిత
యిన వతి ప్రయోగములో సామాన్యధర్మప్రయోగం
డా అవశ్యంగా ఉండాలి. ఆ ధర్మముకూడా ఉపాత్త
యితేనే అన్వయసౌకర్యం ఉంటుంది. ధర్మోపాదానం
పోతే అన్వయరీతి సరిగాఉండదు. "కూర్మవత్ భుజే
దినీ భాతి"అని ఉన్నదా! భూమి భుజమునందు ఆది
ర్మమునందువలె భాసించుతున్నది. అని దీనిఅర్థము.
క్కడ భుజము ఉపమేయము. కూర్మము ఉపమానము.
త్ అనే తద్ధితప్రత్యయము ఉపమావాచకము.'భాతి' అనే
దినీభానము సమానధర్మము. ఇక్కడ వత్ ప్రత్యయము
వార్థమయిన సాదృశ్యార్థములో విహితమయింది. అందు
నే కూర్మమునందువలె అని అర్థమును చెపుతున్నాము.
క్కడ భానరూపమయిన సమానధర్మముకూడా ప్రయు
్తమై ఉన్నందువలననె అన్వయసౌకర్యము సరిగా ఉంది.
భాతి' అనే భానము (సామాన్యధర్మము) ఉపాత్తము కాక
యినట్లయితే భూమి భుజమందు కూర్మమునందువలె-
నేఅర్థము వస్తుంది. కూర్మమునందువలె ఏమిటో? ఏమవు
న్నదో? ఏమో? స్పష్టముకాదు. అన్వయంలో సౌక
్యంఏర్పడదు. కనుక తద్ధితగత అయిన శ్రౌతిలో అవ
్యంగా ధర్మోపాదానం ఉండాలి కాబట్టి తద్ధితగతశ్రౌతి

ధర్మలుప్త ఉండదు. తద్ధితప్రత్యయమయిన వతివిధానంలో ఉన్న భేదమునుబట్టి శ్రౌతి ఆర్థివిభాగము రావడము ఇప్పటికి స్పష్టమయినట్లె. ఇంకా కల్పప్, దేశ్య, దేశీయర్ అనికూడా కొన్ని ప్రత్యయాలు ఉన్నవి. అవికూడా తద్ధితప్రత్యయాలే. కొంచెము తక్కువఅనే అర్థంలో ఈప్రత్యయాలు విహితము లవుతూ ఉంటవి. ముఖము చంద్రకల్పము అని అంటాము అనుకోండి. ముఖము చంద్రునికంటె కొంచెముతక్కువ అని అర్థము. ఇట్లాగే ముఖము చంద్రదేశ్యము చంద్రదేశీయము అని ప్రయోగించినపుడున్నూ గ్రహించాలి. ఈకల్పబాది ప్రయోగండున్నపుడు సదృశార్థమె (ధర్మి) ముందుగా గోచరమవుతుంది. వినినవెంటనే సాదృశ్యార్థము గోచరముకాదు. కనుక వీని ప్రయోగంలో ఆర్థీవిభాగమునె గ్రహించాలి. ఈస్థలంలో సాదృశ్యప్రతిపాదనం ఉండకపోదు. అయితే అది ధర్మివ్యవధానంతో ఉంటుందన్నమాట.

పూర్ణోపమోదాహరణములు

ఇటుమీాదట వరుసవరుసగా పూర్ణోపమాభేదాలకు లుప్తోపమాభేదాలకున్నూ ఉదాహరణములను నిరూపించవలసిఉన్నది. ముందుగా పూర్ణోపమాప్రభేదాలు ఆరింటికి ఉదా :-

౧ వాక్యగతశ్రౌతి

ఉద్దామోద్యతవిక్రమే కృతయుగే బాహౌ యయాతే ర్యథా
త్రేతాయాం రఘునాయకస్య మహితఖ్యాతౌ భుజాయాం యథా
దోర్దండేచ యుధిష్ఠిరస్య విలసచ్ఛౌర్యే యథా ద్వాపరే
విస్రబ్ధాద్య కలౌ తథైవ రమతే క్షోణ్యాంధ్రభర్తు ర్భుజే.

కృతయుగములో అతిశయితమహాపరాక్రమంకలిగిన

మయయాతిమహారాజు భుజమునందువలె, త్రేతాయుగంలో శ్రీరఘునాయకుని మహితఖ్యాతికల భుజమునందువలె, ద్వాపరయుగంలో యుధిష్ఠిరుని విలసించు శౌర్యముకల దోర్దండమునందువలె విశ్వాసముకలిగిన భూమి ఈకలియుగ మందు ఆంధ్రప్రభువయిన ప్రతాపరుద్రుని భుజమందు (ఆవిధముగానె) క్రీడించుతున్నది. పూర్వయుగాలలో ఏవిధంగా వారివారి భుజములందు భూమి క్రీడించిందో ఆవిధంగా కలిలో కాకతీయభుజమందు క్రీడిస్తున్నదని భావము. దీనిలో కాకతీయభుజము ఉపమేయము. యయాతిభుజము ఉపమానము. రమణము సమానధర్మము. 'యథా' అనేది ఉపమావాచకము. నాలుగూఉన్నందువలన పూర్ణ. యథా అనేది సాదృశ్యపరముకాబట్టిశ్రౌతి. ఉపమావాచకము ఉపమానము వ్యస్తముగా ఉన్నందువలన వాక్యగతమయినట్లు ఈవిధముగానే ఉత్తరోదాహరణములలోకూడా గ్రహించాలి.

౨ సమాసగతశ్రౌతి

భాస్వానివోద్యన్నుదయాద్రిలంబీ భద్రాసనస్థో వరవీరరుద్రః
ఉత్పశ్యతా మంధ్రపురీజనానాం నేత్రాబ్జజాడ్యం శమయ త్యశేషం.

సింహాసనస్థితుడయిన వీరరుద్రుడు ఉదయపర్వతమును అవలంబించిఉన్న 'సూర్యుడువలె' దర్శనముచేస్తూఉన్న ఆంధ్రపురీజనుల నేత్రపద్మజడిమనంతా శమింపచేస్తున్నాడు. సూర్యుడు పద్మజడిమను శమింపచేస్తున్నాడు. వీరరుద్రుడు నేత్రముల మాంద్యమును పోగొట్టుతున్నాడు. ఇవ ప్రయోగమువలన శ్రౌతి. చతుష్కమూ ఉన్నదికాబట్టి పూర్ణ. "భాస్వానివ"అనేది సమస్తపదము. కనుక సమాస

గత. "ఇవేనసహ నిత్యసమాసః" అనే నియమము ఉన్నందు వలన ఇది నిత్యసమాసము.

ఇక్కడ ఈవిషయమును గ్రహించాలి. "సుపో ధాతు ప్రాతిపదికయోః" అనే సూత్రందగ్గర సిద్ధాంతకౌముదిలో "ఇవేనసహ సమాసః విభక్త్యలోపః పూర్వపదప్రకృతిస్వరత్వంచ" అనే వార్తికము పఠితమయింది. ఇదే మహాభాష్యములో 'సహసుపా' అనే సూత్రందగ్గర పఠితము. ఇది కాత్యాయనవార్తికముకాని సూత్రముకాదు. వ్యాకరణ శాస్త్రంలో 'సమాసః' అనే ఉందికాని 'నిత్యసమాసః' అని లేదు కాబట్టి నిత్యపదము ప్రక్షిప్తము. అది ప్రామాణికం కాదు. 'భాస్వానివ' మొదలయినవి నిత్యసమాసములని అనడము పొరబాటు. విద్యానాథుడు నిత్యపదమును ప్రయోగించడము భ్రాంతిమూలకము. కావ్యప్రకాశలో 'ఇవేన నిత్యసమాసః' అని ఉండడమును చూచి విద్యానాథుడున్నూ అనిఉంటాడు. కావ్యప్రకాశలో నిత్యపదము ప్రక్షిప్తము. ఇవతో సమాసము వైకల్పికము కాబట్టే "జీమూతస్యేవ భవతి ప్రతీకం" అనే తైత్తిరీయవైదికవాక్యమును పృథక్పదముగా పఠించడమున్నూ ఉపపన్న మవుతున్నది. "ఉద్బాహురివ వామనః; అనయేనేవ రాజ్యశ్రీః; ప్రావృషేణ్య ఇవ వారిధరః" అనే ప్రయోగములున్నూ కుదురుతున్నవి. కనుక ప్రకృతములో నిత్యపదము ఉచితముకాదు. "భాస్వానివ" అనేది సమాసము. అక్కడ ఉపమ సమాసగత.

౩ తద్ధితగతశ్రౌతి

కూర్మవచ్ఛేషవద్గోత్రగిరివద్దిజ్మహేభవత్
భుజే ప్రతాపరుద్రస్య ధరిణే భాతి మేదినీ.

ప్రతాపరుద్రుని ధురంధరమయిన (సమర్థమయిన) భుజమందు, ఆదికూర్మమునందువలె, ఆదిశేషునందువలె, కులపర్వతమునందువలె, దిగ్గజమునందువలె భూమి భాసించుతున్నది. దీనిలో వతి (వత్) తద్ధితప్రత్యయము. "తత్ర తస్యేవ" అనే వ్యాకరణసూత్రముచేత అది విహిత మవుతున్నది. సప్తమ్యర్థములో ప్రవర్తించే ఇవార్థమునందు ఇది విహితమయింది. ఉపమాదులు నాలుగూ ఉన్నవి. సమన్వయము సులభము.

౪ వాక్యగత ఆర్థి

తైస్తైర్మహీపాలనసంవిధానైః తైస్తైః ప్రజారంజనవైభవైశ్చ
విరాజతే సంప్రతి కాకతీయ లక్ష్మీపతి ర్దాశరథే స్సమానః.

ఆయా భూమీపాలనవిధానములచేత ఆయా ప్రజలను రంజింపచేసే విభవములచేతా ఇపుడు కాకతీయలక్ష్మీపతి శ్రీరామునకు సమానుడై విరాజిల్లుతున్నాడు. దీనిలో పూర్ణోపమ. దాశరథేః సమానః అని విడిగా ఉండడముచేత వాక్యగత. సమానశబ్దమును ప్రయోగించినందువలన ఆర్థి. ఈసమానశబ్దము ముందుగా ధర్మిని చెప్పి అనంతరము ఉపపత్తిసంపాదనానికి సాదృశ్యమును చెపుతున్నది.

౫ సమాసగత ఆర్థి

తాదృక్పాలనసామర్థ్యసంపదా కాకతీశ్వరః
హరిదీశ్వరసంకాశః శాస్తి మధ్యమవిష్టపం.

కాకతీశ్వరుడు అటువంటి పాలించే సామర్థ్యసంపదచేత దిక్పతిసమానుడై మధ్యమలోకమును శాసించుతున్నాడు. దీనిలో ఉపమానవాచకమయిన హరిదీశ్వరపదముతో ఉపమావాచకమయిన సంకాశపదము సమసించి

ఉన్నదికాబట్టి సమాసగతత్వమునుఊహించాలి. నిభసంకాశ నీకాశాదిశబ్దములు సమాసగతములయినపుడు ఉత్తర పదముగా ఉండాలి అని నియమము. సంకాశప్రయోగము వలన ఆర్థి.

౬ తద్ధితగత ఆర్థి

హేమాచలవ దౌన్నత్యే గాంభీర్యే క్షీరసింధువత్
ప్రతాపే భానువ ద్భాతి వీరరుద్రనరేశ్వరః.

వీరరుద్రనరేశ్వరుడు ఔన్నత్యములో మేరువుతో సమానుడు. గాంభీర్యములో క్షీరసాగరముతో సదృశుడు. ప్రతాపములో సూర్యునితో సమానుడు అయి భాసించుతున్నాడు. దీనిలో వతి (వత్) ప్రత్యయము "తేనతుల్యం క్రియాచ" అనే వ్యాకరణసూత్రముచే విహితమయింది. ఇది తుల్యార్థమును (సాదృశ్యవత్) సూచిస్తుంది, కనుక ఆర్థి. తద్ధితగతఅయిన ఉపమ. ఈనిరూపించిన ఆరుఉదాహరణాలలోనూ ఉపమానాదిచతురంగనిబంధనము ఉన్నందువలన పూర్ణోపమ.

లుప్తోపమోదాహరణములు

ఇకలుప్తోపమలను ఉదాహరించాలి. మొదటగా నిరూపించే ఈఅయిదుఉదాహరణాలలోనూ సామాన్యధర్మోపాదానము ఉండదు. రెండు శ్రౌతీలుప్తలు. మూడు ఆర్థిలుప్తలు. ఇట్లా ఈధర్మలుప్తలు అయిదు.

౧ వాక్యగత శ్రౌతి

యథా రుచాం స్వామిని చక్రవాక్యో యథా చ నీహారరుచౌ చకోర్యః
యథా ప్రసూనస్తబకే భ్రమర్యః తథా ప్రజాః కాకతివీరరుద్రే.

చక్రవాకులు సూర్యునియందు ఏవిధముగా ఉంటున్నవో, చకోరికలు చంద్రునియందు ఏవిధముగా ఉంటున్నవో, తుమ్మెదలు పువ్వులగుత్తియందు ఏవిధముగా ఉంటున్నవో అదేవిధముగా ప్రజలు కాకతివీరరుద్రునియందు ఉంటున్నారు. దీనిలో ఉపమ యథాప్రయోగమువలన శ్రౌతి. వ్యస్తముగా ఉన్నందువలన వాక్యగత. ధర్మము ఉపాత్తముకానందువలన ధర్మలుప్త. వర్తంతే ఉంటున్నారు అనే అధ్యాహృతమయిన క్రియ సాధారణధర్మము కాదు. సామాన్యముగా ఉండే క్రియామాత్రము. అంటే ఉండకతప్పనిసరిగాఉండే క్రియ. చమత్కారకము కాదు. కాబట్టి సమానధర్మము కాతగదు. ఏదోవిధముగానయినా చమత్కారమును కలుగజేసేది అయితేనే సమానధర్మ మవుతుంది. ఈపద్యములో చమత్కారమును కలుగజేసే ప్రతాపము ఆహ్లాదము సారస్యము అనే ధర్మాలు ఉపాత్తములు కాలేదు కాబట్టి ధర్మలుప్త. ఇట్లాగే ఇతరస్థలములలో కూడా గ్రహించాలి.

౨ సమాసగతశ్రౌతి

ప్రతాపరుద్రదేవస్య పాదపీఠ మనారతం
ఆరాధయంతి భూపాలాః ప్రణతా దేవతా మివ.

సామంతులు నిత్యమున్నూ ప్రతాపరుద్రదేవుని పాదపీఠమును ప్రణతులై దేవతనువలె ఆరాధిస్తున్నారు. 'దేవతా మివ' అనేది 'భాస్వానివ' మాదిరిగా సమాసము. సమన్వయము స్పష్టము. పాదపీఠదేవతలకు సమానధర్మము సంపత్ప్రదత్వము. అది అనుపాత్తము కనుక ధర్మలుప్త. శ్రౌతిలో తద్ధితగతముగా ధర్మలుప్త ఉండదని అన్వయసౌకర్యము కలదని ఇదివరలో నిరూపితము.

౩ వాక్యగత ఆర్థి

కాకతిక్ష్మాపతే ర్జైత్రప్రస్థానపటహధ్వనిం
తుల్యం దంభోలినిర్ఘోషైః శృణ్వంత్యరిమహీభృతః.

కాకతిభూపతియొక్క జయస్వభావము కలిగిన దండయాత్రలోని భేరీధ్వనిని శత్రురాజులు వజ్రనిర్ఘోషములతో సమానమయిన దానినిగా వింటున్నారు. దీనిలో 'తుల్యం' అనేది వ్యస్తముగా ఉన్నందువలన ఉపమ వాక్యగత. భీషణరూపమయిన సమానధర్మము గమ్యమాన మవుతున్నదే కాని పద్యములో ఉపాత్తము కాలేదు. కాబట్టి ధర్మలుప్త. తుల్యపదప్రయోగమువలన ఆర్థి.

౪ సమాసగతఆర్థి

శశ్వత్పురీ మేకశిలాభిధానాం వసోకసారాసదృశీ మవేక్ష్య
నమంతి భూపా భువి కాకతీయరాజ్యప్రతిష్ఠాం బహుమన్యమానాః

రాజులు ఏకశిలాపట్టణమును అలకాపురీసదృశమైనదానినిగా చూచి భూమిలో కాకతీయరాజ్యప్రతిష్ఠను బాగా కొనియాడుతూ మాటిమాటికీ కొనియాడుతున్నారు. దీనిలో 'వసోకసారాసదృశీం' అని కలిపిఉండడము చేత ఉపమ సమాసగత. వైభవరూపమయిన సమానధర్మము ఉపాత్తము కాలేదు.

౫ తద్ధితగత ఆర్థి

ప్రతాపరుద్రనృపతే ర్జగన్మహితతేజసః
కందర్పకల్ప మాకారం పశ్యంత్యంధ్రపురంధ్రయః.

ప్రపంచములో మెచ్చదగిన పరాక్రమముకల ప్రతాపరుద్రుని ఆకారమును మన్మథునితో సమానమయిన దానినిగా ఆంధ్రస్త్రీలు చూస్తున్నారు. ఇక్కడ కల్పప్ప్రత్యయము

కొంచెము తక్కువ అనే అర్థములో విధింపబడిన తద్ధిత ప్రత్యయము. రూపసంపద అనే సమానధర్మము లేదు. ఇప్పటికి ధర్మలుప్తలు అయిదూ నిరూపితములు అయినవి. ఇటుమీాదట ద్విలుప్తలో భేదాలు ఉదాహృతములు అవుతవి. ఇదివరలో ప్రకారాంతరముగా నిరూపించిన విధానాన్నిబట్టి సమాసగతమయిన వాచకలుప్తను వాక్యసమాసగతము లయిన ఉపమానలుప్తలను మొత్తం ఇంకా మూడులుప్త లను ఏకలుప్తాప్రసంగములో నిరూపించవలసిందేకాని విద్యా నాథుడు ఆవిధముగా ఉదాహరించలేదు. తాను తలచిన వరుసను అనుసరించి ఆతడు ఉదాహరించడమువలన సామా న్యముగా ఆప్రణాళికను అనుసరించే ఈరచనలోకూడా ఆపద్ధతి ప్రదర్శనమె సంగతముగా ఉంటుంది. ముందుగా ఈచెప్పబోయే అయిదింటిలో ధర్మవాచకలోపమును గుర్తించాలి.

౬ కర్మక్యచ్

దుగ్ధార్ణవీయ త్యంభోధీ౯ కైలాసీయతి భూధరా౯
ప్రతాపరుద్రదేవస్య యశోవైశద్యవైభవం.

ప్రతాపరుద్రుని యశోవైభవము సముద్రములను దుగ్ధార్ణవములనుగా చేస్తున్నది. పర్వతములను కైలాసము లనుగా చేస్తున్నది. దీనిలో సముద్రములు ఉపమేయము దుగ్ధార్ణవము ఉపమానము. దుగ్ధార్ణవీయతి అనేచోట 'ఉపమానాదాచారే' అనేపాణినిసూత్రముచేత 'క్యచ్' ప్రత్యయము వచ్చింది. ఇది ఉపమానవాచకమయిన 'దుగ్ధార్ణవం' అనే కర్మపదముకంటె ఆచారార్థములో వచ్చిన ప్రత్యయము. అంభోధీ౯ అనే ఉపమేయములో ద్వితీయా

విభక్తి కన్పడుతున్నది కాబట్టి ఈ దుగ్ధార్ణవీయతి అనే స్థలములో ద్వితీయాంతముకంటె క్యచ్ ప్రత్యయము వచ్చింది. ఇంతకూ ఇక్కడ సాదృశ్యప్రతిపాదకములయిన ఇవాదిపదాలకుగాని తుల్యాదిపదాలకుగాని ప్రయోగము లేదు. కాబట్టి వాచకలోపము ఉంది. క్యచ్ ప్రత్యయము ఉపమాప్రతిపాదకము కాదు. అది ఆచారార్థములో విహితమయిన ప్రత్యయముకదా! ఉపమాప్రయోజకమయిన ధావళ్యాదిసమానధర్మమున్నూ ఇక్కడ లేదు. అందువలన ధర్మముకూడా లుప్తము. ఆచారమనేది క్యజర్థముగా ఉన్నా అంతమాత్రము అది ఉపమాప్రయోజకము కాలేదు. కనుక ఇది ధర్మవాచకలుప్త.

౭ ఆధారక్యచ్

క్రీడాద్రీయతి గోత్రశైలశిఖరే ష్వాస్థానసద్మీయతి
ద్వీపేష్వబ్ధిషు దీర్ఘికీయతి హరిత్స్వేకాంతగేహీయతి
ఉద్యానీయతి సీమపర్వతతటారణ్యే సుపర్వాచలే
ప్రాసాదీయతి వీరరుద్రనృపతేః స్ఫారః ప్రతాపోదయః.

వీరరుద్రుని అతిశయించిన ప్రతాపోదయము కులపర్వతశిఖరములలో క్రీడాపర్వతమునందువలె ఆచరించుతున్నది. నానాద్వీపములలో సభామంటపమునందువలె ఆచరిస్తున్నది. సముద్రములలో క్రీడాసరస్సులందువలె ఆచరిస్తున్నది. దిక్కులలో అంతఃపురములోవలె ఆచరిస్తున్నది. లోకాలోకపర్వతతటారణ్యములో ఉద్యానమునందువలె ఆచరిస్తున్నది. మేరుపర్వతములో ప్రాసాదమునందువలె ఆచరిస్తున్నది. దీనిలో గోత్రశైలశిఖరాదులు ఉపమేయములు. క్రీడాద్రిప్రభృతులు ఉపమానములు. (క్రీడాద్రిష్వివ వర్తత

ఇతి క్రీడాద్రీయతి) క్రీడాద్రీయతి మొదలయిన పదాలలో "అధికరణాచ్చ" అనే వార్తికమువలన వచ్చినక్యచ్ ప్రత్యయము ఉన్నది. ఉపమానవాచకమయిన అధికరణ శబ్దము కంటె ఆచారార్థములో క్యచ్ప్రత్యయము వస్తుంది. అని దాని అర్థము. గోత్రశైలశిఖరేషు అనే ఉపమేయములో సప్తమి కన్పడుతున్నది. కాబట్టి ఇక్కడకూడా సప్తమ్యంతము కంటె క్యచ్ ప్రత్యయము వచ్చింది. ఉపమాప్రతిపాదకములయిన ఇవాదులుకాని తుల్యాదిపదాలుకాని లేవు. అందువలన వాచకలోపము. సుఖసాధనత్వరూపమయిన సామాన్యధర్మము గమ్యమవుతున్నది. వాచ్యముగా లేదు. కేవలాచారమాత్రము ఉపమాప్రయోజకధర్మము కాదు. కాబట్టి ధర్మవాచకలుప్త. ఆధారక్యచ్గతముగా ఉన్నది.

౭ కర్మణముల్

పశ్యం త్యాత్మజదర్శ మిందు మమరస్రోతస్వినీం సత్సఖీ
దర్శం క్షీరపయోనిధిం ప్రియసుహృద్దర్శం గిరిం రాజతం
లీలాదర్పణదర్శ మన్యదమలం తారాది హారావళీ
దర్శం ఖేలతి వీరరుద్రనృపతేః కీర్తి ర్జగద్వ్యాపినీ.

వీరరుద్రనృపతియొక్క జగద్వ్యాపిని అయినకీర్తి చంద్రుని పుత్రునివలె చూస్తూ, వియద్గంగను చెలికత్తెవలె చూస్తూ, పాలసముద్రమును ప్రియస్నేహితునివలె చూస్తూ, ఇంకా స్వచ్ఛమయిన నక్షత్రాదికమును హారావళివలె చూస్తూ విహరించుతున్నది. దీనిలో చంద్రాదులు ఉపమేయము. ఆత్మజాదులు ఉపమానము 'ఆత్మజదర్శం పశ్యంతీ' అనేచోట "ఉపమానే కర్మణిచ" అనే పాణిని సూత్రముప్రకారము ణముల్ ప్రత్యయము వచ్చింది. ఉప

మానవాచకమైన 'ఆత్మజం' అనే కర్మ ఉపపదముగా ఉండగా 'దృశి' ధాతువునకు ణముల్ ప్రత్యయము వచ్చి నందువలన మళ్లా దృశిధాతువే అనుప్రయుక్తమయింది. ఆత్మజకర్మకముగా ఉన్న దర్శనక్రియ ఇందుకర్మకమయిన దర్శనక్రియా రెండూ ఉపమానోపమేయభావము పొంది ఉన్నవి. ఇంతకూ ఇక్కడ ఉపమాప్రతిపాదకములయిన ఇవాదులకు ప్రయోగము లేదు. నైర్మల్యరూపమయిన సాధర్మ్యము ఉపమాప్రయోజకమయిన ధర్మము. అదిన్నీ ఉపాత్తముకాలేదు. ణముల్ ప్రత్యయము ఉపమాప్రతిపాదకము కాదు. అది భావరూపార్థములో విహితమయింది కాబట్టి కేవలమూ భావార్థకమే అవుతుంది. కేవలమూ అటువంటి అర్థము సమానధర్మము కావడానికి వీలులేదని ఇదివరలో నిరూపితము.

౯ కర్తృణముల్

నృపేషు శిక్షావిధిదండచారం కాంతాసు పుష్పాయుధధన్వచారం
ప్రజాసు చాలంబనయష్టిచారం చరత్యయం రుద్రనరేంద్రఖడ్గః.

రుద్రనరేంద్రునిఖడ్గము రాజులలో శిక్షావిధిదండమువలె సంచరిస్తున్నది. కాంతలలో మన్మథధనుస్సువలె సంచరిస్తున్నది. ప్రజలలో ఆలంబనయష్టివలె సంచరించుతున్నది. దీనిలో దండధనుర్యష్టులు ఉపమానములు. ఖడ్గము ఉపమేయము. 'దండచారం చరతి' మొదలయిన పదాలలో ణముల్ ప్రత్యయము ఉన్నది. ఉపమానవాచకమయిన కర్త ఉపపదముగా ఉండగా ధాతువునకు ణముల్ ప్రత్యయము వస్తుందని 'ఉపమానే కర్మణిచ' అనే సూత్రములోని చకారమువలన గోచరమయిన అర్థము. ఉపమాప్రతి పాదకము

లయిన ఇవాదులు ప్రయుక్తములు కాలేదు. ఉపమాప్రయోజకమయిన భీషణోద్దీపనవిశ్రామభూమిత్వము లనే సమాన ధర్మములున్నా ఉపాత్తములు కాలేదు. కనుక వాచక ధర్మలుప్త.

౧౦ క్విప్

సుధాప్రవాహతి సతా మసతాం కాలకూటతి
వీరరుద్రనరేంద్రస్య **గుణజ్యోత్స్నావిజృంభితం**.

వీరరుద్రునియొక్క గుణజ్యోత్స్నవిజృంభణము సత్పురుషులకు సుధాప్రవాహమువలె ఆచరిస్తున్నది. అసత్పురుషులకు కాలకూటమువలె ఆచరిస్తున్నది. దీనిలో "సర్వప్రాతిపదికేభ్యః క్విప్ వా వక్తవ్యః" అనే వార్తికము చేత ఉపమానవాచకములయిన సుధాప్రవాహ కాలకూట ప్రాతిపదికలకంటె ఆచారార్థములో క్విప్ ప్రత్యయము వచ్చింది. గుణవిజృంభణము ఉపమేయము. సుధాప్రవాహము ఉపమానము. ఉపమావాచకమయిన ఇవాదికము లేదు. క్విప్ప్రత్యయము ఆచారార్థములో విధించబడించి కనుక ఉపమాప్రతిపాదకము కాదు. కేవలాచారము ఉపమాప్రయోజకధర్మము కాదు. కాబట్టి ధర్మలోపము నున్నా ఊహించాలి. అందువలననే ఇది ధర్మవాచకలుప్త.

ఈచెప్పిన మొదటి తొమ్మిదిఉదాహరణాలలో ప్రాచీనులు కొందరు ఆచారరూపమయిన సమానధర్మము ఉపాత్తమయ్యే ఉన్నదని అంకగీరిస్తూ కేవలవాచకలోపమును మాత్రమె నిరూపిస్తున్నారు. విద్యానాథుడు పూర్వము చెప్పినట్లుగా కేవలము ఆచారముమాత్రము సమానధర్మము కాదని వీనిని ద్విలుప్తలనుగా ఉదాహరిస్తున్నాడు.

౧౧ ధర్మవాచకోపమేయలుప్తః క్యచ్గత

జ్యోత్స్నాయంతి సుధీయంతి చందనీయంతి సర్వతః
ప్రతాపరుద్రనృపతేః శుభ్రాః కీర్తేర్మహోర్మయః.

ప్రతాపరుద్రుని శుభ్రములయిన కీర్తితరంగాలు అంతటా, తమస్వరూపమును వెన్నెలవలె చేసికొంటున్నవి. అమృతమువలె చేసికొంటున్నవి. చందనమువలె చేసికొంటునవి. దీనిలో జ్యోత్స్నయంతిమొదలయిన పదాలలో జ్యోత్స్నామివ ఆత్మానం ఆచరంతి జ్యోత్స్యయంతి అని అర్థమును నిశ్చయించినపుడు ద్వితీయాంతముగాఉన్న (ఆత్మానం) కీర్తిస్వరూపమునకు ఉపమేయమునకు ఉపాదానము లేదు. ఉపమావాచకముమయిన ఇవాదికము లేదు. నైర్మల్యాదిసాధర్మ్యమున్నూ ఉపాత్తము కాలేదని స్పష్టగోచర మవుతున్నది. కాబట్టి ఇది త్రిలుప్త. కీర్తిమహోర్మయః అనేది ఉపమేయము కాదు. ఉపమానోపమేయములు సమానవిభక్తి కలిగిఉండాలి. ఉపమానముకంటె ఇది భిన్న విభక్తికముగా ఉన్నందువలన ఉపమేయమనరాదు. మహోర్మయః అనేది ప్రథమాంతముగా ఉందికాబట్టి దీన్ని అనుసరించి జ్యోత్స్నయంతి అనేచోట 'జ్యోత్స్నాఇవ ఆచరంతి' అని ప్రథమాంతముగానె చెప్పి సమానవిభక్తికత్వమును కల్పించుకొని ఉపపత్తిని సంపాదించరాదా ? అని అనడము వ్యాకరణశాస్త్రవిరుద్ధము.

౧౨ ధర్మవాచకలుప్త కర్తృ క్యఙ్గత

శేషాయతే మహీం వోఢుం కల్పశాఖాయతేర్థినాం
ప్రతాపరుద్రదోర్దండః కాలదండాయతే ద్విషాం.

ప్రతాపరుద్రునిభుజదండము భూమిని వహించడానికి

'శేషునివలె ఆచరించుచున్నది. శత్రువులకు కాలదండమువలె ఆచరించుచున్నది. దీనిలో శేషాయతే కల్పశాఖాయతే కాల దండాయతే' అనేచోట "కర్తుః క్యజ్ సలోపశ్చ" అనే సూత్రమువలన వచ్చిన క్యజ్ ప్రత్యయము ఉన్నది. భుజదండము ఉపమేయము. కల్పశాఖ ఉపమానము. ఉపమావాచకము లేదు. వదాన్యత్వము కోరికలు పూరించడమనే సమానధర్మమున్నూ ఉపాత్తము కాలేదు. అందువలన ధర్మవాచకలుప్త. శేషాయతే మహీం వోఢుం అనేవి ప్రకృతోదాహరణం కాదు. మహీవహనరూపమయిన సమాన ధర్మము ఉపాత్తమయినందువలన ధర్మలుప్తత రాదు. 'శేషాయతే అనేది వాచకలుప్తకు ఉదాహరణం కావచ్చు.

౧౩ సమాసగత ధర్మవాచకలుప్త

దీనికి మూలములో విద్యానాథుడు ఉదాహరణము ప్రదర్శించలేదు. పురుషవ్యాఘ్రః అనేది ప్రకృతోదాహరణ మవుతుంది. "పురుషో వ్యాఘ్ర ఇవ పురుషవ్యాఘ్రః" అని విగ్రహము. సామాన్యధర్మప్రయోగము ఉంటె ఈపదములు ఈవిధముగా సమసించవు. "ఉపమితం వ్యాఘ్రాదిభిః సామాన్యాప్రయోగే" అని అనుశాసనము. సామాన్యధర్మ ప్రయోగము లేనపుడే సమాస మన్నమాట. కనుక ఈస్థలంలో ధర్మలోపము ఉన్నది. ఉపమావాచకములయిన ఇవాదులకు ప్రయోగము లేదు. ఇది ధర్మవాచకలుప్తకు ఉదాహరణము.

౧౪ ఉపమానలుప్త వాక్యగత

వదాన్యో నాన్యోస్తి త్రిజగతి సమో రుద్రనృపతేః
గుణశ్రేణీశ్లాఘాపిహితహరిదీశానయశసః

సమంతాదుద్భూతై ర్ద్విరదమదగంధై స్సురభయః
క్రియంతే యద్విద్వజ్జనమణిగృహప్రాంగణభువః.

ఇది గతార్థము. దీనిలో రుద్రనృపతి ఉపమేయము. సమః అనేది ఉపమావాచకము. వదాన్యత్వము సమాన ధర్మము. ఈమూడింటికీ ప్రయోగము ఉన్నది. సము డయిన వాడు లేడు అనడమువలన ఉపమానము ఉపాత్తము కాలేదు. అందువలన ఉపమానలుప్త. వ్యస్తవ్యస్తముగా ఉన్నందువలన వాక్యగతత్వము స్పష్టము.

౧౫ ఉపమానలుప్త సమాసగత

వీరరుద్రసమో రాజా నాస్తి నాస్త్యేవ భూతలే
యస్య ధర్మానుబంధేన కలిః కృతయుగీకృతః.

వీరరుద్రసమానుడయిన రాజు భూతలములో లేడు. లేనేలేడు. ఆవీరరుద్రుని ధర్మానుబంధముచేత కలియుగము కృతయుగముగా చేయబడింది. దీనిలో వీరరుద్రసమః అని సమస్తముగా ఉన్నందువలన ఉపమ సమాసగత. వీరరుద్రుడు ఉపమేయము. సమః అనేది ఉపమావాచకము. రంజనము చేయడమువలన రాజు అనుట సమానధర్మము. నాస్తినాస్త్యేవ అనడమువలన ఉపమానలుప్త.

౧౬ ధర్మోపమానలుప్త వాక్యగత

లోకే కాకతివీరరుద్రనృపతే రుద్దామభూమశ్రియః
కీర్త్యా కార్తికకౌముదీధవళయా తుల్యం న కించిత్ క్వచిత్
యన్మాధుర్యవిజృంభితక్షతవిషాం గ్రీవాం విలోక్యాధునా
కంఠాలింగన మీశితు ర్వితనుతే నీరంధ్ర మద్రేస్సుతా.

లోకములో అతిశయితమహాశోభగల కాకతీశ్వరుని కార్తికమాసములోని వెన్నెలవలె ధవళమయిన కీర్తితో

సమానమయినది ఏదీ ఎక్కడా లేదు. పార్వతీదేవి కాకతీశ్వరుని కీర్తి మాధుర్యము చేత విషముపోయిన ఈశ్వరుని కంఠసీమను ఇప్పుడు చూచి నిశ్శంకముగా గాఢముగా కంఠాలింగనము చేసికొంటున్నది. పూర్వార్థము ప్రకృతలక్ష్యము. అక్కడ ఉప మానధర్మముల లోపము సుగ్రహమే. ఉత్తరార్థములో సాధర్మ్యము ఉన్నా అది వాక్యాంతరగతము కాబట్టి అను పాత్తప్రాయమె.

౧౭ సమాసగత ధర్మోపమానలుప్త

ప్రతాపశ్రీతుల్యం క్వచిదపి నభూతం నచభవ-
న భావి త్రైలోక్యే కిమపి జయినః కాకతివిభోః
యథా లోకాలోకక్షితిధరతటే ష్వర్కదృషదః
ప్రకాశంతే నక్తందివ ముదితరోచిఃపరిచయాః.

జయశీలుడయిన కాకతీశ్వరుని ప్రతాపశ్రీతుల్యమైనది మూడులోకాలలో ఎక్కడా ఏదీకూడా ఇదివరలో లేదు. ఇప్పుడూ లేదు. ఇకముందూ ఉండబోదు. ఏమంటే; లోకా లోకపర్వతతటాలలో సూర్యకాంతమణులు రాత్రింబవళ్లు సముత్పన్న కాంతిపరిచయం కలవై ప్రకాశిస్తున్నవి. దేశకాల పరిచ్ఛేదం లేక ప్రతాపరుద్రుని ప్రతాపశ్రీ విహరిస్తున్నదని భావము. దీనిలో 'ప్రతాపశ్రీతుల్యం' అనేచోట ఉపమేయము వాచకమూ రెండూఉన్నవి. ఉపమానము లేదు. సమాన ధర్మము లేదు. ప్రతాపశ్రీతుల్యం అని సమస్తముగా ఉన్నందు వలన సమాసగతధర్మోపమానలుప్త అని గ్రహించాలి.

ఇప్పటి ఈనాలుగు ఉదాహరణాలలో ఒకచిన్న విశే షము ఉన్నది. మొదటి రెండుఉదాహరణాలలో "వదాన్యో నాన్యోఽస్తి, వీరరుద్రసమో రాజా" అనేచోట వదాన్య-

రాజశబ్దాలచేత వితరణశీలత్వము ప్రజారంజకత్వము అనే సాధర్మ్యము నిరూపిత మవుతున్నది. తరువాతి రెండు ఉదాహరణాలలో ధర్మముకూడా లేదు. అందువలన ధర్మోపమానములకు రెండిటికీ లోపమును ఊహించాలి. మొత్తం మీాద ఈనాలుగు ఉదాహరణాలలో ప్రతీపాలంకారము ఉన్నదని శంకించరాదు. "రుద్రనృపతే స్సమః వీరరుద్రసమః కీర్త్యా తుల్యం, ప్రతాపశ్రీతుల్యం" ఈనాలుగు పదాలున్నూ సామాన్యంగా ప్రతీపాలంకారమేమో అనేశంకను కలుగచేస్తున్నవి. సాధారణంగా ఉపమావాచకమయిన పదము ఉపమానముతో సంబంధించి ఉండడము ప్రసిద్ధము. ఉపమావాచకము ఉపమేయముతో సంబంధించిఉన్నట్లయితే ఉపమేయనిరూపితసాదృశ్యము ప్రతిపాదితమవుతుంది. ఉపమావాచకము ఉపమానముతో సంబంధించిఉన్నపుడు ఉపమాననిరూపితసాదృశ్యము ప్రతిపాదితమవుతుంది. చంద్రనిరూపితసాదృశ్యాశ్రయము ముఖము; ముఖనిరూపితసాదృశ్యాశ్రయము చంద్రుడు; అనే రెండు స్థలాలలో ప్రతీతిభేదము స్పష్టము. ప్రకృతచతుష్కములో ఉపమేయనిరూపితసాదృశ్యమే ప్రతిపాదితము అవుతున్నందువలన ఉపమాలంకారము కాదేమో అనిపిస్తుంది. ప్రతీపాలంకారములో అంతటా ఉపమేయనిరూపితసాదృశ్యప్రతిపాదనమె ఉంటుంది. ఇక్కడకూడా రుద్రనృపతినిరూపిత సామ్యాశ్రయము కీర్తినిరూపితతౌల్యాశ్రయము వీరరుద్రనిరూపితసామ్యాశ్రయము ప్రతాప శ్రీనిరూపితతౌల్యాశ్రయము అనే అర్థప్రతీతి ఉన్నందువలన ప్రతీపాలంకారమె కావచ్చుకదా! అనేశంక ఒకపుడు కలుగవచ్చును. కాని అది యుక్తముకాదు. ప్రతీపాలంకారస్వరూపము అంతా ఇక్కడ ప్రసక్తముకాలేదు.

ప్రతీపాలంకారములో ఉపమానాక్షేపము ఉండాలి. ఉపమేయమునకు ఆధిక్యమునున్నూ వివక్షించాలి. ఉపమేయమునకు ఆధిక్యమును చెప్పదలచి ఉపమానత్వమును నిరూపించినప్పుడే ప్రతీపాలంకారము అవుతుందని అనుశాసనము. ప్రకృతస్థలములో ఉపమానానికి ఆక్షేపము లేదు. ఉపమానము లేదు అని చెప్పడములోనే కవితాత్పర్యముకాని ఉపమానమును నిరసించడములో కవితాత్పర్యము లేదు. ఉపమేయానికి ముఖ్యంగా ఆధిక్యమును వివక్షించడమున్నూ లేదు. ఇక ప్రతీపాలంకారము ఎట్లా అవుతుంది? ఉపమేయమే ఉంటూ ఉంటే ఉపమానము దేనికి? అనే అభిప్రాయము వీటిలో రాదు. అందువలన ప్రతీపాలంకారమునకు ఇక్కడ అను ప్రవేశము లేదు. కనుకనే ప్రతీపాలంకారముతో సాంకర్యము ఉన్నదేమో! అనే శంకాకలంకావకాశముకూడా లేదు.

౧౮ సమాసగత వాచకలుప్త

అసతా ముష్ణభానూష్ణం సతాం శీతాంశుశీతలం
ప్రతాపరుద్రదేవస్య చరితం విశ్వమంగళం.

ప్రతాపరుద్రదేవుని విశ్వమంగళమయిన చరితము అసత్పురుషులకు సూర్యునివలె వేడిగా ఉన్నది. సత్పురుషులకు చంద్రునివలె శీతలముగా ఉన్నది. దీనిలో "ఉష్ణభానూష్ణం, శీతాంశుశీతలం" అనేస్థలములలో ఉష్ణభానుశీతాంశురూపమయిన ఉపమానము, ఉష్ణశీతలలక్షణమయిన సమానధర్మము, చరితం అనే ఉపమేయము మూడూ ఉన్నవి. ఉపమావాచకము లేదు. సమాసములో అది లోపించింది. సమన్వయము సులభమె.

౧౯ సమాసగత ధర్మోపమాన వాచకలుప్త

కాకతీంద్రో రణే భాతి భీమసేనపరాక్రమః
కిం త్వదుశ్శాసనా స్సర్వే తస్య ప్రత్యర్థిపార్థివాః.

కాకతీంద్రుడు యుద్ధములో భీమునియొక్క పరాక్రమమువంటి పరాక్రమముకలవాడై భాసించుచున్నాడు. కాని శత్రురాజులు అందరూ అదుశ్శాసనులు. భీమసేనప్రత్యర్థులు దుశ్శాసనునితో కూడి ఉన్నారు. సిరసుప్రవైరులు దుశ్శాసనరహితులు అని సామాన్యంగా అర్థము. దుష్కరమయిన శాసనముకలవారు దుశ్శాసనులు. అటువంటివారు కాకపోతే అదుశ్శాసనులు. కాకతీంద్రప్రత్యర్థిపార్థివులు అదుశ్శాసనులై ఉన్నారంటే దుష్కరశాసనరహితులై ఉన్నారని భావము. దీనిలో భీమసేనపరాక్రమః అనేచోట భీమసేనుని పరాక్రమమువంటి పరాక్రమము ఎవరికి కలదో ఆతడు భీమసేనపరాక్రముడు అనే అర్థము వస్తున్నది కాబట్టి ధర్మోపమానవాచకలుప్త. భీమసేనపరాక్రమము ఉపమానము. ప్రతాపరుద్రపరాక్రమము ఉపమేయము. దుస్సహత్వము సమానధర్మము. ఇవాదికము వాచకము. "భీమసేనపరాక్రమః" అనే సమస్తపదానికి "భీమసేనస్య పరాక్రమఇవ పరాక్రమో యస్య సః భీమసేనపరాక్రమః" అని విగ్రహవాక్యము. సమస్తపదములో ఉపమేయపరాక్రమమె నిరూపితమయింది కాని ఉపమానపరాక్రమము నిరూపితము కాలేదు. వాచకము సమానధర్మమున్నూ లేవు. అందువలన త్రిలుప్త.

ఇక్కడ ఈవిశేషమును గుర్తించాలి. భీమసేనపరాక్రమః అన్నప్పుడు భీమసేనపదమును భీమసేనపరాక్రమమునకు లక్షకముగా అంగీకరించితే "భీమసేనఇవ (అంటే-భీమసేన

పరాక్రమఇవ)పరాక్రమః యస్యసః భీమసేనపరాక్రమః"అని సమాసము చేయగా, భీమసేనపదమె ఉపమానప్రతిపాదక మవుతుంది. కాబట్టి ఉపమానము ఉన్నందువలన ఇది త్రిలుప్తకు ఉదాహరణము కాదు. భీమసేనుని పరాక్రమమువంటి పరాక్రమముకలవాడు అనే అర్థమును వివక్షించినప్పుడే ఇది త్రిలుప్తోదాహరణము. "సప్తమ్యుపమానపూర్వపదస్య బహువ్రీహి రుత్తరపదలోపశ్చ" అనే వార్తికము చేత "భీమసేనపరాక్రమః" అనేదానికిపరాక్రమపదముతో బహువ్రీహిసమాసము వస్తే ఉపమానమును చెప్పే "భీమసేనపరాక్రమ" అనే పూర్వపదములో ఉత్తరపదముగా ఉన్న పరాక్రమపదానికి లోపము వస్తుంది. అప్పుడు "భీమసేన" అనే ఉంటుంది. ఉపమేయభూతమయిన పరాక్రమమె ఉపాత్తమై ఉంటుంది. ధర్మవాచకాలూ లేనందున అప్పుడే ఇది త్రిలుప్త. ఇప్పటికి పందొమ్మిదిలుప్తోపమలూ ప్రదర్శితములయినవి. ఇవన్నీ చమత్కారకములు కావు. వ్యాకరణశాస్త్రవ్యుత్పత్తికౌశలమును ప్రదర్శించడానికి పనికివస్తవేకాని అలంకారశాస్త్రంలో ఆస్టే వ్యుత్పాదములు కావు.

సాధర్మ్య విశేషము

సాధారణధర్మమును నిరూపించడములో సర్వభేదసాధారణములయిన కొన్నివిశేషాలు ఉన్నవి. వానిని ఇపుడు చెప్పడము సముచితము. సాధారణధర్మమును స్వీకరించడములో ద్వైవిధ్యముఉన్నది. ధర్మము ఉపమానోపమేయములలో అనుగతముగా ఉండేటట్లు రెండిటిలోనూ ఒకే పర్యాయము ప్రసరించేదిగా ఉండేటట్లు ఒకమారు నిర్దేశించడము ఒకపద్ధతి. రెండిటిని పొందిఉండేవిధంగా వేరువేరుగా

సమానధర్మమును నిర్దేశించడము. రెండవపద్ధతి వేరువేరుగా నిర్దేశించడమునే పృథగుపాదానము అంటారు. ఈపృథగుపాదానముకూడా వస్తుప్రతివస్తుభావవిధాన నిర్దేశించడము బింబప్రతిబింబభావవిధముగా నిర్దేశించడమూ అని రెండు విధాలు. ఒకేఅర్థమును వేరువేరుశబ్దాలతో చెప్పడమును వస్తుప్రతివస్తుభావము అంటారు. సాదృశ్యము కలిగిఉన్న రెండుధర్మాలను వేరువేరుగా భిన్నభిన్నశబ్దములతో నిరూపించడమును బింబప్రతిబింబభావము అని అంటారు. ఈవిశేషముకల ఉదాహరణములను ఇట్లా గ్రహించాలి.

సకృన్నిర్దేశము

నృపాః ప్రణతమూర్ధానః సేవంతే కాకతీశ్వరం
అసాధూనాం వినేతారం గురుం శిష్యాఇవాభితః.

ప్రణతశిరస్కులయిన రాజులు అసాధుశిక్షకుడయిన గురువును అంతటా శిష్యులువలె కాకతీశ్వరుని సేవించుతున్నారు. దీనిలో రాజులకూ శిష్యులకూ 'ప్రణతమూర్ధానః' అనే సమానధర్మము ఒకేసారి నిర్దిష్టమైంది. అసాధూనాం వినేతారం అని రాజునకు గురువునకున్నూ తుల్యధర్మత్వము ఒకేసారి చెప్పబడింది. రాజు అసాధు శిక్షకుడు. గురువూ అసాధు శిక్షకుడు. శిష్యులు ప్రణత శిరస్కులు. సామంత రాజులున్నూ ప్రణతశిరస్కులె. సమానధర్మములుగా నిర్దేశింపబడిన ఇవి ఆయా ఉపమానోపమేయాలలో అనుగతములై సమన్వయము పొందుతున్నవి. కాబట్టి ధర్మానికి సకృన్నిర్దేశమును అభ్యూహించాలి.

వస్తుప్రతివస్తుభావము

వస్తుప్రతివస్తుభావముతో రెండువిధాలుగా; ధర్మము

ఉపమానగతముగానూ ఉపమేయగతముగానూ ఉండేటట్లు నిర్దేశించడమునకు ఉదాహరణమును ఇట్లా గ్రహించాలి.

వంశోయం కాకతీయానాం వీరరుద్రేణ భూషితః
అన్వవాయః కకుత్థ్సానాం రామేణేవ పరిష్కృతః.

కాకతీయుల ఈవంశము కకుత్థ్సుల అన్వవాయము (వంశము) రామునిచే పరిష్కృతమయినట్లుగా వీరరుద్రునిచే భూషితమయింది. దీనిలో భూషితపరిష్కృతశబ్దాలు వేరు వేరుగా ఉన్నప్పటికిన్నీ 'అలంకృతము' అనే ఒకేఅర్థము వాని వలన ప్రతీతమవుతున్నది. ఏకార్థమే సంబంధిభేదముతో నిరూపితమయింది. ఈవిధంగా భూషితపరిష్కృతశబ్దాలచేత సమానధర్మకథనము ఉన్నందువలన ఇది వస్తుప్రతివస్తుభావ మవుతుంది.

బింబప్రతిబింబభావము

స్ఫురత్ శ్వేతాతపత్రశ్రీః కాకతీయనరేశ్వరః
హాటకాద్రిరివాభాతి శృంగసంగీందుమండలః.

ప్రకాశించుతున్న శ్వేతాతపత్రశోభకల కాకతీయ నరేశ్వరుడు, శిఖరములందుకూడుకొన్న చంద్రుమండలముకల మేరుపర్వతమువలె ఆభాసించుతున్నాడు. దీనిలో బింబప్రతి బింబభావము ఉన్నది. కాకతీంద్రమేరుపర్వతములకు స్వరూ పానుసారముగా సాదృశ్యము లేదు. ప్రధానములయిన ఉప మానోపమేయాలకు స్వరూపసాదృశ్యము కుదరకపోతే వాని వాని విశేషణాలకు ఉన్న సాదృశ్యాలనుబట్టి సాదృశ్యనిర్ణయం చేయాలి. కాగా ఇటువంటి స్థలాలలో విశేష్యసాదృశ్యము విశేషణసాదృశ్యాధీనముగా ఉంటుంది. ఈపద్యములో ఉప మేయమయిన కాకతీశ్వరునకు స్ఫురచ్ఛ్వేతాతపత్రశ్రీకత్వము

విశేషణముగా ఉన్నది. మేరుపర్వతానికి శృంగసంగేందు మండలత్వము విశేషణముగా ఉంది. ఈరెండూ ఉపమేయో పమానధర్మాలు. ఈరెండిటికీ ధావళ్యయోగిత్వము అనే సాదృశ్యమువలన అభిన్నత్వము భాసిస్తుంది. పరస్పరసాదృశ్యమువలన అభిన్నముగా భాసించిన ఇవి "స్ఫురచ్ఛ్వేతాతపత్రశ్రీః, శృంగసంగేందుమండలః" అని వేరువేరుగా ఉపాత్తములయినవి. శ్వేతాతపత్రము బింబము. ఇందుమండలము ప్రతిబింబము. ఈధర్మాలు ఈచెప్పినవిధంగా ఇక్కడ నిరూపితములు కావడము, శ్వేతాతపత్రచంద్రమండలములకు కల సాదృశ్యముచేత కాకతీంద్రసువర్ణాచలములకు సాదృశ్యము కలగడమూ ఇక్కడ ఉన్నది. కాబట్టి బింబప్రతిబింబభావమని గ్రహించాలి.

ఉపమా విశేషములు

ఈ ఉపమాలంకారానికి వేరొకవిధముగా కూడా భేదాలు సిద్ధములవుతున్నవి. సమస్తవస్తువిషయమయిన ఉపమ అని, ఏకదేశవర్తిని అయిన ఉపమ అని, మాలారూపముగా ఉన్న ఉపమ అని, ఈమూడుభేదాలూ ఇక్కడ నిర్దిష్టములవుతవి. సమస్తములయిన వస్తువులు అంటే; అవయవములు అవయవిన్ని ఏఉపమలో విషయములుగా ఉంటున్నవో ఆఉపమ సమస్తవస్తువిషయ అవుతుంది. కేవలమూ ఒక్క అవయవికి ఉపమాననిర్దేశము ఉండడముకాక అవయవాలకున్నూ ఉపమానములు నిర్దిష్టములయినప్పుడు సర్వవస్తువులూ ఔపమ్యభూషితములై ఉంటవికాబట్టి అటువంటిది సమస్త వస్తువిషయ అవుతుంది. అవయవము అవయవి అనే ఈరెండిటిలో ఏదయినా ఒకదానికే ఉపమాననిర్దేశముతో

సాదృశ్యకథనము ఉన్నప్పుడు ఉపమ ఏకదేశవర్తిని అవుతుంది. అవయవ్యవయవములకన్నిటికీ ఉపమాననిర్దేశము ఇక్కడ ఉండదు. కేవలమూ అవయవాలకయినా ఉపమాననిర్దేశము ఉంటుంది. కేవలమూ అవయవికిఅయినా ఉపమాననిర్దేశము ఉంటుంది. ఒకదానికి ఉండి రెండవదానికి లేకపోయినా రెండవదానికి ఉపమానము అర్థసామర్థ్యబలాన ప్రతీతమవుతుంది. ఇటువంటిది ఏకదేశవర్తి అని భావము. ఒకే ఉపమేయానికి అనేకోపమానములు నిరూపితములయినప్పుడు మాలారూపమయిన ఉపమ. ఇక్కడ కూర్పబడిన ఉపమానాలు వేరువేరుగా ఉన్నప్పటికీ ఉపమేయము ఒకటే కావడమువలన నానోపమాచమత్కారము ఇక్కడ భాసిస్తుంది. ఇటువంటిది మాలోపమ అని భావము. వీనిని ఈవిధముగా ఉదాహరణాలలో గ్రహించాలి.

సమస్తవస్తువిషయ

విభాతి భూ ర్ద్యౌరివ కాకతీంద్రపురీ విరాజ త్యమరావతీవ
పౌరాః ప్రథంతే త్రిదశా ఇవర్ద్ధిం ధత్తే మరుత్వానివ వీరరుద్రః.

భూమి స్వర్గమువలె ప్రకాశిస్తున్నది. కాకతీంద్ర పట్టణము అమరావతివలె విరాజిల్లుతున్నది. పౌరులు దేవతలవలె ప్రసిద్ధి పొందుతున్నారు. వీరరుద్రుడు ఇంద్రునివలె సమృద్ధి వహించుతున్నాడు. దీనిలో వీరరుద్రుడు అవయవి. భూపురీ పౌరులు అవయవములు. అన్నింటిలోనూ ఉపమానము ఉన్నది. అందువలన సమస్తవస్తువిషయ. దీనిలో ఇవి ప్రత్యేకముగా నాలుగు ఉపమలు అవుతవని అనుకోరాదు. వీనిలో వీనికి పరస్పరమూ సంబంధము ఉండడముచేత ఇదంతా ఒకటే ఉపమగా సహృదయులకు అవభాసిస్తున్నది. భూపురీ

పౌరులకు ప్రత్యేకప్రత్యేకంగా ఉపమను నిర్దేశించకపోయినప్పటికీ విశిష్టముగా ముఖ్యవిశేష్యమునకు సంబంధించిన ఉపమాననిర్దేశమువలననే విశేషణాలకుకూడా ఔపమ్యం గోచరం కావచ్చు. ఆవిధముగా అయితే దానిని విశిష్టోపమ అంటారు. అక్కడ అఖండమయిన ఒకేచమత్కారము ఉదయించుతుంది. ఈస్థలములో అఖండచమత్కారముతోబాటు ఖండరూపములయిన చమత్కారములున్నూ భాసించుతవి. అవయవగతోపమలుకూడా ఇక్కడ స్పష్టవాచ్యములుగా ఉన్నందువలన సమస్తవస్తువిషయ ఉపమ అనడమె స్వారసికముగా ఉంటుంది. విశిష్టోపమలో విశేషణోపమ వ్యంగముగా ఉంటుంది. ఇక్కడ వాచ్యముగా ఉంటుంది. ఇదీవిశేషము.

ఏకదేశవివర్తిని

ద్విపైశ్చరద్భి ర్ధరణీధరైర్వా తురంగమశ్రేణిభి రూర్మిభిర్వా
నానాయుధై ర్వ్యాళజలగ్రహైర్వా బలం త్రిలింగాధిపతే ర్దురాపం.

త్రిలింగదేశాధీశ్వరుడయిన ప్రతాపరుద్రుని సేన మైనాకాదిపర్వతాలవలె ఉన్న సంచరించే ఏనుగులచేత తరంగాలవలె ఉన్న తురంగమపంక్తులచేతా పాములు మొసళ్లువలెఉన్న నానావిధాయుధములచేతా పొందశక్యము కాకుండా ఉన్నది. దీనిలో త్రిలింగాధిపతిబలము అవయవి. దానికి ఉపమానము పద్యములో స్పష్టనిర్దిష్టము కాలేదు. ద్విపతురంగాయుధములు అవయవములు. వానికిపర్వతతురంగవ్యాళాదులు ఉపమానములుగా నిర్దిష్టములయినవి. త్రిలింగాధిపతిబలము సముద్రమువలె ఉన్నది అనే అర్థము అర్థసౌందర్యబలము వలన ప్రతీత మవుతున్నదేకాని వాచ్యముగాలేదు. కేవలము

అవయవగతముగానే ఉపమానము ఉన్నందువలన ఇది ఏకదేశవర్తిని ఉపమ.

మాలోపమ

కుందతి కుముదతి హంసతి హారతి హరతి క్షపాకరతి
కైలాసతి చ యశఃశ్రీవైశద్యం వీరరుద్రస్య.

వీరరుద్రుని యశఃశ్రీవైశద్యము కుందపుష్పమువలె ఆచరిస్తున్నది. కుముదమువలె హంసవలె హారమువలె హరుని వలె చంద్రునివలె కైలాసమువలె ఆచరించుతున్నది. దీనిలో క్విప్ ప్రత్యయగతముగా అనేకోపమలు ఉన్నవి. అందువలన ఉపమాలంకారము. మాలారూపముగా ఉన్నట్లు కుందకుముదాద్యనేకోపమానములున్నా యశఃశ్రీవైశద్యరూపమయిన ఉపమేయము ఒక్కటే. ఒకేఉపమేయానికి అనేకోపమానములు ఉన్నందువలన ఇది మాలోపమ అవుతుంది.

సాధర్మ్యము మూడువిధాలు. భేదప్రధానము, అభేద ప్రధానము, భేదాభేదప్రధానమూ, అని. వ్యతిరేకము మొదలయిన అలంకారాలలో భేదప్రధానకమయిన సాధర్మ్యము ఉంటుంది. రూపకాద్యలంకారములలో అభేదప్రధానసాధర్మ్యము ఉంటుంది. భేదాభేదసాధారణమయిన సాధర్మ్యము ఉపమాలంకారములో ప్రయోజకముగా ఉంటుంది. ఆయా అలంకారాలకు అటువంటి సాధారణధర్మాలు ఆవశ్యకములన్నమాట. ఈచెప్పిన భేదాలే కాక ఉపమాలంకారములో ఇంకా చాలా భేదాలు ఉన్నవి. ప్రాచీనసాహిత్యకారులు రశనోపమ మొదలయిన భేదాలను చాలా పరిగణించారు. వాటినన్నిటినీ యథాసంభవముగా గ్రహించాలి.

౨ అనన్వయము

భేదాభేద సాధారణ మయిన సాధర్మ్యము మూలముగా కలిగిన అలంకారాలలో అనన్వయముకూడా చేరుతుంది. అందువలన ఉపమ తరువాత అనన్వయమును నిరూపించడము సముచితము. అనన్వయములో ఉపమేయోపమలోనూ వస్తువు ప్రతీయమాన మవుతూ ఉంటుంది. ప్రతీయమానవస్తుకము లయిన ఈ రెండింటిలో అనన్వయము ఒకే వాక్యమును ఆశ్రయించి ఉంటుంది. కాబట్టి దీనినిముందుగా చెప్పడము యుక్తము.

ఏకస్యై వోపమానోపమేయత్వేఽనన్వయో మతః.

ఒకేపదార్థానికి ఉపమానత్వము ఉపమేయత్వము చెప్పితే అనన్వయము అవుతుంది. సాదృశ్య మనేది రెండు పదార్థములకు సంబంధించి ఉంటుంది. ముఖము చంద్రుడు అనేవి రెండూ భిన్నభిన్నపదార్థాలు. పదార్థములు ఇట్లా వేరుగా ఉన్నపుడే ఉపమానోపమేయభావము సంగత మవుతుంది. ముఖము చంద్రుడు రెండిటికీ సాదృశ్యము చెప్పితే ఒకదానిసాదృశ్యము వేరొకదానియందు ఉంటుంది కాబట్టి రెండువస్తువులకు సాదృశ్యకథనమె ఉపపన్నముగా ఉంటుంది. చంద్రసాదృశ్యము ముఖములో ఉన్నదన్నా, ముఖసాదృశ్యము చంద్రునిలో ఉన్నదన్నా ఉపమానోపమేయభావము ఉపపన్నముగా కనిపిస్తుంది. చంద్రసాదృశ్యము చంద్రునిలో ఉన్నది. ముఖసాదృశ్యము ముఖములో ఉన్నది. అని అన్నపుడు సాదృశ్యానికి అన్వయము సరిగా కుదరదు. వర్ణ్యమాన సాదృశ్యానికి అన్వయము సరిగా ఉండదుకాబట్టి ఈ అలంకారానికి అనన్వయ మన్న పేరు సార్థకముగా ఉంది. అన్వ

యము పొందనిసాదృశ్యమును వర్ణించడమువలన ఒక ప్రయోజనము ఉన్నది. వర్ణ్యమానసాదృశ్యము తాను అన్వయము పొందక ప్రకృతమునకు అనుపమత్వమును గోచరింప చేస్తుంది. ముఖము ముఖముతో సమానము అని చెప్పితే ముఖముతో పోల్చదగిన వస్తువు వేరొకటి ఏమీ లేదు అనే అర్థము వ్యంగ్యముగా భాసిస్తుంది. కాగా ఒకేపదార్థానికి ఉపమానోపమేయభావమును చెప్పడము ద్వితీయ సబ్రహ్మచారి నివృత్త్యర్థమన్నమాట. ఈ చెప్పిన అభిప్రాయాన్ని అవగాహనం చేసికొంటే ఒకవిధంగా ఇక్కడ ఉపమానోపమేయ భావముయొక్క కుదురుపాటును భావించవచ్చును. ఉపమేయముగా ఉన్నవస్తువుకు ఉపమానత్వము చెప్పడము ఈ అనన్వయములో ఉంటుంది. అంటే వాచ్యమర్యాదను అనుసరించి ఉపమేయముగా ఉన్నవస్తువునకు రెండో సదృశవస్తువు లేదు అనే వ్యంగ్యాభిప్రాయముతో ఉపమానత్వమును చెప్పితే అనన్వయము అని తేలుతుంది. ఈదృష్టిలో ఉపమానోపమేయభావము కుదరవచ్చు. వాచకరీతినే అనుసరించి చూస్తే ఏకవస్తుగతంగా ఉపమానోపమేయభావము కుదరదు కాబట్టి కుదరని అది ప్రకృతమునకు అనుపమత్వమును గోచరింప చేస్తుంది అని గ్రహించాలి. ఈభావమును లక్షణార్థములో గ్రహించాలి. ఉదా :—

సంతు లోకే సువర్ణాద్రిరత్నాకరసుధాకరాః
తథాపి వీరరుద్రోయం వీరరుద్ర ఇవ స్వయం.

లోకములో సువర్ణాద్రి రత్నాకర సుధాకరులు ఉండనీ! ఉపమానత్వము పొందడానికి అనర్హులయిన వారివలన ఏమి ప్రయోజనము ? అయినా ఈవీరరుద్రుడు స్వయంగా వీరరు

ద్రునివలె ఉన్నాడు. దీనిలో వీరరుద్రనిరూపిత మయిన సాదృశ్యమునకు వీరరుద్రుడే ఆశ్రయముగా చెప్పబడు తున్నాడు. ప్రకృతమై ఉపమేయముగా ఉన్న వీరరుద్రునకే ఉప మానత్వము నిరూపిత మయింది. అందువలన వీరరుద్రునితో సమానుడు ఎవడూ లేడు, వీరరుద్రుడు అనుపముడు, అని గోచర మవుతున్నది.

3 ఉపమేయోపమ

ఈఉపమేయోపమాలంకారము అనన్వయముకంటె విలక్షణము. ఇది ఏకవాక్యమునందు ఉండడము కాక వాక్య భేదమును ఆశ్రయించి ఉంటుంది. ఉపమేయముతో ఉపమ కాబట్టి ఉపమేయోపమ. ఉపమ అనగానే ప్రసిద్ధినిబట్టి ఉప మానముతో ఉపమేయమునకు సాదృశ్యమును నిరూపించుట అనే అర్థము వస్తుంది. దీనిలో అది ఉండడమె కాక ఉప మేయముతో ఉపమానమునకు సాదృశ్యమును చెప్పడము కూడా ఉంటుంది. కాబట్టి ఉపమేయోపమ అనే పేరు సంగ తంగా ఉంది. దీనిలక్షణము—

పర్యాయేణ ద్వయో స్తస్మి న్నుపమేయోపమా మతా

ఉపమానముగా ఉపమేయముగా ప్రసిద్ధము లయిన రెండుపదార్థములకు ఉపమానోపమేయత్వమును పర్యా యముగా చెప్పితే ఉపమేయోపమ అవుతుంది. అని లక్షణార్థము. ఉపమాలంకారములో మాదిరిగా ఉపమాన ముతో ఉపమేయానికి సాదృశ్యమును ఒకమారుచెప్పి ప్రతీపా లంకారములోమాదిరిగా ఉపమేయముతో ఉపమానమునకు సాదృశ్యమును చెప్పితే మొత్తంమీద ఉపమానోపమేయ భావమును పర్యాయముగా చెప్పినట్లవుతుంది. అటూ ఇటూ

చెప్పినా ఉపమానోపమేయములు రెండే ఉంటవి. వీటితో సదృశ మయిన మూడవపదార్థము ఏదీ లేదు అని ఇక్కడ గోచరిస్తుంది. కనుకనే తృతీయసబ్రహ్మచారినివృత్తి దీనిలో ఉంటుంది. ముఖము చంద్రునివలె ఉన్నది అని అంటే చంద్రుడు ముఖమువలె ఉన్నాడు అని గోచరము కాకపోదు. అయినా అట్లా గోచర మవుతూ ఉండే అర్థమును స్పష్టముగా శబ్దాలతో చెప్పినందువలన తృతీయసదృశనిరాసము కలుగుతుంది. ఇటువంటి ఫలము ఇక్కడ ఉన్నది కాబట్టే "ఈ ఉపమేయోపమాలంకారము ప్రతీపాలంకారము ఉపమాలంకారము కలిసినందువలన సిద్ధ మవుతుంది. ప్రతీపోపమాసమ్మేళనమె కాని ఇది ప్రత్యేకాలంకారము కాదు." అని అనరాదు. ఇంకా ఈఅలంకారానికి సంబంధించిన విషయవిస్తరణానికి ఇది సమయం కాదు. ఉదా :—

ధర్మోऽర్థ ఇవ పూర్ణశ్రీ రర్థో ధర్మ ఇవ స్థితః
కామ స్తా వివ తౌ కామ ఇవ రుద్రనరేశ్వరే.

దీనిభావము నిరూపిత మయింది. ప్రథమపాదములో అర్థనిరూపితసాదృశ్యము ధర్మమునందు, ద్వితీయపాదములో ధర్మనిరూపితసాదృశ్యము అర్థమునందూ, చెప్పబడింది. మొదట ఉపమానోపమేయములుగా ఉన్న అర్థధర్మములు తరువాత ఉపమేయోపమానము లయినవి. ధర్మార్థము లనే రెండిటికి పర్యాయముగా ఉపమానోపమేయభావము ఉపనిబద్ధ మయింది. అందువలన ఉపమేయోపమాలంకారము. ధర్మోऽర్థ ఇవ పూర్ణశ్రీః అనేది ఒకవాక్యము. "అర్థో ధర్మ ఇవ స్థితః" అనేది రెండవ వాక్యము. ఈవిధంగా ఇది వాక్యభేదమును ఆశ్రయించి ఉంది. పూర్ణశ్రీకత్వము సమాన

ధర్మము. ఈధర్మము కలిగి ఉండడములో అర్థమునకు ధర్మము సాటి, ధర్మానికి అర్థము సాటి. అంతేనేకాని మూడవపదార్థ మేదీ వీటితో సాటిగా చెప్పదగినది లేదు. కనుక తృతీయసదృశవస్తువు లేదు అని ప్రతీత మవుతున్నది. పూర్ణశ్రీరూప మయిన ధర్మము తప్ప ధర్మాంతరము ఏదీ నిర్దిష్టము కాలేదు. మరొకధర్మము ఏ దయినా నిర్దిష్ట మయి నట్లయితే ఆధర్మము కలిగిన తృతీయవస్తువు ఏ దయినా సదృశ మయినది ఉండవచ్చు అనే అర్థము వస్తుంది. అప్పుడు తృతీయసబ్రహ్మచారినివృత్తి రాదు. ఈపద్యంలో ఉత్తరార్థము ప్రకృతాలంకారానికి ఉదాహరణంగా ఎంచరాదు.

౪ స్మరణము

సదృశానుభవా దన్యస్మృతిః స్మరణ ముచ్యతే

ఈఅలంకారముకూడా భేదాభేదప్రధానసాధర్మ్యకము. సదృశ మయిన పదార్థముయొక్క అనుభవమువలన సమాన మయిన వేరొకవస్తువుస్మరణము ఉన్నట్లయితే స్మరణాలంకార మవుతుంది. పూర్వము ఏ దయినా ఒకవస్తువును అనుభవించినట్లయితే ఒకవిధసంస్కారము హృదయగతమై ఉంటుంది. ఆవస్తువుతో సమాన మయిన వస్తువు ప్రకృతము గోచరించినప్పుడు తదనుభవమువలన పూర్వసంస్కారము ఉద్బుద్ధ మవుతుంది. ఆవస్తువు స్మృతిలోకి వస్తుంది. ఈవిధానము నిబంధింపబడినప్పుడు స్మరణాలంకారము. స్మరింపబడే వస్తువునకు స్మరింపచేసే వస్తువునకూ సాదృశ్యసంబంధము లేకపోతే స్మరణాలంకారము కాదు.

రాజ్ఞా ప్రతాపరుద్రేణ పాలితేయం వసుంధరా
హరిశ్చంద్రనలాదీనాం ప్రాచాం స్మరతి భూభుజాం

ప్రజాపాలకు డయిన ప్రతాపరుద్రునిచేత పాలింపబడిన ఈభూమి హరిశ్చంద్రుడు నలుడు మొదలయిన ప్రాచీన భూపతులను స్మరించుతున్నది. ప్రతాపరుద్రుడు హరిశ్చంద్రాదిసదృశుడు. భూమి ప్రతాపరుద్రానుభవమువలన సామ్యమునుబట్టి పూర్వులను స్మరించుతున్నది. నలనహుషాదులతో సమాన మయిన పాలన ప్రావీణ్యం కలిగిన ప్రతాపరుద్రుని తనకు రక్షకునిగా పొందిన వసుంధర పూర్వరాజులను స్మరించడము దీనిలో నిబద్ధ మయింది కాబట్టి స్మరణాలంకారము.

౫ రూపకము

ఇప్పటికి భేదాభేదసాధారణమయిన సాధర్మ్యము నిమిత్తముగా కల అలంకారములను ప్రదర్శించడ మయింది. ఇక ఆరోపగర్భము లయిన అలంకారాలను ప్రస్తావించాలి. ఆరోప స్వరూపము కావ్యప్రకరణములో ప్రదర్శిత మయింది. ఆరోపగర్భాలంకారములు అభేదప్రధానములుగా ఉంటవి. అభేదప్రధానకము లయిన అలంకారాలలో రూపకము ముఖ్యము. సాదృశ్యమూలాలంకారములలో ఉపమ ప్రధాన మయినట్లు ఆరోపమూలకములలో రూపకము ప్రధానము, బీజభూతమూను.

ఆరోపవిషయస్య స్యా దతిరోహితరూపిణః
ఉపరంజక మారోప్యమాణం త ద్రూపకం మతం

ఒకచోట వేరొకధర్మమును ఆరోపించడము ఆరోపము. ఆరోపములో విషయము ఆరోపవిషయము. ఇదే ప్రకృతము. సామాన్యముగా దీనిని ఉపమేయము అని గ్రహించవచ్చు. ఆరోపింపబడేదానికి ఆరోప్యమాణము అని పేరు. దీనినే ఆరోపవిషయి అంటారు. ఇది అప్రకృతమనిన్నీ

వ్యవహృతమవుతుంది. సామాన్యంగా ఉపమానము అని దీన్ని గ్రహించవచ్చు. కాగా లక్షణార్థము ఈవిధముగా పర్యవసన్న మవుతుంది. అతిరోహితరూపముగా ఉన్న ఆరోపవిషయము నకు ఆరోప్యమాణము ఉపరంజక మయితే రూపకాలం కారము అవుతుంది అని. ముఖచంద్రుడు అనే ఉదాహరణ ములో ముఖము ఆరోప విషయము. చంద్రుడు ఆరోప్య మాణము. చంద్రారోపమువలన ముఖానికి ఉపరంజనము కలుగుతున్నది. చంద్రుడు ముఖానికి ఉపరంజకు డయినాడు. ఇక్కడ ఉపరంజనము అంటే తాద్రూప్యప్రతీతి కలగడము అనే గ్రహించాలి. (ఉపరంజకము–తాద్రూప్యప్రతీతిని కలుగ జేసేది) ఈస్థలంలో ఉపయోగించిన తాద్రూప్యపదమువలన స్థూలంగా అభేదము అని అర్థమును గుర్తించాలి. ముఖము చంద్రుడు ఈ రెండిటికీ సంబంధించి ఉన్న ఆరోపము తాద్రూప్యప్రతీతిని కలుగజేసినంతమాత్రాన చరితార్థమవు తున్నది. అంతేకాని పరిణామాలంకారములో మాదిరిగా ప్రకృతమునకు ఉపయోగము కలిగేవరకూ వివక్షింపవలసిన అవసరము లేదు. ఈవిషయము కొంచెం ముందు స్పష్ట మవుతుంది. ఇట్లా ఉపరంజనము ఉంటే రూపకము అని తేలింది. ప్రకృతము అప్రకృతముచేత రూపము కలదిగా చేయ బడుతుంది. "ప్రకృత మప్రకృతేన రూపవ త్క్రియతే ఇతి రూపకం" పెద్దలు ఈవిధంగానే అంగీకరించారు. ప్రకృతము నందు ఆరోపింపబడే అప్రకృతము ప్రకృతమునకు రూప సంపాదకమై ఉపరంజనము చేసినట్లయితే రూపకాలంకారము అవుతుంది. అని సారాంశము.

ఈలక్షణములో ఉన్న విశేషణములు సాభిప్రాయ

ములు. వానివలన కొంత ప్రయోజనము ఉంది. 'ఆరోప విషయస్య' అని నిర్దేశించడమువలన ఉత్ప్రేక్షాదులకు ఉపమాదులకూ వ్యావృత్తి కలుగుతుంది. వానిలో ఆరోపము ఉండదు. ఉత్ప్రేక్ష మొదలయినవి అధ్యవసాయ గర్భాలంకారాలు. ఆరోపాధ్యవసాయములకు తేడా ఇదివరలో ప్రదర్శితమె. ఉపమాద్యలంకారాలు సాదృశ్యమూలకములు కాని ఆరోపమూలకములు కావు. రూపకంలో ప్రకృతము ఆరోపవిషయ మవుతుంది. ఇతరస్థలాలలో అట్లా కాదు. ఆరోపవిషయము అతిరోహితరూపముగా ఉండాలి. అని కూడా లక్షణంలో వివక్షితము. ప్రకృతము పిహితరూపము కాకూడదు. ఈవిధంగా అనడమువలన సందేహము భ్రాంతి మత్ అపహ్నవము మొదలయినవి వ్యావృత్తము లవుతున్నవి. సందేహాదులలో ప్రకృత స్వరూపము తిరస్కృత మవుతుంది. ఈవిషయమును ఇట్లా విశదంగా గ్రహించాలి. ముఖమా ? చంద్రుడా ? అన్న సందేహములో ముఖజ్ఞానము కలిగినప్పుడు చంద్రుడు అనే జ్ఞానము కలుగదు. చంద్రజ్ఞానము కలిగినప్పుడు ముఖము అనే జ్ఞానం కలుగదు. అదా ? ఇదా ? అని సందేహింపబడినప్పుడు విషయము చెప్పిన విధంగా తిరోహిత మవుతుంది. భ్రాంతిమదలంకారములో భ్రాంతిచేత విషయము తిరోహితమవుతుంది. ముఖమును చూచినప్పుడు పద్మము అనే భ్రాంతి కలిగితే ముఖము తిరోహిత మయిందన్నమాట. అపహ్నుత్యలంకారములో అపహ్నవము (తప్పిపుచ్చడము) చేయడముచేత ఆరోపవిషయమునకు తిరోధానము కలుగుతున్నది. "ఇది ముఖము కాదు. పద్మము" అనే అపహ్నవస్థలములో ముఖమును ముఖము కాదు అని అపహ్నవించడమువలన విషయము తిరోహితమె అవుతున్నది.

జైత్రయాత్రలో వీరరుద్రనృపతి నిస్సాణము (భేరి) శత్రుగర్వభేదన భయంకరంగా ధ్వనించగా శత్రుస్త్రీలకు బాగా కన్నీరు ఒలికింది. దాని వలన దిగంతాలలో జగదానందకరమయిన వీరరుద్రుని యశస్సు వృద్ధిపొందింది. ఈ భావము ప్రకృతమునకు సంబంధించి ఉన్నది. వర్షాకాలములో మేఘము పర్వతభేదన భయంకరంగా గర్జించగా అంతటా మాటిమాటికీ వర్షాలు వచ్చినవి. అప్పుడు మొలకలు వృద్ధిపొందినవి. అనే భావము అప్రకృతముగా దీనిలో ఉన్నది. అప్రకృత సముదాయము ప్రకృత సముదాయమందు ఆరోపితము కావడముకాక ప్రత్యేక ప్రత్యేకముగా ఆయా ప్రకృతములందు ఆయా అప్రకృతములు సమారోపితములు అవుతున్నవి. యాత్రయందు ప్రావృట్, నిస్సాణమందు ధారాధరము, గర్వమందు పర్వతము, నయనాంబువునందు వృష్టి, యశస్సునందు కందళము. ఈ ఆరోపితములయిన ప్రావృడాదులు యాత్రాదులకు ఉపరంజనము కలుగజేస్తున్నవి. అందువలన రూపకము. ఆరోపవిషయములయిన యాత్రాదులు ఆరోప్యమాణములయిన ప్రావృడాదులూ శబ్దోపాత్తములై ఉన్నందున సమస్తవస్తువిషయమవుతుంది. యాత్రాప్రావృట్ మొదలయినవి అవయవములు. యశః కందళాః అనేది అవయవి. అవయవములు అవయవి అన్నీ నిరూపితములయినవి కాబట్టి ఇది సావయవము.

ఈపద్యములో ఒక చిన్నవిశేషమును గుర్తించాలి. యశః కందలాః అనేచోట ''యశాంసి కందలా ఇవ'' అని ఉపమితసమాసమా ? 'యశాంస్యేవకందలాః' అని రూపకసమాసమా ? అనిసందేహము కలిగితే రూపకసమాసమే అని నిశ్చయించాలి. జగదానందాః అని సామాన్యధర్మ

ప్రయోగముఉన్నది. అది రూపకసమాసమునే సాధించి పెట్టుతుంది. ఉపమిత సమాస మయితే సామాన్య ధర్మ ప్రయోగము ఉండ రాదు. అని వైయాకరణానుశాసనము. కాబట్టి రూపకమె.

౨ ఏకదేశవివర్తి సావయవము

అవయవ నిరూపణము వలన అవయవి నిరూపణము గోచర మయ్యేటట్లయితే అది ఏకదేశవివర్తి అవుతుంది. అని సామాన్యంగా స్వరూపము. అవయవి నిరూపణము వలన అవయవ నిరూపణము గోచరమయినా ఏకదేశవివర్తి అవుతుంది. ఈ అవయవావయవి నిరూపణాలలో ఒకచోట ఆరోపము శాబ్దముగా ఉండడము వేరొకచోట ఆర్థముగా ఉండడము కన్పడుతుంది. ఏక దేశంలో ఇది విశేషంగా వర్తించేది కనుక ఏకదేశవివర్తి అనే పేరు సార్థకంగా ఉంది. ఉదా:

ప్రసాధితాశావలయాంతరాళః శౌర్యాకరః కాకతి వీరరుద్రః
వికస్వరై ర్వాసనయా త్రిలోకీం గుణప్రసూనైః సురభీకరోతి

దిఙ్మండలమును వశీకరించుకొన్న శౌర్యనిధి అయిన ప్రతాపరుద్రుడు పరిమళముతో కూడుకొని వికసించిన గుణప్రసూనాలచేత మూడులోకాలనూ పరిమళింప చేస్తున్నాడు. దీనిలో గుణములు అవయవములు. వానియందు ప్రసూనత్వ రూపణము ఉన్నది. దానివలన అవయవి అయిన ప్రతాపరుద్రునకు కల్పశాఖిత్వము నిరూపిత మవుతున్నది. గుణములందు ప్రసూనత్వారోపము శబ్దోపాత్తమె ఉన్నది కాబట్టి శాబ్దము. నృపతియందు కల్పశాఖిత్వ గోచర మవుతున్నదే కాని శబ్దోపాత్తము కాలేదు కాబట్టి ఆర్థము. కనుక ఇది ఏకదేశవివర్తి రూపకము. ఇది అవయవ రూపణము

వలన అవయవి రూపణము గోచరము కావడమనే భేదము నకు సంబంధించిన ఉదాహరణము. అవయవ నిరూపణము వలన అవయవిరూపణము గోచరము అయినప్పటికీ ఏకదేశ వివర్తి అవుతుంది.

మథితా ద్వైరివారాశేః భుజా మందరభూభృతా
జాతా ప్రతాపరుద్రస్య కీర్తి ర్లోకాన్ ధినోత్యమూః

భుజమనే మందర పర్వతముచేత తరచ బడిన శత్రు సముద్రమునుండి పుట్టిన ప్రతాపరుద్రునికీర్తి ఈలోకాలను సంతోషపెట్టుతున్నది. దీనిలో వైరిజనమునకు వారాశిత్వ రూపణము ఉన్నది. భుజమునకు మందరాద్రిత్వరూపణము ఉన్నది. ఉత్పన్నమయిన కీర్తికి సుధాత్వరూపణము శబ్దో పాత్తముగా లేదు. అది అర్థబలమువలన గోచర మవుతున్నది. ఆవిధంగానే జనులకు అమరత్వరూపణముకూడా అర్థగోచర మవుతున్నది. కనుక ఏకదేశవివర్తి రూపకము. ఈనిరూ పించిన సావయవోదాహరణాలలో అవయవములందు రూప ణము అవయవియందు రూపణమున్నూ కవికి అభీష్టము. కనుకనే ఏకదేశవివర్తిలో ఒకటి శాబ్ద మని మరొకటి ఆర్థ మని రూపణమును గ్రహించుతున్నాము. అవయవావయవ్యు భయరూపణమునందు కవిసంరంభము ఉన్న దన్నమాట.

నిరవయవము

అవయవరూపణములోనే కవిసంరంభవిశ్రాంతి ఉండి అవయవిరూపణములో కవిసంరంభవిశ్రాంతి లేకపోతే నిరవ యవరూపకము అవుతుంది. కవికి ఒక్కొకపుడు అవయవము లందు ఆరోపణము చెప్పడములోనే తాత్పర్యము ఉంటుంది. అవయవియందుకూడా ఆరోపణము చెప్పవలె నని ఆతనికి

అభిప్రాయము ఉండదు. అట్లాగే ఒక్కొకచోట అవయవి యందు ఆరోపణము చెప్పడమె కవికి అభీష్టము. అవయవా రోపణంలో అభిప్రాయం ఉండదు. అటువంటిస్థలంలో నిరవ యవరూపకము అవుతుంది. ఈనిరవయవానికి కేవలము, మాల, అని భేదాలు ఉన్నవి. ఆరోపవిషయము ఒక్కటే ఉండి ఆరోప్యమాణముకూడా దానికి తగినది ఒక్కటే ఉండే టట్లయితే అది కేవలము అవుతుంది. ఆరోపవిషయము ఒక్కటే అయి ఆరోప్యమాణములు చాలా ఉండే టట్లయితే మాలారూపక మవుతుంది. ప్రకృతము ముందుగా కేవల నిరవయవ రూపకోదాహరణము ఇట్లా ఉంటుంది.

యాత్రారంభ విజృంభమాణ సుభటప్రక్ష్వేడితామ్రేడితైః
నిస్సాణధ్వనిభిః స్ఫుటం ప్రతిదలద్రోదఃకటాహాంతరైః
క్షుబ్ధే ష్వబ్ధిషు కంపితేషు గిరిషు శ్రుత్వైవ ముంచం త్యసూన్
భీతాః కాకతివీరరుద్రనృపతేః ప్రత్యర్థినః పార్థివాః.

జైత్రయాత్రారంభములో విజృంభించుతున్న మహా భటుల సింహనాదాలు భేరీధ్వనులను రెట్టింపు చేస్తున్నవి. ఆ ధ్వనులు రోదఃకటాహముల మధ్యభాగములను బ్రద్దలుకొట్టు తున్నవి. అప్రుడు సముద్రాలు క్షుబ్ధములు కాగా పర్వతాలు కంపించిపోగా ప్రతాపరుద్రుని శత్రురాజు లందరూ భయపడి ఆధ్వనిని వినడముచేతనే ప్రాణాలు విడిచిపెట్టుతున్నారు. (రోదఃకటాహము – బ్రహ్మాండభాండము.) దీనిలో రోదస్సు నకు కటాహత్వము నిరూపిత మయింది. కవికి అంతవరకే అభీష్టము. అటుమీాదట అన్యరూపణములలో ఆతనికి అభి లాష లేదు. కనుక నిరవయవము.

మాలానిరవయము

రాజ్ఞాం మౌళివిభూషణ స్రగమలా దిక్కుంజరశ్రోత్రయోః
స్ఫారం చామరభూషణం ధరణిభృచ్ఛృంగేషు గంగా సరిత్
వ్యోమ్నః క్షౌమవితాన ముజ్జ్వలతరం ముక్తాకలాపో భువః
స్ఫారః కాకతివీరరుద్రయశసాం జాగర్తి విస్ఫూర్జితం

కాకతివీరరుద్రుని యశస్సుల విస్ఫురణము రాజులకు స్వచ్ఛమయిన శిరోఽలంకారమాల. దిగ్గజకర్ణములలో విశాల మయిన చామరభూషణము. పర్వతశిఖరాలలో గంగానది. ఆకాశమునకు సముజ్జ్వల మయిన క్షౌమవితానము. భూమికి విస్తార మయిన ముక్తాహారము. దీనిలో యశస్సు ఆరోపవిషయము ఒక్కటే. ఆరోప్యమాణములు చాలా ఉన్నవి. యశము నందు మాత్రము మాలాదులను రూపణము చేయడమె కవి తాత్పర్యము. ఇక సమన్వయము స్పష్టము.

పరంపరితము

రూపకము హేతువుగా ఉన్న రూపకము పరంపరిత రూపకము. పరంపర కలది పరంపరిత మవుతుంది. ఒక రూపకము వేరొక రూపకములో హేతువుగా ఉండాలి అంటే ఆరూపకము ఈరూపకసిద్ధిలో కారణ మయితే ఈరూపకము ఆరూపకసిద్ధిలో కారణమవుతూ ఉంటుం దని భావము. ఒక రూపకం నిష్పన్నము కావడానికి వేరొక రూపకము ఉండి తీరా లన్నమాట. కూర్పబడే రూపకములు పరస్పరమూ సాపేక్షము లయి ఉంట వని పరమార్థము. ఇంతకూ ఈ పరంపరితములో ఒకరూపకము ఉండడముకాక అనేక రూపకాలు ఉండాలని తేలింది. అనేకరూపకాలు ఉన్నప్పటికీ ఇది అనేక రూపకాల కూడిక అని అనరు. అనేకరూపకాల కలయికలో

ఉండే చమత్కారముకంటె వీనిలోని చమత్కారము విలక్షణముగా ఉంటుంది కాబట్టి ఇది ప్రత్యేకంగా పరిగణనార్హమె. సమస్తవస్తువిషయరూపకంలో కూడా ఇట్లాగే అనేకరూపకాలు ఉంటవి. అక్కడకూడా విలక్షణ చమత్కారోదయమూ ఉంది. అయినా అదీ ఇదీ అభిన్నమని అనుకోరాదు. రెండిటికీ కొంత తేడా ఉంది. పరంపరితరూపకము రెండు రూపకములను మాత్రం అనుసరించి వ్యవస్థిత మవుతుంది. సమస్తవస్తు విషయరూపకము అట్లా కాదు. ఇదివరలో ఉదాహరించినట్లుగా అది రెండిటికంటె అధికంగానే రూపకములను అనుసరించి ఉంటుంది. ఏకరూపక సాపేక్షరూపకము సమస్తవస్తువిషయరూపక మని భేదమును గ్రహించాలి. ఇటువంటి స్పష్టభేదము ఉన్నదికాబట్టే సమస్తవస్తువిషయములో పరంపరితము అంతర్భవించదు.

ఇక్కడ గ్రహింపదగిన విశేషము ఒకటి ఉంది. ఎక్కడనయినా ఒకచోట సమస్తవస్తువిషయము రెండు రూపకములతోనే అనుబంధించి ఉండవచ్చు. అంటే అటువంటి చోట అది ఏకరూపకసాపేక్షముగానే ఉండవచ్చునన్నమాట. అక్కడ ఉన్న రెండు రూపకాలకూ అవయవావయవిభావ సంబంధమును కూడా కవి వివక్షించి ఉంటాడు. అట్టి స్థలంలో అది పరంపరితరూపకము ఎందుకు కాదు ? చాలా రూపకాల సంబంధం ఉన్నచోట పరంపరితము కాకపోయినా ఇటువంటి స్థలంలో కావచ్చునే! అనే ఉదయించే శంకకు విద్యానాథునిరచనలో సమాధానము కనపడడము లేదు. పూర్వము చెప్పినదాన్నిబట్టి చూస్తే రెండే రూపకాలు ఉన్నపుడు పరంపరితమే అని అనాలి. కేవలము లెక్కలభేదాన్ని బట్టి అలంకారభేదమును చెప్పడము అంత సంగతంగా

ఉండదు. అంతకంటె ఏదయినా భేదనిరూపకయుక్తి ఉండాలి. కనుక ఈచెప్పేవిధంగా ఆ రెండిటి వివేకమును గ్రహించడము సముచితము.

పరంపరితములో కూర్చబడే రూపకాలు ఒక టొకటి సంబంధించి ఉంటవి. స్వస్వసిద్ధిలో అవి ఇతరమును ఉప యోగించుకోవు. అసలు ఇతరము ఏమీకూడా వానిసిద్ధిలో ఉపకారకము కాలేదు. సమస్తవస్తువిషయంలోని వ్యవస్థ వేరుగా ఉంటుంది. అక్కడ ఉపాత్తరూపకమె రూపకసిద్ధిని సంపాదించా లని లేదు. అక్కడ ఉన్న రూపకములు కవి సమయప్రసిద్ధ మయిన సాధర్మ్యమువలన సిద్ధము లవుతవి. ఇక్కడ ఒక ఆరోపము ఆరోపాంతరములో నిమిత్త మవు తుంది. ఈవిధముగా ఈ రెండిటికి భేదమును ఊహించడమె సమంజసముగా ఉంటుంది.

౫ శ్లిష్ట కేవల పరంపరితము

దీనిలో పదములు నానార్థములు కలవై శ్లిష్టములు కావడము, నిమిత్తము ఒకటే కావడము, ఆరోపములు పర స్పరము సంబంధము కలవి కావడమూ, ఉంటుంది.

ప్రతాపరుద్రదేవస్య మండలాగ్రవిధుంతుదః
అఖండవిక్రమోద్దామో గ్రసతే రాజమండలం

ఉపమా ప్రస్తావములో దీనిభావము నిరూపిత మయింది. మండలాగ్రమునందు విధుంతుదారోపము క్షత్రి యసమూహమందు రాజమండలారోపము ఉన్నందువలన రూపకము. రాజమండలపదము నానార్థములు కలది కాబట్టి శ్లిష్టము. రాజులసమూహము విషయరూప మయిన అర్థము. చంద్రమండలము విషయ రూపార్థము. ఖడ్గము రాజుల

సమూహాము గ్రసించడము రాహువు చంద్రమండలమును గ్రసించడమూ లోకప్రసిద్ధము. ఖడ్గమునందు రాహుసమారోపము ఉంటేనే నృపమండలమందు చంద్రమండలసమారోపము ఉపపన్న మవుతుంది. రాజమండలమందు రాజమండలసమారోపము ఉన్నపుడే మండలాగ్రమునందు విధుంతుదారోపము కుదురుతుంది. ఒక ఆరోపములో వేరొక ఆరోపము అపేక్షిత మవుతున్నది కాబట్టి ఇది పరంపరితము. ఇక్కడ నిరూపితము లయిన రెండు ఆరోపములూ ఒకటొకటి ఉపకరించుకొంటున్నవే కాని కవిసమయప్రసిద్ధ మయిన సాధర్మ్యము ఇక్కడ అవసరము కావడము లేదు. ఈఉపాత్తములకంటె అతిరిక్త మయిన సాధర్మ్యము ఏదీ ఈరూపకాలను సిద్ధింపచేయ లేదు. ఈవిధంగా శ్లిష్టకేవలపరంపరితమును సమన్వయించుకోవాలి.

౬ శ్లిష్ట మాలా పరంపరితము

పద్మోల్లాససహస్రభాను రసకృ త్సన్మార్గచర్యా బుధః
క్ష్మాభృత్పక్షభిదాశనిః కువలయాలంకారరాకాశశీ
నిత్యోద్య త్సుమనోవికాస సురభిః కళ్యాణసంపత్సుర
క్షోణీభృ ద్భువనాశ్రయాంబుధి రయం శ్రీవీరరుద్రో నృపః

పద్మోల్లాసము = లక్ష్మీసముల్లాసము, పద్మములసముల్లాసము. సన్మార్గము = సాధుమార్గము, నక్షత్రమార్గము. క్ష్మాభృత్పక్షము = రాజులబలము, పర్వతములపక్షములు. కువలయ = భూవలయము, కలువలు. సుమనోవికాసము = విద్వదామోదము, పుష్పవికాసము. కళ్యాణసంపత్ = మంగళసంపత్తి, అక్షయస్వర్ణసమృద్ధి. భువనాశ్రయము = లోకమునకు ఆశ్రయము, ఉదకమునకు ఆశ్రయము. ఈవిధముగా

ఈపద్యములో ఆయాపదాలకు అర్థద్వయము ఉన్నది. ఇక ఈ పద్యభావమును ఈవిధముగా గ్రహించాలి. శ్రీవీరరుద్రనృపాలకుడు పద్మోల్లాసమనే పద్మోల్లాసములో సహస్రకరములు కలిగిన సూర్యుడు. లక్ష్మిని అభివృద్ధిపరచడములో సమర్థుడయిన కాకతిభూపతి పద్మాలను వికసింపజేయడములో సమర్థుడయిన సూర్యుడు. సన్మార్గ మనే సన్మార్గమునందలి చర్యలో బుధుడు. సాధుమార్గచర్యాసమర్థుడయిన వీరరుద్రుడు నక్షత్రమార్గచర్యలో బుధుడు. క్ష్మాభృత్పక్ష మనే క్ష్మాభృత్పక్షముయొక్క భేదనములో వజ్రాయుధము. శత్రుబలభేదనసమర్థుడయిన ప్రతాపరుద్రుడు పర్వతపక్షచ్ఛేదనసమర్థమయిన వజ్రాయుధము. కువలయ మనే కువలయముయొక్క అలంకారములో పూర్ణిమా చంద్రుడు. భూవలయాలంకార నిపుణుడయిన ప్రతాపరుద్రుడు కలువల అలంకారకుశలుడయిన పూర్ణిమాచంద్రుడు. నిత్యమూ అతిశయించె సుమనోవికాస మనే సుమనోవికాసములో వసంతుడు. విద్వదాహ్లాదమును కూర్చడములో నేర్పరి అయిన వీరరుద్రుడు పుష్పవికసనములో నేర్పరి అయిన వసంతుడు. కళ్యాణసంపద అనే కళ్యాణసంపదలో మేరుపర్వతము. మంగళసంపత్తిని సంపాదించే సురపర్వతము. భువనాశ్రయ మనే భువనాశ్రయమునకు సముద్రము. లోకాశ్రయదాత అయిన కాకతీయుడు జలాశ్రయ మయిన జలధి. ఈపద్యములో ప్రతాపరుద్రుడు ఒక్కడే విషయము. సూర్యబుధాదులు విషయిపదార్థములు చాలా ఉన్నవి. అందువలన మాలాత్వమును గ్రహించాలి. వీరరుద్రునియందు సహస్రభానుసమారోపము ఉంటేనే పద్మోల్లాసమందు పద్మోల్లాససమారోపము కుదురుతుంది. పద్మోల్లాసమందు పద్మోల్లాససమారోపము ఉంటేనే

వీరరుద్రునియందు సూర్యారోపము కుదురుతుంది. అందు వలన పరంపరితము. ఇట్లాగే ఇతరస్థలాలలో కూడా గ్రహించాలి. పూర్వపద్యములో చెప్పినవిధంగా మిగతా సమన్వయ మును ఊహించాలి.

౭ ఆశ్లిష్ట కేవల పరంపరితము

కాకతీయస్య దుగ్ధాబ్ధే ర్యశోలీలామహోర్మయః
దిక్కూల ముద్రుజాటోపాః ఖేలం త్యభ్రంకషోచ్ఛ్రయాః.

కాకతీయు డనే దుగ్ధార్ణవముయొక్క యశోలీల లనే మహాతరంగములు దిక్కూలములను ఒరిపిడి చేసే ఆటోపము కలవై ఆకాశమును కషించే ఔన్నత్యము కలవై విహరిస్తున్నవి. దీనిలో పదములు శ్లిష్టములు కావు. యశోలీలలకు మహోర్మిత్వరూపణము కాకతీయునకు సంబంధించిన దుగ్ధార్ణవత్వారోపణాధీనముగా ఉన్నది కాబట్టి పరంపరిత మవుతుంది.

౮ అశ్లిష్ట మాలా పరంపరితము

దోరాశీవిషజిహ్వయా రిపువనశ్రేణీమహావాత్యయా
శౌర్యోగ్రానల ధూమ్యయా జయరమాయోషావిలాసభ్రువా
సంహృష్య ద్ధరణీవిలాస శిఖినీ సంవాసయష్ట్యా జగత్
ప్రాసాదార్గలయా కృపాణలతయా రుద్రో నృపః క్రీడతి.

కృపాణలతతో రుద్రనృపుడు క్రీడించుతున్నాడు. ఈపద్యములో ఆరు ఆరోపములు కృపాణలతకు నిరూపితములై ఉన్నవి. ఆకృపాణలత భుజము లనే సర్పముల నాలుక. శత్రువు లనే వనపంక్తికి సుడిగాలి. ప్రతాప మనే ప్రచండాగ్నికి ధూమసమూహము. జయలక్ష్మి అనే యువతికి విలాసభ్రుకుటి. బాగా హర్షము పొందుతున్న భూదేవి అనే

క్రీడామయూరికి నివాసయష్టి. జగత్తుఅనే భవనానికి అర్గళము. దీనిలో కృపాణలతయందు జిహ్వా వాత్యా భూమ్యాదులు చాలా ఆరోపితము లయినవి. అందువలన మాలారూపక మవుతుంది. కృపాణలతయందు జిహ్వాద్యారోపము భుజాదు లందు సర్పాద్యారోపమును ప్రతీక్షిస్తూ ఉంది. సర్పాద్యారోపమున్నూ జిహ్వాద్యారోపమును అపేక్షిస్తున్నది. అందు వలన పరంపరితము. ఇట్లా పరంపరములో అంతటా హేతు హేతుమద్భావము కనిపిస్తూ ఉంటుంది.

ఈ ఉదాహరణములో వేరొక విశేషమును గుర్తించాలి. కృపాణలత అన్నపుడు కృపాణమందు లతారోపము ఉన్నదని గుర్తింపగలము. అయితే జిహ్వావాత్యాదులు కృపాణమందు ఆరోపితము లవుతున్నవా ? లతయందు ఆరోపితము లవుతున్నవా ? కాకతీయునికృపాణమె ప్రకృతములో వర్ణ్యము. లత కాదు. కృపాణమందు లతారోపము చేస్తే రూపకసమాసములో లతకే ప్రాధాన్యము వస్తుంది కాబట్టి జిహ్వాదులు లతయందే సమారోపితము లవుతున్నవి అని అనవలసిఉంది. అప్రకృత మయిన లత ఆరోపవిషయ మయితే మనకు ఇక్కడ కలిగే చమత్కార మేమిటి ? ఆరోప్యమాణమునకు వేరొక ఆరోప్యమాణము ఉంటే చమత్కారము వాడిపోతుంది. అమ్లానంగా భాసించదు. అందు వలన కృపాణలత అంటే అఖండంగా కృపాణము అని గ్రహించితే ఈయిబ్బంది రాదు. కృపాణలతాపదానికి ఈ అర్థం ఉన్నదా ? అనేది వేరేవిషయము. విద్యానాథుడు ఇక్కడ కృపాణలతాపదముతో కృపాణమును వివక్షించు తున్నా డని నిరూపించుకోవాలి. ఇటువంటిదే వేరొక చిన్న అంశమున్నూ ఈపద్యంలో ఉంది. 'జయరమామోహిత్'

అన్నపుడు యుద్ధవిజయమందు లక్ష్మీసమారోపము ఆలక్ష్మి యందు యోషిదారోపము అని ఆరోప్యమాణమునకు ఆరోప్యమాణము కల్పించుతున్నది. అందువలన అక్కడకూడా జయరమ అంటే యుద్ధవిజయ మని సామాన్యంగా గ్రహించితే సరిపోతుంది. ఇంతవరకు ఈపరంపరితము సాధర్మ్యముతో నిరూపిత మయింది. ఈ అశ్లిష్టమాలాపరంపరితము వైధర్మ్యముతో కూడా సంభవించుతుంది. సాధర్మ్యము అంటే ఇక్కడ నిరూపితము లవుతున్న రెండిటికి పరస్పరము విరోధభావము ఉండకుండా మైత్రము (ఆనుకూల్యము) ఉంటుం దని, వైధర్మ్యము అంటే మైత్రము లేకుండా విరోధ భావము (విరుద్ధధర్మవత్త్వము= ప్రాతికూల్యము) ఉంటుం దని గ్రహించాలి. ఉదా :—

త్రాసాంధకారమధ్యాహ్నాః కైతవాతపరాత్రయః
జయంతి వీరరుద్రస్య రణప్రాంగణకేళయః.

వీరరుద్రుని రణప్రాంగణ క్రీడలు భయ మనే అంధకారమునకు మధ్యాహ్నములు. కపట మనే ఆతపమునకు రాత్రులు అయి సర్వోత్కర్షగా ఉంటున్నవి. ఇక్కడ క్రీడలందు మధ్యాహ్నారోపము త్రాసమందు అంధకారారోపమును అపేక్షిస్తున్నది. రాత్రిసమారోపము కైతవమందు ఆతపారోపసాపేక్షముగా ఉన్నది. అంధకార మధ్యాహ్నములకు ఆతప రాత్రులకూ వైధర్మ్యము స్పష్టము. సమన్వయము సులభము. ఈవిధంగా రూపకము ఎనిమిది విధాలు. ఈ అష్టవిధ మయిన రూపకమున్నూ వాక్యగత మని సమాసగత మని మళ్లా విభాగము పొందితే పదహారు విధా లవుతుంది. ముఖచంద్రుడు అనే రూపకము సమాసగతము.

ముఖ మనే చంద్రుడు అని ఉంటే వాక్యగతము. ఈవిధ ముగానే ఇతరములలో కూడాను. వీని ఉదాహరణ ప్రపంచ మును ఇతరగ్రంథాలలో దర్శించాలి.

౬. పరిణామము

రూపకాలంకారానికి పరిణామాలంకారానికి కొంత సంబంధము ఉంది. ప్రకృతమందు అప్రకృతమును ఆరో పించడము అక్కడా ఇక్కడా కూడా సమానమె. కాని ఆరో ప్యమాణములో ప్రకృతోపయోగి అవుతుంది. ఈవైధర్మ్య ము వలన పరిణామము రూపకముకంటె భిన్న మవుతున్నది.

ఆరోప్యమాణ మారోపవిషయాత్మతయా స్థితం
ప్రకృత స్యోపయోగిత్వే పరిణామ ఉదాహృతః.

ఆరోప్యమాణము ఆరోపవిషయము అనే పదాల అర్థము ఇదివరలో నిరూపిత మయింది. ఆరోప్యమాణము ఆరోపవిషయరూపముగా ఉండి ప్రకృతమునకు ఉపయోగిం చేది అయినప్పుడు పరిణామము అవుతుంది అని సామాన్యంగా లక్షణార్థము. ముఖచంద్రునిచే తాపము శమించును అనే ఉదాహరణములో చంద్రుడు ఆరోప్యమాణము. ఆచంద్ర పదార్థము తాపము శమింపజేయడ మనే ప్రకృతక్రియలో ఉపకరించేది అవుతున్నది. తాపము శమించడ మనేది ముఖము వలననే కలగాలె కాని చంద్రునివలన కలగదు. సౌరతాప మయితే చంద్రునివలన శమించవచ్చు. కాని మాన్మథ తాపము చంద్రునివలన శమించదు. ఈతాపశాంతిలో ముఖమే నిమిత్తము. కాగా చంద్రునివలన ఉపయోగం ఏమి ఉంటుంది ? ఆరోప్యమాణచంద్రుడు ప్రకృతోపయోగి

కావాలంటే ప్రకృతతాదాత్మ్యమును పొందితీరాలి. చంద్రుడు ముఖతాదాత్మ్యము పొందకపోతే తాపశమనోపయోగి కాలేడు. అందువలననే ఆరోప్యమాణము ప్రకృతోపయోగి అయ్యే పర్యంతమూ వివక్షింపబడడము, ప్రకృతోపయోగిత్వముకొరకు ఆరోపవిషయాత్మకముగా ఉండవలసి ఉండడమూ, దీనిలో వివక్షితము. ప్రకృతము అతిరోహిత స్వరూపంగానే ఉండి అంటే; తనరూపమును తాను విడిచిపెట్టకుండా ఉండి ఆరోప్యమాణాత్మకంగా పరిణమించుతుంది కాబట్టి పరిణామాలంకారము అని లక్షణభావము పర్యవసన్న మవుతుంది. రూపకాలంకారములో ఆరోపము తాద్రూప్యప్రతీతితోనే పర్యవసానం పొందుతున్నందువలన ప్రకృతము కొంత అపహ్నుతస్వరూపమై అప్రకృతస్వరూపం పొందుతుంది. రూపకాలంకారప్రస్తావములో ప్రకృతము అతిరోహితస్వరూపంగా ఉండా లని చెప్పినమాట నిజమె. తిరోహితస్వరూపంగా విషయము ఉంటుంది అని ఇక్కడ చెప్పడము పూర్వవచనానికి విరుద్ధంగా ఉండవచ్చు. కాని తత్వ మిది. ప్రకృతము అప్రకృతరూపరూపిత మయినప్పుడు ప్రకృతస్వరూపము తిరోహిత మయినట్లే భావించాలి. ప్రకృతము తనరూపాన్ని కప్పిపుచ్చుకొని అప్రకృతరూపమును పొందినపుడు ఇట్లా చెప్పక తప్పదుకదా! అయితే సందేహాద్యలంకారాలలోఉండే తిరోహితము కావడమునకూరూపకంలో తిరోహితం కావడమునకూ తేడా ఉంది. ఈభేదమును గుర్తింపచేయడానికే రూపకలక్షణంలో' అతిరోహితరూపిణః' అని నిరూపిత మయింది. విషయ్యాకారారోపము ఉండగానే విషయస్థగనము రూపకంలో ఉంటుందన్నమాట. పరిణామంలో విషయము స్వస్వరూపమునుండి ఏమీ జారిపో

కుండా విషయియొక్క ఆకారమును ఉపయోగించుకుంటుంది. ఇదీ ఈ రెండిటికీ భేదము. ఈ భేదకథనంలో ప్రాచీనులకూ నవ్యులకూ వైషమ్యం ఉంది. ప్రాచీనమతానుసారంగా ఇక్కడ విద్యానాథుని అర్థము చేసికోవాలి. ఆరోప్యమాణము ప్రకృతోపయోగి అవుతుంది అని అనడముచేత సర్వాలంకారములకూ వ్యావృత్తి కలుగుతుంది. ఇతరాలంకారాలలో ఎక్కడా ఆరోప్యమాణము ప్రకృతోపయోగి కాదు. ఈ పరిణామాలంకారము సమానాధికరణ్య వైయధికరణ్యముల చేత ద్వివిధ మవుతుంది. విషయము విషయి రెండూ సమానవిభక్తి కలవిగా ఉంటే సామానాధికరణ్య మని, భిన్న విభక్తి కలవిగా ఉంటే వైయధికరణ్య మని నియమము. ఉదా:

శశ్వత్ ప్రసాధనవిధానకృతాభిలాషా
నమ్రై ర్భజంతి మకుటై రవనీపవర్గాః
శ్రీవీరరుద్రనృపతేః కకుభాం విజేతుః
ఆజ్ఞామయీం స్రజ మమందవిలాసలక్ష్మీం.

మాటిమాటికీ అలంకరించుకొనడములో అభిలాష కలిగిన రాజులు వినమ్రశిరస్సులతో దిశావిజేత అయిన శ్రీవీరరుద్రనృపతియొక్క అధికవిలాసశోభ కల ఆజ్ఞారూపమయిన మాలను భజించుతున్నారు. ఆజ్ఞ ప్రకృతము విషయము. స్రక్కు (మాల) అప్రకృతము విషయి. మకుటధారణ మనేది ప్రకృతక్రియ. ఆరోప్యమాణ మయిన మాల ప్రకృతాజ్ఞాతాదాత్మ్యము పొంది మకుటధారణాత్మక మయిన ప్రకృతోపయోగము కలిగి ఉన్నది కనుక పరిణామము. "ఆజ్ఞామయీం స్రజం" అని విషయ విషయి పదార్థములు సమాన విభక్తి కలవిగా ఉన్నందున సామానాధికరణ్యము.

వైయధికరణ్యమునకు ఉదా :—

కిరీటమాణిక్యమయూఖజాలైః విధాయ పుష్పాంజలి మర్చయంతే
ఫలార్థినో రుద్రనరేంద్రపాద పీఠాన్తసీమాన మరిక్షితీంద్రాః

ప్రయోజనార్థు లయిన శత్రురాజులు రుద్రనరేంద్రుని పాదపీఠాంతప్రదేశమును, తమకిరీటాలలోని మాణిక్యముల కిరణసమూహాలచేత పుష్పాంజలి చేసి అర్చనము చేస్తున్నారు. కిరణసమూహము విషయము. పుష్పాంజలి విషయి. అర్చనము ప్రకృతక్రియ. ఆరోప్యమాణ మయిన పుష్పాంజలి ప్రకృత మయూఖజాలతాదాత్మ్యము పొంది అర్చనోపయోగి అవుతున్నది. "మయూఖజాలైః పుష్పాంజలిం" అని భిన్నవిభక్తికములుగా ఉన్నందువలన వైయధికరణ్యము. సమాసోక్తిలో కూడా ఆరోప్యమాణము ప్రకృతోపయోగి అవుతుంది. అయినా అక్కడ ఆరోప్యమాణము గమ్యమానము అవుతుందేకాని పరిణామంలో మాదిరిగా శబ్దోపాత్తము కాదు. పరిణామంలో రెండూ వాచ్యములుగా ఉంటవి. కనుక సమాసోక్తికి పరిణామంలో అంతర్భావం రాదు. అది వేరు. ఇది వేరు.

సందేహము

విషయో విషయీ యత్ర సాదృశ్యా త్కవిసమ్మతాత్
సందేహగోచరౌ స్యాతాం సందేహాలంకృతి శ్చ సా.

ఆరోపగర్భాలంకారములలో కొన్ని నిశ్చయాత్మకంగానూ కొన్ని అనిశ్చయాత్మకంగానూ ఉంటవి. సందేహాలంకారము అనిశ్చయాత్మకము. కవిసంమత మయిన సాదృశ్యమువలన విషయము విషయి అనే రెండూ సందేహగోచరములై ఉన్నట్లయితే సందేహాలంకారము అవుతుంది. కవిసమ్మతసాదృశ్యమువలన ప్రకృతాప్రకృతములు సందిహ్యమానములు కావాలి. కవిసమ్మతసాదృశ్యము లేకపోతే

సందేహమాత్రము అలంకారము కాదు. ఇది రజ్జువా? సర్పమా? అనే సందేహము అలంకారము కాదు. కవిప్రతిభాసముత్థాపిత మైన సందేహము ప్రకృతమునకు ఉత్కర్షను సంపాదించుతుంది. అనియతంగా రెండు అంశములను అవలంబించి ఉండే విమర్శను సందేహము అని అంటారు. ఇటువంటి విమర్శ ఏ ఒకదానికో సంబంధించి ఉండదు. ప్రకృతము అప్రకృతము రెండిటినీ అవలంబించి ఉంటుంది. ఒక్కొకచోట విషయపదార్థములే సందేహగోచరములు అవుతూ ఉంటవి. వేరొకచోట విషయి విషయములు రెండూ సందేహగోచరము లవుతవి. ఈఅలంకారము మూడు విధాలు. శుద్ధము, నిశ్చయగర్భము, నిశ్చయాంతమూ అని. కేవలము సందేహములోనే పర్యవసానము పొందితే శుద్ధ సందేహ మవుతుంది. ఉదా:

శుద్ధ సందేహము

కి మేష నవమో హరిత్పతి రమంద సంపత్ప్రదం
కి మేష దశమః ప్రజాపతి రపూర్వ సర్గక్రమః
కి మేష హరి రుర్వరోద్ధరణచుంచు రేకాదశః
చిరా దితి విలోక్యతే జగతి వీరరుద్రో జనైః

దీని భావము ఇదివరలో నిరూపితము. కవిసమ్మత మయిన సంపదాది సాదృశ్యము వలన వీరరుద్రరూపమయిన విషయము లోకపాలాది రూపమయిన విషయి అనే కోటిద్వయము సందేహ గోచరముగా ఉన్నది కనుక సందేహాలంకారము. ఇక్కడ నిరూపిత మయిన సందేహము తావన్మాత్రములోనే పర్యవసానము పొందినందువలన శుద్ధము. ఈ పద్యములో నవమః దశమః ఏకాదశః అనే పదాలు ఉన్నందు

వలన సర్వప్రసిద్ధమయిన లోకపాలబుద్ధి కలుగదు. నూతనమయిన లోకపాలాదిభావం కలుగుతుంది. అప్పుడు లోకపాలాదులకు ఆరోప్యమాణత్వము రాదు. లోకపాలాది సంభావనమె అక్కడ సిద్ధమవుతుంది. నవమాదిపదాలు లేకపోతే కేవలలోకపాలాదులకు ఆరోప్యమాణత్వము సిద్ధము కావచ్చు. అప్పుడది సందేహమూ కావచ్చు. నవమాది పదాలు ఉన్నందువలన సంభావనాబుద్ధి కలుగుతున్నది. కనుక ఇది ఉత్ప్రేక్ష అవుతుంది కాని సందేహము కాదే! అనే శంక ఈ పద్యంలో కలుగవచ్చును. అప్పుడు ఈ విషయమును గ్రహించాలి. సందేహాలంకారములో ఆరోపమూ ఉండవచ్చు. సంభావనకూడా ఉండవచ్చును. ఏది ఉన్నా సందేహము కోటిద్వయమును అవలంబించి ఉంటే సరి! అలంకారమవుతుంది. అందువలననే ఇటువంటి స్థలంలో ఉత్ప్రేక్షాశ్రయమయిన సందేహము ఉంటుందనికొందరంటారు. ఈ పద్యంలో వీరరుద్రలోకపాలాది కోటిద్వయ గోచరమయిన సందేహము ఉన్నది కాబట్టి అలంకార సమన్వయమును గ్రహించాలి. అని వ్యాఖ్యాత అంటున్నాడు. బాగాచూస్తే ఇక్కడ ప్రకృతమయిన వీరరుద్రుడు సందేహప్రతీతి విషయంగా ఉన్నట్లు కనపడదు. లోకపాలాది విషయి పదార్థములే సందేహప్రతీతిలో గోచరము లవుతున్నవి. లోకపాలాది నానాకోటికంగా సందేహము ఉన్నందువలన సమన్వయానికి ఏమీ బాధ లేదు. ఇక్కడ విషయిపదార్థములే సందేహ గోచరములయినవి. ఇంకొకచోట విషయి విషయములు రెండూ సందేహ గోచరములు కావచ్చు అని గ్రహించాలి.

నిశ్చయగర్భము

మొదట సంశయము ఉంటుంది. మధ్యలో నిశ్చయము ఉంటుంది. మళ్లీ చివర సంశయము ఉంటుంది. ఈ విధంగా ఉంటే నిశ్చయగర్భ సందేహము. ఉదా:-

కాలాహిః కిమయం? మృణాలమృదులం భోగం స ధత్తే పునః
కాలభ్రూకుటి రేష కిం ను? ముఖ ఏవోజ్జృంభతే సా పునః
కాలోగ్రానల ధూమపద్ధతి రసౌ కిం? సా పున ర్ధూయతే
వాతేనేతి వికల్పతే ప్రతిభటైః రుద్రస్య కౌక్షేయకః.

వీరరుద్రుని ఖడ్గమును శత్రువులు ఈ విధంగా వికల్పించుచున్నారు. ఇది కాలసర్పమా? అయితే అది మృణాల మృదుల మయిన శరీరమును ధరించుచుందే! పోనీ ఇది అంతకుని భ్రూభంగమా? అది ముఖమందే విజృంభించుచుందే! ఇది అంతటా విజృంభిస్తున్నది. పోనీ ఇది ప్రళయకాల ప్రచండానల ధూమరేఖ అవుతుందా? అయితే అది గాలికి కదిలి చలించి పోతుందే! ఇది ఆ విధంగా చలించడము లేదు. దీనిలో మొదట కాలాహి అవుతుందా? అని సంశయము. సుకుమారశరీరాది విశేషము కన్పడనందువలన సర్పము కాదు అని నిశ్చయము మధ్యలో ఉన్నది. అయినా ఖడ్గమనే నిశ్చయము లేదు. అందువలన నిశ్చయగర్భమైన సందేహము. పూర్వపద్యంలో మాదిరిగా ఇక్కడకూడా విషయిపదార్థములె సందేహగోచరములై ఉన్నవి.

నిశ్చయాంతము

ఉపక్రమము సంశయంలో ఉంటుంది. పర్యవసానము నిశ్చయంలో ఉంటుంది. అందువలన నిశ్చయ పర్యవసానమయిన సందేహము. ఉదా :

కిం కల్పద్రుమమంజరీస్రజ ఇమే ? కిం వా పయోరాశయః
స్వర్ధేనో ? రథవా కిముజ్జ్వలతరా శ్చింతామణేః స్ఫూర్తయః
కిం వా సిద్ధరసోర్మయ ? శ్చిరమితి వ్యామృశ్య నిశ్చిన్వతే
సంతః కాకతివీరరుద్రనృపతేః స్మేరాః కటాక్షా ఇతి.

ఇవి కల్పవృక్షాల మంజరీ మాలలా ? కాక కామ ధేనువు క్షీరధారలా? లేకపోతే సముజ్జ్వలములయిన చింతామణి విస్ఫురణములా ? సుధారస కల్లోలములా ? అని సందేహించి తుదకు ఇవి కాకతివీరరుద్ర నృపతి యొక్క స్మిత ప్రధానములు సానుగ్రహములు అయిన కటాక్షములు అని సహృదయులు నిశ్చయించు కుంటున్నారు. ఇది నిశ్చయాంతమయిన సందేహమని స్పష్టముగా తెలుస్తూ ఉన్నది. పూర్వపద్యాలలో మాదిరిగా ఇక్కడ కూడా విషయిపదార్థము లే సందేహ గోచరములుగా ఉన్నవి. విషయము విషయి రెండూ సందేహ గోచరములు కావాలని లక్షణములో ఉన్నది. లక్ష్యములో ఒకటే ఉంది. అయినా ఉదాహరణము సరిగా లేదని అనుకోనక్కర లేదు. విషయిగోచరమయిన సందేహము కూడా సందేహాలంకారమే అని తెలియ జేయడానికి నాథుడు ఈ విధంగా ఉదాహరించి ఉంటాడు. ఒక విధంగా ఈ మూడు లక్ష్యాలున్నా విషయివిషయములు రెండూ గోచరములుగా ఉండే సందేహానికి కూడా సరిపోతూ ఉంటవని ఊహించవచ్చు. "కిమేష హరిత్పతిః, కిమయం కాలాహిః, కిం కల్పద్రుమ మంజరీ స్రజ ఇమే" అనే ఈ పద్యాలలో విషయములు సర్వనామ శబ్దాలతో నిరూపితములయినవి. కింశబ్ద బోధ్యమయిన సందేహము ఏతచ్ఛబ్ద ప్రతిపాద్య విషయమును హరిత్పతిరూప మయిన విషయిని గోచరము చేసి కొంటున్నదని సమన్వయించు కోవచ్చు. ఇట్లాగే ఇతర

ములలో కూడా. ఈ రీతిలోని ఔచిత్యమును సహృదయులు భావించాలి.

భ్రాంతిమదలంకారము

సందేహాలంకారానికి భ్రాంతిమదలంకారానికిన్నీ ఒక విషయంలో కొంత సాధర్మ్యము ఉంది. ఒక పదార్థమును వేరొక పదార్థముగా భావించడము రెండిటిలోనూ సమానమె. అందువలననే సందేహానంతరము ఇది ప్రసక్తమవుతున్నది.

కవిసంమత సాదృశ్యా ద్విషయే పిహితాత్మని
ఆరోప్యమాణానుభవో యత్ర స భ్రాంతిమా న్మతః.

ఆచ్ఛాదితస్వరూపము కలిగిన విషయములో (ప్రకృతములో) కవిసంమతమయిన సాదృశ్యము వలన ఆరోప్యమాణము యొక్క అనుభవము కలిగితే భ్రాంతిమదలంకారము అవుతుంది. ఒక వస్తువును వేరొకవస్తువని అనుకొనడము అది ఒక విధమయిన చిత్తభ్రాంతి. అయితే భ్రాంతి చిత్తధర్మ మని తేలుతుంది. ఇటువంటి చిత్తధర్మము కల భణితి ప్రకారము భ్రాంతిమాన్. కవిప్రతిభ వలన ప్రాకరణికమును అప్రాకరణికముగ గ్రహించుట భ్రాంతిమదలంకార మని భావము. దీనిలో కవిప్రతిభా సముత్థాపిత మయిన సాదృశ్యము ఉంటుంది. అటువంటి సాదృశ్యము లేకపోతే కేవలభ్రాంతి అలంకారము కాదు.

కాకతీయవిభోః కీర్తివిభవే వ్యాప్తరోదసి
దివాపి చంద్రికాబుద్ధ్యా చకోరా యాంతి నిర్వృతిం.

స్పష్టార్థము. దీనిలో కీర్తి విషయము. చంద్రిక ఆరోప్యమాణము. చకోరములకు కీర్తియందు చంద్రికాను

భవము ఉన్నట్లు వర్ణింప బడినందువలన భ్రాంతిమ దలంకారము.

అపహ్నవము

సాదృశ్యము వలన ఒక వస్తువు వేరొక వస్తువుగా ప్రతీతము కావడము పూర్వాలంకారములో మాదిరిగా దీనిలో కూడా ఉంటుంది. అందువలననే భ్రాంతిమదనంతరము అపహ్నుతి నిరూపిత మవుతున్నది.

నిషిధ్య విషయం సామ్యా దన్యారోపే హ్యపహ్నుతిః.

కవిసమ్మతమయిన సాదృశ్యము వలన విషయమును నిషేధించగా అన్యారోపము ఉంటే అపహ్నుతి అవుతుంది. ప్రకృత వస్తువు అపహ్నవింపబడడము అన్యవస్తువు ఆరోపింపబడడము ఉండాలి. విషయాపహ్నవమనేది ఇతరాలంకారాలలో కూడా ఉన్నప్పటికి దీనిలో స్పష్టంగా విషయనిషేధం ఉంటుంది. సాదృశ్యమువలన ఆరోప్యమాణానుభవము ఉంటే అపహ్నవ మవుతుం దన్నమాట. ఈ అపహ్నవాలంకారము మూడు విధాలు. అపహ్నవించి ఆరోపించడము, ఆరోపించి అపహ్నవించడము, ఛల కపట వ్యాజ మిషాది శబ్దాల ద్వారా విషయాసత్యత్వమును ప్రతిపాదించడము అని. మొత్తానికి ఈ అలంకారములో విషయాపహ్నవకృతంగా చమత్కారము కలుగుతుంది. ఉదా:-

ఉద్వేల్లచ్చతురర్ణవీకలకలో నాయం చమూడంబరః
నేదం దుందుభిగర్జితం త్రిపురజిత్కల్పాంత ఢక్కారవః
ఇత్థం రుద్రనరేంద్రభాటిషు మహీభారావనమ్రీభవ
చ్ఛేషాశేషశిరస్సు విస్మిత మధ భ్రష్టం దిగీశై రపి

పొంగుతూ ఉన్న నాలుగు సముద్రాల కలకలమొ

కాని ఇది సేనాడంబరము కాదు. ఇక్కడ కలకలత్వారోపము చమూడంబరత్వ నిషేధము ఉన్నది. మొదటి భేదాన్ని ఇక్కడ సమన్వయించాలి. ఇది దుందుభిగర్జితము కాదు శివుని కల్పాంత ఢక్కారవము. ఇక్కడ ముందు నిషేధము తరువాత ఆరోపము ఉన్నది. ద్వితీయ భేదమును ఊహించాలి. ఈ విధంగా రుద్రనరేంద్రుని ధాటులలో (శత్రుదేశపీడనానికి భటులతో అశ్వములతో విజిగీషువు చేసే ప్రయత్నము—ధాటి) భూభారము చేత ఆదిశేషుని శిరస్సులు వంగి పోతూ ఉంటే దిగీశ్వరులు కూడా ఆశ్చర్యపడుతున్నారు. ఎక్కడో జారి పోతున్నారు. ఆరోపము నిషేధము అనే రెండూ ఈ అలంకారానికి ప్రాణమిచ్చేవిగా ఉన్నవి. ఆరోపము మొదట ఉండడము తరువాత ఉండడము అనే విశేషాన్ని బట్టి భేదములు కలుగుతున్నవి. ఒకసారి నిషేధమె చమత్కారి అయితే వేరొకసారి ఆరోపము చమత్కారి అవుతుంది. ఈ పద్యంలో మొదటి రెండు భేదాలూ కనపడుతున్నవి. ఇక మూడవ భేదానికి ఉదా:—

సర్వాం కాకతివీరరుద్ర ధరణీనాథ చ్ఛలేన క్షితిం
పాతుం మధ్యమలోకపాల పదవీం ప్రాప్తః స్వయంభూః శివః
నైవం చే ద్విషమావలోకన కలామాత్రేణ భస్మీకృతైః
జాతం వైరిపురైః కథం? కథ మవాగ్భూతం చ భూభృద్గణైః?

స్వయంభూ శివుడు ఈ భూమినంతా ప్రతాపరుద్రుడన్న మిషతో పాలించడానికి భూలోకములో అవతరించాడు. ఇది సత్యము. ఇట్లా కాకపోతే విషమావలోకనం చేయగానే శత్రువుల పట్టణాలు ఎట్లా భస్మములవుతవి? భూభృద్గణములున్నూ ఎట్లా న్యగ్భూతములు అవుతవి.

త్రిపురదాహసమయంలో శివుడు తృతీయనయన ప్రసారం చేయ గానే వైరిపురాలు భస్మములయినవి. కైలాసము (భూభృత్) ప్రమథగణములూ (గణ) ఎటో పోయినారు. ప్రతాప రుద్రుడు విషమంగా చూడగానే శత్రుపట్టణాలు ఏమో అయి పోతున్నవి. ఎదురు వచ్చిన రాజులున్నూ పరాభూతు లవుతున్నారు. దీనిలో ఛలశబ్ద ప్రయోగము ఉన్నది. దాని వలన ఒకవిధంగా సృకృతమునకు అసత్యత్వము ప్రతిపాదిత మవుతుంది.

ఉల్లేఖము

అర్థయోగరుచిశ్లేషై రుల్లేఖన మనేకథా
గ్రహీతృభేదా దేకస్య స ఉల్లేఖః సతాం మతః.

ఉల్లేఖము కూడా ఆరోపగర్భాలంకారము. ఒకవస్తు వును అనేకులు అనేకవిధాల ఉల్లేఖించితే ఉల్లేఖము. అనేకధా ఉల్లేఖించడములో హేతువులు ఉంటవి. అర్థయోగము–రుచి–శ్లేష ఈ మూడూ హేతువులు. అర్థయోగము అంటే ఒక ప్రయోజనసంబంధము. రుచి అంటే అభిరతి. ఆ వస్తువుపై అభిమానము. శ్లేష నానార్థములు ఉండడము. ఈ మూడు హేతువులూ ఒక చోట ఉండాలని నియమం లేదు. ఉండ గూడదని నిషేధమూ లేదు. ఈ మూడూ ఉండవచ్చు. రెండే ఉండవచ్చు. ఒకటే ఉండవచ్చును. ఆయా వస్తువులను ఆయా విధముగా గ్రహించే వారు ఈ విశేషములు కల వారై ఆయా వస్తువులు నానాధర్మములు కలిగి ఉన్నందు వలన అనేకవిధాలగా నిర్ధారించి నప్పుడు ఉల్లేఖాలంకారము అవుతుంది. గ్రహించే వారు అనేకులు ఉండడమనేది ఇతరా లంకారాలలో ఎక్కడా ఉండదు.

లక్ష్మినివాసగృహ మిత్యఖిలా నరేంద్రాః
శౌర్యాతిభూమిఖని రిత్యరివీరవర్గాః
విద్యావిహారపదవీతి చ లబ్ధవర్ణాః
శ్రీకాకతీంద్రనగరీ మనిశం స్తువంతి

దీని భావము నిరూపితమయింది. కాకతీంద్రనగరములో సమృద్ధి మొదలయిన ధర్మముల సంబంధము ఉన్నందువలన నరేంద్రులు శత్రువులు పండితులు అనే అనేకులు లక్ష్మీనివాసగృహము మొదలయిన అనేకవిధాలుగా ఉల్లేఖించి నందువలన ఇది ఉల్లేఖాలంకారము. దీనిలో రుచి అర్థయోగము అనే రెండూ ఉన్నవి. ఈ చెప్పబోయేది శ్లేషోల్లేఖమునకు ఉదాహరణము.

ఉగ్రః సపత్నేషు గుణేషు భాస్వాన్ రామః ప్రతీకేషు రణేషు భీమః
లీలాసు లక్ష్మ్యాః పురుషోత్తమశ్చే త్యాచక్షతే రుద్రనృపం కవీంద్రాః.

రుద్రనృపాలకుని కవీంద్రులు ఈ విధముగా చెప్పుతున్నారు. ప్రతాపరుద్రుడు శత్రువులవిషయమై ఉగ్రుడు=శివుడు, క్రూరుడు. గుణములలో భాస్వాన్=సూర్యుడు, తేజస్వి. అవయవములలో రాముడు=శ్రీరాముడు, మనోహరుడు. లక్ష్మీలీలలలో పురుషోత్తముడు=విష్ణువు, పురుషులలో ఉత్తముడు. దీనిలో గ్రహీతృభేదం లేదు. అయినా సపత్నాది విషయభేదము ఉన్నది కాబట్టి శ్లేషతో ఉగ్రత్వాద్యనేక ధర్మోల్లేఖము ఉన్నందువలన ఉల్లేఖము.

ఉత్ప్రేక్ష

ఆరోపములో మాదిరిగా అధ్యవసాయములో కూడా అభేద ప్రతిపత్తి (జ్ఞానము) కలుగుతుంది. అయినా ఆరోపముకంటె అధ్యవసాయము ఉత్కృష్టము. అందువలన

ఆరోపమూలములను చెప్పిన తరువాత అధ్యవసాయ మూలములను చెప్పడము సముచితము. అధ్యవసాయగర్భము లయిన అలంకారాలు రెండు. ఉత్ప్రేక్ష అతిశయోక్తి. అధ్యవసాయగర్భములలో ఆరోపగర్భత ఉండక పోదు. ఆరోపగర్భములలో అధ్యవసాయ గర్భత ఉండక పోదు. అయినా ప్రాధాన్యమును బట్టి ఆ విధంగా వ్యపదేశము. ప్రకృతములో అప్రకృత గుణక్రియా సంబంధము ఉన్నందు వలన చమత్కారవిశేషమును అధ్యవసాయము కలుగ జేస్తుంది. కాబట్టి ఇది ఆరోపము కంటె ఉత్కృష్టము. అధ్యవసాయము అంటే నిశ్చయజ్ఞానము. అభిన్నముగా భాసించడము. అది ఒకచోట సమ్యగ్రూపంగా ఉంటుంది. వేరొకచోట మిథ్యా రూపంగా ఉంటుంది. సర్పమును చూచి సర్పమె అనుకొనడము సమ్యగధ్యవసాయము. రజ్జువును చూచి సర్పమని అనుకొనడము మిథ్యాధ్యవసాయము. ఇక్కడ చమత్కారము లేదు కాబట్టి అలంకారము కాదు. బుద్ధిపూర్వకముగానే అది కానిదానిని తద్ధర్మసంబంధము ఉన్నందువలన అదిఅని అనుకొనడము అలంకారమూలమయిన అధ్యవసాయము. ఇది లోకాధ్యవసాయము కంటె విలక్షణము. ఇటువంటిదే లోకోత్తర చమత్కార కారణము. కావ్యప్రకరణములో అధ్యవసాయలక్షణము నిరూపితమె. ఇక్కడ దానిని విశదంగా గ్రహించడము అవసరము. విషయము విషయి ఈ రెండిటిలో ఏదో ఒక దానిని నిగరణము చేసి అభేదప్రతిపత్తిని సంపాదించడము అధ్యవసాయము. నిగరణము అంటే ఏదోవిధంగా అసత్యత్వమును చెప్పడము. విషయి నిగరణము ఒకచోట ఉంటుంది. విషయ నిగరణము ఇంకొక చోట ఉంటుంది.

విషయమును నిగీర్ణము చేసి అభేదప్రతిపత్తిని సంపాదించడమనే అధ్యవసాయము చాలాప్రసిద్ధము. కావ్యప్రకరణంలో చెప్పిన అధ్యవసాయలక్షణము ఇదే. విషయికి అసత్యత్వమును చెప్పే అధ్యవసాయము సాధ్యమని విషయమునకు అసత్యత్వమును చెప్పేఅధ్యవసాయము సిద్ధమని అంటారు. ఈ వివేకమును ఇట్లా ఉదాహరణంలో గ్రహించాలి. ముఖము విషయము. చంద్రుడు విషయి. చంద్రాది విషయిగతముగా ఉండే మాధుర్యాదికమును విషయమయిన ముఖాదులందు నిబంధించి ముఖమును ముఖము అని తెలుసుకుంటూ కూడా ఇది సత్యముగా చంద్రుడే అనిప్రయోగించినప్పుడు విషయి అయిన చంద్రుడు ముఖరూపంగా సత్యము కాదు. కాబట్టి నిగీర్ణుడుగా భాసిస్తాడు. ముఖరూప మయిన విషయము పరమార్థంగా సత్యమే. 'నిశ్చయంగా ముఖము చంద్రుడే' అని ప్రయోగించిన చోట సత్యమయిన ముఖానికి అసత్యమయిన చంద్రునకూ అభేదప్రతిపత్తి సంభవించదు. అయినా సంస్కృతంలో 'మన్యే, శంకే ధ్రువం, ప్రాయః, నూనం' మొదలయిన శబ్దాలచేత అసత్యమయిన చంద్రునకున్నూ సత్యత్వము సమర్థిత మవుతున్నది. అందువలననే ఇక్కడ అధ్యవసాయము సాధ్యమవుతున్నది. ఇటువంటి స్థలాలలో అధ్యవసాయప్రాధాన్యం ఉంటుంది. ముఖపదమును శబ్దముతో చెప్పకుండా చంద్రోయం అని ప్రయోగించినపుడు వాస్తవంగా అక్కడ విషయి అసత్యమే అయినా సత్యత్వము గోచర మవుతుంది. చంద్రునకు అసత్యత్వమును నిరూపించడములో నిమిత్తమయిన ముఖపదమునకు అక్కడ ప్రయోగము లేదుగా! విషయమయిన ముఖము వాస్తవంగా

సత్యమె అయినా ఏమాత్రమూ శబ్దము చేత చెప్పబడనందు వలన అది అసత్యమె అయి నిగీర్ణమవుతున్నది. అందువలన ఇటువంటి స్థలంలో అధ్యవసాయము సిద్ధము. ఇక్కడ అధ్యవసితానికి ప్రాధాన్యం ఉంటుంది. సాధ్యాధ్యవసాయము మూలముగా ఉత్ప్రేక్షాలంకారము ఉంటుంది. ఇక దాని లక్షణము—

> యత్రాన్యధర్మసంబంధా దన్యత్వేనోపతర్కితం
> ప్రకృతం హి భవే త్ప్రాజ్ఞా స్తా ముత్ప్రేక్షాం ప్రచక్షతే.

గుణ క్రియా రూప మయిన అన్యధర్మసంబంధము వలన ప్రకృతము అప్రకృతముగా సంభావిత మయినపుడు ఉత్ప్రేక్షాలంకారము అవుతుంది అని ప్రాజ్ఞులు భావిస్తున్నారు. ముఖము ప్రకృతము. చంద్రుడు అప్రకృతము అన్యము. ముఖమందు చంద్రునకు సంబంధించిన స్వచ్ఛత ఆహ్లాదకారిత్వము మొదలయిన గుణక్రియాసంబంధము ఉన్నందువలన ముఖమును చంద్రుడుగా సంభావించుతాము. అపు డది ఉత్ప్రేక్ష అవుతుంది. ఇది వాచ్యోత్ప్రేక్ష. ప్రతీయమానోత్ప్రేక్ష అని రెండువిధాలు. సంభావనను ప్రతిపాదించే "నూనం ధ్రువం ప్రాయః" మొదలయిన వానిని ప్రయోగించితే వాచ్య అవుతుంది. సంభావనావాచకములను ప్రయోగించకపోతే ప్రతీయమాన అవుతుంది. జాతి క్రియ గుణము ద్రవ్యము అనే నాలుగూ అధ్యవసాయములో విషయములుగా నిరూపితము లయినపుడు ఒక్కొక్కటి మళ్లీ నాలుగు విధాలవుతుంది. జాత్యాదులు నాలుగూ భావరూపములుగాను అభావరూపములుగానూ ఉత్ప్రేక్షింపబడడము ఉంటుంది కాబట్టి ఈ ద్వైవిధ్యమును కలుపు

కొంటే వాచ్య ఎనిమిది విధాలు, ప్రతీయమాన ఎనిమిది విధాలూ అవుతుంది. అధ్యవసాయము గుణనిమిత్తముగా ఉండవచ్చు. క్రియానిమిత్తముగా ఉండవచ్చు. ఈ రెండు విధాలూ మేళవించితే ఒక్కొక్కటి పదహారు విధాలు. ఈ జాతిక్రియాగుణద్రవ్యాల స్వరూపము ఉత్ప్రేక్షింపబడడము అవి హేతువుగా ఉత్ప్రేక్షింపబడడమూ ఫలముగా ఉత్ప్రేక్షింపబడడము కలిపినపుడు ఒక్కొక్కటి నలభై ఎనిమిది విధాలు. వీనినే భంగ్యంతరముగా భావించితే జాత్యుత్ప్రేక్ష పన్నెండు విధాలు, క్రియోత్ప్రేక్ష ౧౨, గుణోత్ప్రేక్ష ౧౨, ద్రవ్యోత్ప్రేక్ష ౧౨ విధాలూ, అవుతుంది. గ్రహణసౌకర్యముకొరకు వానిపేర్లను ఈవిధంగా గ్రహించవచ్చు.

౧. గుణనిమిత్త జాతిభావ స్వరూపోత్ప్రేక్ష
౨. ,, జాత్యభావ ,,
౩. క్రియానిమిత్త జాతిభావ ,,
౪. ,, జాత్యభావ ,,
౫. గుణనిమిత్త జాతిభావ హేతూత్ప్రేక్ష
౬. ,, జాత్యభావ ,,
౭. క్రియానిమిత్త జాతిభావ ,,
౮. ,, జాత్యభావ ,,
౯. గుణనిమిత్త జాతిభావ ఫలోత్ప్రేక్ష
౧౦. ,, జాత్యభావ ,,
౧౧. క్రియానిమిత్త జాతిభావ ,,
౧౨. ,, జాత్యభావ ,,

క్రియాగుణద్రవ్యోత్ప్రేక్షలున్నూ ఈవిధంగానె ఒక్కొక్కటి పన్నెండుఅవుతుంది. ప్రతిపత్తిసౌకర్యంకొరకు స్వరూపో

ప్రేక్ష ౧౬, హేతూత్ప్రేక్ష ౧౬, ఫలోత్ప్రేక్ష ౧౬ విధాలు అవుతుంది అనిన్నీ గ్రహించవచ్చు.

స్వరూపోత్ప్రేక్షలో—
గుణనిమిత్తజాతిభావోత్ప్రేక్షలు ౪
,, అభావోత్ప్రేక్షలు ౪
క్రియానిమిత్త భావ ,, ౪
,, అభావ ,, ౪

ఈవిధంగానే హేతుఫలోత్ప్రేక్షలలో కూడా గ్రహించాలి. ఇట్లా వాచ్యోత్ప్రేక్ష ౪౮, ప్రతీయమానోత్ప్రేక్ష ౪౮, విధాలు. విద్యానాథమతానుసారంగా చూస్తే ప్రతీయమానోత్ప్రేక్షలో హెచ్చింపులు తగ్గింపులు ఏమీ లేవు. వాచ్యోత్ప్రేక్షలో ఇంకా కొన్ని కలుపవలసినవి ఉన్నవి. దీనిలో నిమిత్తము వాచ్యముగా ఉండడము గమ్యముగా ఉండడము వలని భేదము కూడా సంభవిస్తుంది. నిమిత్తము వాచ్యముగా ఉన్నప్పుడు గుణనిమిత్తము క్రియానిమిత్తమన్న భేదము స్పష్టమె. నిమిత్తము గమ్యముగా ఉన్నప్పుడు గుణక్రియాభేదము రాదు. నిమిత్తము ఉపాత్తమె కానప్పుడు గుణము ఉపాత్తము కాలేదని క్రియ ఉపాత్తము కాలేదని పరిగణించడము సముచితంగా ఉండదు ఇది అజాతపుత్ర నామకరణతుల్యంగా ఉంటుంది. అందువలన నిమిత్తానుపాదానంలో ఒకే భేదము కలుగుతుంది. ఈనిమిత్తము ఉపాత్తము కాకపోవడ మనేది వాచ్యోత్ప్రేక్షలో కూడా అన్నిటిలోనూ సంభవించదు. ఒక స్వరూపోత్ప్రేక్షలో మాత్రమె దీనిభేదాలు కలుగుతవి. హేతూత్ప్రేక్ష ఫలోత్ప్రేక్షలలో ఈవిశేషము కుదరదు. హేతూత్ప్రేక్షలో ఫలము నిమిత్త

మవుతుంది. ఫలోత్ప్రేక్షలో హేతువు నిమిత్త మవుతుంది. ఒకదానిని హేతువుగా సంభావించినప్పుడు అది దేనికొరకో ఆ నిమిత్త మయిన ఫలమును నిర్దేశించకపోతే అన్వయము సరిగా కుదరదు. అదేవిధంగా ఒకదానిని ఫలముగా సంభావించి నప్పుడు అది దేనికి ఫలమో ఆ నిమిత్త మయిన హేతువును నిర్దేశించకపోతే అన్వయానికి కుదురుబాటు లేదు. అందు వలన హేతుఫలోత్ప్రేక్షలలో నిమిత్తము ఉండితీరాలి. ఈవిషయమును ముందు సోదాహరణంగా నిరూపిస్తాము. పూర్వము చెప్పినవిధముగా స్వరూపోత్ప్రేక్ష నిమిత్తసహితమై ఉంటే ౧౬ విధా లయిందికదా! దానిలో గుణనిమిత్తకములు ౮, క్రియానిమిత్తకములు ౮; వానికితోడు అనుపాత్తనిమిత్తకము లయిన ౮ భేదాలను కూడా కలిపితే మొత్తం స్వరూపోత్ప్రేక్ష చతుర్వింశతి భేదాలు కల దవుతుంది. నిమిత్తమును చెప్పనప్పుడు గుణక్రియాభేదము రాదు కాబట్టి ఇవి ఎనిమిది భేదాలె.

అనుపాత్త నిమిత్త జాత్యాది భావోత్ప్రేక్షలు ౪
,, జాత్యా ద్యభావోత్ప్రేక్షలు ౪

వీనికి నామనిర్దేశము చేయడము సులభమె. గ్రహణ సౌకర్యముకొరకు మొదట చెప్పిన జాతి క్రియా గుణ ద్రవ్యోత్ప్రేక్షా విభాగానుసారముగా చూస్తే ఒక్కొకదానిలో అనుపాత్త నిమిత్తకములు రెండు రెండు చేరుతవి.

అనుపాత్త నిమిత్తక జాతిభావ స్వరూపోత్ప్రేక్ష
,, జాత్యభావ ,,

అని పేర్లు. హేతు ఫలోత్ప్రేక్షలలో ఈ భేదములు కలుగ వనే విశేషమును గుర్తుపెట్టుకోవాలి. గుణ క్రియా

ద్రవ్యోత్ప్రేక్షలకు సంబంధించిన స్వరూపోత్ప్రేక్షలలో కూడా ఈ భేదద్వయమును అభ్యూహించాలి.

నిమిత్తము వాచ్య గమ్య భేదాలతో ఉంటుం దనే విభాగము వాచ్యోత్ప్రేక్షలోనే సంబంధించుతుంది కాని ప్రతీయమానోత్ప్రేక్షలో సంబంధించదు. ప్రతీయమానోత్ప్రేక్షలో సంభావనావాచకము లయిన ఇవ, నూనం, ప్రాయః ఇత్యాదిశబ్దాలు ఉండవుకదా ! సంభావనావాచకములూ ఉండక నిమిత్తముకూడా ప్రయోగింపబడకపోతే ఉత్ప్రేక్ష నిరవలంబ మవుతుంది. ఉత్ప్రేక్షాశరీరము నాలుగు విధాల ఉంటుంది. ప్రకృతము, అప్రకృతము, నిమిత్తము, సంభావనావాచకము అని. వీనిలో చివరివి రెండూ లేకపోతే ప్రకృతము అప్రకృతము రెండే ఉంటవి. అంతమాత్రంచేత ఉత్ప్రేక్షాలంకార మని ఎట్లా నిర్ధారిత మవుతుంది ?

మహిళాసహస్రభరితే తవ హృదయే సుభగ ! సా అమాంతీ
అనుదిన మనన్యకర్మా అంగం త న్వపి తనయతి

ఓ ! సుందరుడా ! వేయిస్త్రీలతో కూడుకొన్న నీహృదయంలో ఆమె ఉండడానికి తగినచోటు లేక ప్రతి దినమూ ఏమీ పని లేకుండా సన్నగా ఉన్న శరీరాన్నికూడా ఇంకా కృశింపచేసికొంటున్నది. దీనిలో "మహిళాసహస్రభరిత మయిన నీహృదయంలో ఇముడలేక" అనే ఉత్ప్రేక్ష ఇవాదిపదాలు లేనందువలన ప్రతీయమాన మవుతున్నది. ఈఉత్ప్రేక్షలో అంగతనూకరణము నిమిత్తము. ఈనిమిత్తమె ఇక్కడ ఉపాత్తము కాకపోయినట్లయితె పై ఉత్ప్రేక్ష నిష్ప్రమాణక మయ్యేది. అందువల్ల ప్రతీయమానోత్ప్రేక్షలో అవశ్యంగా నిమిత్తం ఉండితీరాలి అని నియమము. వాచ్య

లోనే నిమిత్తోపాదా నానుపాదానములు సంభవించుతవి కాబట్టి అది మొత్తంమీద యాభై ఆరు విధా లవుతుంది. ప్రతీయమాన నలభై ఎనిమిది విధాలు. మొత్తం ఉత్ప్రేక్ష నూటనాలుగువిధా లని తేలింది.

వాచ్యోత్ప్రేక్షలోకూడా హేతుఫలములు ఉత్ప్రేక్షా విషయములు అయినప్పుడు నిమిత్తము చెప్పబడవలసిందే. సాధ్యమును చెప్పక దేనినో సాధనముగా నిర్దేశించడము అన్వయపరిపోషం ఇవ్వదు. అట్లాగే సాధనమును చెప్పక పోతే దేనినో సాధ్యముగా నిర్దేశించడమున్నూ అన్వయ సౌకర్యం కలుగచేయలేదు. సాధ్యము సాధనము అనేవి రెండూ ఎప్పుడూ పరస్పరాపేక్ష కలిగి ఉంటవి. ఒకటొకటి విడిచి ఉండవు. హేతూత్ప్రేక్షలో ఫలము నిమిత్తము. ఫలో త్ప్రేక్షలో హేతువు నిమిత్తము. ఒకటి నిమిత్త మయితే రెండోది నైమిత్తికము. నిమిత్తనైమిత్తకములలో ఏ ఒక దానినో చెప్పడములో అన్వయపరిపోషం ఉండదు. రెండిటిని చెప్పవలసిందే అని నియమము. కాగా వీనిలో నిమిత్తము ఉపాత్తము కావలసిందే. హేతూత్ప్రేక్షలో ఫలము నిమిత్త మయినప్పుడు ఆఫలమును చెప్పకపోతే అది దేనినిగూర్చి హేతువుగా ఉంది, అనిపిస్తుంది. ఈఉదాహరణంలో ఈవిష యము స్పష్ట మవుతుంది.

ప్రతాపరుద్రనృపతే రపారే కీర్తిసాగరే
మగ్నా దురీశ దుష్కీర్తిసంగా దివ జగత్త్రియీ

ప్రతాపరుద్రుని అపారమయిన కీర్తిసాగరంలో, దుష్ట ప్రభువుల దుష్కీర్తిసంగమువలనకాబోలు జగత్త్రయి మగ్న మయింది. దీనిలో జగత్త్రయి మునగడములో దుష్కీర్తి

సంగము హేతువు కాకపోయినా హేతువుగా ఉత్ప్రేక్షిత మయినందువలన హేతూత్ప్రేక్ష. ఈఉత్ప్రేక్షలో మజ్జనము నిమిత్తము. దీనిని ఇక్కడ చెప్పకపోతే "సంగాదివ" అనే హేతూత్ప్రేక్ష అంద మివ్వదు. ఫలోత్ప్రేక్షలో హేతువు నిమిత్త మవుతుంది. దానిని చెప్పకపోతే "ఇది దేనిని గురించి ఫలంగా ఉంది ?" అనిపిస్తుంది. ఈపద్యంలో చూడండి.

> జయశ్రీవాసపద్మస్య వికాసాయేవ భానుమాన్
> ప్రతిబింబమిషాత్ ఖడ్గం ప్రవిశ త్యంధ్రభూభుజః

జయలక్ష్మీనివాసపద్మముయొక్క- వికాసముకొరకు కాబోలు సూర్యుడు ప్రతిబింబ మన్న మిషతో ప్రతాపరుద్రునిఖడ్గమును ప్రవేశిస్తున్నాడు. సూర్యుడు ప్రతిబింబముగా ఖడ్గములో ప్రవేశించడమునకు పద్మవికాసము ఫలము కాదు. అయినా పద్మవికాసము ఫలముగా చెప్పబడినందువలన ఫలోత్ప్రేక్ష. దీనిలో సూర్యప్రవేశము నిమిత్తము. దానిని ఇక్కడ చెప్పకపోతే "జయలక్ష్మీవాసకమలవికాసాయేవ" అనే ఫలోత్ప్రేక్షణము సముచితంగా ఉండదు. కాబట్టి హేతుఫలోత్ప్రేక్షలలో నిమిత్తము ఉండవలసిందే. అక్కడ నిమిత్తానుపాదానం అంటూ ఉండదు. పూర్వము చెప్పినట్లుగా స్వరూపోత్ప్రేక్షలోనే నిమిత్తోపాదానానుపాదానభేదములు కుదురుతవి. ఇట్లా ఈ విధానాలు అన్నీ చూచుకోగా వాచ్యోత్ప్రేక్షకు ౯౬, ప్రతీయమానకు ౪౮, మొత్తము ౧౦౪ ఉత్ప్రేక్షాభేదాలు సిద్ధము లవుతున్నవి. గుణక్రియలు రెండూ ఉత్ప్రేక్షావిషయములు కావడము ఉత్ప్రేక్షానిమిత్తములు కావడము ఉంటుం దని పెద్దలు అంగీకరించారు. ప్రాచీనుల అలంకారప్రబంధాలలలో ఉత్ప్రేక్ష తొంభయిఆరు భేదాలు

అవుతుంది అని అనడము ఉత్త పరిగణనముమాత్రమె. మేము నిరూపించిన యాభై ఆరు భేదాలే చమత్కారాతిశయము కలిగి ఉంటవి. మిగతావి చారుత్వాతిశయము కలవి అని అనలేము.

* అలంకారసర్వస్వకర్త ఈవిధముగా భేదాలను సంఖ్యానిస్తున్నాడు. వాచ్యోత్ప్రేక్ష జాత్యాదులవలన ౪ విధాలు. భావాభావపద్ధతిని ౨ విధాలు గుణక్రియానిమిత్తాన ౧౬ విధాలు. నిమిత్తోపాదానానుపాదానముల వలన ౩౨ విధాలు. స్వరూప హేతు ఫలాలవలన ౯౬ విధాలు. ఈ విధంగా షణ్ణవతిభేదత్వమును చెప్పడమునె విద్యానాథుడు ఆక్షేపిస్తున్నాడు. నిమిత్తమును చెప్పనప్పుడు గుణక్రియా భేదపరికల్పనము ఏమి సమంజసముగా ఉంటుంది? అని నాథునిభావన.

---

* చిత్రమీమాంసలో అప్పయ్యదీక్షితుడు సర్వస్వకారుని భేద సంఖ్యానమును ఈవిధంగా అందిస్తున్నాడు. పైన చెప్పిన విధంగా ౯౬ విధాలలో ౪౦ తగ్గించి వాచ్యోత్ప్రేక్ష ౫౬ విధాలని, గమ్యోత్ప్రేక్ష ౪౦ విధాలని, మొత్తము రెండూ కలిస్తే మళ్లీ ౯౬ విధాలవుతుందని. ఆతనిసూచన - చూడండి. సర్వస్వకారమతంలో ద్రవ్యానికి స్వరూపోత్ప్రేక్షణమె కాని ఇతరములు ఉండవు. కనుక ౯౬ లో ౧౬ భేదాలు తగ్గించాలి. ఇంకా హేతుఫలోత్ప్రేక్షలలో నిమిత్తము ఉండి తీరాలి కాబట్టి ౨౪ తగ్గించాలి. ఈవిధంగా ౪౦ తగ్గగా, స్వరూపోత్ప్రేక్ష ౩౨, హేతూత్ప్రేక్ష ౧౨. ఫలోత్ప్రేక్ష ౧౨. మొత్తం వాచ్యోత్ప్రేక్ష ౫౬ అవుతుంది. ప్రతీయమానకు కూడా ఈవిధంగానే పరిగణనము. అయితే దీనిలో నిమిత్తము అనుపాత్తము కావడమంటూ ఉండదు. కాబట్టి స్వరూప ౧౬. పూర్వముమాదిరి హేతు ౧౨. ఫల ౧౨. మొత్తము ౪౦ గమ్యోత్ప్రేక్షాభేదాలు. వీనితో వాచ్యభేదాలు ౫౬ కలిపితే మొత్తం ౯౬ సంఖ్య సిద్ధమవుతున్నది. అని విద్యానాథుని మాటను కుదర్చడానికి దీక్షితుడు అటు త్రిప్పి ఇటు త్రిప్పి ౯౬ భేదాలు సాధించినట్లుగా

ఈచెప్పిన భేదాలకు యథాసంభవముగా ఉదాహరణములు ప్రదర్శితము లవుతవి. ముందుగా జాతిస్వరూపోత్ప్రేక్ష ఉదాహృత మవుతుంది.

గుణనిమిత్తము

కీర్తిః కాకతివీరరుద్రనృపతేః సింహాసనాధ్యాసినః
ప్రాచాం భూమిభుజాం యశః పిదధతీ కోటీందుతుల్యద్యుతిః
రక్షోదక్షిణరాజలాభజనితామందప్రమోదోత్థితా
త్రైలోక్యాట్టహాసప్రభేవ కకుభాం ప్రాంతేషు విద్యోతతే.

దీని భావ సమన్వయములు ఉపమాప్రస్తావములో నిరూపితము లయినవి. దీనిలో ప్రమోదగుణము నిమిత్తముగా ఉన్నది. ప్రభాశబ్దము జాతివచనము. మామూలుగా అట్టహాసప్రభ అనేది స్వతస్సిద్ధ మయినా మూడులోకాలకు

ఉన్నది. సర్వస్వకారమతంలో ప్రతీయమానోత్ప్రేక్ష ౪౦ కాదు, ౪౮. ఈవిషయమును సర్వస్వవ్యాఖ్యాత జయరథుడు విమర్శినిలో స్పష్టంగా ప్రదర్శించాడు. అలంకారసర్వస్వకర్త అయిన రాజానక రుయ్యకుడు అలంకారానుసారిణి అనే గ్రంథంలో "ప్రతీయమానోత్ప్రేక్షాభేదా అష్టచత్వారింశత్" అన్నాడట. ఇంతకూ దీక్షితవచనము పొరపాటు. ఇంకా దీక్షితుడు ద్రవ్యానికి స్వరూపోత్ప్రేక్షణము తప్ప హేతుఫలోత్ప్రేక్షలు ఉండనే ఉండవు అనే గట్టినమ్మకంతో చాలా భేదాలు తగ్గించాడు. ఇది సర్వస్వకారునకు సమ్మత మయిన భావం కాదు. ద్రవ్యానికి ఏదో ప్రాయః హేతుఫలోత్ప్రేక్షలు ఉండవు అని అంటున్నాడే కాని అసలు ఉండనే ఉండవు అని అనడంలేదు. "తత్రాపి ద్రవ్యస్య ప్రాయః స్వరూపోత్ప్రేక్షణమే వేతి" అని రుయ్యకుడు "ప్రాయః" పదమును వాడితే దానిని చిత్రమీమాంసాకర్త జారవిడిచాడు. ద్రవ్యానికికూడా హేతుఫలములు ఎక్కడనయినా ఒక్కొకచోట ఉంటే ఉండవచ్చునని రుయ్యకభావము. కనుకనె అలంకారానుసారిణి గ్రంథంలో రుయ్యకుడు హేతుఫలసంభవమును ప్రదర్శించాడట. జయరథవ్యాఖ్యలో ఇదంతా విశదంగా ఉంది.

సంబంధించిన అట్టహాసప్రభ కవికల్పితమె కాబట్టి ఉపమ అనే శంక ఇక్కడ రాదు. అందువలన ఈపద్యంలో ఉన్న 'ఇవ' శబ్దముకూడా సంభావనావాచకమె కాని ఉపమావాచకము కాదు. ఉపమానాంశము లోకసిద్ధ మయినపుడు ఇవ శబ్దము సాధర్మ్యమును సూచిస్తుంది. ఉపమానాంశము లోకసిద్ధము కాక కవికల్పిత మయినపుడు ఇవశబ్దము సంభావనాపర మవుతుంది అని ప్రాచీనులు నిరూపిస్తున్నారు. కీర్తి స్వరూపము అట్టహాసప్రభగా ఇక్కడ ఉత్ప్రేక్షితము.

క్రియానిమిత్తము

వీరస్య రుద్రనృపతేః ప్రియవల్లభస్య
రాజ్యాభిషేకసలిలైః సరసీకృతాయాః
సద్యః సముచ్ఛలితసాంద్రపరాగరేఖా
క్షోణ్యాః ప్రమోదపులకాంకురమంజరీవ.

ఇష్టప్రియుసి కలిగిన ప్రతాపరుద్రుని రాజ్యాభిషేకోదకములచేత సరసీకృత అయిన భూమికి అపుడే బయలుదేరిన దట్టమయిన పరాగరేఖ ఆనందపులకాంకురముల మంజరివలె ఉన్నది. దీనిలో పరాగరేఖ విషయము. పులకమంజరి విషయి. 'ఇవ' సంభావనావాచకము. సరసీకరణము క్రియారూప మయిన నిమిత్తము. కాగా సరసీకరణము నిమిత్తముగా ఉన్న పులకాంకురమంజరీ తాదాత్మ్య సంభావనలో పరాగవిషయముగా ఉన్నది. అని ఈవిధంగా ఉత్ప్రేక్షాస్థలంలో అంతటా బోధస్వభావమును గుర్తించాల.

అనుపాత్తనిమిత్తము

ప్రతాపరుద్రస్య నఖేందుకాంతిః ప్రణామభాజాం పదయో ర్నృపాణాం
లలాటలగ్నా విదిని[?]తాయాః వరావలేః వాచనదీపి కేవ.

ప్రతాపరుద్రుని నఖేందుకాంతి, పాదాలపై ప్రణామము చేస్తున్న రాజుల లలాటములందు విధి వ్రాసిన వర్ణావలికి వాచనదీపిక వలె ఉన్నది. నఖ కాంతి విషయము. వాచనదీపిక విషయి. ఇవ వాచకము. 'దీపికేవ' అని జాతి ఉత్ప్రేక్షిత మయింది. నిమిత్తము ఉపాత్తము కాలేదు.

గుణనిమిత్త జాత్యభావము

ప్రతాపరుద్రస్య గుణామృతోర్మి ధౌతా విరాజం త్యమలీకృతాంగాః
ప్రక్షాళితాత్యుద్ధత భూమిపాలా ఖడ్గాంబుభిః స్వచ్ఛతరా భవంతి

ఈ పద్యార్థము నాదృష్టిలో సుసమన్వితముగా కనపడడము లేదు. వాచ్యోత్ప్రేక్షాప్రస్తావములో సంభావనా వాచకము లేని ఉదాహరణము ఎందుకు వచ్చిందో? ఈ పద్యాన్వయమును కుదర్చడానికి పాఠక పండితులు నానా విధంగా పాఠమును సవరించారు. "ప్రతాపరుద్రస్య గుణామృతోర్మిధౌతేవ రాజత్యమలీకృతాంగా" అని ఒకరిసవరణ. "స్వచ్ఛతరాభవంతీ"అనిన్నీ ఏకవచనంగా చివర దిద్దుబాటు. ఈ పక్షంలో కీర్తిని అధ్యాహారం చేసికొని (లేని దానిని తెచ్చి పెట్టుకొనుట) అన్వయమును సంపాదించాలి. ప్రతాపరుద్రుని కీర్తి, గుణామృతతరంగాలచేత కడుగబడి ఖడ్గోదకములచేత ఉద్ధతరాజులను ప్రక్షాళనము చేసినదై స్వచ్ఛముగా అవుతూ అమలీ కృతావయవములు కలదిగా ఉన్నది. అని ఏదో ఒక భావము. మలీకృతాంగత లేక పోవడము జాత్యభావమని స్వచ్ఛమగుట గుణము నిమిత్తమని సమన్వయించుకోవాలి. "ప్రక్షాళితా వ్యుద్ధత భూమిపాలాః ఖడ్గాంబుభిఃస్వచ్ఛతరా భవంతి" అని పూర్వార్థము కంటె ఉత్తరార్థము వేరు అని భావించే కొందరి సవరణ. కీర్తిని అధ్యాహారం చేసికోవడం

కంటె ఉన్నదానినే ఏదోవిధంగా కుదుర్చుకొంటే బాగుం టుంది. సంభావనా వాచకమును పద్యములో సూచించడానికి చివర "భవంతి" తీసివేసి "ఇవాజా" అని ఏరాట్లు చేస్తే సరి. "సంయతి వీరవర్యాః" అని నాల్గవ పాదంలో పాఠాంతరం ఉన్నట్లు ముద్రిత గ్రంథాలె చెప్పుతున్నవి గదా! ఆజా= యుద్ధములో భూమి పాలకులు అమలీకృతాంగులై విరాజిల్లు తున్నారు అని అర్థం లభిస్తుంది. అని మా మిత్రకవి ఘట్టి లక్ష్మీనరసింహశాస్త్రి సూచన. ఈ భాగము మూలములో ఏమయినా కొంచెము గ్రంథ పాతము ఉన్నదేమో ? అని పిస్తుంది. ఉన్నదానికి ఒక సమన్వయము అవసరము కదా !

అనుపాత్త నిమిత్త జాత్యభావము

దిశాం జేతుః విశ్వప్రథితమహసో రుద్రనృపతేః
జయప్రస్థానోద్య త్కరితురగ సంమర్ద జనితం
రజః కృత్వా గ్రస్తప్రతిబల మసూర్యా మివ దివం
ప్రతాపాఖ్యా నన్యాన్ దిశి దిశి విధత్తే దినకరాన్.

రుద్రనృపతి దిగ్విజేత. ప్రపంచ ప్రఖ్యాత పరా క్రముడు. ఆతని జయప్రస్థానములో గజాశ్వసంమర్దము వలన పుట్టిన పరాగము శత్రు బలమును ఆక్రమించి ఆకాశ మును అసూర్యముగా చేసి ప్రతి దిక్కులోనూ ప్రతాప మన్న పేరుతో ఇంకా సూర్యులను సృష్టిస్తున్నది. "దివం అసూర్యా మివ కృత్వా" అనే అంశములో అనుపాత్త నిమిత్త మయిన జాత్య భావస్వరూపోత్ప్రేక్ష ఉన్నది. సూర్యుడు జాతి. సూర్యాభావము జాత్యభావము. ఈ అయిదూ జాతి స్వరూపోత్ప్రేక్షాపరముగా నిర్దిష్టము లయినవి.

జాతి హేతూత్ప్రేక్ష

ఉదారరీత్యా భుజయా ప్రతాప రుద్రస్య విశ్వైకధురంధరస్య
విశ్వంభరా కోమలశయ్యయేవ విస్మారితా గోత్రమహీధ్రవాసం

విశ్వైకధురంధరు డయిన ప్రతాపరుద్రుని ఉదార స్వభావము కలిగిన భుజముచేత కోమలశయ్యచే వలె భూమి కులపర్వత నివాసమును మరచి పోయేటట్లుగా చేయబడింది. శయ్య జాతివచనము. పర్వతనివాసమును మరచి పోవడములో కోమలశయ్య హేతువు కాకపోయినా హేతువుగా నిరూపిత మయినందు వలన జాతి హేతూత్ప్రేక్ష. పర్వత నివాస విస్మరణము నిమిత్తము.

జాత్యభావ హేతూత్ప్రేక్ష

భూమే రకల్పవృక్షత్వాదివ ధాతా విచింతయన్
సృష్టవాన్ కాకతీశానం నిర్వ్యాజ త్యాగవైభవం.

భూమి కల్పవృక్షములు లేకుండా ఉన్నందువలన కాబోలు విధాత విచారించి కపటము లేని త్యాగ వైభవము కల కాకతీశ్వరుని సృజించెను. కాకతీశ్వర నిర్మాణములో భూమి కల్పవృక్ష రహితము కావడము హేతువు కాదు. అయినా హేతువుగా వర్ణితమయినందువలన హేతూత్ప్రేక్ష. ఫలరూప మయిన కాకతీశ్వరసృష్టి నిమిత్తము. అకల్పవృక్షత్వము జాత్యభావము. అది హేతువు.

జాతిఫలోత్ప్రేక్ష

నూనం విశ్వంభరాధార స్తంభీభవితు మాయతౌ
వీరరుద్రనరేంద్రస్య భుజా వాజానులంబినౌ.

వీరరుద్రుని ఆజానులంబి భుజములు భూమికి ఆధార స్తంభములగుటకు దీర్ఘము లయినవి. నిశ్చయము. స్తంభీ

భవనము ఫలము కాకపోయినా ఫలముగా ఉత్ప్రేక్షిత మయింది. ఆయతత్వమనే గుణము నిమిత్తము. సమన్వయము స్పష్టము. స్తంభము జాతి. ఫలముగా నిరూపిత మయింది.

జాత్యభావఫలోత్ప్రేక్ష

పశూ నవధ్యా నాలోక్య శత్రవః కాకతీశితుః
ప్రాయేణామానుషత్వాయ తృణవృత్తిం సమాశ్రితాః

ప్రతాపరుద్రుని శత్రువులు పశువులు అవధ్యములు అని తెలుసుకొని మానుషత్వము లేకుండుటకు తృణవృత్తిని ఆశ్రయించారన్నట్లుగా ఉన్నది. అమానుషత్వము జాత్యభావము. అమానుషత్వాయ అని చతుర్థీ విభక్త్యంతముగా నిర్దిష్ట మయినందు వలన ఫలముగా ఉత్ప్రేక్షింప బడడము స్పష్ట మవుతున్నది. తృతీయా విభక్తి కాని పంచమీ విభక్తి కాని ఉంటే హేతుత్వము గోచరమవుతుంది. ఒక్కొక చోట ఈ విభక్తులు లేక పోయినా హేతుత్వము సామర్థ్యము వలన వ్యక్త మవుతుంది. కాని ఇవి ఉంటే స్పష్ట గోచరమవుతుంది. ఇదే విధంగా చతుర్థీ విభక్తి ఫలమును గోచరము చేస్తుంది. ఈ పద్యంలోని ఉత్ప్రేక్షలో తృణవృత్తిని ఆశ్రయించుట అనే క్రియ నిమిత్తము. ఇంతవరకేదో సామాన్యంగా జాత్యుత్ప్రేక్షలు నిరూపితములయినవి. ఊహాబలాన్ని అనుసరించి సంఖ్యానించితే చాలా ఉత్ప్రేక్షా భేదములు సిద్ధములయినవి. కాని వీనిని అన్నింటినీ లక్ష్యములలో నిర్దేశించడము కష్టము. ఆ ప్రక్రియ దురవబోధంగా ఉంటుంది కూడాను. ఇక కొన్ని క్రియోత్ప్రేక్షలు నిరూపితము లవుతవి.

క్రియాస్వరూపోత్ప్రేక్ష

శ్రీకాకతీయనృపతేః ద్విషదంగనానాం
శ్వాసోర్మిభిః సపది మర్మరితాంతరాళాః

త్రాసాం నివాసవిధయే కృతయాచనానాం
ప్రత్యుత్తరాణి దదతీవ మరో ర్వనాంతాః

ప్రతాపరుద్రుని శత్రుస్త్రీల యొక్క నిశ్వాస తరంగములచేత మధ్య భాగాలలో మర్మరధ్వనులు కలవిగా చేయ బడిన ఎడారుల లోని వనాంతములు వనంలో నివసించడానికి యాచిస్తూ ఉన్న వాళ్లకు ప్రత్యుత్తరములు ఇస్తూ ఉన్నట్లుగా ఉన్నవి. దీనిలో దదతీవ అని దాన క్రియా స్వరూపము ఉత్ప్రేక్షిత మయింది. మర్మరితాంతరాళాః అని మర్మర ధ్వని కలిగి ఉండడము గుణ రూపమయిన నిమిత్తము.

క్రియా ఒభావస్వరూపోత్ప్రేక్ష

విముఖే సతి కాకతిక్షితీంద్రే వనసీమాపి కఠోరకంటకాగ్రా
చికురేషు వికర్షతి ప్రతీశాన్ అదదానేవ నిజాంతర ప్రవేశం.

శత్రువుల విషయమై ప్రతాపరుద్రుడు విముఖుడు కాగానే వనసీమకూడా కఠోరము లయిన కంటకాగ్రములు కలదయింది. తన ఆంతర ప్రవేశమును ఇవ్వని దానివలె శత్రువులను జుట్టు పట్టి లాగుతున్నది. దీనిలో "అదదానేవ" అని క్రియయొక్క అభావము ఉత్ప్రేక్షిత మయింది. వికర్షణము నిమిత్తము. నిమిత్తాను పాదానమునకు మూలములో లక్ష్యము నిరూపితం కాలేదు.

క్రియా హేతూత్ప్రేక్ష

రాజ్ఞాం గర్వాంకురోద్భేదాః పరిమ్లానా దినే దినే
కాకతీంద్ర ప్రతాపార్క తీవ్రోష్మాభిభవా దివ

రాజుల గర్వాంకురములు ప్రతాపరుద్రుని ప్రతాపమనే సూర్యుని తీవ్రోష్మాభిభవము (తిరస్కారము) వలన

కాబోలు దిన దినము వాడిపోయినవి. అభిభవనక్రియ హేతువుగా ఉత్ప్రేక్షితము కావడములో ఫల రూపమయిన పరిమ్లానము నిమిత్తము.

క్రియాఽభావహేతూత్ప్రేక్ష

కపోలఫలకా వస్యాః కథం భూత్వా తథావిధౌ
అపశ్యంతా వివాన్యోన్య మీదృశీం క్షామతాం గతౌ.

ఈ భేదానికి మూలములో ఉదాహరణము లేదు. వ్యాఖ్యాత సముచితంగా ఉంటుందని దీనిని అందిస్తున్నాడు. ఈ కన్య కపోలములు ఏదో అయి ఆవిధంగా అయినవి. ఒకటొకటి చూచుకోకుండా ఉండి కాబోలు ఇంతగా చిక్కిపోయినవి. దీనిలో 'అపశ్యంతావివ' అని దర్శన క్రియాఽభావము హేతువుగా ఉత్ప్రేక్షిత మయింది. క్షామత్వము పొందడము నిమిత్తము.

క్రియాఫలోత్ప్రేక్ష

దంభోళిసంరంభ మహాజిగోపః ప్రస్థానభేరీ నినదోఽస్యభర్తుః
లీనా నివాన్వేష్టు మరాతివర్గాన్ విగాహతే శైలగుహాంతరాణి.

దంభోళి—వజ్రాయుధము. దాని సంరంభమనే మహాజి—మహాయుద్ధము ఇతరతిరస్కారము. దానిని ఆచ్ఛాదించునది దంభోళి సంరంభమహాజిగోపము. మొత్తముమీద అశని ధ్వనిని తిరస్కరించినట్టి అని అర్థము. అటువంటి, ఆంధ్ర ప్రభువు ప్రస్థానములోని భేరీనినాదము ఎక్కడో దాగి కొన్న శత్రువర్గములను వెతుకుటకు కాబోలు పర్వత గుహాంతరములను ప్రవేశించుతున్నది. దీనిలో అన్వేషణక్రియ ఫలముగా ఉత్ప్రేక్షితము. గుహాంతర ప్రవేశ క్రియ నిమిత్తము.

క్రియాఽభావ ఫలోత్ప్రేక్ష

సీమాద్రి కుంజేషు విహార భాజః సిద్ధాంగనా కల్పిత చంద్రికార్ఘ్యాః
శ్రీవీరరుద్రస్య యశోవిలాసాః గాయంత్యసంస్పృష్టమివాంధకారం

సీమపర్వత నికుంజములలో విహరించే వారు సిద్ధాంగనలు వెన్నెలకు చేసినట్లుగా చేసిన పూజ కల వీరరుద్రుని యశోవిలాసములను, అంధకారమును స్పృశించకుండా ఉండడానికి కాబోలు గానము చేస్తున్నారు. దీనిలో 'అసంస్పృష్ట మివ' అని స్పర్శనక్రియాఽభావము ఫలముగా ఉత్ప్రేక్షిత మయింది గానక్రియనిమిత్తకము. ఇంతవరకుక్రియోత్ప్రేక్షలు.

గుణస్వరూపోత్ప్రేక్ష

చకాస్తి కాకతీంద్రస్య కృపాలోకన విభ్రమః
ప్రకృతిష్వపి సర్వాసు ప్రసాద ఇవ మూర్తిమాన్

కాకతీంద్రుని కృపాదృష్టివిలాసము సర్వప్రకృతులందున్నా మూర్తిమంతమయిన ప్రసాదము (అనుగ్రహము) వలె ప్రకాశిస్తున్నది. ప్రసాదము గుణము. ప్రసాదతాదాత్మ్య సంభావన ఉన్నందున గుణోత్ప్రేక్ష. ప్రసాదమునకు మూర్తిమాన్ అని విశేషణము ఉన్నది. ఈ విశేషణము లేకపోతే ఇది ఉపమాలంకారమె కావచ్చు. కాని అధికవిశేషణ స్వీకారము వలన ఇవార్థము సంభావనలోనే పర్యవసానము పొందుతుందని అనాలి.

గుణాభావస్వరూపోత్ప్రేక్ష

ప్రతాపరుద్రస్య మహాభిషేక పయఃకణైః శీతలితాఖిలాంగా
ప్రశాంతభారార్త ఫణీంద్ర గాఢ శ్వాసానిలోష్మేవ విభాతి పృథ్వీ

ప్రతాపరుద్రుని అభిషేకసమయములోని జలకణముల

చేత చల్లనయిన సర్వాంగములు కలదై భూమి, ఇంత కాలంవరకూ భూభారము చేత పీడితుడయిన ఆదిశేషువు శ్వాసవాయువుల వేడి ప్రశాంత మైనట్లుగా (ప్రశాంత మయిన శ్వాసోష్మ కలదిగా) ప్రకాశిస్తున్నది. పైన అభిషేక జలం పడేటప్పటికి శేషుని శ్వాసముల వలన కలిగిన వేడి శాంత మయింది. ఊష్మ గుణము. అది తగ్గినట్లు చెప్పినందు వలన గుణాభావము. అది ఉత్ప్రేక్షితమయింది. పృథ్వీ విషయమయిన ధర్మి.

గుణహేతూత్ప్రేక్ష

జయశ్రియా మాశ్రయతా ముపైతి శ్రీవీరరుద్రస్య రణే కృపాణః
జయశ్రియం వైరిమహీపతీనాం సముత్సుకో హర్తు మసూయయేవ

యుద్ధములో వీరరుద్రుని కృపాణము జయశ్రీలకు ఆశ్రయ మవుతున్నది. అసూయచే కాబోలు శత్రురాజుల జయశ్రీని హరించుటకు సముత్సుకమై ఉన్నది. దీనిలో 'అసూయయేవ' అని అసూయా గుణము హేతువుగా ఉత్ప్రేక్షిత మయింది. ఫలమయిన హరణౌత్సుక్యము నిమిత్తము.

గుణాభావహేతూత్ప్రేక్ష

జాతా వయం సంపది వీరరుద్ర నరేంద్ర గంభీరిమ గుల్ఫదఘ్నాః
ఇత్యప్రమోదాదివ జీవనేషు మాలిన్య మంభోనిధయో భజంతే

మేము ఇప్పుడు వీరరుద్రుని గాంభీర్యమునకు చీలమండలలోతు కలవార మయినాము అనే అసంతోషము వలన కాబోలు సముద్రములు జీవనములందు (ఉదకములందు) మాలిన్యము (నలుపుదనము, క్లిష్టత) వహించు తున్నవి. దీనిలో 'అప్రమోదాదివ' అని గుణాభావము హేతువు. మాలిన్యము పొందుట నిమిత్తము.

గుణఫలోత్ప్రేక్ష

ఆశిషాం విషధూమ్రాణాం నైర్మల్యార్థ మివోత్సుకాః
భుజంగ్యః కాకతీంద్రస్య గుణా న్గాతుం సుధాముచః

సర్పములు విషమలినములయినకోరలకు నిర్మలత్వము కొరకు కాకోలు కాకతీంద్రుని గుణములను గానము చేయుటకు సుధను వెలువరించుచున్నవి. దీనిలో 'నైర్మల్యార్థమివ' అని గుణము ఫలముగా ఉత్ప్రేక్షిత మయింది. గుణగానము నిమిత్తము నైర్మల్యము–మాలిన్యము లేకపోవుట అనే అర్థమును బట్టి గుణాభావము ఫలముగా ఉన్నదనుకో రాదు. నైర్మల్యపదము వలన స్వచ్ఛతా రూప మయిన గుణమునే గ్రహించాలి. అదే కవివివక్షితము.

గుణాభావఫలోత్ప్రేక్ష

అరణ్యవాసోచిత బాంధవాసు మృగీ ష్వవైరార్థ మివాశరణ్యాః
త్రిలింగదేశేశ్వర వైరినార్యః పరాఙ్ముఖా లోచనవిభ్రమేషు

ఆంధ్రప్రభువు శత్రుస్త్రీలు రక్షించేవారు ఎవరూ లేనివారై అరణ్యనివాసములో బంధువులయిన మృగములందు వైరము లేకుండా ఉండడము కొరకు కాబోలు లోచన విలాసములందు పరాఙ్ముఖులై ఉన్నారు. విలోచనవిలాస విముఖులయిన మృగాంగనలు విలోచనవిలాసినులను చూచి వైరము పొందవచ్చును. ఆ వైరము లేకుండా చేసికొనడానికి వారు విభ్రమవిముఖ లయినారు. దీనిలో 'అవైరార్థమివ' అని వైరాభావ రూపమయిన గుణాభావము ఫలముగా ఉత్ప్రేక్షితము. విభ్రమ విముఖత నిమిత్తము. ఇటు మీద ద్రవ్యోత్ప్రేక్షలను భావించాలి.

ద్రవ్యస్వరూపోత్ప్రేక్ష

న నిత్య మస్మిన్ పరిపూర్ణతేతి త్యక్త్వా నభః క్షోణితలావతీర్ణః
ఆనందయన్ ఇందు రివ స్వధామ్నా విభాతి లోకే నవకాకతీంద్రః

ఈ ఆకాశములో నిత్యపూర్ణత్వము లేదని ఆకాశమును విడిచి పెట్టి భూమిలో అవతరించిన చంద్రుడో అన్నట్లుగా నవకాకతీంద్రుడు తన తేజస్సుతో ఆనందపెట్టుతూ లోకములో భాసించుతున్నాడు. దీనిలో 'ఇందురివ' అని ద్రవ్యస్వరూపము ఉత్ప్రేక్షితము. చంద్రుడు ఏకవ్యక్తి. వ్యక్తిభేదము లేకపోతే జాతి అనరాదు అని నియమము. అందువలన చంద్రుడు ద్రవ్యము. ఇందుతాదాత్మ్య సంపాదనము ఇక్కడ ఉన్నందువలన ఉత్ప్రేక్ష. "ఇందురివ కాకతీంద్రః" అని ఉన్నప్పటికీ ఉపమాలంకారమని అనుకోరాదు. ఇక్కడ ఇవ శబ్దము సంభావనా వాచకమె కాని సాదృశ్య వాచకము కాదు. ఇక్కడ చంద్రుడు చంద్రుడుగా స్వతస్సిద్ధుడే అయినా క్షోణితలావతీర్ణుడుగా నిరూపింపబడి నందువలన స్వతస్సిద్ధుడు కాడు. చంద్రుడు భూమిలో అవతరించడము కవికల్పితము. ఉపమానము కవికల్పితమయితే ఇవార్థము సాదృశ్యము కాదు. సంభావనే అవుతుంది. కనుకనే ఉత్ప్రేక్ష అని ఊహించాలి.

ద్రవ్యస్వరూపాభావోత్ప్రేక్ష

అనన్యసాధారణ దానశౌండే సద్యఃకృతార్థీభవ దర్థిసార్థే
శ్రీకాకతీంద్రే భువి రాజమానే ద్యౌః పారిజాతేన వినాకృతేవ

ఇతరసాధారణము కాని దానశౌండుడూ, వెంటనే యాచకులను కృతార్థులను చేసేవాడూ అయిన కాకతీంద్రుడు భూమిలో ప్రకాశిస్తూ ఉంటే స్వర్గము పారిజాతరహితముగా

చేయబడినట్లయింది. పారిజాతము ఒక్కటే. అది ద్రవ్యము. తదభావము ఉత్ప్రేక్షితము.

ద్రవ్యహేతూత్ప్రేక్ష

ప్రతాపరుద్రదేవేన క్ష్మాభృత్పక్షవిజృంభితం
సమున్మూలిత మామూలా దపరేణేవ వజ్రిణా

ప్రతాపరుద్రునిచేత ప్రసిద్ధ దేవేంద్రునికంటె అతిరిక్తుడయిన (అపర) దేవేంద్రునిచే వలె క్ష్మాభృత్పక్ష విజృంభణము (పర్వతపక్ష-శత్రురాజబల) సమూలముగా ఉన్మూలనము చేయబడినది. దీనిలో "అపరేణేవ వజ్రిణా" అని ఉండడముచేత ద్రవ్యము హేతువుగా ఉత్ప్రేక్షిత మయినదని గ్రహించాలి. ఉన్మూలనము నిమిత్తము. ఇక్కడ అపర శబ్దము లేకపోయి నట్లయితే ఉత్ప్రేక్ష అయ్యేది కాదు. శబ్దమాత్ర సాధర్మ్యము ఉన్నందు వలన శ్లేష అయ్యేది.

ద్రవ్యాభావహేతూత్ప్రేక్ష

కాకతీయ ప్రతాపోష్మ విలీనాంగేన మేరుణా
అసువర్ణాచలేనేవ విరించి ర్వ్యాకులీకృతః

ప్రతాపరుద్రుని ప్రతాపము వేడిలో కరిగి పోయిన అవయవాలు కలిగిన మేరువు పర్వతము చేత సువర్ణపర్వతము కానిదానిచే వలె బ్రహ్మ వ్యాకులముగా చేయబడినాడు. బంగారమయితే ఎంతటి నిప్పులో నయినా కరిగి నశించిపోదు. ఇప్పుడు మేరువు ప్రతాపోష్మలో కరిగిపోయి సువర్ణము లేనిది కావడము చేత బ్రహ్మకు వ్యాకులపాటు కలిగింది. సువర్ణాచలము ఏకవ్యక్తి కాబట్టి ద్రవ్యము. అసువర్ణాచలేనేవ అని ద్రవ్యాభావము హేతువుగా అధ్యవసితమయింది. వ్యాకులపాటు నిమిత్తము.

ద్రవ్యఫలోత్ప్రేక్ష

దుగ్ధార్ణవశతాయేవ కైలాసాచలకోటయే
నూనం ప్రతాపరుద్రేణ యశో దిక్షు ప్రసారితం

నూరు పాలసముద్రాల కొరకు కాబోలు కోటి కైలాస పర్వతాలకొరకు కాబోలు ప్రతాపరుద్రుడు తన యశస్సును దిక్కులలో ప్రసరింప చేసినాడు. యశఃప్రసారము నిమిత్తముగా దుగ్ధార్ణవశతము కైలాసాచలకోటిన్నీ ఫలముగా ఉత్ప్రేక్షితమయింది.

ద్రవ్యాభావఫలోత్ప్రేక్ష

వీరరుద్రనరేంద్రస్య జయప్రస్థానసంభవం
రజః పిహితదిగ్గోళం నిరాకాశ మివ స్థితం

ప్రతాపరుద్రుని జయప్రస్థానములో ఉత్పన్నమయిన పరాగము దిగ్గోళమును కప్పిపెట్టినదై ఆకాశము లేకుండా చేయడమునకో అన్నట్లుగా ఉన్నది. ఆకాశాభావము ఫలముగా ఉత్ప్రేక్షిత మయింది. దిగ్గోలపిధానము నిమిత్తము. ఇప్పటికి ఏదో యథాసంభముగా ఉత్ప్రేక్షలను ఉదాహరించడ మయింది. ఇంకా కొందరు ఈ అలంకారానికి నానాభేదములను నిరూపించారు. ఉపమతో ఉపక్రమము ఉండే ఉత్ప్రేక్షలు కొన్ని. అపహ్నవ గర్భములయిన ఉత్ప్రేక్షలు కొన్ని. ఈ విధంగా ఎన్నో భేదాలు ఉన్నవి. వానిని అలంకార సర్వస్వము విమర్శిని మొదలయిన గ్రంథాలలో గ్రహించాలి. గమ్యోత్ప్రేక్ష ఇక్కడ ఉదాహృతమె కావడములేదు. సంభావనావాచకములు లేకపోతే గమ్యమవుతుంది అని నిరూపితమె. ఈ చెప్పిన ఉదాహరణములనె వాచకపదరహితంగా గ్రహించితే ప్రతీయమానోత్ప్రేక్షోదాహరణత్వమును భావించడము కష్టము కాదు.

అతిశయోక్తి

సాధ్యాధ్యవసాయ మూలక మయిన ఉత్ప్రేక్ష నిర్ణీత మయింది. ఇక సిద్ధాధ్యవసాయ మూలక మయిన అతిశయోక్తిని నిరూపించ వలసి ఉన్నది. అధ్యవసితమునకు ప్రాధాన్యం ఉంటే అతిశయోక్తి అవుతుంది. అధ్యవసాయమును పొందిన వస్తువు అధ్యవసితము. అతిశయోక్తిలో నిగరణము భూతకాలమునకు సంబంధించినది గాను, ఉత్ప్రేక్షలో నిగరణము వర్తమానకాలమునకు సంబంధించినది గానూ ఉంటుంది. అతిశయోక్తిలో అధ్యవసాయమును స్వీకరించడములోని తాత్పర్యమును ఈ విధంగా స్వీకరించ వచ్చు. ఒక వస్తువు వేరొక వస్తువు గర్భప్రవిష్ట మవుతుంది. స్వస్వరూపంతో వేరుగా కనపడదు. వాస్తవ మయిన వస్తువు అన్యవస్తువు యొక్క ఉదరంలోనే ఉండి ప్రతీత మవుతుంది. ఈ వస్తువును ఉదరంలో పెట్టుకొని ఈ విధంగా నిగరణము చేసిన వస్త్వంతరము ఆ స్థలంలో వాస్తవంగా లేదు. అది లోకం హద్దును దాటి ఉంటుంది. ముఖమును చెప్పదలచి కమలము అని ప్రయోగించి నప్పుడు ఈ అంశమునె గుర్తించాలి. అక్కడ కమలము ముఖమును నిగీర్ణము చేసింది. ముఖము స్పష్టంగా శబ్దము వలన ప్రతిభాసించడము లేదు. అది కమలగర్భ ప్రవిష్ట మయింది. కమలము కమలమనే శబ్దముతో ఉపాత్తమై ఉన్నప్పటికి కమలవస్తువు అక్కడ వాస్తవంగా లేదు. వాస్తవ మయిన ముఖమును అవాస్తవంగా నిశ్చయపరచి అవాస్తవ మయిన కమలమును వాస్తవంగా గోచరింప చేస్తూ నిరూపించడ మంతా లోకమార్గమును అతిక్రమించి ఉంటుంది. అందువలననే ఇది అతిశయోక్తి. ఉత్ప్రే

క్షలో ఇట్లా ఉండదు. అది సంభావనా రూపము. ఉత్కటైక కోటికమయిన సందేహ మన్నమాట. ముఖము చంద్రుడు అనే రెండుకోటులలో (అంశము) చంద్రరూప మయిన ఒక కోటి యందు సందేహజ్ఞానము యొక్క మొగ్గుదల ఉంటుంది. అంతేకాని అక్కడి జ్ఞానమునకు నిశ్చయరూపత్వము ఉండదు. అందువలననే అది లోకాతిక్రాంతము కాదు. అంతటా అధ్యవసానంలో మూడు సంభవించుతూ ఉంటవి. అధ్యవసాన స్వరూపము విషయము విషయి అని. విషయము విషయిచే కుక్షీకృతమై నిగీర్ణ మయినప్పుడు అధ్యవసాయానికి స్వరూప లాభము ఉంటుంది. విషయానికి స్వరూప ప్రతిపత్తి ఉండదు. సంభావనా వాచకము లయిన "నూనం, ధ్రువం, ప్రాయః" మొదలయిన శబ్దాలచేత అధ్యవసాయము సాధ్య మయినప్పుడు ఉత్ప్రేక్ష అవుతుందని ఇదివరలో నిరూపితము. నూనమాది శబ్దాలు లేకపోతే విషయికే ప్రాధాన్యం ఉంటుంది. అందువలననే అక్కడ అధ్యవసాయము సిద్ధము. ఇటువంటి విషయవివేకమును అవగతం చేసికొన్న తరువాత లక్షణ భావనము చేయుడము యుక్తముగా ఉంటుంది.

విషయస్యానుపాదానా ద్విషయ్యుపనిబధ్యతే
యత్ర సాఽతిశయోక్తి స్స్యా త్కవిప్రౌఢోక్తిజీవితా

ఇది అతిశయోక్తి లక్షణము. ప్రకృతమయిన ముఖాదికము విషయము. దానిని శబ్దముచేత చెప్పనందువలన అంటే; విషయిపదార్థముచేత నిగీర్ణ మయినందువలన, అప్రకృతమయిన చంద్రాది విషయి, ప్రధానముగా నిరూపింపబడినప్పుడు అతిశయోక్తి అవుతుంది. ముత్తెపు చిప్పను చూచి "ఇది రజతము" అని ప్రయోగించిన చోట కూడా

కేవలము విషయి మాత్రమె శబ్దోపాత్త మయినందువలన అతిశయోక్తి అని అనుకోవలసి వస్తుంది. కాని అది అతిశయోక్తి కాదు. అతిశయోక్తిలో కవిప్రౌఢోక్తి జీవ మిచ్చేదిగా ఉండాలి. ఇది రజత మనే చోట కవిప్రౌఢోక్తి జీవితత్వము లేదు. కవిప్రౌఢోక్తి చేత విషయమును తిరోధానించి విషయి నిబంధింపబడి నప్పుడు అతిశయోక్తి అవుతుంది. ఇటువంటి ఇది నాలుగు విధాలు.

౧. భేదమున్నా అభేదము చెప్పడము
౨. అభేదమున్నా భేదమును చెప్పడము
౩. సంబంధము ఉన్నా అసంబంధము చెప్పడము
౪. అసంబంధము ఉన్నా సంబంధము చెప్పడము

కార్యకారణములకు పౌర్వాపర్యమును విపర్యయముగా చెప్పడము (ముందు వెనుకలను మార్చి చెప్పడము) రూపముగా ఉన్న దానినికూడా అతిశయోక్తి అని అంటున్నారు. కాని అది అధ్యవసాయ మూలకము కాదు. కాబట్టి ఇది పూర్వము చెప్పిన వానికంటె వ్యతిరిక్తము. అయినప్పటికీ కవిప్రౌఢోక్తి మూలకముగా ఉన్నందువలన అతిశయోక్తి అని వ్యవహారము కలిగింది.

౧ భేదమున్నా అభేదము

స్థానే కల్పతరు ర్జాతః కాకతీయ మహోదధేః
లక్ష్మీపతి రసౌ చిత్రం మర్త్యరూప మహోత్సవః

కాకతీయ వంశమనే సముద్రమునుండి కల్పతరువు ఉత్పన్నమయింది. ఇది యుక్తమె. కాని ఈ పుట్టినట్టిది మానవులకు మహోత్సవముగాను లక్ష్మీపతిగానూ ఉండడము చిత్రముగా ఉన్నది. సముద్రమునుండి కల్పతరువు పుట్టడము

యుక్తమే. లక్ష్మి కూడా సముద్రము నందే పుట్టింది. కల్పతరువు లక్ష్మీదేవికి సోదరభావంతో ఉండడము అమర్త్యులకు మహోత్సవము కావడమూ యుక్తము. కాని ఈ కల్పతరువు ఈ విధముగా కావడము మాత్రము చిత్రము అని పద్యభావము. ఈ పద్యము ప్రథమపాదములో కల్పతరుపదము విషయివాచకము. దానిచేత ప్రతాపరుద్రుడు అధ్యవసితుడయినాడు. విషయమయిన ప్రతాపరుద్రుడు శబ్దోపాత్తము కాలేదు. ఇక్కడ అధ్యవసిత కల్పవృక్షమునకే ప్రాధాన్యము ఉన్నందు వలన అతిశయోక్తి. కల్పతరువునకూ ప్రతాపరుద్రునకూ వాస్తవంగా భేదము ఉంది. అయినా అధ్యవసాన ప్రభావం వలన అభేదము గోచర మవుతున్నది. కాబట్టి ఇది ప్రథమభేదోదాహరణము. "కాకతీయమహోదధేః" అనేది ప్రకృతోదాహరణము కాదు. అది రూపకమే అవుతుందని స్పష్టమే. మొత్తం మీద దీనిలో ప్రతాపరుద్రకల్పవృక్షములకు అభేదాధ్యవసాయము ఉన్నదని గ్రహించాలి.

ఈ పద్యంలో కాకతీయమహోదధేః అని రూపకము ఉంది. దాని బలం వలన 'కల్పతరుర్జాతః' అనే చోట కూడా రూపకమునే సాధించుకోవలె గదా! ఒకే పద్యంలో అఖండంగా వాక్యార్థమును భావన చేయవలసిన అవసరం ఉన్నప్పుడు ఐకార్థ్యమునకు భంగం లేకుండా రూపకమే అని అనడము బాగుంటుందేమో? అని శంకించడానికి అవకాశం లేకపోలేదు గాని లక్షణసమన్వయము కోసరము ఖండరూపంగా భావించి అభేదాధ్యవసాయముతో అతిశయోక్తిని నిశ్చయించుకోవాలి.

౨ అభేదమున, భేదము

> ఔన్నత్యం మహ దన్యదేవ మహితః కోప్యేష గంభీరిమా
> కాప్యన్యా సరణిః ప్రతాపయశసో రన్యైవ బాహ్వోః ప్రథా
> సర్వం నూతన మేవ రుద్రనృపతే ర్జానే న తన్నిర్మితౌ
> సామగ్రీ చతురాననేన కియతీ కీదృక్క్రమా కల్పితా.

ఇది నిరూపితార్థమె. దీనిలో ఔన్నత్యము గంభీరిమ మొదలయిన వానికి వాస్తవంగా భేదము లేకపోయినా 'అన్య దేవ కోపి' అని చెప్పడము చేత కాల్పనిక మయిన భేదము ఉన్నది. అందువలన సమన్వయము విశదము. ఈ భేద ములో కేవలమూ ఈ రూపంగానే సమన్వయము చెప్పు కొంటే అసలు అధ్యవసాయ లక్షణము సుసంగతమయి నట్లుగా లేదుకదా! ఇది ఎట్లా కుదురుతుంది? అనే సందే హము కలుగ వచ్చు. అపుడు ఈ అభిప్రాయముతో సమ న్వయమును దర్శించాలి. ఈ అతిశయోక్తి అలంకారభేదా లలో అంతటా కవిప్రతిభా నిర్మితమయిన అతిశయము కన్ప డుతూ ఉంటుంది. ఈ అతిశయరూపమయిన ఫలమె అతిశ యోక్తిలో ప్రయోజకముగా ఉంటుంది. అదె ఇక్కడ నిమి త్తము. ఈ భేదాలలో ఈ అతిశయాఖ్యఫలమునే కవి ప్రధా నంగా ప్రతిపాదింప దలచి ఉంటాడు. ఇట్లా కవి ముఖ్య తాత్పర్యవిషయమైన నిమిత్తమునందె అధ్యవసాయమును గ్రహించాలి. ఔన్నత్యం మహదన్యదేవ అన్నపుడు వాస్త వము స్వతస్సిద్ధమయిన ఔన్నత్యము ఒకటిన్ని కవిసమర్పిత మయిన ఔన్నత్యము వేరొకటిన్ని ఉన్నదని గ్రహించాలి. ఫలరూపములయిన ఈ రెండు ఔన్నత్యాలకు భేద మున్నప్ప టికీ అభేదాధ్యవసాయము ఉన్నదని గ్రహించాలి. అంతే కాని ఆఫలము కలిగిన ఫలి పదార్థములకు (ధర్మి పదార్థము

లకు) అభేదాధ్యవసాయము కుదరదు. వాస్తవంగా భేదము ఉన్నవానికి అభేదము కుదరదు. అందువలన అక్కడ అభేదాధ్యవసాయకల్పన యుక్తము కాదు. ఎక్కడ అతిశయము ఉంటుందో అక్కడే అధ్యవసాయము యుక్తము. ఫలము లోనే అతిశయము ఉన్నది కాబట్టి అక్కడే అధ్యవసాయము. ఇదే విధంగా ప్రథమోదాహరణంలో కూడా గ్రహించాలి. అక్కడ స్వతస్సిద్ధమయిన వదాన్యత్వము ఒకటి కవిప్రతిభాసిద్ధ మయిన వదాన్యత్వము వేరొకటి. ఆ రెండిటికీ అక్కడ అభేదాధ్యవసాయము. అంతటానిమిత్తాంశములోనే అభేదాధ్యవసాయమును అంగీకరించాలి. అంతే కాని రాజకల్పవృక్షములకు అభేదాధ్యవసాయము రాదు. అయితే ఆ శ్లోక సమన్వయ కథన సమయంలో రాజ కల్పవృక్షములకు అభేదాధ్యవసాయము ఉన్నదని చెప్పినమాట సత్యమె. అంతటా ఫలములకె అధ్యవసాయమునుఅంగీకరిస్తూ అక్కడమాత్రము ఫలిపదార్థములకు అభేదాధ్యవసాయమును చెప్పడము విరూప ముగా ఉంటుంది. అక్కడ ప్రతాపరుద్రకల్పవృక్షములకు అభేదాధ్యవసాయము అనే మాటను ఫలగతాధ్యవసాయ విషయముగా భావించితే విరోధము ఏమీ లేదు. రెండవ భేదంలో అభేదాధ్యవసాయమును కుదర్చడానికి ధర్మ్యభేదాధ్యవసాయమును అంగీకరించక తప్పదం లేదు. మొదటి భేదంలో ధర్మిఅధ్యవసాయము రెండవ భేదంలో ధర్మ్యధ్యవసాయము అనే రీతి యుక్తంగా ఉండదు. అంతటా ఒకే విధముగా ధర్మ్యధ్యవసాయమును గ్రహించడమె సమంజసము.

౩ సంబంధములో అసంబంధము

శిలా చింతారత్నం తరు రమరశాఖీ పశు రసౌ
వియద్ధేనుః సర్వం జగదపి తథా దోషవిధురం
న సృష్టి ర్వైధాత్రీ తదిహ చతురశ్రీః కథ మియం
స్పృశే ద్దేవం రుద్రం సకలగుణసామ్రాజ్యనిలయం.

చింతామణి శిల. కల్పవృక్షము చెట్టు. ఆ కామ ధేనువు పశువు. సర్వజగత్తున్నూ ఇట్లా దోషవివశమై ఉంది. ఇదంతా చూస్తే బ్రహ్మసృష్టిరచన చతురశోభ కలదిగా కన పడడము లేదు. ఇటువంటి ఈ సృష్టి సకలగుణసామ్రాజ్య నిలయుడయిన ప్రతాపరుద్రదేవుని ఏవిధంగా స్పృశిస్తుంది? దీనిలో ప్రతాపరుద్రునకు బ్రహ్మసృష్టిసంబంధము ఉంది. అయినా అసంబంధము నిరూపితమయింది. ఈశ్వరుడు బ్రహ్మసృష్టిని అతిక్రమించినవాడు. వీరరుద్రుడున్నూ బ్రహ్మ సృష్ట్యతీతుడు. కనుక ఆ ఈశ్వరునితో అధ్యవసాయము ఉన్నదని ఊహించాలి. ఇట్లా అధ్యవసాయమును చెప్పితే మొదటి భేదములో మాదిరిగా ధర్మి అధ్యవసాయమునే చెప్పినట్లవుతున్నది. కనుక దీని భావమును ఈ విధంగా గ్రహించాలి. ప్రతాపరుద్రుడు సకలగుణ సామ్రాజ్య నిల యుడు కదా! ఈశ్వరుడూ అటువంటి వాడె. స్వతస్సిద్ధ మయిన గుణాతిశయము కవిప్రౌఢోక్తి సిద్ధమయిన గుణాతి శయము అనే రెండింటికీ అభేదాధ్యవసానము ఉన్నది. ఇటు వంటి నిమిత్తాంశములోని అధ్యవసాయము మూలముగా ఈశ్వర ప్రతాపరుద్రులకు అభేదాధ్యవసాయము ప్రతిభా సిస్తుంది. కాగా ఇక్కడ కూడా పూర్వములో మాదిరిగానే ధర్మ్యధ్యవసాయమును గుర్తించాలి.

౮ అసంబంధములో సంబంధము

బ్రహ్మన్! మేరుగిరౌ కృతేపి కిమిదం? నైవంవిధా స్తే ముదః
స్వామిన్! సత్య మధిక్రియాఽద్య ఫలితా యద్వీరరుద్రః కృతః
మిథ్యా కిన్ను వికత్థసే? త్రిజగత స్త్రాణాయ మత్ప్రార్థితః
శంభుః క్ష్మా మవతీర్ణవానితి కథా జాతా హరిబ్రహ్మణోః

ఇది హరిబ్రహ్మల సంవాదాత్మక పద్యము. మొదట హరివాక్యము. ఓ బ్రహ్మ! మేరుపర్వతమును సృజించినా నీకు ఇటువంటి సంతోషములు కలుగ లేదే! ఇదేమిటి? ఇప్పుడు ఇంతగా సంతోషిస్తున్నావు? ఇక బ్రహ్మ సమాధానం చెప్పుతున్నాడు. స్వామి! నిజమె. నా జగత్సృష్టి అధికారము నేడు ఫలించింది. శ్రీవీరరుద్ర నిర్మాణము అయింది కదా! అందువలన ఇంతగా సంతోషపడుతున్నాను. హరి:- ఓహో! అంతా అబద్ధము చెప్పుతున్నావె! నీవా? వీరరుద్రనిర్మాణం చేసింది? సరి సరి!! మూడు లోకాలను రక్షించ డానికి నేను ప్రార్థించితే శంభుడు తనంతట తాను భూమికి అవతరించాడు.'' ఈ విధంగా ఒకనాడు హరిబ్రహ్మలకు కథ సాగింది. దీనిలో హరిబ్రహ్మలకు ఇటువంటి గోష్ఠీసంబంధము లేక పోయినా సంబంధము ఉన్నట్లుగా నిరూపిత మయింది. శంభువుతో కాకతీంద్రునకు అభేదాధ్యవసాయము ఉన్నదని గ్రహించాలి. కేవలము ఈ విధంగానే చూస్తే ధర్మి అధ్యవసాయమె ఉన్నట్లు కన్పడుతుంది. అయినా శివవీరరుద్రులకు అభేదమును గోచరింప చేయడములో నిమిత్తమయిన సర్వలోకరక్షా దక్షత్వ రూపమయిన ధర్మమును భావించి స్వతస్సిద్ధమయిన రక్షాదక్షత్వమునకు కవిప్రతిభా ప్రసూతమయిన రక్షాదక్షత్వమునకూ అభేదాధ్యవసానమును అభ్యూహించాలి. శంభువుతో అభేదాధ్యవ

సాయము అనే మాట ఈ నిమిత్తాధ్యవసాయ మూలకమని గ్రహించితే అన్నిటిలోనూ అనుగతమయిన సమన్వయం లభిస్తుంది.

౫ పౌర్వాపర్యవిపర్యయము

ఇది అతిశయోక్తికి అయిదవ భేదము. అధ్యవసాయము దీనిలో ఉండదని మొదటిమాట. ఈ భేదానికి కార్యకారణ పౌర్వాపర్య విధ్వంసము అని పూర్వపు పేరు. కార్యకారణ విధ్వంసము పౌర్వాపర్య విధ్వంసము అని దీనిని విభాగించవచ్చు. కాగా దీనిని అయిదు విధాలుగా గ్రహించడానికి వీలుంది. లోకప్రసిద్ధము లయిన కార్యకారణములను విధ్వంసము చేయడము మార్చి వేయడము అని రెండు విధాలు. పౌర్వాపర్యము అనేది మొదట తర్వాత అన్న క్రమంతో ఉంటుంది. ఇటువంటి ప్రసిద్ధక్రమమును విధ్వంసము చేయడము అటూ ఇటూ మార్పు చేయడము రెండిటినీ సమకాలంలో చెప్పడము అని మూడు విధాలు లభిస్తున్నవి. కార్యకారణముల ముందు వెనుకలను మార్చి వేయుట అనే ఒక భేదమునె ప్రస్తుతము విద్యానాథుడు స్వీకరించినాడు. ఉదా:—

మాతః కథం కాకతినాథ దృష్టే రగ్రేసరాః కామశరాః పతంతి ?
తద్రూపలావణ్యజితః స్మరోపి నూనం గతః కింకరతా మముష్య.

కామశరపీడ సహించలేక ఒకపిల్ల తనతల్లితో అంటున్నది. అమ్మా ! కాకతినాథుని దృష్టి కంటె ముందుగా మన్మథబాణాలు ఎట్లా పడుతున్నవోనే ? ఆయన రూప లావణ్యపరాజితుడయిన మన్మథుడు కూడా ఆయనకు కింకరుడు అయినాడేమోనమ్మా ! దృష్టిపాతము కారణము. స్మర

శరపాతము కార్యము. మొదట కార్యము ఉండదు. కారణమె ఉంటుంది. దీనిలో వ్యత్యయము ఉన్నది కాబట్టి సమన్వయము *స్పష్టము.

---

* స్పష్టసంబద్ధమయిన ఒక అంశమును ఇక్కడ మీమాంసించవలసి ఉన్నది. ఈ మీమాంసాఫలముగా తేలే సారాంశ మిది. కార్యకారణ పౌర్వాపర్య విపర్యయరూపమయిన అతిశయోక్తి పంచమభేదము కూడా అధ్యవసాయమూలకమె. మొదటి నాలుగు భేదాలలోనూ అధ్యవసాయమును సమర్థించడానికి నిమిత్తాంశము దాకా ధావనము చేయనక్కరలేదు. అంతటా ధర్మి పదార్థాధ్యవసాయమే సిద్ధమవుతుంది. అన్నిటిలోనూ అధ్యవసిత ప్రాధాన్యమె లభిస్తుంది. కాబట్టి అతిశయోక్తిహాని లేదు. అని విద్యానాధుని అర్థాలంకార భాగరచన కంతకూ అలంకార సర్వస్వము తద్వ్యాఖ్యానమయిన విమర్శిని మూలాధారము. వాఖ్యామూల సారాంశమును తన గ్రంథంలో నిబంధించినాడు. ఎక్కడనయినా ఒక్కొక చోట కొంత అతిక్రమణము ఉన్నప్పటికీ అది అహేతుకము కాదు. ఈ అతిశయోక్తి రచనలో విమర్శినీ సర్వస్వాతిక్రమణమును సూచించే మాటలు కన్పడుతున్నవి. అవి సహేతుకంగా లేవు. ఇటువంటి అతిక్రాంతిని విద్యానాధుడు స్వయముగా చేసి ఉంటాడని అనుకోలేము. ఎవరో కొందరు కొన్ని ఇతరగ్రంథాలనుచూచిన వారు అసంస్కారంతో కొన్ని పంక్తులను విద్యానాధగ్రంథంలో సంబంధింపచేసి ఉంటారు. ఆ రీతినే వ్యాఖ్యాత సోమపీధి కూడా అనుసరించాడు చూడండి.

సర్వస్వకర్త అతిశయోక్తికి అధ్యవసిత ప్రాధాన్యమును అంగీకరించి అయిదు ప్రకారములనూ చెప్పి కార్యకారణ పౌర్వాపర్యవిధ్వంసనమును కూడా వానిలోనే కూర్చినాడు. ఈ భేద భేదోదాహరణములను విశదం చేసిన విమర్శినీకర్త అధ్యవసిత ప్రాధాన్యమును కూడా సమన్వయించి ప్రదర్శించాడు. కాబట్టి "కార్యకారణ పౌర్వాపర్య విపర్యయరూపము అనధ్యవసాయమూలము" అనే అర్థమిచ్చే పంక్తి విద్యానాధరచనలో ప్రక్షిప్తమై ఉంటుంది. ఇంకా రెండవ భేదంలో అధ్యవసాయమును సమర్థించడానికి స్వతస్సిద్ధకవిప్రౌఢోక్తిసిద్ధమయిన ధర్మములను అభేదాధ్యవసాయమును చెప్పడము అసంగతము, పూర్వాపర వచన విరుద్ధమూను. ప్రథమభేదములో ప్రతాపరుద్ర కల్పవృక్షము

ఇంతగా ఇది అపపాఠమని జయరథుడు చెప్పుతూ ఉంటే దానిని ప్రామాణికంగా ఎందుకు గ్రహింపవలసి వచ్చిందో ? సర్వస్వమునకు సంజీవినీవ్యాఖ్యానమురచించిన శ్రీ విద్యాచక్రవర్తి ఫలాధ్యవసాయమును అంగీకరించే

లకు అభేదాధ్యవసాయము ఉన్నదని స్పష్టముగా పంక్తిరచన ఉన్నది. అట్లాగే మూడవభేదములో ఈశ్వరునితో వీరరుద్రునకు అభేదాధ్యవసాయము అని, నాలుగో భేదములో శంభువుతో కాకతీంద్రునకు అభేదాధ్యవసాయము అని ధర్మి పదార్థాధ్యవసాయమె నిరూపితమయింది. దీనిని బట్టి రెండవభేదములో చెప్పిన ధర్మాధ్యవసాయ పరమయిన పంక్తి ప్రక్షిప్తమనక తప్పదు.

అయితే వ్యాఖ్యాత సోమపీథి మూలములో ధర్మి అధ్యవసాయమును చెప్పే వచనాలను కూడా ధర్మాధ్యవసాయ పరంగా సమన్వయించ వలసిందని నిరూపించాడు. ఎందుకై ఆ పండితుడు ఆ సమన్వయమును అందించుతున్నాడు ? అని ఆలోచిస్తే అలంకారసర్వస్వ గ్రంథంలోని ఒక అపపాఠము ఆయనకు కన్పడి ఉండవచ్చు అని తోస్తుంది. సర్వస్వగ్రంథంలో ధర్మాధ్యవసాయందాకా ధావనం చేసిన రచన కన్పడుతున్నది. అది అపపాఠమని విమర్శినీకర్త జయరథుడు చక్కగా నిరూపించాడు. అతని ఆ పంక్తులు ఇక్కడ స్మరించడం అవసరం.

"అతఏవ చాత్రాతిశయ్యాఖ్య మిత్యాదిః తదభిప్రాయేణైవ అధ్యవసిత ప్రాధాన్యం ఇత్యంతశ్చ ఉత్తరకాలికో గ్రంథః స్వమతి జాడ్యాత్ లేఖకై రన్యథా లిఖిత ఇతి నిశ్చినుమః. అయం హి గ్రంథకృతః పశ్చాత్ కైశ్చి ద్విపశ్చిద్భిః పత్రికాభి ర్లిఖిత ఇత్యవగీతా ప్రసిద్ధిః. తతశ్చ తై రనవధానేన గ్రంథాంతరప్రసంగత్వాత్ అనుపయుక్తత్వాద్వా పత్రికాంతరా దయ మసమంజసప్రాయః గ్రంథఖండో లిఖిత ఇతిన పున రేకత్రైవ తత్రైవ "ముఖాదీనాం కమలాద్యై ర్భేదేఽప్యభేదః" ఇత్యుక్త్వాపి "న తు వదనాదీనాం కమలాదిభి రభేదాధ్యవసాయః యోజనీయః" ఇత్యాది వచనం పూర్వాపర పరాహతం అస్య వైదుష్యశాలినో గ్రంథకారస్య సంభావ్యం. ....ఇత్యలం అసంగత గ్రంథోద్ధీరణేన."

వాడు కావడము వలన ఆ వ్యాఖ్యానశరణులు అట్లాగే తలచి ఉంటారు. అందువలననే ధర్మి అధ్యవసాయమును నిరూపించే పంక్తులను కూడా ధర్మాధ్యవసాయ పరంగానే సమన్వయించారు. కుమారస్వామిసోమపీథి, విమర్శినీగ్రంథమును నిభాలనము చేసిన వాడయినా తండ్రి అయిన మల్లినాథునిపై అభిమానంతో ధర్మాధ్యవసాయమును సమన్వయించాడు. మల్లినాథుడు విద్యాధరుని ఏకావళి గ్రంథ వ్యాఖ్యాత. ఆ వ్యాఖ్యానంలో ఆయన సంజీవినీకర్తను బంధువుగా తలచి ఫలాధ్యవసాయమును నిరూపించాడు. సోమపీథిన్నీ తండ్రి అడుగులో అడుగు వేశాడు. అబాల సులభమయిన ఈ ప్రసంగమును ఇంతతో ఆపి ఏతద్విషయ విజ్ఞానమును విమర్శించి విశదము చేయడము యుక్తమని మనవి చేస్తున్నాను.

౧౩ సహోక్తి

అతిశయోక్తి సహోక్తి వినోక్తి సమాసోక్తి మొదలయిన కొన్ని అలంకారాలలో ఉక్తి అన్న పదము ఉన్నది. ఈ ఉక్తిసామ్యము వీనికి ఉన్నందు వలన అలంకార నిరూపణములో ఇక్కడ సహోక్తి నిరూపణము అవసర మవుతున్నది. ఇంకా సహోక్తి అతిశయోక్తిహేతుకము. కనుకనే దాని తరువాత దీని నిరూపణము ఉచితము.

సహార్థే నాన్వయో యత్ర భవే దతిశయోక్తితః
కల్పితౌపమ్య పర్యంతా సా సహోక్తి రితీష్యతే.

అతిశయోక్తి వశము వలన సహార్థముతో అన్వయము ఉన్నచోట సహోక్తి అలంకారము అవుతుంది. ఔపమ్యము దీనిలో పార్యంతికముగా (చివర–పర్యవసాన

ములో) గోచరిస్తుంది. ఆ ఔపమ్యము వాస్తవము కాదు. కల్పితము. ఇటువంటిది సహోక్తి అని సామాన్యంగా లక్షణ భావము. రెండు పదార్థములలో ఒక దానికి సహార్థముతో అన్వయము ఉంటుంది. "కీర్తిః శత్రుభిః సహ దిగంతం అగమత్" అనే చోట కీర్తికి శత్రువులకు గమన క్రియా న్వయము ఉన్నది. కీర్తి శత్రువులతో కూడా దిగంతములకు పోయినది అని దాని అర్థము. ఇక్కడ సహార్థముతో అన్వయము. 'సహ' అనే పదమునకు కూడా అని అర్థము. కేవలము సహ పదమె ఉండనక్కర లేదు. సహశబ్దము యొక్క అర్థము కల ఏ పదమయినా ఉండ వచ్చును. సహ పర్యాయములు సాకం సార్థం సమం సహ మొదలయినవి. రెండు పదార్థములకు సహార్థాన్వయము ఉంటే గుణప్రధాన భావం వస్తుంది. ఆ రెండింటిలో ఒకటి ప్రధాన మవుతుంది. వేరొకటి అప్రధాన మవుతుంది. ఒక క్రియలో రెండిటికి సమంగా అన్వయము కలగదు. ఒకటి ప్రధానము, వేరొకటి అప్రధానమూ కాక తప్పదు. 'పుత్రేణ సహ ఆగతః పితా' అనే చోట పితకు ఆగమనక్రియతో సాక్షాదన్వయము ఉన్నది. పుత్రుడు సహార్థముతో సంబంధించి అన్వయము పొందు తున్నాడు. సాక్షాత్తుగా సంబంధించేది ప్రధానము. 'సహ యుక్తేఽప్రధానే' అనే వ్యాకరణ నియమానుసారంగా అప్రధానమునకు సహయోగం ఉంటుంది. సహయోగం ఉన్న దానికి నియమానుసారంగా తృతీయా విభక్తి కలుగుతుంది. 'త్వం అనేన సహ విహర' నీవు ఈతనితో కూడా విహరించు అనేచోట సహార్థయోగం ఉన్నప్పటికీ అంతమాత్రాన అది సహోక్తి అలంకారము కాదు. ఉపమానోపమేయభావము

ఉన్నప్పుడే సహోక్తి అలంకార మవుతుంది. తృతీయాంతము నియమంగా అప్రధానమవుతుంది కాబట్టి ఉపమానము. మిగతా రెండవది విధివిభక్తి కలిగి ఉంటుంది కాబట్టి ఉపమేయము. ఇట్లా రెండిటికీ ఉపమానోపమేయభావం ఉంటే ఇది అలంకారము. ఇక్కడఉండే ఉపమానోపమేయభావము కల్పితమె కాని వాస్తవం కాదు. ఉపమానము అప్రకృతము కావాలి. ఉపమేయము ప్రకృతము కావాలి. అని ఒక నియమము. ఇక్కడ రెండూ సహార్థసామర్థ్యము వలన ప్రాకరణికములు అవుతవి. కొన్నిచోట్ల రెండూ అప్రాకరణికములె అవుతవి. అందువలన వాస్తవప్రసిద్ధమయిన ఉపమానోపమేయభావం రాదు. వివక్షాధీనమయిన ఉనమానోపమేయ భావం ఉంటుంది. కనుకనే ఇక్కడ భేదప్రధాన సాధర్మ్యము ఉంటుంది. ఇక్కడ రెండుపదార్థాలకు కనపడుతున్న గుణప్రధానభావము శబ్దము వలన సిద్ధమయినదే కాని వాస్తవం కాదు. ఇటువంటి గుణప్రధానభావమును అవలంబించి ఉన్న భేదప్రాధాన్యం కూడా వాస్తవం కాదు, శాబ్దమె. సాదృశ్యము చక్కగా పర్యవసన్న మవుతున్నపుడు భేదము అభేదమూ కనపడవు. ఈ సహోక్తి నియమంగా అతిశయోక్తి మూలమై ఉంటుంది. భేదమున్నప్పటికీ అభేదరూపమయిన అతిశయోక్తి, కార్యకారణ పౌర్వాపర్య విపర్యయ రూపమయిన అతిశయోక్తి సహోక్తిమూలములు. ఇట్లా ఈ అతిశయోక్తి వలననే గుణప్రధానభావంతో అన్వయము వస్తుంది. వైవక్షిక మయిన ఉపమానోపమేయభావము సిద్ధిస్తుంది.

కార్యకారణ పౌర్వాపర్య విపర్యయ రూపమయిన అతిశయోక్తి మూలముగా ఉన్న సహోక్తికి ఉదా :—

అంధ్రక్షమాభృ త్సుభటాసిధారా రణేషు నీలోత్పలపత్రభాసః
పతంతి కంఠేష్వరిభూపతీనాం సాకం సురస్త్రీజన ముక్తమాల్యైః

ప్రతాపరుద్రుని సుభటుల ఖడ్గధారలు యుద్ధాలలో నల్లగలువ కాంతి కలవై దేవతాస్త్రీలు (అప్సరసలు) వేసిన మాల్యములతో పాటు శత్రురాజుల కంఠములందు పడు తున్నవి. దివ్యమాల్యముల వలె ఖడ్గధారలు కంఠములందు పడుతున్నవి అని ఉపమానోపమేయభావము ప్రతీయమాన మవుతున్నది. ఖడ్గధారలు మాల్యములు రెండూ ప్రకృతములే కాబట్టి ఉపమానోపమేయభావము వైవక్షికము. ముందుగా ఖడ్గము కంఠముపై పడితే తరువాత దివ్యమాల్యములు పడుతవి. కృపాణపతనము కారణము. మాల్యపతనము కార్యము. ఈ రెండిటికీ పౌర్వాపర్యము దీనిలో లేదు. రెండూ సమకాలములో జరిగినట్లు నిరూపితము. ఇక సమ న్వయము స్పష్టమే. భేదము ఉన్నప్పటికీ అభేదాధ్యవసా యము చెప్పెడమనే అతిశయోక్తిమూలక మయిన సహోక్తి శ్లేషభిత్తికంగా ఉండవచ్చు. అది లేకుండానూ ఉండవచ్చు. శ్లేషగర్భమయిన అభేదాధ్యవసాయ రూపమయిన సహోక్తి చారుత్వాతిశయమును కలుగ జేస్తుంది. ఉదా:—

దినే దినే రుద్రనరాధిపస్య ప్రతాపలక్ష్మీ రుదయం ప్రయాతి
ప్రకాశితాశేష దిగంతరాళా వివస్వతా సార్థ మనింద్యభాసా.

ప్రతాపరుద్రుని ప్రతాపశోభ ప్రతిదినమున్నూ అశేష దిగంతరాళమును ప్రకాశింపచేస్తూ పవిత్ర తేజస్సుకల సూర్యు నితో పాటు ఉదయము (అభ్యుదయము) పొందుతున్నది. సూర్యుడు ఉదయపర్వతము పొందుతున్నాడు. ఇక్కడ ఉదయ శబ్దము రెండు అర్థాలు కలది. ఉదయపర్వతము అభ్యు

దయము అనేవి రెండూ పరస్పరము భిన్నములే అయినా అభేదము అధ్యవసిత మవుతున్నది. అందువలన శ్లేషభిత్తికా భేదాధ్యవసాయము ఇక్కడ సహోక్తిమూలము అయింది. ఇంకా భేదాలను ఇతరగ్రంథాలలో చూడవలసిందే.

౧౪ వినోక్తి

సహోక్తికి వినోక్తి ప్రతిపక్షముగా ఉంటుంది. కనుకనే ఇది అవసరప్రాప్త మయింది.

> వినా సంబంధి యత్కించి ద్యత్రాన్యస్య పరాభవేత్
> అరమ్యతా రమ్యతా వా సా వినోక్తి రితి స్మృతా

సంబంధించి ఉన్న ఒకవస్తువు లేనందువలన ప్రతి సంబంధి వస్తువునకు రమ్యత కలిగినా అరమ్యత కలిగినా వినోక్తిఅవుతుంది. ఒకవస్తువు యొక్క అసాన్నిధ్యం వలన వేరొక వస్తువు రమ్యము కాని అరమ్యము కాని అయితే వినోక్తి అన్నమాట. ఇది రెండు విధాలు. అరమ్యత అని. రమ్యత అని. ఉదా:—

> ప్రతాపరుద్రదేవస్య గుణవర్ణనయా వినా
> కీదృశీ కావ్యరచనా సంశృణుధ్వం కవీశ్వరాః

ప్రతాపరుద్రుని గుణవర్ణన లేకపోతే ఇంకా కావ్య రచన ఏమిటి? కవీశ్వరులంగరూ ఈ మాట బాగా వినండి! ఆ గుణవర్ణన లేకపోతే కావ్యరచన రమ్యము కాదు అని భావము. ప్రతాపరుద్ర గుణవర్ణనము లేకపోతే కావ్యశ్రీకి అశోభనత్వము నిరూపిత మయింది. కాబట్టి కావ్యశోభను కాంక్షించే కవులు ప్రతాపరుద్రుని గుణాలనె వర్ణించాలి అని విధియే ప్రకాశిత మవుతున్నది.

కలాపూర్ణే నిత్యం జయతి జగతీందౌ త్రిజగతో
వపుష్మ త్యానందే విమలవిభవే రుద్రనృపతౌ
వినా లక్ష్మ ప్రాప్య ప్రతిదివసపూర్ణాం నిజతనుం
ప్రకాశః స్యా దిందు ర్యది దివి భవే త్సోపి సుభగః

నిత్యమూ కలాపూర్ణుడు భూలోకచంద్రుడు మూడు లోకాల మూర్తమయిన ఆనందము విమలైశ్వర్యశాలి అయిన రుద్రభూపతి సర్వోత్కర్షగా విలసిస్తూ ఉంటే చంద్రుడు కళంకము లేకుండా ప్రతిదివస పరిపూర్ణమయిన నిజ తనువు పొంది ఆకాశంలో ప్రకాశించే వాడయితే ఆతడు కూడా సుభగుడు కావచ్చు. దీనిలో ప్రతాపరుద్రుడు ప్రకాశిస్తూ ఉంటే చంద్రునకు కలంకము లేక పోయినపుడు శోభనత్వము ఉంటుందని నిరూపితము. సకలగుణశాలి అయిన ప్రతిపక్షుని ఎదుట అటువంటి గుణాలుంటేనే రమ్యత. లేకపోతే లేదు. చంద్రుడు ఆ విధంగా అయితే అరమ్యత్వము ఉండదని చెప్పినందువలన ఇది రమ్యతకు లక్ష్యము.

౧౫. సమాసోక్తి

"సమాసేన ఉక్తిః సమాసోక్తిః" చెప్పవలసిన దానిని సంక్షేపముగా చెప్పితే సమాసోక్తి అవుతుందని భావము. రెండు అర్థములను సంక్షేపముగా చెప్పడము ఉంటుంది అన్న మాట. ప్రస్తుతార్థము వివక్షితము. దానిని చెప్పేటపుడు అప్రస్తుతము కూడా చెప్పబడి నట్లయితే సమాసోక్తి అవుతుంది. అని శబ్దసామర్థ్యము వలన లభించే అర్థము.

విశేషణానాం తౌల్యేన యత్ర ప్రస్తుతవర్తినాం
అప్రస్తుతస్య గమ్యత్వే సా సమాసోక్తి రిష్యతే

ప్రస్తుతార్థమునకు అనుకూలములై ప్రవర్తించుచున్న విశేషణములు అప్రస్తుతార్థానికి కూడా అనుకూలములై

ఉండడము చేత తౌల్యము ఉంటుంది. ఇటువంటి విశేషణ తౌల్యము చేత అప్రస్తుత వృత్తాంతము గమ్యము అయినట్ల యితే సమాసోక్తి అలంకారము అని అనడము యుక్తము ప్రకృతవిశేషణ సామ్యము వలన అప్రస్తుతము గమ్యమాన మయితే అది సమాసోక్తి. దీనిలో ఉండే విశేషణసామ్యము మూడువిధాలు. శ్లిష్టవిశేషణసామ్యము సాధారణమయిన విశేషణసామ్యము ఔపమ్య గర్భమయిన విశేషణ సామ్యము అని. ఒకే పర్యాయము ఒకే శబ్దమును ఉచ్చరించగా అర్ద ద్వయము ప్రతీతమయితే అది శ్లిష్టము. ఏదయినా ఒక విశే షణము ప్రస్తుతమును అప్రస్తుతమును చెప్పడములో సమాన ముగానే ఉంటే సాధారణ విశేషణ మవుతుంది. ఇటువంటి విశేషణము ఏ అర్థములో ప్రవర్తించడాని కయినా ఒక నిమిత్తముతో ఉంటుంది. ప్రవృత్తి నిమిత్తము ఇక్కడ భిన్న భిన్నముగా ఉండదన్నమాట. ఔపమ్య గర్భితమయిన సమాస విశేషణమును ఆశ్రయించిన విశేషణమయితే ఔపమ్యగర్భ విశేషణము అంటారు.

౧ శ్లిష్టవిశేషణ సామ్యము

సద్యో విశ్లథమేఖలాం పులకితాం ఋజ్వీం తనుం బిభ్రతీ
రాగా దంధ్రపతేః కృపాణలతికా గృహ్ణాతి కంఠే ష్వరీన్
తద్యోగా దనురక్తభావ వివశాః సంమీలితాక్షా శ్చిరం
శూన్యాంతఃకరణా భజంతి ఖలు తే భావస్థితిం కామపి

విశ్లథమేఖల=ప్రయోగానుకూల మయిన కంఠరజ్జువు కలది. జారి పోయిన మొలనూలు కలది. పులకిత=ఛాయలు కలది, రోమాంచము కలది. ఋజ్వీ=వంకర లేనిది, రతి యందు పెడమోము పెట్టనిది. రాగ=ఎరుపు దనము, అను

రాగము, అనురక్తభావ వివశాః=అనువృత్తమయిన రక్తము ల స్వరూపము ఉన్నందువలన పరవశులు, అనురాగ భావము చేత పరవశులు. ఈ అర్థములను అనుసరించి చూస్తే ప్రకృ తార్థము : ఆంధ్రభూపతి యొక్క కృపాణలత ప్రయోగాను కూల మయిన కంఠరజ్జువు కల ఛాయలు కలిగిన వంకర లేని శరీరమును ధరించి శత్రువులను కంఠములందు పట్టుకొం టున్నది. ఆ కృపాణలతా సంబంధము వలన, ఆ శత్రువులు అనువృత్తమయిన నెత్తురు కలస్వరూపము ఉన్నందు వలన పరవశులై నేత్రాలు మూసికొని శూన్యాంతఃకరణులై చెప్పడానికి వీలుకాని భావస్థితిని అంటే వినాశమును పొందు తున్నారు. ఇది ప్రకృతార్థము. ఈ ప్రకృతార్థ పరముగా ఉన్న విశేషణములు పైన చెప్పినవిధాన శ్లిష్టములుగా ఉన్నందు వలన అప్రకృత మయిన అర్థాంతరమున్నూ గోచర మవు తున్నది. కృపాణలతిక అనే నాయిక అనురాగము వలన అప్పుడే జారిపోయిన మొలనూలు కల రోమాంచము కలిగిన సురతములో అనుకూల మయిన శరీరమును ధరిస్తూ నాయకు లను కంఠములందు గ్రహిస్తున్నది. ఆ నాయికా సంబంధము వలన అనురాగ భావం చేత పరవశులై సుఖపారవశ్యం వలన నేత్రాలు మూసికొని అనిర్వాచ్యమయిన ప్రేమానుబంధ మును పొందు తున్నారు. ఈ పద్యంలో విశ్లథమేఖలాం పులకితాం ఋజ్వీం అనే శ్లిష్టము లయిన విశేషణముల సామర్థ్యం చేత కృపాణలతిక నాయిక అని ప్రతీయమాన మవు తున్నది. అనురక్త భావ వివశా అనే విశేషణాల ద్వారా రిపువులకు నాయకత్వము గోచర మవుతున్నది. ఈ నాయికా నాయక వ్యవహారము ఖడ్గము శత్రువులందు సమారోపితమై భాసిస్తున్నది. సమారోపిత నాయికా నాయకవ్యవహారము

కలిగిన కృపాణలతా రిపువృత్తాంతమె వాక్యార్థముగా గో-
మవుతున్నది.

౨ సాధారణ విశేషణసామ్యము

వీతవ్రీడ మపాస్తమాన ముదయద్వైవస్వర్య మావిర్భవత్
స్వేదం నిర్భరగాత్రవేపథు మిళన్మూర్ఛం గలద్బాష్పకం
సంజాతప్రళయంచ కాకతిమహీనాథ! స్మరోద్వేజితా
భూపాః శైలగుహాసు యాంతి విజనం భీత్యా సమాలింగితాః.

ఇది నిరూపితార్థము. వీతవ్రీడత్వాది విశేషణ
రెండర్థాలలోనూ సమానములె. ఒక అర్థములో శృంగ
ప్రతీతి ఉన్నది. వేరొక అర్థములో భయానక ప్రతీతి ఉన్న
విశేషణాలు రెండింటికీ అనుకూలముగా ఉన్నవి. ఇ
శృంగార భయానక సాధారణ విశేషణ బలము ఉన్నం
వలన భీతి నాయిక అని భూపాలకులు నాయకులు
గోచర మవుతుంది. భీతిసమాలింగిత భూపాలనాయక వ్య
హారము ప్రతీయమాన మవుతున్నది. ఈ విధంగా ప్రతీ
మాన మవుతున్న శృంగారనాయికా నాయకవ్యవహారము
ప్రకృత భయానకమునకు సంబంధించి ఉన్న భూపులం
సమారోపించాలి. ఈ సమారోపములో వీతవ్రీడత్వ
మొదలయిన ధర్మసమారోపము నిమిత్తము. ఇక్కడ అ
కృతధర్మసమారోపము ఉన్నట్లుగా కొన్ని స్థలాలలో అ
కృత కార్య సమారోపము ఉంటుంది. ధర్మసమారోప
కాని కార్యసమారోపము కాని లేకపోతే విశేషణసామ
మాత్రము చేత అప్రకృతవ్యవహారము గోచరము కాద
సాధారణవిశేషణ సమాసోక్తి ఇపుడు రెండు విధాలం
నట్లు. ఈ సమాసోక్తి మొదటిసమాసోక్తి కంటె కొం
అస్పష్టము.

౩ ఔపమ్యగర్భవిశేషణము

భృతాత్మా గుణ రత్నౌఘైః పూర్ణః సౌజన్య వారిణా
ప్రతాపరుద్ర నృపతిః ధత్తే విశ్వంభరాశ్రియం.

భరించిన తన గుణరత్న సమూహములతో కూడు కొనినవాడు సౌజన్యోదకముచే పూర్ణుడూ అయిన ప్రతాప రుద్రుడు విశ్వంభరాశోభను ధరించుతున్నాడు. దీనిలో రత్నములవంటి గుణములు ఉదకము వంటి సౌజన్యము అని ఉపమిత సమాసమును అంగీకరించ వచ్చును. గుణములనెడు రత్నములు సౌజన్యమనెడి ఉదకము అని రూపకసమాసము నయినా స్వీకరించ వచ్చును. ఆ సమాసమే తగును, ఇది తగదు, అని నిర్ణయించడానికి ఏమీ ఇక్కడ సాధక బాధక ములు లేవు. కాబట్టి "గుణసదృశైః రత్నైః సౌజన్యసదృశేన వారిణా" అని మధ్యమపదలోప సమాసమును స్వీకరించాలి. అప్పుడు ఔపమ్య గర్భ విశేషణసామ్యము సిద్ధిస్తుంది. ప్రతా పరుద్రుని యందు సముద్ర వ్యవహారము ప్రతీత మవుతుంది. కనుక సమాసోక్తి. ఎక్కడ నయినా ఉపమాసమాసంలో సాధకము ఉంటే అక్కడ ఉపమాసమాసమును స్వీకరించాలి. సాధకబాధకములు లేనిచోట సంకరసమాసమును అంగీ కరించాలి. ఈ విధంగా చూస్తే ఇప్పటికి ఈ సమాసోక్తి అయిదువిధా లయినట్లు గ్రహించాలి. వాని పేర్లు ఇవి.

౧. శ్లిష్టవిశేషణ సముత్థాపితము
౨. సాధారణ విశేషణములో ధర్మ సమారోపము
౩. ,, కార్య సమారోపము
౪. ఔపమ్యగర్భవిశేషణములో ఉపమిత సమాసము
౫. ,, సంకర సమాసము

ఇంకా దీనికి సంబంధించిన అవాంతర భేదాలు ఇం? ఉన్నవి. వాని స్వరూపోదాహరణములకు ఇక్కడ అ కాశము లేదు.

ఇన్ని విధములయిన ఈ సమాసోక్తిలో అంతట అప్రస్తుతవ్యవహార సమారోపమె జీవితము. వ్యవహారసమ రోపం లేకపోతే సమాసోక్తిలో చమత్కారము లేదు. ఈ విధంగా అంగీకరించినందు వలననే రూపక సమారోప వ్యః చ్ఛేదము కలుగుతుంది. ఆ విధంగా కాక సమాసోక్తిలో కూడా అప్రస్తుతారోపమునే స్వీకరించితే రూపకాలంకారము కంటె సమాసోక్తికి భేదము లేక పోవలసి వస్తుంది. అప్రస్తు తము శబ్దముచే ప్రయుక్తము కాక ప్రస్తుతమునకు సంబం ధించిన విశేషణముల సామ్యము వలన ప్రతీయమాన మయిన చోట వ్యవహార సమారోపమునే అంగీకరించి సమాసోక్తిని నిర్ణయించాలి. అటు వంటి స్థలములో ప్రస్తుతమయిన రాజాదులు విశేషణ సామ్యము వలన గోచరమయిన అప్రస్తుత సముద్రత్వాది ధర్మములతో కూడుకొని గోచరిస్తారు. అప్రస్తుతము కూడా శబ్దముచే ప్రయోగింప బడిఉన్నప్పుడు అప్రస్తుతము ప్రస్తుతమును తనరూపముతో రూపము కలదానినిగా చేస్తుంది. ప్రకృత మును న్యగ్భావించుతుంది. ప్రస్తుతమున్నూ తన రూప మును విడిచి పెట్టుకొని అప్రస్తుత తాద్రూప్యమును స్వీకరించు తుంది. అందు వలన అటువంటి చోట రూపక మని నిశ్చయించాలి. ప్రస్తుతములో అప్రస్తుతము న్యగ్భూత మయితే సమాసోక్తి. అప్రస్తుతములో ప్రస్తుతము న్యగ్భూత మయితే రూపకము. సమాసోక్తిలో వ్యవహార సమారోప

మును జీవితముగా అంగీకరించి నందువలన ఈ చెప్పిన విధముగా రూపకము కంటె భేదము సిద్ధమవుతున్నది.

ఇటువంటి వ్యవహార సమారోపము నాలుగు విధాలు. లౌకిక వస్తువునందు లౌకిక వ్యవహార సమారోపము. లౌకిక వస్తువునందు శాస్త్రీయ వస్తు వ్యవహార సమారోపము. అని ఇది రెండు విధాలు. అట్లాగే శాస్త్రీయవస్తువు నందు శాస్త్రీయవస్తు వ్యవహారసమారోపము. శాస్త్రీయవస్తువు నందు లౌకికవస్తు వ్యవహారసమారోపము. అని ఇది రెండు విధాలు. మొత్తము ఈ వ్యవహారసమారోపము ఇట్లా నాలుగు విధాలు. యథాక్రమంగా వీనికి ఉదా:-

సప్తాంగ స్ఫుర దుద్దామ దానలక్ష్మీ విరాజితః
ప్రతాపరుద్రో భద్రాత్మా తనుతే సార్వభౌమతాం.

సప్తాంగములందు గోచరించు అతిశయించిన దాన శోభతో విరాజిల్లుతున్న ప్రతాపరుద్రుడు భద్రాత్మకుడై సార్వభౌమత్వమును విస్తరింప చేస్తున్నాడు. స్వామి అమాత్య సుహృత్ కోశ రాష్ట్ర దుర్గ బలములు సప్తాంగ ములు. ఇది లౌకికమయిన ప్రకృతవస్తువు. దీనియందు లౌకికమె అయిన సార్వభౌమమనే పేరుగల దిగ్గజ వ్యవహారము ప్రతీత మవుతున్నది. ఈ పద్యములో స్ఫురించే దాని స్వరూపమును ఈ విధముగా గ్రహించాలి. ఏడు అవయవముల నుండి ప్రసరించుతున్న దానలక్ష్మిచేత విరాజత మయిన భద్రజాతికరి సార్వభౌమము అనే దిగ్గజము. ఇక్కడ ప్రకృత ప్రతాపరుద్రుని యందు అప్రకృత మయిన భద్రగజ వ్యవహారము సమారోపిత మయింది.

గురుప్రమాణేన నిజేన సద్య స్తిరస్కృతోద్య త్ప్రతిపక్ష హేతౌ
ప్రతాపరుద్రస్య సమిత్యుదగ్రే ఖడ్గే మహత్ ఖండన పండితత్వం

దీనిలో లౌకికవస్తువునందు శాస్త్రీయవస్తు సమారోపము కనపడుతున్నది. లౌకికవస్తువు ఖడ్గము. దానికి సంబంధించిన అర్థమును ఈ విధముగా గ్రహించాలి. ప్రతాపరుద్రుని యుద్ధములోని ఖడ్గమునందు గొప్ప ఖండనపండితత్వము ఉన్నది. ఆ ఖడ్గము తన శ్రేష్ఠమైన ప్రమాణము చేత శత్రువుల ఆయుధములను తిరస్కరించింది. తర్కశాస్త్రప్రసిద్ధమయిన వస్తువు అప్రకృతము. దాని స్వరూపమిది. వ్యాప్తి పక్షధర్మత మొదలయిన విశేషాలు కలిగి గొప్పదయిన అనుమాన ప్రమాణము సభలో ప్రతివాదికి సంబంధించిన వాద హేతువులను అన్నిటినీ క్షణములో తిరస్కరించి వేస్తున్నది. అపుడు ఇతర మత దూషణ నైపుణ్యము స్పష్టము. ఖడ్గమునందు ఇటువంటి శాస్త్రీయ మయిన వ్యవహారము సమారోపసుందరమై దీనిలో భాసిస్తున్నది.

అపూర్వార్థ శ్లాఘా గురుభణిత సారస్య పదవీ
శ్రుతిగ్రాహ్యం తత్త్వం కిమపి కలయంతీ ప్రతిపదం
ప్రబంధశ్రీ ర్వీరక్షితిభుజి కవీనాం విజయతే
బుధశ్రేణీ యస్యాం నిపుణ మధికర్తుం ప్రభవతి.

ఈ పద్యంలో అలంకారశాస్త్రమునకు సంబంధించిన వస్తువు ప్రకృతము. దాని యందు మీమాంసాశాస్త్ర ప్రసిద్ధమయిన వస్తువ్యవహార సమారోపము కన్పడు తున్నది. మొదటగా అలంకారశాస్త్రీయ వస్తువును ఇట్లా గుర్తించాల. ప్రతాపరుద్రుని విషయమై కవుల యొక్క ప్రబంధశోభ సర్వోత్కర్షగా విలసిల్లు తున్నది. ఆ కావ్యనాటకాది ప్రబంధ లక్ష్మి యందు చతురసహృదయుల యొక్క పరిషత్తు చక్కగా రసభావాలను ఆస్వాదించడానికి సమర్థ మవుతున్నది. ఆ ప్రబంధశ్రీ ఈ విధముగా ఉన్నది. అచుంబితము లయిన

అర్థముల యొక్క శ్లాఘచేత ఉదాత్తవాక్యముల యొక్క సరసతాసరణిగా ఉన్నది. ప్రతిపదములోనూ శ్రవణసుభగ మయిన అనిర్వచనీయమగు మాధుర్యాదికము కలిగి ఉన్నది. శ్రుతికటువు మొదలయిన దోషాలు లేవు. ప్రవత్సుధా మధు రములయిన శబ్దార్థశరీరము కల ప్రబంధశ్రీ చక్కగా ఉన్నది. తంత్రశాస్త్రవస్తువును ఈ విధముగా గ్రహించాలి. వేదవాక్యములుబోధించిన అపూర్వములయినఅగ్నిహోత్రాది యాగముల యొక్క శ్లాఘ చక్కగా ఉండడముచేత విధి వాక్యములు ఉత్తమములుగా ఉన్నవి. అవి చక్కని సరసత్వ మును అంటే ప్రవర్తింపచేయడము లోని ఉన్ముఖత్వమును కలిగి ఉన్నవి. ప్రతి పదము లోనూ శ్రుతి లింగ వాక్యాదుల చేత గ్రహింపదగిన తత్వము కూడుకొని ఉన్నది. ఇటువంటి ప్రబంధశ్రీ అనగా; మీమాంస శ్రేయస్సాధన మయిన ధర్మమును బోధించు తున్నది. దీని యందు దేవతల సమూ హము నిపుణముగా అధికరించడానికి సమర్థము. ఇటువంటి మీమాంసా వస్తు వ్యవహార సమారోపము ఇక్కడ ఉన్నది.

సాలంకార లసద్వర్ణా సుగుణా రసనిర్భరా
భావానుబంధినీ భాతి భారతీ కాకతీశ్వరే.

దీనిలో అలంకారశాస్త్రీయమయిన భారతీరూపమగు వస్తువు ప్రకృతము. దీనియందు లౌకికమయిన నాయికా వ్యవహార సమారోపము ఉన్నది. ఉపమాద్యలంకారములు కలిగిన రసవ్యంజకము లయిన, మధురాక్షరముల శోభ కల శ్లేషాది గుణ సహిత మయిన, శృంగారాది రసనిర్భర మయిన, నిర్వేదాది భావానుబంధము కల భారతి ప్రతాప రుద్రుని విషయమై భాసించు తున్నది. భారతి అనేపేరు కలి

గిన నాయికా వ్యవహారము అప్రకృతము. భారతీ నాయిక కటకాద్యలంకారములు కలిగి, మనోజ్ఞకాంతి కలదై, గాంభీర్యాది గుణాలు కలదై, అనురాగ పూర్ణురాలై ప్రేమానుబంధము కలదై ప్రతాపరుద్రుని విషయమై భాసించు తున్నది. ఈ లౌకిక వ్యవహార సమారోపము ఇక్కడ స్పష్టముగా ఉన్నది. సమాసోక్త్యలంకారములో విశేషణము విశేష్యము అనేవి రెండూ ఉపాత్తములు కావు. ఒక ప్రకృతవిశేష్యమె ఉంటుంది. అప్రకృతవిశేష్యము ప్రతీయమాన మవుతుంది. కాని వాచ్యము కాదు. శ్లేషాలంకారములో నయితే విశేష్యములు రెండూ ఉపాత్తము లవుతవి. అప్రకృత విశేష్యము కూడా శ్లేషలో వేరుగా ఉంటుంది. అందువలన శ్లేషకంటె సమాసోక్తి భిన్నము. సమాసోక్తిలోని విషయమీమాంస చాలా జటిలంగా ఉంటుంది. తద్విస్తరము ఇక్కడ అవసరము కాదని నిరూపించడము లేదు.

౧౭ వక్రోక్తి

వక్రోక్తి స్వభావోక్తి వ్యాజోక్తి మొదలయిన ఇంకా కొన్ని అలంకారాలకు ఉక్తి సామ్యము ఉన్నది. అయినా వక్రోక్తి అలంకారములో శ్లేషగర్భత్వ మన్న విశేషము ఉన్నది కాబట్టి సమాసోక్తి తరువాత వక్రోక్తినిరూపణము సంగతంగా ఉంటుంది.

అన్యథోక్తస్య వాక్యస్య కాక్వా శ్లేషేణ వా భవేత్
అన్యథా యోజనం యత్ర సా వక్రోక్తి ర్నిగద్యతే.

ఒకడు ఒకవిధముగా పలికిన వాక్యానికి కాకువుచే గాని శ్లేషచే గాని వేరొకవిధముగా యోజనము ఉన్నట్లయితే అది వక్రోక్తి అవుతుంది. ఒకడు తానేదో చెప్పవలె

నని ఒక వాక్యమును ప్రయోగించితే వేరొకడు తానేదో చెప్పవలెనన్న ఊహతో ఆ వాక్యానికి అన్యథా యోజనము చేసినట్లయితే అది వక్రోక్తి. వక్రమయిన ఉక్తి వక్రోక్తి. వక్రము అంటే లోకము కన్న విలక్షణము. లోకములో ప్రసిద్ధమయిన విధానము కంటె దీని విధానము విలక్షణముగా ఉంటుంది. కాబట్టి ఇది వక్రోక్తి. సామాన్యంగా అన్ని అలంకారాలకూ ఏదో విధముగా ఉక్తి వక్రత ఉంటుంది. కావ్యభాష లోకభాష కంటె స్వాభావికంగా విలక్షణమె కదా! సామాన్యంగా సర్వాలంకారాలలోనూ ఉక్తివక్రత్వము ఉంటేనే చమత్కారము ఉంటుంది. అయినా ఈ వక్రోక్తికి చెప్పిన లక్షణము వాటిలో వేనికీ ఉండదు. కాబట్టి ఇది సర్వాలంకారాలకంటె విలక్షణము. కాకువక్రోక్తి శ్లేషవక్రోక్తి అని ఇది రెండు విధాలు. కాకువు అంటే ఒక విధమయిన స్వరము. వాక్యములను పలికేటప్పుడు ఒకస్వరము వలన ఒక విధమయిన అర్థము వేరొక స్వరము వలన వేరొక విధమయిన అర్థము లంభించుతుంది. ఒకడు సామాన్యంగా ఒకమాటను పలికిన తరువాత వేఱొకడు విభిన్నమయిన స్వర యోజనముతో అర్థాంతరము వచ్చేటట్లుగా చేస్తే అది కాకు వక్రోక్తి. ఉదా :

బహువల్లభః ఖలు రాజా సఖి! తస్య శ్రియాం నిర్భరాసక్తిః
న్యూనా శ్రియోఽపి త్వం? ఆత్మానం కిం ను లఘయసి?

పూర్వార్ధము నాయికా వాక్యము. సఖీ! రాజు బహువల్లభుడు కదా! ఆయనకు శ్రీదేవి యందు అనురాగము ఎక్కువ. శ్రీదేవి మాదిరిగా నేను ఆయన ప్రేమను పొందగలిగిన అర్హత కలదాననా? నేను అంతటి దానను

కాను. అనే అభిప్రాయము నాయికా వాక్యాలలో గోచరము కాగానే సఖి ఈ విధముగా అంటున్నది. నీవు మాత్రము శ్రీదేవి కంటె తక్కువ దానవా? ఏమి? నీవేమీ తక్కువ దానవు కావు. ఎందుకు నిన్ను తక్కువగా చేసి కొంటావు? ఈ పద్యము ప్రథమార్థములో నాయిక తన న్యూనత్వమును సంభావించితే, ద్వితీయార్ధములో సఖి "శ్రియో న్యూనా" అనే చోట కాకు స్వరమును కలిపి తక్కువదానవు కావని నిషేధయోజనము చేసినందు వలన కాకు వక్రోక్తి అవుతున్నది. కాకువువలన వ్యంగ్యమున్నప్పటికీ అది వాచ్యములోనే విశ్రాంత మవుతున్నది. నీవు తక్కువ దానవు కావు కాబట్టి నీయందు కూడా రాజు ఆసక్తి కలిగి ఉన్నాడు. నిన్ను నీవు ఎందుకు అంతగా చులకన చేసికొంటావు? అని గోచర మవుతున్నది. శ్లేష వక్రోక్తికి ఉదా:-

> కస్తే సుందరి! వర్తతే హృది సదా? రాజా, కిమిందుః? న హి
> క్షోణీభృత్తిలకః, సుమేరు రయి! కిం? నో రుద్రదేవో విభుః
> ఈశః కిం? సఖి! సత్యమాత్థ సుభగే త్వం గోత్రసారోద్భవే
> త్యాశ్యాం ఖల్వపహాసవాచి విరహం కించి ద్వధూ ర్వ్యస్మరత్

ఈ పద్యంలో సఖీనాయకుల యొక్క ఉక్తి ప్రత్యుక్తి వాక్యములు తొమ్మిది ఉన్నవి.

సఖి:- నీహృదయంలో ఉన్నవారెవరే ఎప్పుడూ?

సుందరి:- ఎవరా! రాజు

సఖి:- చంద్రుడా ఏమిటి?

సుందరి:- ఊఁహూఁ. క్షోణీభృత్తిలకము

సఖి:- ఓహో! మేరు పర్వతమటమ్మా?

సుం:- కాదు. రుద్రదేవ ప్రభువు.

సఖి:- అట్లాగా! ఈశ్వరు డేమిటి?

సుం:- సఖీ! సత్యము చెప్పినావె!

సఖి:- సుభగా! నీవు గోత్రసారోద్భవు రాలవు (సత్కుల ప్రసూతవు-పర్వతరాజపుత్రివి).

అని ఈ విధంగా చెలికత్తె అపహాసప్రధానంగా పలికే టప్పటికి ఆ నాయిక కొంతగా విరహమును విస్మరించింది. ఈ పద్యంలో 'రాజా క్షోణీభృత్తిలకః రుద్రదేవః' అనే పదాలు శ్లిష్టములు. నాయిక ఒక అర్థముతో వానిని ప్రయోగించితే సఖి తాను ఏదో చెప్పడానికి అర్థాంతర యోజనము చేసినందువలన శ్లేషవక్రోక్తి అవుతుంది. ఈ వక్రోక్తి శబ్దము సామాన్యంగా సర్వాలంకారాలకూ సంబంధించిన పదము. సంపూర్ణమయిన అలంకారవర్గమంతా వక్రోక్తి స్వరూపమె. ఈ విధంగానే భామహుడు అంగీకరించు తున్నాడు. అయినప్పటికిన్నీ ఇక్కడ ఆ శబ్దము అలంకారవిశేషము నందు ప్రయోగింపబడింది.

౧౭ స్వభావోక్తి

వక్రోక్త్యలంకారముకంటె స్వభావోక్తి అలంకారము విపర్యయముగా ఉంటుంది.

స్వభావోక్తిరసౌ చారు యథావద్వస్తు వర్ణనం

ఉన్న వస్తువును ఉన్నవిధంగా హెచ్చు తగ్గులు లేకుండా వర్ణము క్రియ అవయవముల కూర్పు మొదలయిన రూపము కలిగిన వస్తుస్వభావమును కవిప్రతిభలో గోచరించిన విధంగా హృదయరమ్యంగా వర్ణించినట్లయితే స్వభావోక్తి అలంకారమవుతుంది. కేవలము వస్తుస్వభావవర్ణనం

లేని కావ్యము ఉండదు. కుశాగ్రీయ ధిషణులు అయిన సు: వులు తమ ప్రతిభలో భావించి భాసింప చేసికొన్నవిధా: స్వభావవర్ణనము ఉన్నపుడే ఈ స్వభావోక్తి; వస్తుస్వభా: వర్ణనము అలంకార మవుతుంది. స్థూలమతులయిన అకవుల కుకవులూ ఈ స్వభావరమ్య విధానమును బాగా గుర్తించ: పోవచ్చును. ఉదా:-

మదచ్యుతా నర్తితకర్ణతాళం ఉద్ధూతమూర్ధ్నా త్రిపదస్థితేన
లోలాగ్రహస్తేన గజేన జాతో నిత్యోత్సవః కాకతివీరరుద్రః.

మదమును స్రవించునట్టి, నర్తనము చేస్తూ ఉన్నట్లుగా ఉన్న చెవులు తాళము వేస్తూ ఉంటే కుంభస్థలమును కంపింప చేస్తూ ఉన్న, త్రిపదస్థితిలో ఉన్న, తొండమును ఊగించుతూ ఉన్న పట్టపు గజముతో కాకతివీరరుద్రుడు నిత్యోత్సవము వాడుగా అయినాడు. దీనిలో గజమునకు సంబంధించిన క్రియాస్వభావము సూక్ష్మపరిశీలనంతో హృదయహారిగా నిరూపితమయింది. ఈ విధంగానే వర్ణ సంస్థానములకు సంబంధించి ఉండే సూక్ష్మవర్ణనము కూడా స్వభావోక్తి అలంకారము అవుతుందని ఉదాహరించి గ్రహించాలి. వస్తు స్వభావమును స్థూలరూపంగా గ్రహించి ఉన్న దానిని ఉన్న ట్లుగా వర్ణించినపుడు ఈ అలంకారము కాదు. అది ఒకదోష మవుతుందని దోష ప్రకరణములో నిరూపితమయింది.

౧౮ వ్యాజోక్తి

ఉక్తి సామ్యము ఉన్నది. కాబట్టి పర్యాయోక్తికి ఇక్కడ అవకాశం ఉన్నది.

వ్యాజోక్తిః సా సముద్భూతం వస్తు యత్ర నిగూహ్యతే.

ప్రకాశముగా ఉన్న వస్తువు నిగూహిత మయితే

వ్యాజోక్తి అని సామాన్యంగా అర్థము. అసలు నిగూఢంగా ఉన్న వస్తువు ఏదో నిమిత్తము వలన ప్రకటమై ఉన్నప్పుడు సామ్యగర్భముగా ఉన్నందు వలన ఏదోవిధంగా నిగూహనార్హమై ఉంటుంది. కాబట్టి ఏదో ఒక వ్యాజముచేత దానిని కప్పిపుచ్చినట్లయితే అది వ్యాజోక్తి అవుతుంది. "వ్యాజస్య ఉక్తిః వ్యాజోక్తిః" వస్త్వంతరమును ప్రక్షేపించడము అనే వ్యాజము యొక్క వచనము ఉంటుంది కాబట్టి వ్యాజోక్తి అవుతుంది. ఉదా:—

క్షోణీ పాణిగ్రహణ సమయే సంపదా ద్రోమహర్షే
సర్వాంగీణే నృపతితిలకః కాకతీయాన్వయేందుః
ధీరోదాత్తః శిశిరసలిలైః కింను రాజ్యాభిషేకః
కర్తవ్యః స్యా? దితి మృదు హసన్ వీక్షతే మంత్రివృద్ధాన్.

ప్రతాపరుద్రుడు క్షోణీపాణిగ్రహణ సమయంలో సముత్కటమయిన ఆనందము వలన రోమహర్షము సర్వావయవములందూ వ్యాపించగా ధీరోదాత్తుడు కాబట్టి శిశిరోదకములతో రాజ్యాభిషేకము చేయవలెనా ఏమి? అని అంటూ మెల్లగా నవ్వుతూ వృద్ధమంత్రులను అవలోకనము చేస్తున్నాడు. దీనిలో క్షోణీ పాణిగ్రహణ జన్యమయిన రోమహర్షము ను ప్రతాపరుద్రుడు ధీరోదాత్తుడు కాబట్టి మహాభిషేక సలిల శైత్య వ్యాజాన కప్పిపుచ్చి మంత్రులను చూస్తున్నాడు. మొదట్లో నిగూఢంగా ఉన్న క్షోణీ పాణిగ్రహణ జన్య హర్షము రోమహర్షము చేత ప్రకాశిత మయింది. దానిని నిమిత్తాంతరము చెప్పుతూ సలిల శైత్య వ్యాజాన కప్పిపుచ్చడము చేత వ్యాజోక్తి అలంకార మయింది.

౧౯ మీలనము

వ్యాజోక్తి అలంకారమును చెప్పిన తరువాత క
సామ్యము ఉన్నందు వలన మీలనము ఇక్కడ నిక
మవుతుంది.

మీలనం వస్తునా యత్ర వస్త్వంతర నిగూహనం.

దీనికే మీలితాలంకార మనిన్నీ పేరు. ఒక వస్తువు
వేరొక వస్తువునకు నిగూహనము చెప్పినచోట మీల
కార మవుతుంది. ఉత్కృష్ట వస్తువుచేత అపకృష్ట వస్తు
నిగూహనము ఉంటుంది. చెప్పబోయే సామాన్యాల
ములో ఈ విధంగా ఉండదు. అక్కడ సాధారణ గుణ
గము వలన భేదము కనపడక పోవడమె దాని స్వరూప
ఉంటుంది. మీలనాలంకారము రెండువిధాలు. సహజ
చేత ఆగంతుక వస్తువునకు తిరోధానము మొదటి భే
ఆగంతుక వస్తువు చేత సహజ వస్తువునకు తిరోధానము
రెండవ భేదము. యథా క్రమముగా ఉదా :

ఉగ్రైః కాకతివీరరుద్ర నృపతే ర్దోర్దండ విస్ఫూర్జితైః
యుద్ధప్రాంగణ వర్జితేషు పతిషు క్వాపి ప్రలీనాత్మను
విష్వక్తీవ్రతర స్మరజ్వర జుషా మంగే ద్విషద్యోషితాం
సంక్రాంతోపి న లక్ష్యతే పధి మహా నూష్మా చిరం మారప

ప్రతాపరుద్ర మహారాజు యొక్క అత్యుగ్రము
భుజవిజృంభణముల చేత శత్రుస్త్రీల భర్తలందరూ
ప్రాంగణమును విడిచిపెట్టి ఎక్కడనో ప్రలీనమై పోయి
కాగా ఆ స్త్రీలకు తీవ్రతరమయిన స్మరజ్వరము క
వారి శరీరంలో మరుప్రదేశములకు సంబంధించిన
ప్రయాణవశాన కలుసు కొన్నప్పటికీ కనపడడము

దీనిలో శత్రుస్త్రీల యందున్న మన్మథాగ్ని వేడిమి సహజము. మార్గవశము వలన కలిగిన మహోష్మ ఆగంతుకము. సహజముచేత ఆగంతుకము తిరోహితము అయినట్లు వర్ణిత మయింది. కాబట్టి మొదటి మీలితము. ఇక రెండవది–

ప్రతాపరుద్రస్య భుజప్రభావా దంతర్భయా ద్భూమిభుజా మజస్రం
స్వేదాశ్రు కంపాద్యుదయే ప్యనంగగోష్ఠ్యాం స్త్రియః ప్రేష్ఠి న విశ్వసంతి.

ప్రతాపరుద్రుని భుజప్రభావము వలన రాజులకు నిత్యమూ అంతర్భయము పుట్టింది. మన్మథగోష్ఠిలో వారికి స్వేదాశ్రు కంపాదులు కలిగినప్పటికీ వారి స్త్రీలు విశ్వసించడము లేదు. దీనిలో భయజన్యమయిన కంపాదికము ఆగంతుకము. ప్రేమజనితమయిన కంపాదికము సహజము. ఆగంతుకము చేత సహజతిరోధానము స్పష్టము.

౭౦ సామాన్యము

సామాన్యం గుణసామ్యేన యత్ర వస్త్వంతరైకతా,

గుణసామ్యము చేత ప్రకృతవస్తువునకు ఇతరవస్తువునకున్నూ ఏకత్వము వర్ణిత మయినట్లయితే సామాన్యాలంకారము. ప్రస్తుతమయిన వస్తువునకు అప్రస్తుతవస్తువుతో ఐకాత్మ్యము ఉండాలి. అక్కడ ప్రస్తుతాప్రస్తుతములకు సాధారణమయిన గుణసంబంధము హేతువు. ఐకాత్మ్యము అంటే భేదనిశ్చయము లేకపోవడము. ఉదా:–

కైలాస దుగ్ధార్ణవ యానహంసే ష్వలక్షితే ష్వంధ్రనరేంద్ర కీర్త్యా
త్రయః పుమాంసః ప్రథమే స్మయంతే స్వసేవకా సంభ్రమతో విలోక్య.

ఆంధ్రనరేంద్రకీర్తిలో కైలాసము పాలసముద్రము హంసవాహనము కన్పడకపోగా మొదటి ముగ్గురు పురుషులూ అటూ ఇటూ తిరుగుతూ ఉన్న తమ సేవకులను చూచి

మందహాసము చేస్తున్నారు. ప్రతాపరుద్రుని కీర్తి లోకాలలో విజృంభించగానే కైలాసము మొదలయిన విమల వస్తువు లన్నీ కీర్తిలో కలిసి పోయి తదేకాత్మతను పొందినవి అని వర్ణించడము చేత అభేద ప్రతీతి వర్ణిత మయినట్లు ఊహిం చాలి. అందువలన ఇక్కడ సామాన్యాలంకారము.

౨౧ తద్గుణము

ఇతరవస్తువుల యొక్క గుణములు దగ్గరలో ఉండ డమువలన కలిగే అతిశయము సామాన్యంలో మాదిరిగా తద్గుణంలో కూడా ఉంటుంది. అందువలన దీనికి ఇక్కడ అవకాశము ఉన్నది.

తద్గుణః స్వగుణత్యాగా దన్యోత్కృష్ట గుణాహృతిః.

స్వాభావికమయిన తన గుణమును విడిచి పెట్టడము వలన ఇతరవస్తువు యొక్క ఉత్కృష్టగుణ స్వీకారము వర్ణింప బడిన చోట తద్గుణాలంకారము అవుతుంది. న్యూనమయిన తన గుణమును విడిచిపెట్టి దగ్గరలో ఉన్న వస్తువునుండి గొప్ప గుణమును స్వీకరించడము ఉంటే తద్గుణ మన్నమాట. "తస్య గుణాః అస్మిన్నితి తద్గుణః" ఉత్కృష్టగుణము కలవస్తువు యొక్క గుణాలు దీనియందు ఉంటున్నవి కాబట్టి ఇది తద్గుణ మవుతుంది. మీలితాలంకారానికి దీనికీ భేదము ఉన్నది. మీలితంలో ప్రకృతవస్తువు ఇతరవస్తువుచేత ఆచ్ఛాదిత మవుతుంది. దీనిలో ప్రకృతము అట్లా ఆచ్ఛాదితము కాదు. అనపహ్నుత స్వరూపముగానే ఉంటుంది. ఇతరవస్తువు యొక్క గుణాలచేత ఉపరంజితమై గోచరిస్తుంది. ఉదా:—

ప్రతాపరుద్ర దేవాంఘ్రి నఖ జ్యోత్స్నా విజృంభితైః
నమన్నృపతి మాణిక్య మౌళయః శుచయః కృతాః.

ప్రతాపరుద్రదేవుని పాదనఖముల జ్యోత్స్నా విజృంభణములచేత నమస్కరించుతూ ఉన్న రాజుల యొక్క మాణిక్యములతో కూడుకొన్న మౌళులన్నీ శుభ్రములుగా చేయబడినవి. దీనిలో నమస్కరించుతూ ఉన్న రాజుల యొక్క పద్మరాగమకుటములు తమ ఎఱ్ఱని కాంతిని విడిచి పెట్టి ప్రతాపరుద్రుని పాదనఖజ్యోత్స్న యందున్న ధవళిమను స్వీకరించు తున్నవి. అని వర్ణించడము చేత పరిమితమయిన స్వగుణత్యాగము ఉత్కృష్టమయిన అన్యగుణస్వీకారమూ స్పష్టముగా ఉన్నది. కాబట్టి తద్గుణాలంకారము.

౨౨ అతద్గుణము

తద్గుణమునకు ఇది విపర్యయరూపము. అందువలన అతద్గుణము ఇక్కడ నిరూపణార్హము.

సతి హేతా వన్యగుణాస్వీకారః స్యా దతద్గుణః.

తగినంత హేతువు ఉన్నప్పటికీ ఇతర గుణస్వీకారము లేకపోయినట్లయితే అతద్గుణాలంకార మవుతుంది. ఒకవస్తువు వేరొకవస్తుగుణమును స్వీకరించడములో సన్నిధానము (దగ్గరలో ఉండడము) హేతువు. న్యూనగుణమయిన వస్తువు సన్నిధాన హేతువు ఉన్నప్పుడు విశిష్ట గుణాలు కలిగి పదార్థము యొక్క ధర్మాలను స్వీకరించడము న్యాయము. అటువంటి స్వీకారము లేనపుడు అతద్గుణ మవుతుంది. ''తస్య గుణాః అస్మిన్ న సంతీతి అతద్గుణః'' దాని గుణములు దీనిలో లేవు కాబట్టి ఇది అతద్గుణము. ఇంకా అర్థాంతరమునకు సంబంధించిన భేదాంతరములు ఇతర గ్రంథాలలో నిరూపితములు. ఉదా :—

ఈశానం సమయా జగత్యటతి తల్లీలాట్టహాసోజ్జ్వలే
దైత్యారిం పరితః తదంగ విలసన్నీలద్యుతి ద్యోతితే
బ్రహ్మాణం నికషా చ తత్తనుమిళత్స్వర్ణప్రభా భాస్వరే
పుష్ణా రుద్రనరేంద్రకీర్తివిభవః స్వామేవ శుభ్రాం ఛవిం.

ప్రతాపరుద్రుని కీర్తివిభవము ఈశ్వరుని దగ్గర ఆతని లీలాట్టహాసములచేత సముజ్జ్వలమైన జగత్తులో తిరుగుతున్నది. విష్ణువు దగ్గర ఆతని శరీరవిలసన్నీలకాంతిచే ప్రకాశితమయిన లోకములో తిరుగుతున్నది. బ్రహ్మసమక్షంలో ఆతని శరీరమందు కూడుకొన్న స్వర్ణప్రభా భాస్వరమయిన లోకములో సంచరించుతున్నది. అయినప్పటికిన్ని తన శుభ్రకాంతినే పోషించు కుంటూ విహరిస్తున్నది. దీనిలో త్రిమూర్తుల సమీపమందున్న లోకాలు ఆ యా నానాకాంతి సమగ్రములై ఉన్నప్పటికి తెంపు లేకుండా కీర్తి తిరుగుతూ ఉన్నా ప్రతాపరుద్రయశస్సునకు నిరంకుశమయిన స్వీయ ధవళిమ విజృంభించు తున్నది. సన్నిధానరూపహేతువు ఉన్నప్పటికీ ఇతరగుణముల స్వీకారము లేకపోవడము దీనిలో నిబద్ధమయినందు వలన ఇది అతద్గుణము.

౨౩ విరోధము

అతద్గుణాలంకారములో కొంతగా విరోధము ప్రక్రాంతమయింది. విరోధాలంకారములో కూడా విరోధము ఉంది. కాబట్టి ఇది ఇక్కడ ప్రాస్తావసరము.

ఆభాసత్వే విరోధస్య విరోధాలంకృతి స్మృతా

విరోధము ఆభాసరూపముగా ఉన్నట్లయితే విరోధాలంకార మవుతుంది. మొట్ట మొదట్లో ఆభాసరూపంగా గోచరించిన విరోధము పర్యవసానంలో పరిహృతమయితే

విరోధాలంకారము. దీనికే విరోధాభాసాలంకారమనిన్నీ పేరు. విరోధము మొదట్లోనే భాసించాలి. కాని తరువాత ఉండ రాదు. విరోధము సమాధానరహితంగా ఉంటే ప్రరూఢ దోష మవుతుంది. సమాధానము ఉన్నప్పుడు మొదట్లోనే విరోధభానము ఉంటుంది కాని తరువాత ఉండదు. అందు వలన విరోధాభాసము. జాతి క్రియా గుణ ద్రవ్యములు నాల్గింటికి సజాతీయ విజాతీయ విరోధులతో సంబంధము చెప్పినట్లయితే విరోధాలంకారము. జాతివిరోధము క్రియా విరోధము గుణవిరోధము ద్రవ్యవిరోధము అనే నాలుగు విరోధములున్నూ ఒకటొకటి పెంపు పొంది పది విధములవు తున్నవి. జాతికి జాతిక్రియాగుణద్రవ్యములతో విరోధమును చెప్పితే నాలుగు భేదాలు. క్రియకు క్రియాగుణద్రవ్యములతో విరోధమును చెప్పితే మూడు భేదాలు. గుణమునకు గుణ ద్రవ్యములతో విరోధమును చెప్పితే రెండు భేదాలు. ద్రవ్యానికి ద్రవ్యముతో విరోధములో ఒక భేదము. ఈ విధ ముగా పది విరోధభేదాలు. జాతికి క్రియతో విరోధమును చెప్పినప్పుడు మళ్లీ క్రియకు జాతితో విరోధమును ప్రత్యేకంగా పరిగణించ నక్కర లేదు. ధ్వనిప్రసంగంలో నిరూపించిన అభిప్రాయమును ఇక్కడ కూడా అభ్యూహించాలి. అందు వలననే అక్కడ మాదిరిగా ఇక్కడ కూడా ఒక్కొక్క భేదానికి న్యూనత్వము కలుగుతుంది. వాని పేర్లను ఈ విధముగా గుర్తించ వచ్చు.

౧ జాతికి జాతితో విరోధము

౨ జాతికి క్రియతో విరోధము

3 జాతికి గుణముతో విరోధము

౪ జాతికి ద్రవ్యముతో విరోధము

౫ క్రియకు క్రియతో విరోధము
౬ క్రియకు గుణముతో విరోధము
౭ క్రియకు ద్రవ్యముతో విరోధము
౮ గుణమునకు గుణముతో విరోధము
౯ గుణమునకు ద్రవ్యముతో విరోధము
౧౦ ద్రవ్యానికి ద్రవ్యముతో విరోధము.

పద్మాకరోపి విలసతి నితరా మజడాశయోయ ముర్వీశః
విమలతరవారిధారా ప్యాసీ ద్వైరిక్షితీశ తాపకరీ.

ఈ పద్యము జాతికి జాతితో విరోధమును క్రియతో విరోధమును సూచిస్తున్నది. ఈ భూపాలుడు పద్మాకరు డయినా మిక్కిలి అజడాశయుడై విలసిల్లుతున్నాడు. ఈ పూర్వార్థములో జాతులకు విరోధమున్నది. ఇక్కడ విరోధము శ్లేషమూలము. పద్మాకరమయినా అజడాశయము అని విరోధము. పద్మములకు ఆకరమయిన సరస్సు జలస్థానము కాకపోదు. డ ల లకు అభేదమును ఆశ్రయించి ఈ అర్థమును గ్రహించాలి. పద్మాకరము జలస్థానము కాకపోవడములో విరోధమున్నది. మొదట భాసించే ఈ విరోధము అనంతర సమయములోని సమాధానరూపమయిన అర్థభావనచేయగా ఆభాసరూపమై పరిహృత మవుతుంది. ప్రతాపరుద్రుడు లక్ష్మీనివాసమయినా మూర్ఖాశయుడు కాడు అని పరిహారము. ఈ విధముగానే విరోధపరిహారమును ముమ్ముందు గ్రహించాలి. ఉత్తరార్థములో జాతిక్రియలకు విరోధము వర్ణితము. విమలతరవారిధార కూడా వైరిరాజులకు తాపకరి అయింది. వారిధార సంతాపమును కలగజేయడము విరుద్ధము. విమల-తరవారి ధార అని శబ్దసుందరతను భావిం

చితే తరవారి ధార=ఖడ్గధార తాపకరి కావడము విరుద్ధము కాదు.

అమదః సార్వభౌమోపి భాస్వానపి కలానిధిః
వీరరుద్రనరేంద్రోయ మద్భుతానాం విహారభూః.

జాతికి గుణముతో ద్రవ్యముతో విరోధము దీనిలో ప్రదర్శిత మవుతున్నది. ఈ వీరరుద్రుడు సార్వభౌముడయినా అమదుడు. సార్వభౌమత్వము జాతి. మదముగుణము. సార్వభౌమమనే దిగ్గజము మదరహితము అనడము విరుద్ధము. ప్రజాపాలకుడయిన్నీ మదసహితుడు కాడు అనేది పరిహారము. భాస్వంతుడయినా కలానిధుడై ఈతడు అద్భుతములకు విహారభూమి అవుతున్నాడు. సూర్యుడు చంద్రుడు కావడము విరుద్ధము. చంద్రుడు ఏకవ్యక్తి కాబట్టి ద్రవ్యము. ప్రకాశమానుడు కళలకు నిధి అనే అర్థము పరిహారకము. ఇది కూడా శ్లేషమూలమె.

ధర్మద్విషా మర్థముషాం చ భంగ ముత్పాదయ న్కాకతివీరరుద్రః
త్రివర్గసాధారణగోచరోపి కరోతి కామద్విషి భావమార్ద్రం.

ధర్మశత్రువులకు అర్థశత్రువులకూ భంగపాటు కలుగజేస్తూ ఉన్న ప్రతాపరుద్రుడు ధర్మార్థకామములనే త్రివర్గములను సమానముగా చూచేవాడయినప్పటికీ కామశత్రువునందు ఆర్ద్రభావమును కలుగజేసికొంటున్నాడు. దీనిలో త్రివర్గములందు సాధారణ వ్యాపారము కలవానికి ధర్మార్థవిరోధులకు భంగముసంపాదించడము కామవిరోధియందు స్నేహము కలుగజేసికొనడమున్నూ విరుద్ధము. కామశత్రువు లయిన శివుని యందు భక్తిభావము కలిగిఉన్నాడని పరిహారము. క్రియకు క్రియతో విరోధము దీనిలో స్పష్టమె. పూర్వోదా

హారణములో విరుద్ధములయిన రెండూ శ్లిష్టములయినవి. ఇక్కడ కామద్విషి అనేది ఒక్కటే శ్లిష్టమయింది.

ఏష జిష్ణువిహారోపి గోత్రవాత్సల్యలాలసః
కరోతి కమలోల్లాసం రాజా ప్యంధ్రనరేశ్వరః

క్రియకు గుణద్రవ్యములతో విరోధము దీనిలో నిరూపిత మవుతుంది. ఈ ఆంధ్రనరేశ్వరుడు జిష్ణువిహారుడయినా గోత్రవాత్సల్యమునందు ఆసక్తి కలిగి ఉన్నాడు. ఇంద్రవిహారుడు పర్వతవాత్సల్యముతో ఉండడము విరుద్ధము. విహారము క్రియ. వాత్సల్యము గుణము. జయశీల వ్యవహారము కలవాడయ్యీన్నీ వంశ వాత్సల్యమందు లాలసుడై ఉన్నాడు అనేది పరిహారము. రాజు అయి కూడా కమలోల్లాసము కలుగ జేస్తున్నాడు. అనే పూర్వార్ధార్థములో క్రియాద్రవ్యములకు విరోధము ఉన్నది. చంద్రుడు కమలములకు వికాసమివ్వడము విరుద్ధమె. భూపాలకుడై లక్ష్మీసముల్లాసమును సంపాదిస్తున్నాడు. అనే అర్థము పరిహారకము. చంద్రుడు ద్రవ్యము. ఉల్లాసకరణము క్రియ. రెండింటికీ ఆముఖవిరోధము వర్ణితమయినది.

రంజయఞ్ భువనమిదం రాజేతి యథా శ్లాఘనీయోసి
రుద్రనరేంద్ర ! కథం సా రక్తాపి చ పాండురా జాతా,

రుద్రనరేంద్ర ! ఈ భూమిని రంజింపచేస్తూ నీవు రాజా అని శ్లాఘనీయుడవు అయినావు కదా ! ఆ తరుణి రక్త అయి కూడా పాండుర ఎట్లా అయింది ? ఎఱ్ఱనిది తెల్లగా కావడము విరుద్ధము. గుణానికి గుణముతో విరోధానికి ఇది ఉదాహరణము. అనురాగము కలదై విరహము చేత పాండుర వర్ణము కలదయింది అనేది పరిహారము.

జ్వలత్ప్రతాపరౌద్రోపి కాకతీయనరేశ్వరః
భూత్వా జైవాతృకో భాతి శశ్వద్విశ్వప్రియంకరః

గుణమునకు ద్రవ్యముతో విరోధము దీనిలో ఉన్నది. జ్వలించుతున్న ప్రతాపరౌద్రు డయినప్పటికీ కాకతీశ్వరుడు మాటిమాటికీ విశ్వప్రియంకరుడయిన జైవాతృకుడై భాసించుచు తున్నాడు. ప్రతాపరౌద్రుడయినా జైవాతృకుడు=చంద్రుడు అని గుణద్రవ్యములకు విరోధము. జైవాతృకపదానికి ఆయుష్మంతుడు అనే అర్థములో విరోధపరిహార మున్నది.

విభాతి కాకతీంద్రోయం రుద్రోపి చతురాననః
తథాపి జిష్ణురిత్యేష కథ్యతే పురుషోత్తమః.

ద్రవ్యమునకు ద్రవ్యముతో విరోధము ఈ పద్యములో ఉన్నది. ఈ కాకతీంద్రుడు రుద్రుడయినా చతురాననుడై భాసిస్తున్నాడు. అదేవిధముగా జిష్ణువయినప్పటికీ పురుషోత్తముడని చెప్పబడుతున్నాడు. రుద్రుడు చతురాననుడు అనే పదాలకు శివుడు బ్రహ్మ అనే అర్థాలలో విరోధము ఉన్నది. జిష్ణు పురుషోత్తమ పదాలకు ఇంద్రుడు విష్ణువు అనే అర్థాలలో విరోధము ఉన్నది. చతురమయిన ముఖము కలవాడు. పురుషులలో ఉత్తముడు. అనే అర్థాంతరస్వీకారములో విరోధము లేదు. రుద్రాది పదములు ద్రవ్యవాచకములు అనే అభిప్రాయముతో ఇది ద్రవ్యమునకు ద్రవ్యముతో విరోధోదాహరణముగా ఉదాహృతమయింది. ఏకాదశరుద్రులు నవబ్రహ్మలు అనే విధాన వ్యక్తిభేదమును ఊహించి నపుడు ఇవి ద్రవ్యవాచకములు కాక పోవచ్చును. ఏకాదశరుద్రులలో రుద్రుడు ఒకడని నవబ్రహ్మలలో చతురాననుడు ఒకడని వారు ఏక వ్యక్తి రూపులె అని భావించి

దీనిని ఉదాహరణముగా గ్రహింపవచ్చును. ఇప్పటికి మొదట చెప్పిన పది భేదాలూ నిరూపితములయినవి. ఈ చెప్పిన వాటిలో అంతా సామాన్యంగా శ్లేష కన్పడుతున్నది. అందు వలన ఈ అలంకారము శ్లేషగర్భముగానే ఉంటుందని అనుకోనక్కరలేదు. ఇది శ్లేష లేకుండగా కూడా ఉంటుంది.

స్వభావశిశిరా దృష్టిరపి కాకతిభూభుజః
సర్వాంగతాపినీ జాతా ప్రతిపక్ష మహీభృతాం

ప్రతాపరుద్రుని దృష్టి స్వభావము చేత చల్లనిది అయినా శత్రురాజులకు తాపపెట్టేది అయింది. చల్లనిది తాపపెట్టేదికావడము విరుద్ధము. శత్రువులకు తాపజనకముగ ఉన్నది అనే అర్థములో విరోధము లేదు.

24 విశేషము

ఇటు మీదట విరోధమూలాలంకారాలను నిరూపించుతాము. విరోధమూలములలోనూ విశేషము బహు భేదాలు కలది కాబట్టి ప్రథమ నిరూపణీయము.

ఆధారరహితాధేయ మేకం చానేకగోచరం
అశక్యవస్తుకరణం విశేషాలంకృతి స్త్రిధా

ఆధారరహితము లయిన ఆధేయములను వర్ణించినా ఒకే వస్తువును అనేకాధారములందు ఉన్నట్లు వర్ణించినా అశక్యవస్త్వంతర కరణమును నిబంధించినా విశేషాలంకారము మూడు విధాలవుతుంది. అని సామాన్యంగా అర్థము అసలు ఆధారం లేకుండా ఆధేయము ఉండదు. ఆవిధంగా ఉండడము విరుద్ధము. ఆ విరోధాన్ని పరిహరిస్తూ ఆధేయమును ఉపనిబంధించితే ఒక విశేషము. ఆధారములు రెండు విధాలు. ఒకటి ప్రసిద్ధాధారము. వేరొకటి అప్రసిద్ధాధారము

ప్రసిద్ధాధారము లేకుండా ఆధేయము ఉండడము అప్రసిద్ధము. అయినప్పటికీ అప్రసిద్ధాధారమును చెప్పి ఆధేయమును వర్ణించితే అది ఒక విశేషమవుతుం దన్నమాట. ఈ విధంగా చెప్పినప్పటికీ అనాధారాధేయమును చెప్పినట్లే. ఒక పరిమితమయిన వస్తువును ఒకే పర్యాయము అనేకము లందున్నట్లుగా వర్ణించితే రెండవ విశేష మవుతుంది. పరిమితవస్తువును ఈ విధముగా వర్ణించినపుడే ద్వితీయ విశేషము. అపరిమితమయిన వస్తువును అనగా వ్యాపకవస్తువును ఈ విధంగా వర్ణించినపుడు అలంకారము కాదు. వ్యాపకము ఒకేసారి అనేకములందు ఉండడము అసంభవము కాదు. ఇది రెండవ విశేష స్వరూపము. ప్రకృతమయిన దానికంటె అశక్యమయిన ఇతరముకూడా సిద్ధమయినట్లు వర్ణించడము నూతన విశేషస్వరూపము. కేవలమూ ఆరంభించిన వస్తువు యొక్క సిద్ధి కలగడమె కాక అసంభావ్యమయిన వస్త్వంతరము కూడా సిద్ధమయినట్లు వర్ణించాలి అని తాత్పర్యము. ఆ వస్త్వంతరము చికీర్షితము (చేయదలచినది) కావచ్చును. అచికీర్షితము కావచ్చును. మొత్తానికి ఫలాంతరనిష్పత్తి ఉంటే తృతీయ విశేష మవుతుంది. యథాక్రమముగా పేని ఉదా :

> నల నహుష దిలీప ధర్మపుత్ర ప్రభృతి నరేశ్వర సంశ్రితా యశఃశ్రీః
> అనుదిన మధునా ప్యుపేత్య మైత్రీం విలసతి కాకతివీరరుద్రకీర్త్యా

నలుడు నహుషుడు దిలీపుడు ధర్మజుడు మొదలయిన రాజులను ఆశ్రయించిన యశఃశ్రీ ప్రతిదినమున్నూ ఇప్పుడు కాకతీయకీర్తితో మైత్రి పొంది విలసిల్లుతున్నది. దీనిలో యశఃశ్రీకి ప్రాచీనరాజులు ప్రధానాధారము. వారు తిరోధానము పొందినప్పటికిన్నీ వారిని ఆశ్రయించిన యశఃశ్రీకి స్థితి వర్ణిత మయింది.

పశ్యంతో భయవిహ్వలాః ప్రతినృపాః పశ్చాత్పురః పార్శ్వయో
రప్యంత ర్బహి రంధ్రపార్థివపతిం ప్రోత్క్షిప్త కౌక్షేయకం
నిస్సీమోల్బణధావన వ్యతికర ప్రభ్రష్ట దోరాయుధాః
శైలాచ్ఛైల మటంతి కంపవిగల ద్గాంభీర్య శౌర్యశ్రియః

శత్రురాజులు, ప్రతాపరుద్రుని ఖడ్గము ఎత్తిపట్టుకొన్న వానినిగా వెనుక ఎదుట పార్శ్వములలో లోపల బయటా భయవిహ్వలులై చూస్తూ అంతు లేకుండా బాగా పరుగెత్తడముచేత ఆయుధాలు అన్నీ జారిపోతూ ఉండగా గాంభీర్యము శౌర్యమూ అన్నీ కంపముతో నశించి పోతూ ఉండగా ఒక పర్వతము నుండి ఒక పర్వతానికి తిరుగుతున్నారు. దీనిలో భయభ్రాంతులయిన శత్రురాజులకు ప్రతాపరుద్రుడు ఒక్కడే అయినా అనేకస్థలాలలో గోచరిస్తునట్లు చెప్పబడింది. సమన్వయము సులభము.

అపారకరుణానిధేః సదసి వీరరుద్రప్రభోః
ప్రసాదమధురక్రమా లగతి యత్ర దృష్టి ర్జనే
అతీంద్ర మతికిన్నరాధిప మశేషలోకోన్నతం
న కిం కిమధితిష్ఠతి త్రిభువనే స సర్వాధికః

అపారకరుణానిధి అయిన ప్రతాపరుద్రుని ఆస్థానంలో ప్రసాదమధురమయిన దృష్టి ఎవనియందు లగ్నమవుతున్నదో ఆతడు అతీంద్రము అతికుబేరము అశేషలోకోన్నతమూ అయిన ఏ యే స్థానమును ఆతడు పొందకుండా ఉంటున్నాడు? త్రిభువనాలలో ఆతడు సర్వాధికుడు. దీనిలో సాధారణజనుడు ప్రతాపరుద్రుని దృష్టిప్రసాదపాత్రీకృతుడై ఏమి యేమి పొందడు? అని అశక్య వస్త్వంతర కరణము నిరూపితమయింది.

౨౫. అధికము

ఆధారాధేయములలో వైచిత్ర్యము ఉన్నందువలన ఇక్కడ అధికాలంకారము నిరూపణార్హము.

ఆధారాధేయయో రానురూప్యాభావోఽధికో మతః

ఆధారాధేయములకు ఆనురూప్యము లేక పోవడము అధికాలంకారము అవుతుంది. అది రెండు విధాలు. ఆశ్రయమునకు అల్పత్వము చెప్పడము మహత్త్వము చెప్పడము అని. ఆశ్రయమునకు వైపుల్యము ఉంటే ఆశ్రితము పరిమితమై ఉంటుంది. ఆశ్రితమునకు వైపుల్యము ఉంటే ఆశ్రయమునకు పరిమితత్వము ఉంటుంది. ఇక్కడ ఉన్న పరిమితత్వాపరిమితత్వములు సాపేక్షములు. అటువంటి వస్తుద్వయ సంఘటనము చేతనే అననురూపత్వము గోచరమవుతుంది. ఈ విధంగా ఆధారాధేయములకు అనానురూప్యము ఉన్నపుడు అధికాలంకారము. ఉదా :—

స్తోకే బ్రహ్మాండరంధ్రే విపులతరతయా స్వైరసంచారహేలా
సంకోచా దేకరాశీభవ దతనురుచౌ కాకతీంద్రస్య కీర్త్యా
ఏతైః ప్రాలేయపృథ్వీధర రజతగిరి స్వర్నదీ శీతభాను
క్షీరాంభోరాశి ముఖ్యైః ప్రకటిత మధునా తద్ఘనీభావరూపం

అల్పమయిన బ్రహ్మాండరంధ్రంలో కాకతీంద్రుని కీర్తి చాలా విపులతరము కావడము చేత స్వేచ్ఛాసంచార విలాసములకు సంకోచము కలిగినందువలన ఒకేరాశిగా అయి పెద్దకాంతి కలదిగా అయ్యేటప్పటికి హిమాలయము కైలాసము వియన్నది చంద్రుడు పాలసముద్రము మొదలయిన వన్నీ ఇపుడు ఆ కీర్తి యొక్క ఘనీభావరూపమునే ప్రకటనము చేస్తున్నవి. దీనిలో ఆశ్రయమయిన రోదఃకుహరానికి

అల్పత్వమున్నూ ఆశ్రితమయిన ప్రతాపరుద్రకీర్తికి మహత్వ మున్నూ నిరూపిత మయింది.

క్వాపి క్వాపి కలింగ మాలవ మహారాష్ట్రాంగ వంగాదయో
భూపా స్తాదృశసైన్య వైభవ సమాక్రాంతాఖిలాశాంతరాః
లీనాః కాకతివీరరుద్రనృపతేః వ్యూహప్రపంచశ్రియా
నిస్సీమే బలవారిధౌ విదధతే పూర్తిం న కోణేఽప్యహో ।

ప్రతాపరుద్రుని వ్యూహరచనచేత అపారమయిన బల సముద్రంలో కలింగ మాలవ మహారాష్ట్రాంగ వంగాది రాజులు అటువంటి సైన్యవైభవముచేత దిగంతములను ఆక్రమించిన వారయినా ఎక్కడో ఎక్కడో లీనమయినారు. ఏదో ఒక కోణంలో కూడా పూర్తిని సంపాదించ లేకపోతు న్నారు. దీనిలో ఆధారమయిన బలవారిధి మహత్వము కలది గానూ ఆధేయమయిన భూపుల సేనలు అల్పత్వము కలవారు గానూ వర్ణితమయినందువలన అధికాలంకారము. ఈ ఆధి క్యాల్పత్వములు ప్రమాణవిరుద్ధములని అనుకో నక్కరలేదు. పరస్పరమూ ఇవి అనురూపములుగా=తగినవిగా లేకపోవ డమే ప్రకృతంలో గుర్తింప దగినది. అందువలననె మొదట లక్షణంలో ఆనురూప్యాభావము లక్షిత మయింది.

౨౬. విభావన

ఈ విభావనాలంకారములో పూర్వాలంకారములో మాదిరిగా ఆనురూప్యము లేకపోవడమనేది సమానంగా ఉంది. అందువలన అధికానంతరము ఇది ప్రసక్తము.

కారణేన వినా కార్యస్యోత్పత్తిః స్యా ద్విభావనా

కారణము లేకుండా కార్యము ఉత్పన్నమయినట్లు వర్ణించితే విభావన అవుతుంది. ఏమీ కారణమె లేకుండా

కార్యము పుట్టడము అత్యంతమూ విరుద్ధము. అప్పటి విరోధము దుష్పరిహారము కూడాను. కారణం ఉంటేనే కార్యం ఉంటుంది. అని నియమము. అందువలన ఈ విధంగా చెప్పాలి. ప్రసిద్ధమయిన కారణము లేకుండా కార్యము యొక్క ఉత్పత్తి నిబద్ధమయినపుడు విభావన అవుతుంది అని. ప్రసిద్ధకారణము లేక పోయినా అప్రసిద్ధకారణము ఉండవచ్చును. ప్రసిద్ధకారణ పరిత్యాగముతో కార్యము యొక్క ఉత్పత్తి విభావిత మవుతుంది కాబట్టి ఇది విభావన అవుతుంది. ఉదా :—

ప్రతాపరుద్రేణ పరాజితానాం ప్రత్యర్థినాం వింధ్యగుహాగతానాం
తమాంస్యరాత్రిణి సముద్భవంతి తేజాంసి ఘస్రేష్వపి నోద్భవంతి

ప్రతాపరుద్రునిచేత పరాజితులై వింధ్యగుహాను పొందిన శత్రువులకు రాత్రులు లేని చీకట్లు పుట్టుతున్నవి. పగటిసమయములో కూడా తేజములు పుట్టడము లేదు. దీనిలో తమఃప్రాదుర్భావమునకు ప్రసిద్ధకారణము రాత్రి. అది లేకపోయినా తమ ఉత్పత్తి నిబద్ధ మయింది. శోకాదికము అప్రసిద్ధమయిన కారణము. అది ఉండనే ఉంది. ఈ పద్యములో తమాంసి తేజాంసి అన్నపుడు రెండు తమస్సులను రెండు తేజస్సులను గ్రహించాలి. చీకటి మోహము అని తమోద్వైవిధ్యము ఉన్నప్పటికీ ఆ రెండిటికీ అభేదాధ్యవసాయమును గ్రహించాలి. ఈ అభేదాధ్యవసాయమును సంపాదించే అతిశయోక్తి ఇటువంటి స్థలాలలో తప్పదు. అయినా అతిశయోక్తి విభావన రెండూ ఒకటొకటి బాధించుకోవడం ఉండదు. అతిశయోక్తి సంపాదించి ఇచ్చిన బలమును గ్రహించి విభావన స్వరూపము పొందుతున్నది. ఇంకా ఈ విషయంలోని చర్చకు భేదాలకూ ఇది అదను కాదు.

౨౭ విశేషోక్తి

విభావనాలంకారము కంటె విశేషోక్తి విపర్యయ రూపము. కాబట్టి ఇక్కడ అవకాశము ఉన్నది.

తత్సామగ్ర్యా మనుత్పత్తి ర్విశేషోక్తి ర్నిగద్యతే

కారణసామగ్రి పుష్కలంగా ఉన్నప్పటికీ కార్యము యొక్క ఉత్పత్తి లేకపోయినట్లు నిబంధించితే విశేషోక్తి అలంకార మవుతుంది. కారణము ఉన్నపుడు కార్యము పుట్ట కపోవటము కుదరదు. కారణసామగ్రిలో ఏదో వైగుణ్యము ఉన్నందు వలననే కార్యము పుట్టడము లేదు. విభావనలో కార్యోత్పత్తిలోనే విరోధము ఉంది. విశేషోక్తిలో కారణము యొక్క ఉనికిలో మాత్రమె విరోధము ఉంది. విరోధాలం కారములో నయితే ఉభయవిరోధములూ ఉజ్జీవము ఇచ్చే విగా ఉంటున్నవి. కాబట్టి ఉభయవిరోధానుప్రాణనం ఉన్న విరోధాలంకారంకంటె ఏకైకవిరోధానుప్రాణనం ఉన్న విభావన విశేషోక్తులు విభిన్నములె అని గ్రహించవచ్చు. విభా వనాలంకారానికి లక్ష్యముగా ఇచ్చిన పద్యమే దీనికి కూడా లక్ష్యమవుతుంది. ఉదాహరణ లాఘవమును భావించి అసలు మూలములో లక్షణముకూడా ఒకచోటనే నిర్దిష్టమయింది. పై పద్యంలోని నాల్గవపాదము విశేషోక్తి లక్ష్యము. తేజః ప్రాదుర్భావములో పగలు కారణము. పగటి రవి కిరణాలు ఉంటున్నప్పటికీ తేజోనుత్పత్తి వర్ణిత మయినందు వలన విశే షోక్తి అవుతుంది. ఇక్కడ కూడా తేజాంసి అంటే పరాక్ర మములు వెలుతురులు అని రెండు అర్థములున్నవి. ఈ రెండి టికీ అభేదాధ్యవసాయము వలన ఏకత్వమును నిశ్చయించాలి. ఇక్కడ ఉన్న అతిశయోక్తి కూడా విశేషోక్తికి అనుప్రాణక

ముగా ఉన్నదని భావించాలి. అసలు కారణసామగ్రి ఉంటే కార్యము పుట్టక పోదు. కారణంలో ఏదో వైగుణ్యము ఉన్నందువలన ఇక్కడ కార్యము ఉత్పన్నము కాలేదు. శత్రువులకు తేజస్సు ఉదయించక పోవడములో నిష్ప్రతాపత్వము మొదలయిన నిమిత్తము ఇక్కడ ఉండనే ఉన్నది. ఏదయినా ఒక విశేషమును అభివ్యక్తము చేయడానికి విశేషరూపమయిన ఉక్తి ఉంటుంది కనుక ఇదివిశేషోక్తి. సామగ్రి ఉండగా కార్యము పుట్టకపోవడములో విరోధము ఉంది. అనుత్పత్తిలో నిమిత్తము ఉంటుంది కాబట్టి విరోధపరిహారము కలుగుతుంది. కాగా ఈ విశేషోక్తి ఉక్తనిమిత్త అని అనుక్తనిమిత్త అని రెండువిధాలవుతుందని అనేక గ్రంథాలలోని మాట. విద్యానాథుడు విశేషోక్తి ప్రస్తావములో ఈ భేదకథనం చేయలేదు. అలంకారాలకు పరస్పరమూ భేదములను చెప్పే ప్రసక్తిలో ఉక్తనిమిత్తవిశేషోక్తి, అనుక్తనిమిత్తవిశేషోక్తి అనే పదాలను స్మరించి కూడా అవసరసమయంలో వానిని చెప్పకుండా ఎందుకు విడిచినాడా ? అనిపిస్తుంది. పై పద్యంలో విశేషోక్తిని సమన్వయించుతూ నిష్ప్రతాపత్వాది నిమిత్తము ఉన్నది అనే భావమును స్పష్టము చేయడము వలన నిమిత్తానుపాదానోపాదాన విశేషమును మనస్సులో పెట్టుకొని ఆ రచన చేసి ఉండవచ్చు అని నిశ్చయించితే మూలగ్రంథస్వరసతకు అట్టే భంగపాటు రాదు. ఇంకా ఈ అలంకారద్వయ భేదప్రభేదాలకు ఇది స్థలం కాదు.

౨౦ అసంగతి

ఇంతవరకూ కార్యకారణముల విరోధ ప్రస్తావము

జరిగింది. అసంగత్యలంకారము కూడా కార్యకారణవిరోధ ముతో ఉంటుంది. కనుక ఇక్కడ నిరూపించాల.

కార్యకారణయో ర్భిన్నదేశత్వే సత్యసంగతిః.

కార్యకారణములకు భిన్నదేశస్థితిని వర్ణించితే అసంగతి అవుతుంది. కారణము ఏ ప్రదేశములో ఉంటుందో కార్యము కూడా ఆ ప్రదేశములో ఉండడము ప్రసిద్ధముగా కనపడుతున్నది. వంటఇంటిలోని వహ్ని పర్వతముమీద ధూమమును పుట్టించ లేదు. కారణము ఒక ప్రదేశంలోనూ కార్యము వేరొక ప్రదేశంలోనూ వర్ణితమయితే ఉచితసంగతి నశించి పోతుంది కాబట్టి అసంగతి అలంకార మవుతుంది. కొన్ని కార్యకారణాలు భిన్నదేశంలో ఉండడము విరుద్ధము కాదు. ఏ కార్యకారణాలు భిన్నదేశంలో ఉండడము విరుద్ధమో అటువంటి కార్యకారణాలకు భిన్నదేశస్థితిని చెప్పితే అసంగత్యలంకార మవుతుందని తాత్పర్యము. ఈ అసంగత్యలంకారానికిన్నీ అతిశయోక్తి అలంకారము అనుప్రాణకముగా ఉంటుందని గ్రహించాలి. ఉదా :

బిభర్త్యుర్వీధురాం గుర్వీం వీరరుద్రనరేశ్వరే
భపం త్యతితరాం శశ్వ న్నమ్రాః సామంతమౌళయః

వీరరుద్రుడు గొప్ప భూభారమును భరించు తున్నాడు. సామంతరాజుల శిరస్సులు మాటిమాటికీ మిక్కిలి నమ్రము లవుతున్నవి దీనిలో ప్రతాపరుద్రుని యందు భూభారము శత్రువులందు నమనమూ వర్ణితము. ఎవరిలో భారము ఉంటే వారే వంగిపోవాలి. ఇక్కడ కార్యకారణాలు భిన్న దేశగతములు కావడము విరుద్ధము. అవి అట్లా నిరూపితములు కాబటి అసంగత్యలంకారము.

౨౯ విచిత్రము

విచిత్రము కూడా విరోధప్రస్తావములో చేరదగిన అలంకారము.

విచిత్రం స్వవిరుద్ధస్య ఫలస్యాప్త్యర్థ ముద్యమః

కారణవిరుద్ధమయిన ఫలము యొక్క ప్రాప్తికై ఉద్యమము నిబంధింపబడి నపుడు విచిత్రాలంకారము. ఒక హేతువునకు ఒకకార్యము ఉంటుంది. ఎపుడయినా కార్యము హేతువునకు విపరీతముగా ఉండవచ్చు. అటువంటి కారణ విపరీత ఫల నిష్పత్తి కొరకు ఒకని ప్రయత్నము అంటే ఉత్సాహము నిబంధింప బడినప్పుడు విచిత్రా లంకారము. విపరీతఫల నిష్పత్తి కయిన ప్రయత్నము ఆశ్చర్య హేతువవుతుంది కదా ! ఉదా :

ప్రతాపరుద్రనృపతే రగ్రే దూరా న్నరేశ్వరాః
అవరోహంతి హస్తిభ్య స్తా నారోఢు మనర్గళం

ప్రతాపరుద్రుని ఎదుట దూరముగానే రాజులు, అడ్డు లేకుండా ఆరోహించడానికై ఏనుగుల నుండి దిగుతున్నారు. దీనిలో ఆరోహించడానికి దిగుతున్నా రనడము విపరీతఫల ప్రాప్తి ప్రయత్నము.

౩౦ అన్యోన్యము

తదన్యోన్యం మిథో యత్రోత్పాద్యోత్పాదకతా భవేత్

ఈ అలంకారము కూడా విరోధమూలము. పుట్టించేది ఉత్పాదకము. పుట్టేది ఉత్పాద్యము. రెండిటికి పరస్పరము ఉత్పాద్యోత్పాదకత వర్ణిత మయినట్లయితే అన్యోన్యాలంకార మవుతుంది. సాక్షాత్తుగా పరస్పరమూ జన్యజనక భావము విరుద్ధము. కాబట్టి క్రియా ద్వారముగా పరస్ప

రము ఉత్పాద్యోత్పాదకత ఉంటే అన్యోన్యమని తాత్పర్యము. దాని క్రియ దీనియందు దీనిక్రియ దానియందు వర్ణితమయినపుడు ఇది కుదురుతుంది.

ఆరోహతా రుద్రనరేశ్వరేణ విరాజతే కాకతిరాజపీఠం
ఆరుహ్య తేనోజ్జ్వలరత్నభాజా రాజాపి లక్ష్మీమధికాం బిభర్తి

కాకతి రాజపీఠము ఆరోహించిన రుద్రనరేశ్వరునిచే శోభించింది. ఆ పీఠమును అధిష్ఠించిన రుద్రనరేశ్వరుడున్నూ సముజ్జ్వలరత్నాలతో కూడుకొన్న ఆ పీఠము చేత అధిక శోభను ధరించు తున్నాడు. ఇక్కడఅలంకరణక్రియా ద్వారముగా పరస్పర నిష్పాదకత్వము ఉన్నది. ప్రతాపరుద్ర భద్రాసనములకు అన్యోన్యాలంకార్యత్వము స్పష్టము.

౩౧ విషమము

విరుద్ధ కార్యస్యోత్పత్తి ర్యత్రానర్థస్య వా భవేత్
విరూపఘటనా చాసౌ విషమాలంకృతి స్త్రిధా.

విషమాలంకారము విరోధమూలము. ఇది మూడు విధాలు. విరుద్ధకార్యము యొక్క ఉత్పత్తిని వర్ణించితే మొదటి విషమము. అనర్థోత్పత్తిని వర్ణించితే రెండవ విషమము. విరూపములయిన వస్తువుల ఘటనము ఉంటే మూడవ విషమము. వీని విపులీకరణమును ఈ విధముగా గుర్తించాలి. మొదటి విషమంలో కారణవిరుద్ధమయిన కార్యోత్పత్తి ఉండాలి. కారణగుణములను సంబంధించి కార్యము ఉత్పన్నమవుతుంది అని సామాన్యంగా లోకప్రసిద్ధి. ఈ విధముగా లేక కారణగుణాల కంటె కార్యగుణాలు వేరుగా ఉండి విరూప కార్యము ఉత్పన్నమయినట్లు వర్ణితం కావాలి. ఇట్లా అనురూపం కాని సంసర్గము ఉన్నందు వలన ఇది విరోధగర్భము.

కారణము కంటె కార్యము విజాతీయముగా ఉండి అతద్గుణంగా ఉంటుంది కాబట్టి కార్యము విరూప మన్నమాట. గోమయము నుండి తేలు పుట్టుతుంది. ఈ రీతిగా కార్యకారణాలు విరూపములు అవుతూనే ఉంటవి. అయినా కవిప్రతిభా నిర్వర్తిత మయిన విరూపత్వమును ఇక్కడ పరిగ్రహించాలి. ఒక విశిష్టమయిన కారణము వలన పైన చెప్పిన విధముగా విరూపమయిన కార్యము పుట్టడమును వర్ణించితే మొదటి విషమము అవుతుంది అని తేలింది. రెండవ విషమంలో అనర్థసముత్పత్తి ముఖ్యము. ఒక ప్రయోజనమును సాధించడానికి ప్రత్నించిన వ్యక్తికి ఆ ప్రయోజనము సిద్ధించక పోవడమె కాక అనర్థప్రాప్తికూడా ఉంటే ఇది అవుతుంది. అత్యంతమూ అననురూపములు విరూపములు అయిన వస్తువులకు ఘటనము ఉంటే మూడవది. ఆ కూర్పబడిన పదార్థములు కేవలము విరూపములుగా ఉండడమె కాక వాని సంఘటన (కూర్పు) కూడా అనను రూపముగా ఉండాలి. అని తాత్పర్యము. ఇటువంటి విరూపఘటనము మూడవ విషమ మన్నమాట. ఈ విధముగా మూడూ మూడు విషమములు. ఈ మూడింటికీఅనుగతమైన సామాన్యలక్షణము లేదు. మొత్తానికి అంతటా అననురూప సంసర్గము విషమాలంకారము అని తేలుతుంది. వరుసగా ఉదా :—

> రాజ్ఞః కాకతివీరరుద్రనృపతేః ఖడ్గాత్ తమాలప్రభాత్
> ఉద్భూతాం శరదిందుకాంతి ధవళాం కీర్తిశ్రియం పశ్యతాం
> లోకానాం మురవైరిపాదకమలా జ్జాతాం వియన్నిమ్నగాం
> శ్రుత్వా సంప్రతి విస్మయా ద్విరమతి ప్రాప్తానుభావం మనః.

ప్రతాపరుద్రుని తమాలకాంతి కలిగిన ఖడ్గమునుండి

ఉత్పన్నమయిన శరచ్చంద్రకాంతి ధవలకీర్తిని చూస్తూ ఉన్న జనుల మనస్సు విష్ణుపాదోద్భవ అయిన గంగను విన్న తర వాత ఒక అనుభవమును సంపాదించి విస్మయమునుండి విరమిస్తున్నది. విష్ణువు నల్లనివాడు. ఆతని పాదకంజాతజాత గంగ తెల్లనిది. నల్లని ఖడ్గము వలన తెల్లని కీర్తి కారణ విరూపకార్యము. కారణగుణము కార్యములో లేదు. ఇక్కడ కార్యకారణముల అననురూపత్వములో కవిప్రతిభ కనపడ తూనే ఉన్నది.

ఆస్తాం జయాశా రిపుభూపతీనాం సంగ్రామసీమాన ముపాగతానాం
ప్రతాపరుద్రస్య విలోకనేన భ్రశ్యంతి జీవై స్సమ మాయుధాని

యుద్ధభూమికి వచ్చిన శత్రురాజులకు జయాశ ఆ విధ ముగా ఉండనీ! ప్రతాపరుద్రుని చూపుచేతనే జీవములతో బాటు ఆయుధాలు కూడా జారిపోతున్నవి. శత్రువులు జయ మును ఉద్దేశించి యుద్ధము ప్రారంభించారు. వారికి జయము లభించక పోగా జీవాయుధములు కూడా పోయినవని వర్ణిత మయినందువలన అనర్థప్రాప్తి ఉన్నది. కనుక ద్వితీయ విషమము.

క్వ భూపాలా స్తాదృగ్విభవమహనీయ ప్రకృతయః
క్వచేయం కాంతారస్థితి రశివవృత్త్యేకనిలయా
ఇతి ప్రేక్షం ప్రేక్షం వనభువి రిపూణా రుద్రనృపతేః
ప్రతాపం శ్లాఘంతే శబరపురవీరాః ప్రతిదిశం.

అటువంటి వైభవము చేత మహనీయమయిన స్వభా వం కల రాజులెక్కడ! అమంగళవృత్తి నివాసమయిన ఈ వన స్థితి ఎక్కడ!! ఈ రెండిటికీ చాలా అంతరం ఉంది. ఇటు వంటి వానికి కూడా ఇక్కడ ఘటనము ఉన్నదే! అని

తాత్పర్యము. ఈవిధంగా వనభూమిలో శత్రువులను చూస్తూ చూస్తూ కిరాతవీరులు ప్రతాపరుద్రుని ప్రతాపమును ప్రతి దిశలోనూ శ్లాఘించుతున్నారు. మహానగర నివాసయోగ్యులయిన రాజులకు అమంగళములయిన వనప్రదేశములకున్నూ ఘటనము ఉన్నది. ఇవి విరూపములు. వీని ఘటనము కూడా అననురూపము. కనుక తృతీయవిషమమును ఊహించాలి. ఇప్పటికి ఈవిధముగా విరోధగర్భాలంకారములు నిర్ణీతమయినవి.

౩.౨ సమము

సమవిషమాలంకారములకు పరస్పరము వైషమ్యము ఉన్నది. కనుక సమాలంకారమును ఇక్కడ ఇప్పుడు నిరూపించాలి. విషమ విపర్యయము సమము. విషమానికి భేద త్రయము ఉన్నది. ఆ భేదత్రయానికి విపర్యయరూపంగా భేదత్రయము దీనిలో ఉంటుంది అని అనుకో కూడదు. విషమంలోని మొదటి రెండుభేదాల విపర్యయము అలంకార రూపము కాదు. కారణము వలన కార్యము పుట్టడము వస్తు సాధనోద్యతునకు అది సిద్ధించడము వాస్తవమె కాబట్టి అవి అనలంకారములు. ఇక మిగిలిన మూడవ భేద విపర్యయమె బాగా ఉంటుంది కాబట్టి అలంకారంగా పరిగణించాలి. సమము విషమవిపర్యయముగా ఉంటుంది అంటే ఈ అభిప్రాయమునె గుర్తించాలి.

సా సమాలంకృతి ర్యోగే వస్తునో రనురూపయోః

అనురూప వస్తువులకు సంబంధము ఉన్నట్లయితే సమాలంకారమవుతుంది. అన్యోన్యము అనురూపములయిన పదార్థములకు సంఘటనము కుదిర్చినట్లయితే సమాలంకార

మన్నమాట. విషమంలో చెప్పిన విధంగా కూర్పబడే పదార్థములు అనురూపములుగా ఉండడమె కాక వాని సంఘటన కూడా అనురూపముగా ఉండాలని తాత్పర్యము. ఉదా :—

విద్యా స్సకలా లక్ష్మ్యా సమం ప్రతాపరుద్రే
సంఘటయ్య సుసదృశం భవతి కృతార్థః స్వయంబ్రహ్మా.

సకలవిద్యలనూ లక్ష్మితో సమంగా ప్రతాపరుద్రుని లో సుసదృశంగా తానంతట తాను సంఘటించి బ్రహ్మ కృతార్థు డవుతున్నాడు. దీనిలో లక్ష్మిసరస్వతులకు ఇద్దరకూ అనుగుణమయిన కూర్పు నిబద్ధమయింది. కూర్పులో సంబంధించి ఉండే వస్తువులు శ్లాఘ్యములయినవి కావడము అశ్లాఘ్యములయినవి కావడము అని రెండువిధాలుగా ఉంటవి. ఇక్కడ శ్లాఘ్యయోగము ఉన్నది. సుసదృశసంఘటనము అని చెప్పడము చేత సంఘటనమున్నూ అనురూపముగా ఉన్నదని తాత్పర్యము.

౩౩ తుల్యయోగిత

ఇక ఇటు మీదట గమ్యమానౌపమ్యములయిన అలంకారముల వర్గప్రస్తావము ఉంటుంది.

ప్రస్తుతానాం తథాన్యేషాం కేవలం తుల్యధర్మతః
ఔపమ్యం గమ్యతే యత్ర సా మతా తుల్యయోగితా

కేవలము ప్రస్తుతములకు కాని కేవలము అప్రస్తుతములకు కాని గుణక్రియారూపమయిన తుల్యధర్మసంబంధము వలన ఔపమ్యము గమ్యమాన మయినట్లయితే తుల్యయోగితాలంకార మవుతుంది. "తుల్యస్య యోగః అస్యాం సంజాత ఇతి తుల్యయోగితా" తుల్యమయిన దానికి దీనిలో సంబంధము కలిగింది కాబటి ఇదితుల్యయోగిత అవుతుంది. సమాన

ధర్మసంబంధము వలన ఔపమ్యము గమ్యమానము కావడము ఉండవలెనని చెప్పినందు వలెనన ప్రస్తుతము లయిన రెండు పదార్థాలు కాని అప్రస్తుతములయిన రెండు పదార్థాలు కాని దీనిలో ఉండాలి అనే అర్థము లభిస్తున్నది. అయినా లక్షణవాక్యంలో "ప్రస్తుతానాం తథాన్యేషాం" అని బహువచనము ఉన్నందు వలన కూర్పబడే ప్రస్తుతములూ అనేకములు ఉండాలి. అప్రస్తుతములూ అనేకములు ఉండాలి" అనే అర్థము రావచ్చును. దాన్ని బట్టి తుల్యయోగితలో బహుపదార్థములను గ్రహించాలి. బహుపదార్థములకు ఔపమ్యమును వ్యంగ్యముగా చేయడము దీనిలో ఉంటుంది—అని ఇటువంటి అభిప్రాయమును ఇక్కడ గ్రహింప చేయనక్కరలేదు. ఉదాహరణానురోధముగా చూస్తే రెండు పదార్థములకున్నూ ఔపమ్యము భాసించేటట్లు నిబంధనమున్నది. కాబట్టి రెండు పదార్థములూ ఉండవచ్చు. అనేక పదార్థములూ ఉండవచ్చు అని బోధింప చేయడమె యుక్తము. ఈ విధంగానే దీపకంలో కూడాను. సమానధర్మము గుణ క్రియారూపముగా ఉంటుంది కాబట్టి ప్రత్యేక ప్రత్యేకంగా ప్రస్తుతములకు అప్రస్తుతములకూ వానిని సంబంధింపచేస్తే తుల్యయోగిత నాలుగు విధాలవుతుంది. వాని పేర్లు స్పష్టము. ఈ తుల్యయోగితకు అవశ్యంగా అతిశయోక్తి అనుప్రాణకంగా ఉంటుందని అనుకోనక్కరలేదు. అతిశయోక్తి లేకుండగా కూడా తుల్యయోగిత ఉంటుంది. ఔపమ్యము అవశ్యంగా గోచరము కావాలి. ఉదా :-

భద్రాసనాధ్యాసిని రుద్రదేవే తత్కీర్త్యయ స్తద్విషదంగనాశ్చ
అనారతం భ్రాంతివిశేష భాజః ప్రతిక్షణం పాండురతాం భజంతే

రుద్రదేవుడు సింహాసనమును అధిష్ఠించగా ఆతని కీర్తులు శత్రుస్త్రీలున్నూ నిత్యమూ భ్రాంతివిశేషమును పొంది ప్రతిక్షణము తెల్లనవుతున్నారు. ఇది ప్రాకరణికమయిన తుల్యయోగిత. ప్రతాపరుద్రుడు వర్ణ్యమానుడు. ఆతని కీర్తులు శత్రుస్త్రీలున్నూ ప్రస్తుతములె. పాండురత్వము పొందుట సమానధర్మము. కీర్తికి శత్రుస్త్రీలకూ ఔపమ్యము గోచరమవుతున్నది. ప్రాకరణికములకు కాని అప్రాకరణికములకు కాని గోచరమవుతున్న ఔపమ్యము వివక్షానుసారముగా ఉంటుంది. కీర్తివలె స్త్రీలు ఉన్నారు, అనిగాని స్త్రీలవలె కీర్తులు ఉన్నవనిగాని గ్రహించవచ్చును.

కూర్మేంద్ర పన్నగాధీశ హరిత్కరి కులాద్రయః
మిథో నిస్సారతాం ప్రాప్తాః కాకతీంద్రే మహీభృతి

ప్రతాపరుద్రుడు రాజు కాగా ఆదికూర్మము ఆదిశేషువు దిగ్గజము కులపర్వతము అన్నీ పరస్పరము నిస్సారత్వము పొందినవి. దీనిలో కూర్మేంద్రాదులు ప్రాకరణికములు. కూర్మేంద్రసదృశము పన్నగము, పన్నగసదృశము కూర్మేంద్రము అని ఏ విధముగా నయినా ఔపమ్యమును ఊహించవచ్చు. ఇదిన్నీ వైవక్షికమె.

౩౪ దీపకము

ప్రస్తుతాప్రస్తుతానాం తు సామస్త్యే తుల్యధర్మతః
ఔపమ్యం గమ్యతే యత్ర దీపకం తన్నిగద్యతే.

తుల్యయోగితాలంకారము కేవలము ప్రస్తుతములకు గాని కేవలము అప్రస్తుతములకు గాని సంబంధించి ఉంటుంది. దీపకము ప్రస్తుతాప్రస్తుతములను ఆశ్రయించి ఉంటుంది. ప్రస్తుతాప్రస్తుతములకు మొత్తముగా గుణక్రియారూప

మయిన తుల్యధర్మమును అనుసరించి ఔపమ్యమును గమ్య మయ్యేటట్లుగా నిరూపించినట్లయితే దీపకాలంకారమవుతుంది. ప్రాకరణికాప్రాకరణికములలో ఏదో ఒకచోట సమానధర్మమును నిర్దేశించితే అది ప్రసంగవశాన ఇతరమునకు కూడా ఉపకరించుతుంది. దానిని దీపనము చేస్తుంది. అందువలన దీపసాదృశ్యము స్పష్టము. కనుకనే దీపకమనే పేరు సముచితముగా ఉన్నది. దీనిలో కూడా ఔపమ్యము గోచరము కావాలి. సాదృశ్యవాచకము లయిన ఇవాదులు ఇక్కడ ప్రయోగింపబడవు. కాబట్టి ఔపమ్యము గమ్యమే అవుతుంది. ప్రకృతాప్రకృతములు రెండూ ఉపమేయముగా ఉపమానముగా ప్రసిద్ధములై ఉంటవి కాబట్టి ఉపమానోపమేయభావము ఇక్కడ వాస్తవమే. ఈ దీపకంలో సాధర్మ్యము వాక్యార్థగతము గానే ప్రతీతమవుతుంది. అందువలన ఆదిమధ్యాంతగతముగా ధర్మము ఉంటే ఆదిదీపకము మధ్యదీపకము అంతదీపకము అని ఇది మూడు విధాలు.ఉదా:

భాతి నలేన కృతయుగం రఘుకులదీపేన శౌరిణా త్రేతా
ద్వాపర స్తపోజనినా కలియుగం వీరరుద్రేణ.

నలునిచే కృతయుగము రఘుకులదీపకుడయిన శ్రీరామునిచే త్రేతాయుగము ధర్మరాజుచే ద్వాపరము వీరరుద్రునిచే కలియుగము భాసించుచున్నది. దీనిలో 'భాతి' అనే సమానధర్మము మొదటి వాక్యగతముగా ఉంది కాబట్టి ఆది దీపకము. నల రామ ధర్మపుత్రులచేత కృత త్రేతా ద్వాపరములు శోభించినట్లుగా వీరరుద్రునిచే కలియుగము శోభించుచున్నది. అని ఔపమ్యము గోచర మవుతుంది.

భాగీరథ్యా జలనిధీ రాజతే జ్యోత్స్నయా పూర్ణిమాచంద్రః
శ్రుత్యా కమలభవః కీర్త్యా ప్రతాపరుద్రోపి,

భాగీరథిచే జలనిధి, వెన్నెలచే పూర్ణిమాచంద్రుడు వేదముచే బ్రహ్మ, కీర్తిచే ప్రతాపరుద్రుడు రాజిల్లుతున్నారు దీనిలో ధర్మము మధ్యవాక్యగతముగా ఉన్నది. గం మొదలయిన వానిచేత సముద్రాదులు ఏ విధముగా శోభి చుతున్నవో ఆ విధముగా కీర్తిచే ప్రతాపరుద్రుడు శోభి చుతున్నాడు. అని ఔపమ్యప్రతీతి ఉన్నది.

సురలోకం సురనాథో నరలోకం వీరరుద్రనరనాథః
ఫణిలోకం ఫణినాథో రక్షతి నిరుపద్రవోద్వేగం.

సురలోకమును సురనాథుడు, ఫణిలోకమును ఫ నాథుడు, నరలోకమును వీరరుద్రనరనాథుడూ ఉపద్రవవ ఉద్వేగము లేకుండా రక్షించుతున్నారు. దీనిలో సమా ధర్మము చివరి వాక్యములో ఉన్నది. అందువలన అం దీపకము. సురలోక ఫణిలోకములు సురనాథ ఫణినాథుల రక్షితములయినట్లుగా వీరరుద్రునిచేత నరలోకము రక్షి మైనది. అని ఔపమ్యము గోచరమవుతున్నది. ఇంకా దీ సంబంధించిన భేదప్రభేదాలు గ్రంథాంతరములలో నిరూపి ములయినవి. దీపకంలో సాధర్మ్యము వాక్యార్థగతముగా గోచరమవుతుంది. అయినప్పటికిన్నిపదార్థగతముగానే ఇక్క ఉంటుంది. అని అంటున్నారు. అనేకములు ఏకక్రియా సంబంధముతో ఏకగుణాభిసంబంధముతో ఉన్నందు వ ఈ ఔచిత్యమును అనుసరించి పదార్థత్వ వచనమును స తము చేసికోవచ్చు; ఒకే క్రియ ఒకే గుణము అనేక ముగా ఉన్నప్పటికీ క్రియారూపంగా గుణరూపంగా విధాన ఉంటుంది కాబట్టి పదార్థగతమె అని అన్నారు. అన వాక్యార్థ గత మని అనడమె సమంజసంగా ఉంటుంది. ఆ

అభిప్రాయముతో ఆదిమధ్యాంతగతముగా వాక్యమును ఆవృత్తి చేసి మూడు దీపకములను ప్రాచీనానుసారముగా నిరూపించినాడు.

౩౫ ప్రతివస్తూపమ

పదార్థగతమయిన అలంకారద్వయమును నిరూపించిన తరువాత వాక్యార్థగతమయిన అలంకారద్వయమును నిరూపించుతాము.

> యత్ర సామాన్యనిర్దేశః పృథగ్వాక్యద్వయే యది
> గమ్యౌపమ్యాశ్రితా సా స్యా త్ప్రతివస్తూపమా మతా.

సామాన్యధర్మ నిర్దేశము వాక్యద్వయములో వేరు వేరుగా ఉన్నపుడు ప్రతివస్తూపమ అవుతుంది. ఇది గమ్యౌపమ్యమును ఆశ్రయించి ఉంటుంది. వస్తు ప్రతివస్తు భావమును అనుసరించిన సామాన్యధర్మము ఔపమ్యము గమ్యము అయ్యేటట్లుగా వాక్యద్వయములో నిర్దిష్టము కావాలి. అపుడది ప్రతివస్తూపమ "ప్రతివస్తు ప్రతివాక్యార్థం ఉపమా సామాన్యం యస్యాం సా ప్రతివస్తూపమా" ప్రతి వాక్యార్థమును సంబంధించి సామాన్యధర్మము ఉంటుంది కాబట్టి దీని పేరు సార్థకము. పదార్థముల ద్వారా నిష్పన్న మవుతుంది. కనుకనే ప్రతివస్తూపమకు ఇక్కడ ప్రసక్తి ఉన్నది. వాచకశబ్దములను చెప్పి సామాన్యధర్మమును ఒక పర్యాయము నిర్దేశించితే ఉపమాలంకార మవుతుంది. వస్తు ప్రతి వస్తు భావముతో అసకృన్నిర్దేశము ఉన్నప్పటికీ ఉపమాలంకారమె. వాచకపదములు లేకుండా ధర్మానికి అసకృన్నిర్దేశము ఉన్నప్పుడు రెండు విధానాలు ఉన్నవి. అందులో వస్తు ప్రతివస్తు విధానమయితే ప్రతివస్తూపమాలంకారము.

బింబప్రతిబింబభావము ఉంటే దృష్టాంతాలంకారము. వస్తు ప్రతివస్తుభావ బింబప్రతిబింబభావముల స్వరూపములు ఉపమాప్రసంగములో నిరూపితము లయినవి. ఈ ప్రతివస్తూపమాలంకారము సాధర్మ్య వైధర్మ్యములతో రెండు విధాలు. ఉదా :

మంథానాచల ఏవైకః క్షమః సింధువిలోడనే
ప్రతాపరుద్ర ఏవైకః శక్తః శత్రువిలోడనే.

సముద్రవిలోడనములో మంథానపర్వతమె క్షమమయింది. శత్రువిలోడనములో ప్రతాపరుద్రుడె శక్తుడు. ఏ విధంగా సముద్రవిలోడనములో మంథానాచలము క్షమమో ఆ విధంగా శత్రువిలోడనంలో ప్రతాపరుద్రుడు శక్తుడు. అని ఔపమ్యము గమ్యమాన మవుతుంది. సమర్థుడు అనే ఒకే అర్థము సంబంధి భేదముతో క్షమ శక్త శబ్దాల చేత చెప్పబడి నందువలన ప్రతివస్తూపమ.

ప్రతాపరుద్ర ఏవైకః పటీయాన్ జనరంజనే
చంద్రాదృతే క్షమో నాన్య శ్చకోరపరితోషణే.

జనులను రంజింప చేయడములో ప్రతాపరుద్రుడు ఒక్కడే సమర్థుడు. చకోరములను సంతోషపెట్టడములో చంద్రుడు తప్ప ఇతరుడు ఎవరూ సమర్థుడు కాడు. దీనిలో చంద్రుడు ఏ విధముగా చకోరపరితోషణము చేస్తున్నాడో ఆ విధముగానే ప్రతాపరుద్రుడు జనరంజనము చేస్తున్నాడు అని వైధర్మ్యముగా ఔపమ్యము గోచర మవుతుంది. పటీయాన్ క్షమః అనే రెండుశబ్దాల చేతా ఏకార్థమే సంబంధభేదాన నిరూపితమయింది కాబట్టి వస్తుప్రతివస్తుభావమును గ్రహించ వచ్చును.

౩౭. దృష్టాంతము

యత్ర వాక్యద్వయే బింబ ప్రతిబింబతయోచ్యతే
సామాన్యధర్మో వాక్యజ్ఞైః స దృష్టాంతో నిగద్యతే

వాక్యద్వయములో సమానధర్మము బింబప్రతిబింబ భావముతో నిరూపితమయినప్పుడు దృష్టాంతాలంకార మవుతుంది. సాదృశ్యవాచకము లయిన ఇవాదులకు ఇక్కడ ప్రయోగము ఉండరాదు. ఇవాది ప్రయోగము ఉంటే ఉపమాలంకార మవుతుంది. "దృష్టః అంతః నిశ్చయో యత్ర స దృష్టాంతః" నిశ్చయము ఎక్కడ కన్పడుతున్నదో అక్కడ అది దృష్టాంతము. ఇది కూడా సాధర్మ్యవైధర్మ్యలతో రెండు విధాలు. ఉదా :—

క్షోణీం బిభ్రతు భూభృతః కతిపయే కాపి ప్రతిష్ఠా పునః
స్వర్ణాద్రే ర్దిగధీశ వాస నగరీ సందిగ్ధ కుంజశ్రియః
రాజానో జనరంజనం విదధతాం శ్రీవీరరుద్రప్రభోః
కోప్యన్యో మహిమా జగత్త్రయధురా ధౌరేయ దోశ్శాలినః.

కొన్ని పర్వతాలు భూమిని భరించినా, దిక్పతులకు నివాసనగరము లేమో! అనే సందేహమును కలిగించే నికుంజముల శోభ గల మేరువు పర్వతానికే అనిర్వాచ్యమయిన గొప్ప ప్రతిష్ఠ ఉంది. రాజులు జనరంజనము చేయుదురు గావుత! మూడులోకముల భారమును వహించడములో సమర్థమయిన భుజశోభ కలిగిన శ్రీవీరరుద్ర ప్రభువునకే అనిర్వాచ్యము అసాధారణమూ అయిన మహిమ ఉన్నది. ఉపమాన ధర్మమయిన ప్రతిష్ఠ ఉపమేయధర్మమయిన మహిమ రెండున్నూ పరస్పరమూ సాదృశ్యము వలన అభిన్నములుగా గోచరము లవుతున్నవి.

వేరువేరుగా పేనికి నిరూపణము ఉన్నది. ఇటువంటి బింబ ప్రతిబింబభావముతో సామాన్యధర్మ నిరూపణము వాక్య ద్వయములో ఉన్నందువలన దృష్టాంతాలంకారము అవుతున్నది. ప్రకృతాప్రకృతధర్మి పదార్థములయిన ప్రతాప రుద్రుడు మేరువు రెండిటికే బింబ ప్రతిబింబభావము వలన ఔపమ్యము గోచరమవుతున్నది. కేవలము ప్రకృతా ప్రకృతములయిన ధర్మిపదార్థములకే బింబప్రతిబింబభావము ఉండడము కాక ధర్మములకున్నూ బింబప్రతిబింబభావ ముతో నిర్దేశము ఉండాలి.

కాకతీంద్ర కృపాదృష్టిమాత్రా జ్జాగ్రతి సంపదః
తావదబ్జాని నిద్రాంతి యావన్నోదేతి భానుమా౯

ప్రతాపరుద్రుని దయాదృష్టిమాత్రాన సంపదలు మేల్కొంటున్నవి. సూర్యుడు ఉదయించనంతవరకూ పద్మాలు నిద్రిస్తున్నవి. ఈ పద్యములో భాస్వదుదయ మాత్రాన పద్మాలు ఏ విధంగా సమున్మీలనము పొందుతున్నవో ఆ విధంగా ప్రతాపరుద్రుని దయావిలోకనమాత్రము చేత సంపదలు సంభవిస్తున్నవి. అని వైధర్మ్యముతో బింబప్రతి బింబనము ఉన్నది.

౩౭ నిదర్శన

గమ్యమానౌపమ్యముల ప్రస్తావములో నిదర్శనాలం కారమును కూడా నిరూపించాలి.

అసంభవద్ధర్మయోగా దుపమానోపమేయయోః
ప్రతిబింబక్రియా గమ్యా యత్ర సా స్యా న్నిదర్శనా.

సంభవించని ధర్మసంబంధము వలన ఉపమానోప మేయములకు ప్రతిబింబక్రియ గమ్యమయినపుడు నిదర్శన

అవుతుంది. ఉపమానధర్మమును ఉపమేయగతముగా నిబంధించి నపుడు అన్వయము సంభవించదు. దాని సంబంధము కొరకు బింబప్రతిబింబభావమును గోచరింప చేసేటట్లయితే ఒక నిదర్శనము. ఉపమేయధర్మమును ఉపమానగతముగా నిబంధించి నపుడు అన్వయము కుదరదు. అపుడున్నూ బింబ ప్రతిబింబభావమును గోచరింపచేసి నట్లయితే రెండో నిదర్శన మవుతుందని ఇది రెండు విధాలు. ఉదా :—

రిపుతిమిర ముదస్యన్ రత్నసింహాసనస్థః
త్రిభువనరమణీయః కాకతీయక్షితీశః
వహతి మహితవిశ్వోల్లాసి లీలా మఖిఖ్యాం
ఉదయగిరి శిఖరి చూడా చుంబిన స్త్రీవ్రభానోః.

రిపుతిమిరమును పోగొట్టుతూ రత్నసింహాసనస్థుడై మూడు లోకాలలో మహనీయుడయిన ప్రతాపరుద్రుడు ఉదయపర్వతశిఖరమును స్పృశించుతూ ఉన్న సూర్యుని లోకానంది స్వరూపము కల శోభను వహించుతున్నాడు. ఈ పద్యంలో సూర్యుడు ఉపమానము. ప్రతాపరుద్రుడు ఉపమేయము. సూర్యశోభ ప్రకృతములో సంభవించదు, దాని సంబంధమును సంపాదించడానికై శోభాసదృశమయిన శోభను వహించుతున్నాడు అని బింబప్రతిబింబకరణాక్షేపము ఉన్నది. ఉపమానధర్మమును ఉపమేయమందు నిరూపించుట ఈ పద్యములో ఉన్నది.

వీరరుద్రనరేంద్రస్య యశోవైశద్యసంపదః
లక్ష్యంతే క్షీరవారాశి లీలాదర్పణ మండలే.

ప్రతాపరుద్రుని యశోవైశద్యసంపదలు పాలసముద్రము అనే లీలాదర్పణ మండలంలో గోచరములవుతున్నవి.

దీనిలో ఉపమేయ ధర్మమయిన యశోవైశద్యము దుగ్ధార్ణవములో సంభవించనందు వలన సాదృశ్యమును స్వీకరించి యశోవైశద్య సదృశమయిన యశోవైశద్యము అని స్వీకరించాలి. ఈ విధంగా బింబప్రతిబింబనము గమ్యమవుతుంది. ఉపమేయధర్మము ఉపమానగతంగా చెప్పడంలో ఇది ఉదాహరణము. ఇంకా ఈ నిదర్శనములో చాలా భేదములను ప్రాచీనులంగీకరించి నిరూపించారు. ఒక్కొక్కచోట నిషేధ వశము వలన ప్రాప్తి ఆక్షిప్త మవుతుంది. అక్కడకూడా బింబప్రతిబింబభావము గోచరమవుతుంది. ఈ విశేషమును ఈ పద్యంలో గుర్తించ వచ్చు. ఉదా :—

కాకతీంద్రద్విషత్కాంతా ధావంత్యః ప్రతికాననం
పద్భ్యాం ముంచం త్యలాక్షాభ్యాం స్థలే రక్తోత్పలశ్రియం

ప్రతాపరుద్రుని శత్రుస్త్రీలు ప్రతిఅరణ్యానికీ పరుగెత్తుతూ లాక్షారహితములయిన పాదాలతో భూమియందు ఎఱ్ఱగలువ శోభను విడిచి పెట్టుతున్నారు. ఇక్కడ ఎఱ్ఱగలువ శోభను విడిచి పెట్టుతున్నారు అనడము చేత ఒకప్పుడు వారి పాదాలకు లాక్షారసముతో కూడుకొన్న సమయంలో రక్తోత్పలశోభ ఉండేదని ఆశ్రీప్రాప్తి ఆక్షిప్తమవుతుంది. పూర్వము కూడా రక్తోత్పలశ్రీ ఉన్నదంటే కేవలమూ అదే సంభవించదు. రక్తోత్పలశ్రీ సదృశమయిన శ్రీ అక్కడ ఉన్నదని ప్రతిబింబకరణమును అభ్యూహించ వచ్చును.

౩౭ వ్యతిరేకము

భేదప్రధానసాధర్మ్య ముపమానోపమేయయోః
ఆధిక్యాల్పత్వ కథనాత్ వ్యతిరేకః స ఉచ్యతే.

ఉపమానోపమేయములకు భేదప్రధానమయిన సాధ

ర్మ్యము చెప్పినట్లయితే వ్యతిరేకాలంకార మవుతుంది. ఉపమానముకంటె ఉపమేయమునకు ఆధిక్యము చెప్పడము వలన గాని అల్పత్వము చెప్పడము వలన గాని సాధర్మ్యము గమ్యమయ్యేటట్లుగా ఉండాలి. అంతే గాని అది వాచ్యము కాకూడదు. భేదమనగా వైలక్షణ్యము. ఇది రెండు విధాల సంభవిస్తుంది. ఉపమానము కంటె ఉపమేయము అధిక గుణాలు కలదిగా వర్ణించి నప్పుడున్ను, ఉపమేయము తక్కువ గుణాలు కలదిగా వర్ణించి నప్పుడున్నూ సంభవిస్తుంది. భేదము దీనిలో ప్రధానముగా ఉంటుంది కాని అభేదము కూడా దీనిలో ఉండనే ఉంటుంది. ఉదా:—

దినకృతి కుముదైః ధృతో న రాగః శశిని పరాంచి పరం సరోరుహాణి
కువలయ కమలాదృత ప్రకాశః ప్రభవతి విశ్వసుహృత్ ప్రతాపరుద్రః.

కుముదములు సూర్యునియందు రాగమును ధరించ లేదు. పద్మములు చంద్రుని విషయమై పరాఙ్ముఖములుగా ఉన్నవి. కువలయకమలాదృత ప్రకాశుడయిన ప్రతాపరుద్రుడు విశ్వసుహృదుడై ఉంటున్నాడు. దీనిలో సూర్యచంద్రులకు సంబంధించని సర్వప్రియంకరత్వము ఉపమేయమయిన ప్రతాపరుద్రునకు సిద్ధప్రాయముగా నిరూపితమయింది. అందువలన ఉపమేయాధిక్య రూపమయిన వ్యతిరేకము. ఇది కువలయ కమలాదృతప్రకాశః అని శ్లేషసముత్థాపితమై ఉన్నది. కువలయము - కలువ భూమండలము. కమలము—లక్ష్మి పద్మము. ఈ రెండర్థములకు అభేదాధ్యవసానమునుగ్రహించాలి. ఉపమానము కంటె ఉపమేయాల్పత్వ పక్షములో విద్యానాథుడు ఉదాహరణమును ప్రదర్శించలేదు. ఆ భేదము సహృదయహృదయాలకు అంతగా

తృప్తిని ఇవ్వక పోవచ్చు. అని ఊహించి ఉంటాడేమో! మొదటి లక్షణవాక్యంలో రెండవభేదము కూడా ఆసూత్రిత మయింది. సర్వస్వ కార మతమును అనుసరించి ఆ విధ ముగా లక్షణమును నిరూపించి ఉండాలి. ఉపమానముకంటె ఉపమేయము తక్కువగుణాలు కలది కావడము మామూలె. కాబట్టి ఆ విధంగా వర్ణించడములో వ్యతిరేకాలంకారత్వము ఉండదని కొందరనుకుంటారు. ఆ అభిప్రాయముతో రెండవ ఉదాహరణమును ప్రదర్శించలేదేమో అని అనిపిస్తుంది. వ్యతిరేకాలంకారములో ప్రకృతార్థమును ఉపరంజకముగా నిరూపించాలని కవికి బాగా సంరంభము ఉంటుంది. అది ఒకపుడు అధికగుణముగా రావచ్చును. ఇతరముఖముగా రావచ్చును. ఎట్లాగయినా సరే! ఇష్టసిద్ధి కలిగితే చాలు. అందువలన రెండవభేదము కూడా ఉండడము ఉచితము గానే కనిపిస్తుంది. ఈదృష్టితోనే మొదట విద్యానాథుడు భేదద్వయమును నిరూపించినాడు. ఉదాహరణసమయంలో అది ఏల లేదో? అని ఆలోచించితే అర్వాచీనులెవరయినా ఆ భేదమును తొలిగించిఉంటారా! అనిన్నీ తోస్తుంది.

౩౯ శ్లేష

ప్రకృతాప్రకృతతోభయగత ముక్తం చేత్ శబ్దమాత్ర సాధర్మ్యం
శ్లేషోయం శ్లిష్టత్వం సర్వత్రాద్యద్వయే నాంత్యే

శబ్దమాత్ర సాధర్మ్యమును ప్రకృతగతముగా అప్ర కృతగతముగా ఉభయగతముగా నిరూపించినట్లయితే శ్లేషా లంకార మవుతుంది. ఈ రూపంగా శ్లేష మూడు విధాలు. ప్రకృత శ్లేష అప్రకృతశ్లేష ఉభయశ్లేష అని. మొదటి రెండూ అయిన ప్రకృత శ్లేషలోను అప్రకృత శ్లేషలోనూ

అంతటా శ్లిష్టత్వము ఉంటుంది. ఆ రెండిటిలో విశేషణములు శ్లిష్టములు కావచ్చును. విశేష్యములూ శ్లిష్టములు కావచ్చును. చివరి భేదమయిన ఉభయ శ్లేషలో అంతటా శ్లిష్టత్వము ఉండదు. ఒక అంశములోనే శ్లిష్టత్వము ఉంటుంది. అంటే విశేషణములు మాత్రమె శ్లిష్టములు అవుతవి కాని విశేష్యములు శ్లిష్టములు కావన్నమాట. విశేష్యములు కూడా శ్లిష్టము లయితే శబ్దశక్తి మూల ధ్వనియే అవుతుంది. ఒకే శబ్దమును అనుసరించి అనేకార్థములు ఉండడము శ్లేష. కేవలము ప్రకృతములయిన రెండర్థములూ శ్లేషవిధాన గోచరము లయినట్లయితే దానిని ప్రకృత శ్లేష అంటారు. ఒక అర్థము ప్రకృతము వేరొక అర్థము అప్రకృతముగా ఉండి శ్లేష విధాన భాసించితే ఉభయశ్లేష అవుతుంది. దీనికే ప్రకృతా ప్రకృత శ్లేష అనిన్నీ పేరు. కేవలమూ ప్రకృతములయిన రెండర్థములు కాని కేవలమూ అప్రకృతములయిన రెండర్థములుకాని ఏకశబ్ద గోచరములయినపుడు ధ్వని అని శంకించరాదు. ఈ రెండింటిలో అర్థద్వయమును ప్రతిపాదించడములో 'ఇది ప్రస్తుతము ఇది అప్రస్తుతము' అని వైషమ్యము ఉండదు. రెండర్థములూ ప్రస్తుతము లయినపుడు రెండర్థములూ అప్రస్తుతము లయినపుడున్నూ ఒక అర్థము ప్రస్తుతము వేరొక అర్థము అప్రస్తుతము అనే అభిప్రాయము ఎందుకు కలుగుతుంది? కాబట్టి అభిధాశక్తియే అకుంఠితమయిన సంచారము కలదై ప్రస్తుతము లయిన రెండర్థములను ప్రస్తుత శ్లేషలోనూ, అప్రస్తుతములయిన రెండర్థములను అప్రస్తుత శ్లేషలోనూ తెలియజేయగలదు. కాబట్టి అభిధచే చెప్పబడిన

ఆ రెండర్థములకూ వాచ్యత్వమె ఉంటుంది. కనుకనే అక్క విశేషణములు విశేష్యములూ అన్నీ శ్లిష్టములే అయిన 'ధ్వని' అనే శంకయే కలుగదు. ఉభయ శ్లేషలో నయి రెండవ అర్థము అప్రస్తుత మవుతున్నది కాబట్టి 'ధ్వని' అః తుందేమో? అనే శంక కలుగడానికి అవకాశము ఉన్నద అభిధ ఎపుడూ కూడా ప్రస్తుతైక పరతంత్రము. ప్రకరణా కము అభిధను ప్రస్తుతార్థమందే నియమించుతుంది. అంద వలన అభిధ ప్రస్తుతమును చెప్పలేదు. కాబట్టే అప్రస్ తార్థానికి వాచ్యార్థమన్న పేరు రాదు. అప్రస్తుతమయి అర్థముయొక్క ప్రతిపత్తి అటువంటి స్థలములో కలుగవ నన్నట్లయితే అది వ్యంజన వ్యాపారమూలము గానే కలు వలెను. కాని వేరొక విధముగా కలుగదు. ఇటువంటి స్థలంల అర్థాంతరము ఎప్పుడూ వ్యంజన వ్యాపారైక విషయ మః తుంది. ఈ అభిప్రాయమునే కావ్య ప్రకాశకారుడునూ స్పష్టముగా నిరూపణము చేసినాడు. అనే కార్థకమయి శబ్దముయొక్క సర్వార్థములను చెప్పే వాచకతా శక్తి స యోగాదులచేత నియమితమై పోతే అంటే; ప్రస్తుతపరమ గానే ఆ వాచకత్వము నియమితము కాగా, అప్రకృత మయి అర్థ జ్ఞానమును కలుగజేసే వ్యాపారము వ్యంజన వ్యాపారవె ఇతర వ్యాపారముల వలన ఆ అర్థ జ్ఞానము కలుగదు. అ అంటున్నారు. కాగా; ఇంతకూ ఉభయశ్లేషలో విశేషః ములు మాత్రము శ్లిష్టములు కావచ్చును కాని, విశేష్యము ఏమాత్రమూ శ్లిష్టము కాదని భావము పర్యవసన్న మః తున్నది. ఇట్లా ప్రకృత గతముగా అప్రకృత గతముగ ఉభయ గతముగా శ్లేష మూడువిధాలు. ఒక అర్థము ప్రక

తము వేరొక అర్థము అప్రకృతముగా ఉన్నప్పుడు కొందరు ఇటువంటి స్థలంలో శబ్దశక్తి మూలధ్వని అంటారు కాని ఉభయ శ్లేష అనరు. అభిధా శక్తి ప్రాకరణికార్థమును మాత్రము చెప్పి విశ్రాంత మవుతుంది. కాబట్టి ఇక్కడ గోచరించే అర్థాంతరము వ్యంజన వలననే వస్తుంది. కనుక 'ధ్వని' అని అనడమె సముచితము కాని శ్లేష అనడము బాగుండదు. అని వారి అభిప్రాయము. నానార్థక స్థలములో కూడా శబ్దశక్తిమూలధ్వనికి ఉభయశ్లేషకూ విషయ విభాగ మును ప్రదర్శించి ఒకటొకటి కలయిక లేకుండా వేరు వేరుగా ప్రదర్శించడము విద్యానాథునకు అభీష్టము. అందువలననే ఉభయ శ్లేషలో విశేష్యము శ్లిష్టము కారాదు అని నియమ మును ప్రదర్శించుతున్నాడు. దీనివలన ధ్వని కంటె శ్లేషకు వేరుగా అవకాశము లభించింది. ఉభయశ్లేషలో అప్రకృ తార్థము అభిధచే ప్రతిపాదింప బడవచ్చును. విశేష్యము ఎప్పుడయితే శ్లిష్టము కాలేదో ప్రకృతాప్రకృతము లయిన రెండు విశేష్యములూ అపుడు విడి విడిగా ఉంటవి. కాబట్టి ఆయా విశేష్యములకు సంబంధించిన అర్థమును శబ్దశక్తి ద్వారా సూచనము చేయవలసి ఉంటుంది అభిధచే అక్కడ ఆ అర్థమును ప్రతిపాదించు కొనకపోతే వాచ్యార్థమునకు వెలితి ఉంటుందే కాని సంపూర్ణమయిన ఉపపత్తి ఉండదు. అందువలన విశేష్యము శ్లిష్టము కాకుండా ఉన్నపుడు ఉభయ శ్లేషయే అవుతుంది. ఈ శ్లేషాలంకారమును వేరొక విధ ముగా కూడా మూడు విభాగాలని భావించవచ్చు. శబ్దశ్లేష, అర్థశ్లేష, ఉభయశ్లేష, అని. జతుకాష్ఠ (లక్క-పుడక) న్యా యాను సారముగా శబ్దము లె అటూ ఇటూ శ్లిష్టములయి

నపుడు శబ్ద శ్లేష అవుతుంది. దీనినే అభంగ శ్లేష అంటారు. ఒక తొడిమెను అనుసరించిన రెండు ఫలాల మాదిరిగ (ఏక నాళావలంబి ఫలద్వయ న్యాయము) ఒకే శబ్దమున అనుసరించి రెండు అర్థములు భాసించుతూ ఉన్నప్పుడు అ శ్లేష అంటారు. దీనినే అభంగ శ్లేష అంటారు. రెండ విధాలా నిబంధనము ఉంటే ఉభయ శ్లేష అవుతుంది

ఉదా :-

రాజ్ఞః పూజావిధిం ధత్తే సకలో మాధవే తిథిః
నీలకంఠకలాపాంకే స్ఫురదబ్జమణి త్విషి

ఈ పద్యములో హరి హరులకు సంబంధించిన రెండు అర్థములు ఉన్నవి. మొదట హరి పక్షార్థమును ఈ విధము గ్రహించాలి. మయూర పింఛచిహ్నము కలిగిన ప్రకాశిస్తున్న కౌస్తుభ కాంతికల మాధవుని విషయమై పాడ్యమి మొద లయిన చంద్రుని సకల తిథులున్ను పూజావిధానము ధరించు తున్నవి. హరపక్షమయిన రెండవ అర్థము. నీల కంఠము కలిగినట్టిన్ని శేఖరమందు ప్రకాశించు చంద్రు కాంతివంటి కాంతికల ఉమాధవుని విషయమై సకల తిథి పూజా విధానమును ధరించుతున్నది. దీనిలో హరి హరు ఇద్దరున్నూ పూజావిషయముగా ఉన్నందువలన ప్రాకరణికు సకలా- ఉమాధవే. సకలః- మాధవే' అని పదచ్ఛేదమ ఉన్నందు వలన ఇది శబ్దశ్లేష. ఇతర స్థలములలో అర్థశ్లేష

సదృశః కాకతీంద్రోయం మహాకులమహీభృతాం
శిరోగృహీత సన్మార్గ స్ఫుటత్కటక సంపదాం

ఈ పద్యములో కాకతీంద్రుడు- ప్రకృతము అప్ర తము లయిన రెండు అర్థములు ఉన్నవి. ఈ ప్రతాపరుద్రు

శిరస్సుతో గౌరవముగా స్వీకరించిన సాధుమార్గము కలిగి స్ఫురించుతున్న అలంకార (కటక) సంపదకల మహాకుల ములోని మహారాజులకు సదృశుడు. ఇది ప్రకృతము. శిఖర ములచే గ్రహించిన నక్షత్ర మార్గము కలిగి స్ఫురించుతూ ఉన్న చరియల సంపదకల పర్వతములకు సదృశుడు. ఇది అప్రకృతము. మహాకులీను లయిన హరిశ్చంద్రాదులు కుల పర్వతములూ ఉపమానముగా ఉన్నందు వలన అప్రా కరణికములు.

విజితారిపురో మూర్త్యా విలసత్సర్వమంగళః
రాజమౌళిః ప్రతాపాంకరుద్రో రుద్ర ఇవ స్థితః,

ఈ పద్యార్థము నిరూపితమె. రుద్ర ప్రతాపరుద్ర రూప మయిన విశేష్యములు వేరుగా ఉన్నందు వలన ఉభయశ్లేష. రుద్రుడు అప్రాకరణికుడు.

౪౦ పరికరము

ఇంతవరకూ ఒకవిధముగా విశేషణముల లోని వైచి త్ర్యము కనపడుతున్నది. పరికరము కూడా విశేషణ వైచిత్ర్య మూలకము. కాబట్టి ఇక్కడ నిరూపణార్హము.

యత్రాభిప్రాయగర్భా స్యా ద్విశేషణ పరంపరా
తత్రాభిప్రాయ విదుషా మసౌ పరికరో మతః.

విశేషణముల పరంపర అభిప్రాయ గర్భముగా ఉన్నట్ల యితే అభిప్రాయ వేత్తలు దానిని పరికరాలంకారమని అం టారు. విశేషణములు వ్యంగ్య గర్భములుగా నిబంధింప బడి నపుడు పరికరాలంకార మవుతుందని భావము. విశేషణములు సాభిప్రాయముగా ఉండడము అంటె ప్రతీయ మానార్థమును గర్భీకరించు కొనడమన్నమాట. కనుకనే ప్రసన్న గంభీరపద

ములు దీనిలో ఉంటవి. అందువలన ఇది ధ్వనివిషయము కాదు. దీనిలో ప్రతీయ మానాంశము వాచ్యార్థమునకు ఉన్ముఖమై ఉంటుంది. కనుకనే పరికర మనేపేరు సార్థకము. దీనిలో విశేషణములు అనేకములు ఉండడము వివక్షితము. ఏదయినా విశేషణము నిరభిప్రాయముగా ఉంటే అపుష్టార్థమన్నదోషము కలుగుతుంది. విశేషణము సాభిప్రాయముగా ఉంటే అక్కడ అపుష్టార్థమనే దోషము ఉండదు. అంతే కాని ఇంకా ఎక్కువ విశేషము అక్కడ ఏమి ఉంటుంది? అనేక విశేషణాలను చెప్పి వానిని సాభిప్రాయములనుగా చేసినట్లయితే వాని ద్వారా వైచిత్ర్యాతిశయము కలుగుతుంది. అప్పుడే ఇది అలంకారము. ఈ అర్థమునే 'విశేషణ పరంపరా' అనే పదము సూచిస్తున్నది. దీనిలో ప్రతీయమానార్థము వాచ్యార్థమునకు ఉన్ముఖంగా ఉన్నందువలన ప్రాధాన్యము కలది కాదు. వ్యంగము ఇక్కడ గర్భీకృతమవుతుంది.

రాజ్ఞో యాదవవంశ పార్థివమణేః ప్రఖ్యాతశౌర్యశ్రియః
త్వంగత్తుంగ తురంగ సైన్యమహతో మానైకవిత్తస్య చ
సద్యో రుద్రనరేంద్రనాయక చమూనాథేన కేనాప్యధి
క్షిప్తస్యాచరితాని సేవణపతే ర్జానాతి సా గౌతమీ

యాదవ వంశపార్థివ మణి, ప్రఖ్యాత శౌర్యశ్రీ, సమున్నత తురంగ సైన్యాధికుడు, అభిమానైకధనుడు, రాజూ అయిన సేవణ ప్రభువు రుద్రనరేంద్రుని ఏదో ఒక సేనానాయకునిచే అధిక్షిప్తు డయినాడు. అతని అప్పటి చరితములను గౌతమీ నది మాత్రము తెలిసికొంటున్నది. దీనిలోని విశేషణములు అన్నీ ఉత్సాస గర్భములుగా ఉన్నవి.

౮౧ ఆక్షేపము

పరికరాలంకారములో అన్యార్థము యొక్క ప్రస్తావము ఉన్నది. విశేష రూపమయిన గమ్యమును ఆశ్రయించి ఉండే ఆక్షేపాలంకారానికి ఇక్కడ అవకాశము ఉన్నది.

విశేషబోధాయోక్తస్య వక్ష్యమాణస్య వా భవేత్
నిషేధాభాసకథన మాక్షేపః స ఉదాహృతః.

ఒక విశేషార్థమును బోధించడానికి చెప్పిన వచనమునకు నిషేధాభాసము ఉన్నట్లయితే ఒకవిధమయిన ఆక్షేపా లంకార మవుతుంది. విశేషార్థమును సంపాదించడానికి వక్ష్యమాణమునకు (చెప్పబోయే దానికి) నిషేధాభాసము ఉన్నట్లయితే వేరొక విధమయిన ఆక్షేపాలంకార మవుతుంది. ఈ విధంగా ఉక్త వక్ష్యమాణముల ఆభాస రూపమయిన నిషేధము విశేషమును బోధించేది అయినపుడు ఆక్షేపా లంకారమని తాత్పర్యము. ప్రాకరణికమయిన అర్థమును ప్రాకరణికము కాబట్టే నిరూపణము చేయాలని కవి ఇష్టపడు తాడు. అందువలన ఉక్తముకాని, వక్ష్యమాణము కాని, ప్రాకరణికమె కాబట్టి విధానమునకు (విధించడానికి) తగి ఉంటుంది. అటువంటి దానిని నిషేధము చేయడము యుక్తము కాదు. ఒకపుడు ఆ నిషేధమును చేసినప్పటికీ అది బాధితమె అవుతుంది. అపుడు నిషేధము విశేషార్థ బోధకై ఉపయోగించుతూ అభాసరూప మవుతుంది. అపుడది ఆక్షేపా లంకారమన్నమాట. ఆక్షేపాలంకారములో అంతటా నిరూపింపబడే నిషేధము ప్రకృతమునకు సంబంధించిన విశేషమును సూచించేదిగా ఉండితీరాలి. కాకపోతే గజస్నాన తుల్యమయింది. ఇట్లా ఆభాసరూపమయిన నిషేధము ఒక

పుడు ఉక్తమునకు సంబంధించేది అవుతుంది. (ఉక్తము చెప
బడినట్టిది.) ఒకచోట వక్ష్యమాణమున కయినా సంబంధిం
ఉంటుంది. ఈ విధముగా ఆక్షేపమునకు గతి ద్వయవ
ఉన్నది. ఉక్త విషయాక్షేపములో విశేష రూపమయి
ఇష్టము ఆక్షిప్త మవుతుంది. వక్ష్యమాణ విషయముల
ఇష్ట విశేషము ఆక్షిప్తమవుతుంది. విశేషము ఇక్కడ శ
ముచే చెప్పబడదు కాబట్టి గమ్యముగా ఉంటుంది. ఉ
విషయాక్షేపములో ఒక చోట వస్తువు నిషిద్ధము కా
చ్చును. వేరొక చోట వస్తు కథనము నిషిద్ధము కావచ్చు
అందువలన ఇది రెండు విధాలు. వక్ష్యమాణ విషయాక్షే
ములో వస్తు కథనమె నిషిద్ధ మవుతుంది. ఇదిన్నీ రెం
విధాలు. సామాన్య రూపంగా మొదట ప్రతిజ్ఞ చేసి వి
నిష్టముగా నిషేధించడము ఒకరీతి. సామాన్య రూపము
ఒక అంశమును చెప్పి అంశాంతర గతముగా నిషేధించడ
రెండవ భేదము. ఈ విధముగా ఈ ఆక్షేపాలంకార
నాలుగు భేదాలు కల దవుతుంది. జటిలముగా ఉన్న ఈ
మాల ఈ ఉదాహరణములలో స్పష్ట విశద మవుతుంది.

నరేంద్రమౌళే ! న వయం తవ సందేశహారిణః
జగత్కుటుంబినః కశ్చి న్న శత్రు రితి కథ్యతే

ఓ ! రాజా ! మేము సందేశ హారకులము కా
జగత్కుటుంబివి అయిన నీకు ఎవడున్నూ శత్రువు అని
బడడుకదా ! ఇది రాజులకు సంధి విగ్రహములను ఏర్పా
చేసే వారి వచనము. మేము సందేశహారకులము కా
అని వస్తు నిషేధము ఉన్నది. సందేశ హారకులయిన
సందేశహారకులము కాము అని తత్వనిషేధము చేస్తున్నా

అది ఉపపన్నము కాదు. ఓ ! రాజా ! సంధి విగ్రహ కాలములో ఎప్పటి కప్పుడు తగినట్టి కైతవ వచనాలను మేము పలకడము లేదు. మేము యథార్థమునే చెప్పుతున్నాము. అనే తత్త్వ వాదిత్వములో ఈ నిషేధము పర్యవసన్న మవుతుంది. సర్వ జగత్పాలకుడ వయిన నీకు శత్రువుగా ఉండే వాడు ఎవడూ లేడు. కాబట్టి మా రాజులను కూడా భృత్యరూపముగా నీవు సంరంక్షింప వలసినది. అనే విశేషార్థము ఇక్కడ ఆక్షిప్త మవుతుంది. మొదటలో చెప్పిన నిషేధము నిషేధముగా ఉండక ఆభాసరూపమై ఈ విశేషమును గోచరింప చేస్తుందని గ్రహించాలి. ఇది ఉక్త విషయములో వస్తు నిషేధరూపమయిన ఆక్షేపమని ఈసమన్వయము వలన స్పష్ట మవుతూనే ఉన్నది.

వయ మశరణా ఇత్యేషోక్తిః కథం ఘటతే జగత్
త్రితయశరణే త్రాయస్వాస్మానితి స్ఫుట మజ్ఞతా
సకలజనతా రక్షా దక్షే త్వయి ప్రణతా ఇతి
త్రిభువన నమస్కార్యే సిద్ధం ప్రతాపమహీపతే !

మూడు లోకాలకూ శరణుడ వయిన నీ విషయమై మేము అశరణులము అనే మాట ఏ విధముగా కుదురుతుంది ? సకల జనులనూ రక్షించడములో దక్షుడవయిన నీవిషయమై మమ్ములను రక్షింపవలసినది అని అనడము చాలా అజ్ఞత. త్రిభువన నమస్కార్యుడవయిన నీవిషయమై మేము నమస్కరిస్తున్నాము అనేది సిద్ధమే కదా ! ఓ ! ప్రతాప భూపతీ ! సర్వ నాథుడవు రక్షకుడవు నమస్కార్యుడ వయిన నీవు దేదీప్య మానముగా ఉంటూ ఉంటే అనేకులలో ఒకర మయిన మేము అశరణుల మని రక్షించ మని నమస్కరిస్తు

న్నామని పలకడము వ్యర్థముగా ఉన్నది. అని భావము. ఈ పద్యము ఉక్తవిషయములో కథననిషేధమునకు ఉదాహరణము. "మేము అశరణులమనేది ఏ విధంగా కుదురుతుంది ?" ఈ మొదలయిన మాటలు "అశరణుల మనుట కుదరదు" అనే ఆకారంతో నిషేధరూపములు అవుతున్నవి. ఇది కథన నిషేధము. అవిషయప్రవృత్తి ఉన్నందువలన ఈ నిషేధము పెంపుదలలేక ఆభాసరూప మవుతుంది. దీనివలన అవశ్యముగా పరిపాలింప వలసినది అనే విశేషము ప్రతీయమాన మవుతున్నది.

విజ్ఞాపయామస్తే కించి త్కాకతీయకులోద్భవ !
విజ్ఞాప్యతే కిమథవా ? సర్వజ్ఞే రక్షకే త్వయి.

ఓ ! ప్రతాపరుద్రా ! మేము కొంచెము విజ్ఞాపనము చేస్తున్నాము. పోనీలే ! సర్వజ్ఞుడవు రక్షకుడవూ అయిన నీ విషయంలో ఇంకా విజ్ఞాపనము చేసేది ఏముంది ? ఇది వక్ష్యమాణవిషయంలో మొదటి భేదానికి ఉదాహరణము. మేము విజ్ఞాపనము చేస్తాము అని సామాన్యంగా ప్రతిజ్ఞ చేసి ఇంకా ఏమి చెపుతాములే, అని కథననిషేధము ఉన్నది. ఈ కథననిషేధము ఆభాసరూపమై సర్వథా మమ్ములను రక్షింప వలసింది అనే విశేషము గోచర మవుతున్నది.

ప్రతాపరుద్రః స్వయమిద్ధతేజాః దైవం చ తద్విక్రమ దత్తహస్తం
యూయం చ తూలోపమసారభాజః తద్వ్యక్త మేవం యది వా కిముక్తైః ?

ప్రతాపరుద్రుడు స్వయంగా ప్రసిద్ధ పరాక్రమము కలవాడు. దైవము కూడా ఆతని పరాక్రమానికి అనుకూలము. మీరు కూడా నిస్సారులు. కాని ఈ మాటలతో ఏమి ప్రయోజనము ? దీనిలో వక్ష్యమాణవిషయ మయిన

ఆక్షేపము యొక్క సామాన్య రూపమయిన ఒక అంశమును చెప్పి అంశాంతరమును నిషేధించడమునకు ఇది ఉదాహరణము. ప్రతాపరుద్రుడు గొప్పవాడు. మీరు అల్పులు. అని సామాన్య రూపముగా మొదట అంశాత్మక మయిన వచనము ఉన్నది. తరువాత ఈ మాటలతో ఏమిలే! అని అంశాంతర నిషేధము ఉన్నది. ఆ నిషేధము నిషేధరూపముగానే ఉండడము లేదు. ఎన్ని విధాల నయినా ప్రణామాలు చేసి ప్రతాపరుద్రుణ్ణి ప్రసన్నుణ్ణి చేసికొన వలసింది. కాని మీరు ఏమాత్రమూ ప్రాతి పక్ష్యము వహించరాదు. అనే విధంగా శత్రుస్త్రీ వచన భంగితో విశేషము ఆక్షిప్తమవుతుంది. కాబట్టే అంశాంతర రూపమయిన నిషేధము ఆభాస రూపమయిం దన్న మాట.

ఇప్పటికి ఇష్టనిషేధముతో ఆక్షేపమును నిరూపించడ మయింది. ఇష్ట నిషేధము బాధితమై విధిలో పర్యవసానము పొందింది. ఇట్లాగే అనిష్టవిధానమున్నూ నిషేధములో పర్యవసానము పొందవచ్చు. ఈ చెప్పిన ఆక్షేపానికి చెప్పబోయే ఆక్షేపానికిన్నీ ఇదే సాజాత్యము. అనిష్ట విధ్యాభాసముకూడా ఆక్షేపాలంకారమె అవుతుంది. అని పెద్దలు అంగీకరిస్తున్నారు. ఇష్ట నిషేధము ఉపపన్నము కాక ఆభాస అయినట్లు అనిష్ట విధి కూడా అనుప పన్నమై ఆభాస అవుతుంది. ఇష్టమయిన వస్తువు ఇష్టము కనుకనె నిషిద్ధము కావడము కుదరదు. అదే విధముగా అనిష్టమయిన వస్తువు అనిష్టము కనుకనె విధింపబడడము కూడా ఉపపన్నము కాదు. అటువంటి దానిని విధించినట్లయితే ప్రస్థలద్రూపము అవుతుంది. అంటే తన రూపము నుండి తానే చెదిరి పోతుందన్నమాట. స్వార్థ

బాధ కలదవుతుందన్నమాట. అటువంటి ఆవిధి నిషేధములో పర్యవసానము పొందుతుంది కనుక ఇక్కడ నిషేధము విధికి ఉపకరణము అవుతుంది. విధిచే సిద్ధమవుతున్న ఈ నిషేధము అనిష్ట విశేషరూపమును గోచరింప చేస్తుం దన్నమాట. ఈ ప్రయోజనము లేకపోతే ఇది గజస్నానమే. ఉదా :—

నాథ! ప్రతాపరుద్రస్య సేవాం త్యజసి చే త్త్యజ!
అరణ్యగృహమేధిన్యా రీతి రభ్యస్యతే మయా.

ఓ! నాథా! ప్రతాపరుద్రుని సేవను విడిచి పెట్టేటట్లయితే విడిచి పెట్టండి. నేనున్నా అరణ్య గృహిణీ రీతిని అభ్య సిస్తున్నానులె. ప్రతాపరుద్రుని పాదసేవ చేయనని పట్టుదల కలిగిన ఒకరాజును గూర్చి ఆతని భార్య పలికే ఈ వచనములో పాదసేవా పరిత్యాగము ఇష్టము కాదు. అతని పాదసేవ చేస్తూ పట్టణంలో ఉండడమే మంచిదని ఆ స్త్రీభావము. కాని; 'సేవను విడిచి పెట్టండి' అని అనిష్ట భూత మయిన ప్రతాపరుద్ర పాదసేవా త్యజనమును శత్రుకామిని విధించు తున్నది. ఆ విధి ఇక్కడ ఉపపన్నము కాక ఆభాస రూపముగా పర్యవసన్న మవుతున్నది. అరణ్య గృహమేధినీ రీతిని అభ్యసిస్తున్నాను అని అనడము చేత విధ్యాభాసయే ఉపబృంహిత మయినది.

౪౨ వ్యాజస్తుతి

ఇంతవరకూ గమ్యప్రస్తావము వచ్చినందువలన ఇక వ్యాజస్తుతిని నిరూపించాలి.

నిందయా వాచ్యయా యత్ర స్తుతిరేవావ గమ్యతే
స్తుత్యా వాగమ్యతే నిందా వ్యాజస్తుతి రసౌ మతా.

వాచ్య మయిన స్తుతిచేత నింద గోచరమయినపుడు

వ్యాజస్తుతి అవుతుంది. నిందాకథన ముఖముగా స్తుతి గమ్యమాన మయితే ఒక వ్యాజస్తుతి. స్తుతి ముఖముగా నింద గమ్యమానమయినపుడు వేరొక వ్యాజస్తుతి. వ్యాజముతో స్తుతి, వ్యాజరూపమయిన స్తుతి, అని రెండు విధాలుగా శబ్దార్థమును గ్రహించాలి. ఉదా :—

కాకతీయవిభోః కీర్త్యా కిం వాద్య ధవళీకృతం
యత్తదీయారివక్త్రేషు దృశ్యతే కాలిమా మహాన్.

ప్రతాపరుద్రుని కీర్తి ఇప్పుడు దేనిని ధవళముగా చేసింది ? ఎందు వలన అంటే ఇప్పటికీ ఆతని శత్రు ముఖాలలో బాగా కాలిమ కన్పడు తున్నది. దీనిలో మొదట నింద ఉన్నది. దానిచే శత్రుముఖా తిరిక్తమయిన ప్రపంచమంతా కీర్తిచే ధవళీకృత మయింది అనిస్తుతి గమ్యమానమవుతున్నది.

ప్రతాపరుద్రనృపతే రహో ? సాహసికా ద్విషః
యద్విశంత్యుదధీన్ శైలానారోహంతి సమంతతః

ప్రతాపరుద్రుని శత్రువులు అబ్బో ! ఎంతో సాహసికులు. సముద్రాలు దూరుతున్నారు. కొండలెక్కు తున్నారు. స్తుతిచే నిందకు ఉదాహరణము. దీనిలో శత్రువుల సాహస ప్రశంస వారి భీరుత్వమును వ్యంగ్యము చేస్తున్నది.

౪౩ అప్రస్తుతప్రశంస

గమ్యత్వ ప్రస్తావము వచ్చింది కాబట్టి అప్రస్తుత ప్రశంసను నిరూపించుతాము.

అప్రస్తుతస్య కథనాత్ ప్రస్తుతం యత్ర గమ్యతే
అప్రస్తుత ప్రశంసేయం సారూప్యాది నియంత్రితా,

అప్రస్తుతమును చెప్పినందు వలన ప్రస్తుతము గమ్యమాన మయినట్లయితే అప్రస్తుత ప్రశంసాలంకారము అవు

తుంది. సారూప్యము, సామాన్యవిశేష భావము, కార్యకారణ భావము ఈ మూడూ దీనిని నియంత్రణము చేస్తవి. అప్రస్తుతవర్ణనమె అప్రస్తుతము కాబట్టి దాని వర్ణనము యుక్తము కాదు. అదెపుడయినా ప్రస్తుతపర మయినట్లయితే ఆ వర్ణనము కూడా యుక్తము కావచ్చు. ఏమీ సంబంధము లేక పోతే అప్రస్తుతము వలన ప్రస్తుతము ప్రతీతముకాదు. కనుక అప్రస్తుతము వలన ప్రస్తుతప్రతీతి ఉంటే ఏదయినా సంబంధము ఉండాలి. సంబంధము ఉండి ఆ విధముగా ప్రతీతి కలిగేటపుడు అది త్రివిధసంబంధాన్ని ఎప్పుడూ అతిక్రమించదు. అదే అర్థాంతరప్రతీతిలో హేతువు అవుతూ ఉంటుంది. సారూప్యము, సామాన్యవిశేష భావము, కార్యకారణ భావము అని సంబంధము మూడు విధాలు. సామాన్యము విశేషాశ్రయముగా ఉంటుంది. విశేషము సామాన్యనిష్ఠమై ఉంటుంది. ఇట్లా సామాన్యవిశేషములు రెండూ ఒకటొకటి పొదువుకొని ఉంటవి. ఇట్లాగే కార్యము కారణపరతంత్రము. కారణము కార్యోన్ముఖము. కనుక కార్యకారణములు ఇట్లా సంబంధము కలిగి ఉంటవి. ఈ సంబంధద్వయము వాస్తవము. సారూప్యమయితే అది ప్రతీతిసిద్ధమె కాని వాస్తవము కాదు. ఈ విధముగా అప్రస్తుతప్రశంసాలంకారము అయిదు భేదాలు కలది అవుతుంది. వాని పేరులు—

౧. అప్రస్తుతమయిన సామాన్యము వలన ప్రస్తుతమయిన విశేషప్రతీతి.

౨. అప్రస్తుతమయిన విశేషమువలన ప్రస్తుతమయిన సామాన్యప్రతీతి.

౩. అప్రస్తుతమయిన కారణము వలన ప్రస్తుతమయిన కార్యప్రతీతి.

౪. అప్రస్తుతమయిన కార్యము వలన ప్రస్తుతమయిన కారణ ప్రతీతి.

౫. అప్రస్తుతమయిన సారూప్యము వలన ప్రస్తుతమయిన సారూప్యప్రతీతి.

అప్రస్తుతము వలన ప్రస్తుతప్రతీతి దీనిలో ఉంటు న్నందు వలన సమాసోక్తి కంటె భేదము సిద్ధ మవుతుంది. సమాసోక్తిలో ప్రస్తుతము వలన అప్రస్తుతము గోచర మవు తుంది కదా! అప్రస్తుతమయిన కార్యము వలన ప్రస్తుత మయిన కార్యము గోచర మయినపుడు అనుమానాలంకా రము అవుతుందేమో నని శంకించ నక్కర లేదు. అనుమా నాలంకారములో ప్రత్యాయ్యము ప్రత్యాయకము (గోచ రింప చేయబడేది, గోచరముచేసేది) అనే రెండున్నూ ప్రాక రణికములె అవుతున్నవి. అక్కడ కార్య కారణములు ప్రస్తు తములె. ఈ విధముగానే పర్యాయోక్తములో కూడా కార్య కారణములు ప్రస్తుతములు గానే ఉంటవి. కనుకనే పర్యా యోక్తాలంకారమునకున్నూ వ్యావృత్తి కలుగు తుంది. ఇటు వంటి ఈ అప్రస్తుతప్రశంసాలంకారములో ప్రతీయమానము ఉన్నప్పటికిన్నీ ధ్వని అని అనరాదు. దీనిలో ప్రతీయమానా ర్థము వాచ్యసిద్ధ్యంగమె అవుతున్నది కాబట్టి ఇది గుణీభూ తవ్యంగ్యమె కాని ధ్వని కాదు. అప్రస్తుతము వాచ్యము కావడము యుక్తమె కాదు. ప్రతీయమాన మవుతున్న ప్రస్తు తము అప్రస్తుతమునకు సాధనమై ఉపకరిస్తుంది. ఇటువంటి స్థలాలలో ధ్వని కాదు. ఉదా:-

సారూప్యము

ఆశాసు ప్రశమిత వాసనోదయేభ్యః కిం లబ్ధం? భ్రమరీగణైః జరత్తరుభ్యః పున్నాగో నవనవ సౌరభ ప్రసూనైః ఆమోదం దిశతి నివాస మారభధ్వం.

దిక్కులలో పరిమళప్రచారము లేకుండగా ఉన్న ముసలి చెట్ల నుండి తుమ్మెద సమూహము ఏమి పొంద గలిగినది? ఈ పున్నాగము నవనవ సౌరభముకల ప్రసూనములతో పరిమళము ఇస్తూ ఉన్నది. ఇక్కడ నివాసమును ఆరంభించడి. దీనిలో భ్రమరవృత్తాంతము అప్రస్తుతముగా నిరూపితమయింది. ఈ వృత్తాంతసారూప్యము వలన ప్రస్తుతమయిన ప్రతాపరుద్రవృత్తాంతము గోచర మవుతుంది. అసంపూర్ణ వైభవము కలిగిన సకలరాజులనూ విడిచిపెట్టి సకలగుణపరిపూర్ణుడు సర్వజనానందకరుడూ అయిన ప్రతాపరుద్రుడు ఒక్కడే విద్వాంసులకు సేవింపదగినవాడు అని ప్రస్తుతము.

సామాన్యము — విశేషము

యశస్వినీ పద్మభవస్య సృష్టి రుత్పాదయిత్రీ నృపశేఖరాణాం
తత్పాలనా ల్లాలనభాగ్య యోగ్యః జాత శ్చిరాన్మధ్యమలోక ఏషః.

రాజశేఖరులను ఉత్పాదించే బ్రహ్మసృష్టి యశోవంతమై ఉన్నది. తత్పాలనము వలన ఈ భూలోకము చాలా కాలానికి లాలనభాగ్య యోగ్య మయింది. ఈ పద్యములో నిరూపితమయిన అర్థము సామాన్యరూపముగా ఉన్నది. దీని వలన రాజవిశేషుడయిన ప్రస్తుతప్రతాపరుద్రుని గుణమహిమ ప్రతీత మవుతుంది.

విశేషము - సామాన్యము

ద్రష్టుమనా అపి న పశ్యతి న భణతి వక్తుం సకౌతూహలాపి
స్పర్శాశయాపి న స్పృశతి వనితాయాః కీదృశీ సృష్టిః?

చూడవలెనని అనుకున్నా చూడదు. మాట్లాడాలని కౌతూహలము ఉన్నా మాట్లాడదు. స్పృశించాలని కోరిక

ఉన్నా స్పృశించదు. ఈ వనితా సృష్టి ఏమిటో ? దీనిలో ముగ్ధలయిన స్త్రీలకు నవసమాగమములో సిగ్గు అధికంగా ఉంటుంది. అనే సామాన్యార్థము ప్రస్తుతముగా వివక్షితము. దానిని ప్రతీతము చేయడము కొరకై ఒక విశేషార్థము నిరూపిత మయింది. లజ్జాకార్యము లయిన అదర్శనాదులు విశేషరూపములు. అవి వాచ్యములుగా ఉన్నవి.

కార్యము - కారణము

గాధా ఇవార్ణవా జాతా నీచా ఇవ మహాద్రయః
మహీ మవతరత్యస్మిన్ కాకతీయకులేశ్వరే.

కాకతీయకులేశ్వరుడు భూమికిఅవతరించగానే సముద్రములు మెరకగా అయినవి. కులపర్వతాలు పొట్టివిగా అయినవి. అర్ణవగాధత్వము పర్వతనీచత్వమున్నూ కార్యభూత మయిన అప్రస్తుతము. దీని వలన కారణభూత మయిన ప్రతాపరుద్రుని గాంభీర్యాదికము ప్రతీయమాన. మవుతున్నది. ఇక్కడ కార్యకారణములు అప్రస్తుతప్రస్తుతములు కనుక అనుమానాలంకారము కాదు. పర్యాయోక్తమూ కాదు అని గ్రహించాలి.

కారణము - కార్యము

ప్రతాపరుద్రనృపతే ర్ధరిత్రీ కల్పశాఖినః
జాతా మయి కృపాదృష్టిః కిం వా విస్మయసే సఖే !

భూకల్పవృక్షమయిన ప్రతాపరుద్రుని కృపాదృష్టినాపై ప్రసరించింది. సఖుడా ! ఆశ్చర్యపడతావేమి ? ఇప్పుడు నీవు ఇంతటి మహావిభవానికి ఎట్లా భాజనము కాగలిగినావు ? అని కార్యమును గురించి అడుగుతూ ఆశ్చర్యము పొందుతూ ఉన్న స్నేహితునకు కారణభూత మయిన ప్రతాపరుద్రుని

కృపాదృష్టి వాచ్యముగా నిరూపిత మయింది. ఇంకా ఈ అలంకారంలో వాచ్యార్థము సంభవించేది కావడము, కాక పోవడము, అటు ఇటుగా ఉండడము, అని అనేక భేదాలు ఉన్నవి. వానిని యథాసంభవంగా ఆయా ముఖ్యగ్రంథాలలో పాఠకులు స్వయంగా చూచుకోవాలి.

౪౪ పర్యాయోక్తము

కారణం గమ్యతే యత్ర ప్రస్తుతా త్కార్యవర్ణనాత్
ప్రస్తుతత్వేన సంబద్ధం తత్పర్యాయోక్త ముచ్యతే.

ప్రస్తుత మయిన కార్యవర్ణనము వలన ప్రస్తుతముగా సంబంధించి ఉన్న కారణము గోచరమయినట్లయితే పర్యాయోక్తాలంకార మవుతుంది. "పర్యాయేణ ఉక్తం పర్యాయోక్తం" ప్రతీయమానమవుతూ ఉన్న కారణమున కార్యాది ద్వారముగా వర్ణించి నట్లయితే పర్యాయోక్త మని అభిప్రాయము. దీనిలో కార్యకారణములు రెండూ ప్రస్తుతములే కావాలి. అందువలననే అప్రస్తుతప్రశంసకంటే భేదము సిద్ధమవుతుంది. ఏది గమ్యమవుతుందో దానినే వాచ్యముగ చెప్పితే పర్యాయోక్తము. ఒకే వస్తువు ఒకే కాలంలో వాచ్యము గమ్యమూ కావడము కుదరదు. అందువలన గమ్యమవుతూ ఉన్న విధానం కంటె వేరొక ప్రకారాంతరంలో అంటే; కార్యముగా అభిధానము ఉండాలి. వాచ్యముగ చెప్పబడుతున్న కార్యము కారణమునకు సంబంధించే ఉంటుంది కాబట్టి స్వసిద్ధికొరకై కారణమును ఆక్షిప్తము చేస్తుంది. అందువలన అది గమ్యమయినా వాచ్యాయమానమె. ఉదా :—

ప్రతిభూపాల శుద్ధాంత దీర్ఘికా స్వాజిధూసరాః
ప్రక్షాలయంతి గాత్రాణి కాకతీయచమూచరాః

శత్రువుల అంతఃపురములలోని బావులలో యుద్ధ ధూళి ధూసరితులయిన ప్రతాపరుద్రుని సేనాభటులు తమ శరీరములను ప్రక్షాళనము చేసికొంటున్నారు. దీనిలో ప్రతాపరుద్రుని భటులు చేస్తూ ఉన్న రిపునగరీ దీర్ఘికా వారి విహారము కార్యభూతము. దీని వలన యుద్ధ ప్రారంభము లోనే తమ పట్టణాలను విడిచి పెట్టి శత్రురాజులు పలాయితు లయినారు అని కారణము ప్రతీతము అవుతున్నది.

౮౫ ప్రతీపము

అలంకారాలలో కొన్నిటి యందు ప్రతీయమానము స్ఫుటముగా ఉంటుంది. మరికొన్నిటిలో అస్ఫుటముగా ఉంటుంది. ప్రతీపము అస్ఫుటప్రతీయమానము. ఇది రెండు విధాలు. ఉపమేయము వలననే ఉపమానకార్యము సిద్ధమవుతూ ఉంటే ఉపమానము ఇంకా దేనికి? అనే అభిప్రాయముతో ఉపమానము వ్యర్థమని నిరూపిస్తూ ఆక్షేపము చేసినట్లయితే మొదటి ప్రతీపము. ఉపమానంగా ప్రసిద్ధమై ఉన్న వస్తువునకు వేరొక ఉపమానమును చూపించి అనాదరము చేయడానికి ఉపమేయత్వము కల్పించితే రెండవ ప్రతీపము. ఉపమేయము ఉపమాన ప్రతికూలముగా ఉంటుంది కాబట్టి దీనికి ప్రతీపము అనే పేరు యుక్తముగా ఉంటుంది. ఈ అభిప్రాయముతో ఈ లక్షణార్థమును భావించాలి.

ఆక్షేప ఉపమానస్య కైమర్థ్యేన కథ్యతే
యద్వోపమేయభావః స్యాత్ తత్ప్రతీప ముదాహృతం.

ఉపమానమునకు కైమర్థ్యము చేత ఆక్షేపమును

నిరూపించినా, ఉపమానమునకు ఉపమేయభావమును నిరూపించినా ప్రతీపాలంకార మవుతుంది. ఉపమేయము లోకోత్తరము అనే అభిప్రాయముతో ఉపమానాక్షేపము చేస్తే ఒక ప్రతీపము. ఉపమేయానికి ఉపమానత్వమును కల్పించితే రెండవ ప్రతీపము. ఉపమానోపమేయాలలో ఉపమానము అధిక గుణాలు కలదని ఉపమేయము న్యూనగుణాలుకలది అని ఒక ప్రసిద్ధి. ఇటువంటి ప్రసిద్ధిలో కవి వివక్షయే ప్రయోజకముగా ఉంటుంది. ఈ అలంకారము యొక్క రెండు భేదాలలోనూ ప్రతీపము అనేపేరు సంజ్ఞామాత్రము కాక సార్థకంగా ఉంటుంది. ఈ రెండు భేదాలకూ అనుగతంగా సామాన్యలక్షణం లేదు. ఒకటే రెండు విధాలవుతుం దన్నమాట. ఇవి ఉపమాభేదములె అవుతవని అనుకోరాదు. ఉపమాలంకారములో ఉపమానాక్షేపము ఉండదు. ఉపమానమునకు ఉపమేయత్వ కల్పనమూ ఉండదు. ఇవిన్నీ సాధర్మ్య జీవితముగా ఉంటవి. ఉదా ;

కీర్త్యా ప్రతాపరుద్రస్య విలసంత్యాం దిగంతరే
కిమర్ధ ముదయత్యేష నిర్లజ్జః శశలాంఛనః.

ప్రతాపరుద్రుని కీర్తి దిగంతరంలో విలసిస్తూ ఉంటే సిగ్గులేని చంద్రుడు ఎందుకు ఉదయిస్తున్నాడు ? చంద్రుడు చేయవలసిన పనిని కీర్తి చేస్తూ ఉన్నపుడు చంద్రుడు ఇంకా ఎందుకు ?

కాకతీయకులే లక్ష్మీపతి రేష న సంశయః
అనేన కథ మల్పజ్ఞైః సుమేరు రుపమీయతే.

కాకతీయకులంలో ఈతడు లక్ష్మీపతి. సంశయము లేదు. అల్పజ్ఞులయిన వారు ఈతనితో సుమేరువును పోల్చు

తారేమి ? దీనిలో ఉపమానముగా ప్రసిద్ధమయిన మేరుపర్వతానికి నికర్ష సంపాదించడానికి ఉపమేయత్వము కల్పితమయింది. కాకతీంద్రునకు ఉపమానత్వము నిరూపితమయింది. ఇటువంటి నిరూపణములో ఇక్కడకూడా కవి వివక్షయె ప్రయోజకము.

౭౫ అనుమానము

ఇటు మీదట తర్కన్యాయమూలాలంకారములు నిరూపితము లవుతవి. వానిలో కూడా అనుమానాలంకారము ప్రధానము. కాబట్టి మొదట నిరూపణీయము.

సాధ్య సాధన నిర్దేశే త్వనుమాన ముదీర్యతే.

సాధ్యము సాధనము అనే రెండింటి యొక్క నిర్దేశము ఉన్నట్లయితే అనుమానాలంకార మవుతుంది. అనుమానవాదుల ప్రణాళికలో, సాధ్యము సాధనము వ్యాప్తి పక్షము సపక్షము విపక్షము మొదలయిన కొన్ని పారిభాషిక పదాలు ఉన్నవి. కావ్యభాషలో ప్రసిద్ధములయిన అర్థాలకంటె వీని అర్థములో కొంత సాంకేతికములై ఉంటవి. కార్యమును అనుసరించి కారణమును ఊహించడము సామాన్యముగా అనుమానము యొక్క స్వరూపము. అగ్నివలన ధూమము ఉత్పన్న మవుతుంది కాబట్టి అగ్ని కారణము. ధూమము కార్యము. ఒకడు గ్రామంలో తన ఇంటి దగ్గర ఉన్నపుడు వంటగదిలో అగ్ని ఉండగా ధూమము రావడమును అనుభవములో గుర్తించి ఉంటాడు. అపుడాతడు ధూమము ఉన్న చోట అగ్ని ఉంటుంది అని అభిప్రాయమును కలుగ జేసుకుంటాడు. ఒకపుడు పర్వతసమీపానికి వెళ్లగా దట్టమయిన ధూమము కనపడింది. దానిని చూచి పర్వతము మీద అగ్ని

ఉన్నదని ఆతడు ఊహించ గలడు. ఊహింప జేసిన ధూమము సాధనము. ఊహింప బడిన అగ్నిసాధ్యము. ఆశ్రయముగా ఉన్న పర్వతము పక్షము. ఎక్కడెక్కడ ధూమము ఉంటుందో అక్కడక్కడ వహ్ని ఉంటుంది అనేది వ్యాప్తి. సాధనమన బడే హేతువు మూడు రూపములతో ఉండాలి. పక్షంలో గోచరించడము. సపక్షములో ఉండడము. విపక్షమునుండి వ్యావృత్తము కావడము. పర్వతము పక్షము. వంటఇల్లు సపక్షము. తటాకము విపక్షము. ఇటువంటి సాధనముతో తప్పకుండా సంబంధి ఉండేది సాధ్యమవుతుంది. అని భావము న్యాయశాస్త్రమర్యాదలో అనుమాననిరూపణము ఏ విధ ముగా ఉంటుందో ఇక్కడ కూడా అదే విధము ఉంటుంది ఇట్లా తర్కానుమాన సమాన కక్ష్య మయినప్పటికినీ ఈ అలంకారంలో కొంత విశేషము ఉన్నది. తర్కాను మానము చమత్కారి కాదు. లోకవిలక్షణమయిన సాధ్య సాధనభావము దీనిలో ఉంటుంది కాబట్టి చమత్కారవి షము దీనిలో ఉంటుంది. స్వార్థానుమానము పరార్థాను మానము అని అనుమానము రెండు విధాలు. "ఈ విష యము నాకు తెలిసింది" అని తన పరామర్శ నిశ్చయమవ ఉంటే స్వార్థానుమానమని, ఇతరునకు తెలియనట్టి వస్తువు ప్రతిపాదించి నపుడు ఇతరుని విశ్వసింప చేయడము ఉ టుంది కాబట్టి అటువంటిది పరార్థానుమానమని అంటా ఈ రెండు విధములయిన అనుమానాలున్నా ఇక్కడ ఉ అలంకారముగా నిశ్చయించాలి. అలంకారమయిన అ మానము రూపకమూలముగా ఉంటుంది కాబట్టి తర్కా నుమానము కంటె విలక్షణము. వేరొక అలంకారము ఇక్క

మూలముగా ఉండడమె కాక కేవలము శుద్ధముగా కూడా ఇది ఉండవచ్చు. అటువంటి స్థలాలలో కవిప్రౌఢోక్తి నిష్పన్నమయిన రమణీయార్థము చమత్కార విశేషమును సంపాదిస్తుంది. కనుక తర్కానుమానం కంటె వైలక్షణ్యమును ఊహించాలి. అందువలన కవికర్మ వైలక్షణ్య నిమిత్తమని నిశ్చయించడమె సముచితము. కవి కౌశలమె లేకపోతే అసలీ అలంకారములో విచ్ఛిత్తివిశేషము కుదరదు. ఒకపుడు నిరూపించిన అర్థములో స్వభావసిద్ధమయిన సుందరత లేకపోయినా కవి ప్రతిభా నిర్వర్తితమయిన విశేషము ఉన్నప్పుడు అనుమానము అలంకారమె అవుతుంది. సామాన్యంగా అనుమాన ప్రక్రియలో ప్రత్యాయ్య । ప్రత్యాయకభావము సమర్థ్య సమర్థకభావము అని రెండు విధానాలు ఉంటవి. ఇదివరలో ప్రతీతము కాని దానిని ప్రత్యాయనము చేయడము అంటే; తెలియజేయడము ఉన్నప్పుడు ప్రత్యాయ్య ప్రత్యాయక భావము ప్రసరించుతుంది. తెలిసిన దానిని ప్రత్యాయనము చేయడము ఉంటే సమర్థ్య సమర్థకభావము ఉంటుంది. సమర్థ్య సమర్థకభావము ఉన్నపుడు అనుమానాలంకారము కాదు. ప్రత్యాయ్య ప్రత్యాయకభావము ఉన్నపుడే అనుమానము అలంకారము అవుతుంది. ఇంకా ఈ విషయవిస్తరణము కంటె ఉదాహరణ సమన్వయమె సముచితము.

రజోధూమః సేనావ్యతికరభవో యత్ ప్రసరతి
స్ఫులింగా దృశ్యంతే భటఘటిత కౌక్షేయక భువః
తతో మన్యే యాత్రాశుచిసమయజో రుద్రనృపతేః
ప్రభూతః కోపాగ్నిః దహతి రిపుభూపాల నగరీః.

సేనాసంబంధము వలన పుట్టిన రజోధూమము ప్రసరించుతున్నది. అంటే, భటులఖడ్గాలవలన ఉత్పన్నములయిన

స్ఫులింగములు కన్పడుతున్నవి. అంటే,వీనివలన జైత్రయాత్ర అనే గ్రీష్మసమయంలో పుట్టిన ప్రతాపరుద్రుని ప్రభూ కోపాగ్ని శత్రునగరములను గహించుతున్నది అని నిశ్చ యించు తున్నాను. దీనిలో క్రోధాగ్ని సాధ్యము. రజోధూ స్ఫులింగములు సాధనము. సాధ్యసాధననిర్దేశము ఇక్క ఉన్నది. రజోధూమ-యాత్రాశుచిసమయ-కోపాగ్ని స్థల లలో రూపకమున్నూ ఉన్నది కాబట్టి అనుమానాలంకారమ ఇక్కడ అనుమానప్రక్రియను ఈ విధముగా బోధించవచ్చు అయ మగ్నిమాన్ స్ఫులింగాత్ ధూమాత్, యత్ర యత్ర ధూమః తత్ర తత్ర అగ్నిః; అయం కోపవాన్ సేనారజ వత్వాత్, భటఖడ్గవత్వాచ్చ, యత్ర యత్ర సేనారజః ఖడ్గ తత్ర తత్ర కోపః; ఇట్లా వేరు వేరుగా అనుమానరూపము గ్రహించి నందు వలన చమత్కారము కలుగక పోయిన ఆరోపము వలన చమత్కారవిశేషము ఉదయించుతుం కాబట్టి అనుమానము అలంకార మవుతుంది. ఇంకా దీని సంబంధించిన విశేషములు ఇక్కడ నిరూపితములు కా డము లేదు.

౪౭ కావ్యలింగము

ఈ అలంకారము కూడా తర్కన్యాయమూలమ అనుమానాలంకారములో మాదిరిగా సాధ్యసాధన నిర్దేశవ దీనిలోనూ ఉంటుంది. కాని అప్రతీత ప్రత్యాయనవ ఉండదు కనుక ప్రత్యాయ్యప్రత్యాయకభావము గోచరించద ప్రతీతప్రత్యాయనమె ఇక్కడి పరమార్థము. కాబట్టి సమర్థ సమర్థభావము ఉంటుంది.

హేతో ర్వాక్యపదార్థత్వే కావ్యలింగ ముదాహృతం.

హేతువు వాక్యగతముగా ఉన్నా పదగతముగా ఉన్నా కావ్యలింగాలంకార మవుతుంది. ఈవిధముగా ఇది ద్వివిధము. కారణరూప మయిన హేతువు వాక్యార్థగతిని అనుసరించి విశేషణద్వారముగా ఉన్నప్పుడు ఒక విధము. పదార్థగతిని అనుసరించి హేతువుగా నిబద్ధమయినప్పుడు రెండవ విధము. ఈ రెండుభేదాలను వాక్యార్థహేతుక కావ్యలింగము పదార్థ హేతుక కావ్యలింగము అని వ్యవహరించవచ్చును. హేతువుగా ఉన్న దానిని నిబంధించడము మొదటి దానిలోనూ, ఉపనిబద్ధమయిన దానిని హేతువుగా చెప్పడము రెండవ దానిలోనూ ఉంటుంది. చెప్పిన విషయమును సమర్థించడానికి సమర్థకముగా ఉండే హేతువు అనగా లింగము ఇక్కడ ఉన్నందు వలన కావ్యలింగము అనే పేరు సార్థకము. తర్కశాస్త్ర ప్రసిద్ధమయిన వ్యాప్తి పక్షధర్మత మొదలయిన వాటితో కూడుకొన్న లింగముకంటె ఇది విలక్షణ మని నిరూపించడానికె కావ్యపదము సమర్థ మవుతుంది. ఉదా :—

వాక్యార్థగతము

ప్రతాపరుద్ర ఇత్యేషా కాపి పంచాక్షరీ శుభా
హృది యాం బిభ్రతో భూపా వశీకుర్వంతి సంపదః.

"ప్రతాపరుద్ర" అనే పంచాక్షరీ మంత్రము అనిర్వాచ్యము. శుభప్రదము. దీన్ని హృదయాన ధరించిన రాజులు సంపదలను వశీకరించు కొంటున్నారు. సంపద్వశీకరణములో పంచాక్షరీ ప్రాశస్త్య రూపమయిన వాక్యార్థము హేతువుగా ఉన్నది.

పదార్థగతము

మ్లానాపి భూభృతాం ఫాలలిపి రుచ్ఛ్వసితా పునః
ప్రతాపరుద్ర దేవాంఘ్రి నఖజ్యోత్స్నామృతోక్షితా

ప్రతిరాజుల ఫాలలిపి మ్లానమయినప్పటికి ప్రతాపరుద్ర దేవుని పాదనఖ జ్యోత్స్నామృతముచే తడుపబడి మరల ఉచ్ఛ్వసిత మయింది. దీనిలో పూర్వము పరిమ్లానమయిన భూపాల ఫాలలిపి పునరుచ్ఛ్వాసము పొందడములో ప్రతాపరుద్ర నరేంద్రుని చరణనఖ చంద్రికాసేచనము హేతువు. అది విశేషణగతముగా ఉన్నది కాబట్టి పదార్థగత కావ్య లింగము. హేతుహేతుమద్భావము స్పష్టంగా శబ్దోపాత్త మయితే అందంగా ఉండదు. అందువలన దానిని కొంత గూఢాగూఢంగా ఉంచాలి. ఇక్కడ ఆ విధముగానే ఉన్నది.

౪౭ అర్థాంతరన్యాసము

కావ్యలింగాలంకారానికి అర్థాంతరన్యాసాలంకారము నకూ కొంత సామ్యము ఉంది. కనుక ఇక్కడ నిరూపించాలి.

కార్య కారణ సామాన్య విశేషాణాం పరస్పరం
సమర్థనం యత్ర సోర్థాంతరన్యాస ఉదాహృతః.

కార్యము కారణము, సామాన్యము విశేషము వీనికి పరస్పరమూ సమర్థనము ఉంటే అర్థాంతరన్యాసాలంకార మవుతుంది. కార్యము కారణమును సమర్థించేదిగా ఉన్నా కారణము కార్యమును సమర్థించేదిగా ఉన్నా సామాన్యము విశేషమును సమర్థించేదిగా ఉన్నా విశేషము సామాన్యమును సమర్థించేదిగా ఉన్నా అర్థాంతరన్యాస మవుతుందని భావము. ఈ పరిసంఖ్యానముతో ఈ అలంకారము నాలుగు విధాలవు తున్నది.

౧. సామాన్యముతో విశేష సమర్థనము.
౨. విశేషముతో సామాన్య సమర్థనము.
౩. కార్యముతో కారణ సమర్థనము.

౪. కారణముతో కార్య సమర్థనము.

వీనిలో సమర్థింపబడేది సమర్థనార్హముగా ఉండాలి. అంతేకాని అపూర్వముగా ప్రతీత మయ్యేది కాకూడదు. సమర్థ్య సమర్థకభావ మనేది కావ్యలింగములోనూ దీనిలోనూ సమానమె. అయినా ఈ అలంకారములో సమర్థ్యసమర్థక భావము తాటస్థ్యముతో ఉంటుంది. సమర్థనమునకు తగిఉన్న ప్రకృతమును కార్యకారణభావముతో గాని సామాన్యవిశేష భావముతోగాని సమర్థించడమును చెప్పితే అర్థాంతరన్యాసా లంకారము అవుతుందని ఫలితార్థము.

౧. భూపాః ! ప్రతాపరుద్రస్య నతా భవత ? నోన్నతాః
ఉన్నతాఞ్ నమయత్యేష నతా నున్నమయ త్యసౌ.

ఓ ! భూపాలకులారా ! మీరు ప్రతాపరుద్రునకు వినమ్రులు కండి. ఉన్నతులు కావద్దు. ఈతడు ఉన్నతులను వినమ్రులనుగా చేస్తాడు. వినమ్రులను ఉన్నతులనుగా చేస్తాడు. నమ్రత్వము వలన ఔన్నత్యము కలుగుతుందని దీనిలో భావము. ఫలరూపమయిన ఔన్నత్యము చేత నమ్రత్వ కారణము దీనిలో సమర్థితమయింది.

౨. ఉద్వేజితా రుద్రనరేశ్వరస్య రణాపదానైః ప్రతిపక్షభూపాః
బిభ్యత్యమీ చిత్ర మచేతనేభ్యో భీతస్య సర్వం భయకారి నూనం.

ప్రతాపరుద్రుని యుద్ధము లనే అద్భుతకర్మలచేత ఉద్వేగము పొందిన శత్రురాజులు అచేతనములవలన గూడా భయపడుతున్నారు. ఆశ్చర్యము ! భయపడినవానికి సర్వమూ భయమును కలుగజేస్తుంది కదా ! దీనిలో అచేతనముల వలన గూడా శత్రురాజులు భయపడుతున్నారు అనే విశేషా

ర్థమును భయపడినవానికి సర్వమూ భయకారి అనే సామ
న్యార్థము సమర్థించు తున్నది.

౩. దుష్టోపి మహతాం సంగా ద్భవత్యేవ హి సజ్జనః
ప్రతాపరుద్ర మభ్యేత్య కలిః కృతయుగాయతే.

దుష్టుడయినా గొప్పవారి సంబంధము వలన సజ్జ
డవుతాడు. ప్రతాపరుద్రుని పొంది కలియుగము కృతయు
మువలె ఆచరిస్తున్నది. దీనిలో ప్రతాపరుద్రుని సంగ
మహిమ చేత కలి కృతయుగ సదృశ మయింది అని విశేష
ర్థముచేత సామాన్యార్థ సమర్థనము ఉన్నది. కార్యకార
భావములో కారణము వలన కార్యమును సమర్థించుట అనే
కావ్యలింగములో అంతర్భవించుతుంది. కాబట్టి అర్థాం
రన్యాసాలంకారము మూడు విధాలని తేలింది. కార్యకార
భావమును ఆశ్రయించిన రెండు భేదాలూ కావ్యలింగమ
లోనే అంతర్భూతము లని సర్వస్వకారునిభావము. విద్యా
నాథుడు ఒక భేదము మాత్రమె కావ్యలింగాంతర్భూతమ
భావిస్తున్నాడు. సమర్థకమయిన హేతువు వాక్యపదగతముగ
ఉన్నప్పుడు కావ్యలింగముకదా! వాక్యపదగతత్వము కార
మునకె కాని కార్యమునకు కాదు అని దానివలన వచ్చే
అర్థము. కార్యము సమర్థించేదిగా ఉన్నప్పుడు కావ్యలింగమ
అనసక్కరలేదు అని విద్యానాథుడు భావించి ఉంటాడు.

౪౯. యథాసంఖ్యము

తర్కన్యాయ మూలాలంకారములను నిరూపించి
తరువాత వాక్యన్యాయమూలాలంకారములను నిరూపి
చడము సముచితము. తర్కపరిశుద్ధ బుద్ధులు మీమాంసలో
అధికారులు కాగలుగుతారు.

ఉద్దిష్టానాం పదార్థానాం పూర్వం పశ్చా ద్యథాక్రమం
అనూద్దేశో భవే ద్యత్ర తద్యథాసంఖ్య మిష్యతే

మొదట ఉద్దిష్టములయిన పదార్థములకు తరువాత యథాక్రమంగా అనూద్దేశము ఉంటే యథాసంఖ్యాలంకార మవుతుంది. మొదట నిర్దిష్టములు ఉద్దిష్టములు. తరువాత నిర్దేశించడము అనూద్దేశము. ఈ అర్థము ఉద్దిష్టానూద్దేశ పదాల వలననే లభించినా లక్షణంలో పూర్వం పశ్చాత్పద ప్రయోగము స్పష్టార్థతకు అని భావించాలి. మొదట నిర్దేశించిన పదార్థాలకు తరువాత నిర్దేశించిన పదార్థాలతో క్రమంగా సంబంధము ఉంటే ఈ అలంకార మవుతుంది. దీనిని కొందరు క్రమాలంకారము అని అంటారు. ఈ ఉద్దేశానూద్దేశ విధానము అసమస్త పదాలలో ఉంటే అర్థద్వారకంగా అక్కడ శాబ్దమయిన సంబంధం భాసిస్తుంది. క్రమసంబంధ మున్నూ స్పష్టంగా కనపడుతుంది. సమస్తపదాలలో ఆవిధానము ఉంటే సముదాయముతో సముదాయమునకు సంబంధము మాత్రమె శబ్దము వలన గోచరిస్తుంది కాని అవయవగతమయిన క్రమసంబంధము గోచరించదు. అది అర్థపర్యాలోచనము చేస్తే భాసిస్తుంది. కనుక శాబ్దము ఆర్థము అనే భేదద్వయం కలుగుతుంది. ఈ అలంకారములో ఉద్దిష్టములు అనూద్దిష్టములున్నూ బహుసంఖ్య కలవి అయితేనే చమత్కారము ఉంటుంది. ఒకటి ఉద్దిష్టమయి వేరొకటి అనూద్దిష్టమయితే ఆవిధానంలో చమత్కారలేశ మయినా ఉండదు కాబట్టి ఈ అలంకారానికి ప్రసక్తియే లేదు. రెండు ఉద్దిష్టములు రెండు అనూద్దిష్టములూ అయినప్పుడున్నూ ఆట్టే చమత్కారము రాదు. ఉద్దిష్టములకు అనునిర్దేశము లేకపోతే

అపక్రమము అనే దోషము సంభవిస్తుంది. ఉద్దిష్టములయి రెండిటికి యథాక్రమంగా రెండు అనూద్దిష్టములయినప్పు దోషము లేక పోవడమె కాని విశేషము ఏమి ఉంటుంద కనుక విశేష చమత్కారమును సంపాదించడానికి ఉద్దిష్టము అనూద్దిష్టములున్నూ రెండిటికన్న అధికంగా ఉండితీరాల అప్పుడే యథాసంఖ్యము అలంకార మవుతుంది. ఈ విశిష్ట భిప్రాయమును బోధించడానికే లక్షణవాక్యంలో బహువచ నిర్దేశము కూడా సాభిప్రాయముగా సంయోజిత మయినద గ్రహించాలి. ఎక్కడనయినా ఒక్కొక చోట శుష్కమయి స్థలాలలో ఉద్దిష్టానుద్దిష్టములు బహుసంఖ్యగా ఉన్నప్పు విచ్ఛిత్తివిశేషము ఉదయించదు. కాబట్టి అలంకారత్వ రాదు. అందువలన కవిప్రతిభాత్మకమయిన విచ్ఛిత్తి అంత ఉండక తప్పదు. కవిప్రతిభ విచ్ఛిత్తివిశేషమును సంపా చేదిగా ఉన్నప్పుడు ఉద్దిష్టానూద్దిష్టములు రెండయినా ఉం వచ్చును, అని కొందరు భావించితే భావించ వచ్చును. క బహుత్వము ఉండడము స్వారసికంగా ఉంటుందని లక్ష మును సంభావించాలి. ఉదా:

> గాంభీర్య మౌన్నత్య మనర్గలత్వం ప్రతాపరుద్రే సమవేక్ష్య ధాతా
> అంభోనిధి ష్వద్రిషు దిగ్గజేషు సృష్టిం ప్రయాసైకఫలా మమం...

బ్రహ్మ ప్రతాపరుద్రునిలో గాంభీర్యమును ఔన్నత్య మును అనర్గలత్వమునూ చూచి సముద్రములను పర్వత లను దిగ్గజాలనూ సృజించడము వలన ఉత్త ప్రయాస త ఏమీ ఫలం లేదు అని భావించినాడు. దీనిలో ఉద్దిష్ట లయిన మూడింటికీ యథాక్రమముగా అనూద్దేశము చె సంబంధమును గోచరింపచేయడము ఉన్నది కాబట్టి యథా సంఖ్యము.

౫౦ అర్థాపత్తి

మీమాంసకులు అర్థాపత్తి అనే ఒక న్యాయమును అంగీకరిస్తారు. దానిని సచమత్కారంగా నిబంధించితే అలంకార మవుతుంది.

ఏకస్య వస్తునో భావా ద్యత్ర వస్త్వన్య దాపతేత్
కైముత్యన్యాయతః సా స్యా దర్థాపత్తి రలంక్రియా.

ఒక పదార్థము యొక్క నిష్పత్తి వలన వేరొక పదార్థము యొక్క సిద్ధి కైముత్యన్యాయానుసారముగా కలిగినట్లయితే అర్థాపత్తి అలంకార మవుతుంది. దండాపూపికాన్యాయమును కైముత్యన్యాయమని అంటారు. "దండానేవ భక్షయతః అపూపాః కిముత !" అనే ఆకారమును అనుసరించి ఈన్యాయమునే దండాపూపికాన్యాయము అనికూడా అంటారు. ఒక గదిలో ఒక దండము వ్రేలాడగట్టి ఉన్నది. దానికి ఒక చివర గారె ముక్కల మూట కట్టారు. మూషికములు ఆ గదిలోకి వచ్చి ఆ దండము రెండవవైపున కొరకడమును ఒకడు గుర్తించాడు. ఇక్కడ ఎలుకలు ఉన్నవి కదా ! ఆ ప్రక్క గారెలు ఏమయినవో? అనే శంకను ఈ న్యాయము దిద్ది తీర్చుతుంది. కర్రలనే కొరికి తింటూ ఉంటె గారెల సంగతి ఇంకా చెప్పేదేమిటి ? ఆ గారెలు ఇంకా ఉంటవా? మూషికాలు ఎప్పుడో తిన్నవి. అనే అర్థము ఇక్కడ లభిస్తుంది. ఇటువంటిది దండాపూపికాన్యాయము. కైముత్యన్యాయము. ఈ సమానన్యాయమును బట్టి ఒకదాని సిద్ధి వలన వేరొకదాని సిద్ధి కూడా స్పష్టమయితే ఈ అలంకారమన్నమాట. దండభక్షణము వలన అపూపభక్షణము అర్థసిద్ధమయినట్లు ఒక అర్థసిద్ధి కలిగితే అర్థాంతరము యొక్క

ఆపత్తి అర్థాపత్తి అని సారాంశము. ఒక దాని వలన వేరొక దానిసిద్ధి అభ్యూహిత మవుతున్నదని ఇక్కడ అనుమానశంక చేయరాదు. అనుమానములో కైముత్యన్యాయసంబంధము ఉండదుకదా! ఇది కైముత్యన్యాయ సంబంధరూపము. రెండిటికీ స్పష్టభేదము ఉన్నది. ఒకదాని వలన వేరొకదాని సిద్ధిని గోచరింప చేయడములో సమానన్యాయమె ఇక్కడ ఉన్నది కాని నియత సంబంధము లేదు. నియత సంబంధము ఉండనపుడు అనుమానప్రసక్తి కలుగదు గదా! ఈ అర్థాపత్తి అలంకారము రెండు విధాలు. ప్రాకరణికము వలన అప్రాకరణికాక్షేపము, అప్రాకరణికము వలన ప్రాకరణికాక్షేపము అని ఉదా :—

సమంతా దుద్వేలై ర్వివిధహయధాటీ కలకలైః
జగత్యాం క్రామన్న ప్యజని విధురః సేవణపతిః
మనాక్ క్రోధోదంచద్భ్రుకుటి కుటిలే రుద్రనృపతౌ
నృపాణా మన్యేషాం విఫలితరుషాం కైవ గణనా?

ప్రతాపరుద్రుడు కొంచెపు కోపంతో కుటిలభ్రుకుటి కలవాడు కాగానే అంతటా ఉద్వేలములయిన నానావిధ హయ ధాటీ కలకలములతో కూడుకొని జగత్తులో ఆక్రమించే వాడయినా సేవణపతి వివశు డయినాడు. వ్యర్థులయిన ఇతరరాజులకు ఇంకా లెక్క ఏమిటి? మహాపరాక్రమశాలి అయిన సేవణప్రభువే వివశుడయినప్పుడు ఇతరులు అత్యంతమూ అసమర్థులయినట్లె అని అర్థాంతరాపత్తి ఉన్నది. సేవణపతి వృత్తాంతము ప్రాకరణికము. అది అప్రాకరణికమయిన నృపాంతరవృత్తాంతమును ఆక్షిప్తము చేస్తున్నది.

త్రైలోక్యసారోపి సువర్ణశైలః ప్రతాపరుద్రేణ నృపేణ తుల్యాం
తులాం సమారోఢు మపూర్ణ ఏవ మహీభృతాం కా గణనేతరేషాం?

త్రిలోకసారరూపమయిన మేరుపర్వతము కూడా ప్రతాపరుద్రునితో సమానంగా సామ్యము పొందడానికి అసమర్థమె. ఇతర మహీభృత్తులకు (పర్వతములు, రాజులు) ఇంకా లెక్క ఏమిటి? దీనిలో మేరు వృత్తాంతము అప్రాకరణికము. ఇతరరాజులకు ఇంకా ఏమి గణన? అనే అన్యరాజవృత్తాంతము ప్రాకరణికము. ఇతరపర్వతములకు లెక్క ఏమిటి? అనే వృత్తాంతము అప్రాకరణికమె. ఇక్కడ అప్రాకరణిక మేరువృత్తాంత సమాన న్యాయమును బట్టి ఒక అప్రాకరణికార్థాపత్తి ఒక ప్రాకరణికార్థాపత్తీ ఉన్నది. మహీభృతాం అనే శబ్దము శ్లిష్టముకావడము దీనిలో ఒక విశేషము. అన్యరాజవృత్తాంతమును ప్రాకరణికముగా భావించడము అంతగా సమ్మతము కాకపోతే అప్రాకరణికము వలన ప్రాకరణికార్థసిద్ధికి ఉదాహరణాంతరమును గ్రంథాంతరములలో భావించాలి. ప్రాకరణికమయిన రాజవృత్తాంతాపత్తి ఇక్కడ అసంగతముగా కన్పడదు.

౫౧. పరిసంఖ్య

మీమాంసకులు నియమవిధి పరిసంఖ్యావిధి అని పరిసంఖ్యను విధి భేదాలలో పరిగణించు తున్నారు. నియమ పరిసంఖ్యావిధులకు వారొకవిధమయిన భేదమునున్నా నిరూపిస్తారు కాని వారు చెప్పే స్వరూపనిరూపణమును ఆలంకారికులు అంగీకరించరు. అలంకారికుల పరిసంఖ్యాలక్షణము ఈ విధముగా ఉంటుంది.

ఏకస్య వస్తునః ప్రాప్తా వనేకత్రైకదా యది
ఏకత్ర నియమః సా హి పరిసంఖ్యా నిగద్యతే.

ఒక వస్తువునకు ఒక సమయంలోనే అక్కడా ఇక్కడా అనేకస్థలాలలో ప్రాప్తి ఉన్నప్పుడు ఒకేచోట నియమమును నిరూపిస్తే పరిసంఖ్యాలంకార మవుతుంది. ఏకకాలంలోనే అనేకప్రదేశాలలో ఉంటూ ఉన్నట్లుగా ఊహింపబడే వస్తువును ఇతరస్థలాల లేకుండగా చేసి ఒకే చోట నియమించడము పరిసంఖ్య అన్నమాట. పరివర్జనము సంఖ్యానము రెండూ ఉంటున్నందు వలన పరిసంఖ్య అనే పేరు సార్థకము. అనేక ప్రదేశాలలో ఉండే దానిని ఇతర స్థలాలలో లేకుండా వర్జింపచేసి ఒకే చోట నియమించడము అంటే వర్ణనీయముగా పరిగణించడము పరిసంఖ్య అని తాత్పర్యము. ఇది ప్రశ్నపూర్వికము అప్రశ్నపూర్వికము అని మొదట రెండు విధాలు. మళ్లీ ఒక్కొక్కటి రెండు విధాలు. వర్జనీయము శాబ్దముగా ఉండడము ఒకటి. ఆర్థముగా ఉండడము మరి ఒకటి. ఇట్లా మొత్తమిది నాలుగు విధాలు. వానిపేర్లు

౧ ప్రశ్నపూర్విక శాబ్ద వర్జనీయము
౨ ,, ఆర్థ వర్జనీయము
౩ అప్రశ్నపూర్విక శాబ్ద వర్జనీయము
౪ ,, ఆర్థ వర్జనీయము.

వీని ఉదాహరణములు ఇట్లా సంభావించాలి.

౧ కిం మండనం త్రైలోక్యాః? కాకతితిలకో న హాటకక్షితిభృత్
స్తోతవ్యః కః సుధియాం? రుద్రనరేంద్రో న మందరః క్షితిభృత్.

"మూడులోకాలకూ అలంకారము ఏమి?" అని ప్రశ్న. ప్రతాపరుద్రుడె అలంకారము మేరుపర్వతం కాదు" అని సమాధానము. "విద్వాంసులకు స్తోత్రయోగ్యుడు ఎవరు?" అని ప్రశ్న. "ప్రతాపరుద్రుడె మందరపర్వతము కాదు.

అని సమాధానము. ఇది ప్రశ్నపూర్వకమని స్పష్టము. త్రిలోకమండనత్వము కాకతీంద్రకనకాచలములనే అనేకస్థలాలలో ప్రాప్తమవుతూ ఉంటే కనకాచలమునందు నిషేధించి కాకతీంద్రునియందే నియమించడము ఉన్నందువలన పరిసంఖ్య ఇట్లాగే ఉత్తరార్థములో. వర్జనీయమును శబ్దముతో స్పష్టముగా చెప్పడమువలన ఇది శాబ్దవర్జనీయ మవుతున్నది.

౨. కిం వా క్షౌమ వితానం లోకానాం ? కాకతీయకుల కీర్తిః
కిం సౌఖ్యం వసుమత్యాః ? రుద్రనరేంద్రస్య భుజవాసః

ఇది ప్రశ్నపూర్వకార్థవర్జనీయోదాహరణము. లోకాలకు శుభ్రవితానము ఏమి? కాకతీయకులకీర్తి. భూమికి సౌఖ్యము ఏమిటి? ప్రతాపరుద్రుని భుజనివాసము. దీనిలో వితానత్వము కాకతీయ కీర్తికి చంద్రికకూ ప్రాప్త మవుతూ ఉంటే కీర్తి యందే నియమించడము ఉన్నది. చంద్రికయందు పరివర్జనము కంఠోక్తిగా లేనందువలన ఆర్థము. ప్రశ్న ఉన్నది. సమన్వయము సులభము.

౩. రాగో ధర్మే న విషయసుఖే, సంగతిః సత్సభాయాం
న స్త్రీగోష్ఠ్యాం వ్యసన మనిశం నీతిశాస్త్రే న చాక్షే,
కీర్త్యాం నిత్యార్జనచతురతా నార్థజాతే, వినోదో
విద్యాభ్యాసే న చ పరిజనే, రుద్రదేవస్య రాజ్ఞః.

ప్రతాపరుద్రదేవునకు రాగము (అభిమానము) ధర్మమునందే కాని విషయసుఖమునందు కాదు. ఆసక్తి సత్సభయందే కాని స్త్రీగోష్ఠి యందు కాదు. నిత్యమూ వ్యసనము నీతిశాస్త్రమందే కాని పాచికయందు కాదు. నిత్యము సంపాదన చాతుర్యము కీర్తి యందే ద్రవ్యజాతమందు కాదు. వినోదము విద్యాభ్యాసమందే కాని పరిజనము నందు కాదు.

రాగము మొదలయినవి ధర్మ విషయసుఖాదులందు ప్రాప్తములు కాగా విషయ సుఖాదికము నందు నిషేధించి ధర్మాదులందు నియమించడము దీనిలో ఉన్నది. విషయసుఖాది వర్జనీయము శాబ్దముగా ఉన్నది. ఇది ప్రశ్నరహితమయిన పరిసంఖ్య.

౪. భూరేవ భువనం, దేవః స్వయంభూ రేవ పార్థివః
ప్రతాపరుద్ర ఏ వైకశిలైవ నగరీ శుభా
క్షోణీం రుద్రనరాధీశే రక్షతి క్షతవిద్విషి
బలిసద్మ న్యహిభయం త్రిదివే గోత్రభిత్కథా

భూలోకమె లోకము. స్వయంభూదేవుడే దేవుడు. ప్రతాపరుద్రుడె పార్థివుడు. వరంగలు నగరమె నగరము. శత్రుసంహారము చేసిన ప్రతాపరుద్రుడు భూమిని రక్షించుతూ ఉంటే అహిభయము (శత్రుభయము, సర్పభయము) పాతాళమునందే, గోత్రభిత్కథ (ఇంద్రకథ, కులఘాతుక ప్రసంగము) స్వర్గము నందే ఉన్నది. దీనిలో వర్జనీయము ఆర్థము. అప్రశ్నము. చివరి పద్యములో శ్లేష కూడా ఉన్నందున చారుత్వాతిశయము అభ్యుచ్చయము. కవిప్రతిభా నిర్వర్తనము ఉన్నందువలననె లోకోత్తరంగా నియమనము దీనిలో కుదురుతుంది.

౫౨ ఉత్తరము

పరిసంఖ్యాలంకారములో ప్రశ్నప్రసంగము వచ్చింది. ఉత్తరాలంకారములో కూడా ప్రశ్నసంబంధము ఉన్నది కాబట్టి ఇక్కడ నిరూపించాలి.

ఉత్తరా త్ప్రశ్న ఉన్నేయో యత్ర ప్రశ్నోత్తరే తథా
బహుధా చ నిబధ్యేతే తదుత్తర ముదీర్యతే

ఇది రెండు విధాలు. ప్రశ్న శబ్దముచే స్పష్టముగా ఉపనిబద్ధము కాకపోయినా నిరూపితమయిన సమాధానము వలన ప్రశ్న ప్రశ్నరూపముగా ఊహింప బడినప్పుడు ఒక విధమయిన ఉత్తరమవుతుంది. ప్రశ్నోత్తర పరంపర అనేక పర్యాయములు కూర్చబడినప్పుడు రెండో విధమయిన ఉత్తరమవుతుంది. లేని దానిని గోచరింప చేయడము మొదటి ఉత్తరభేదములో ఉన్నప్పటికీ అనుమాన మన్న శంక కలుగ రాదు. అనుమానసాధకములయిన వ్యాప్తి పక్షధర్మత మొదలయిన వేవీ ఇక్కడ ఉండవు కదా ! రెండవ భేదములో ప్రశ్నోత్తరములు అనేకపర్యాయములు ఉండాలి. ఒకపర్యాయము నిర్దేశించితే చమత్కారము కలుగదు. దీనిలో నిబంధింపబడే సమాధానమున్నా కవిప్రతిభానిర్వర్తిత మవుతుంది కాబట్టి లోకోత్తరంగా ఉంటుంది. ఇది ప్రశ్నోత్తరరూపముగా ఉన్నా పరిసంఖ్య కాదు. పరిసంఖ్యలో ఒకదానిని పరివర్జనము చేయడము వేరొకదానిని నియమించడమూ ఉంటుంది. ఇక్కడ అటువంటి విధానం ఉండదు. ఇక్కడ ఆ వివక్ష కూడా ఉండదు. ఈ రెండూ రెండు భేదాలు. అనుగతమయిన ఒకే లక్షణం వీనికి లేదు. ఉదా :—

కిమద్య వ్యుత్పత్తి స్తవ సుజనలోక వ్యవహృతా
యదద్య జ్ఞాతవ్యం ప్రభవతి యదా రుద్రనృపతిః
తదారభ్యోన్మూర్ధా జయతి నిశదో ధర్మవిభవో
మహీదేవా శ్చోద్యద్విధ విభవారంభ ముదితాః.

సుజనలోకములో ప్రసిద్ధమయిన నీ వ్యుత్పత్తి (ధార్మికత్వాదిజ్ఞానము) ఏమి వ్యుత్పత్తి? ఇంకా నీవు తెలుసుకోవలసి ఉన్నదాయెను ! అదేమిటో తెలిసిందా ? ప్రతాప

రుద్రనృపతి ఎప్పటి నుండీ ప్రభువై ఉంటున్నాడో అది మొదలు కొని ధర్మవిభవము విశదమై తలఎత్తుకొని తిరుగుతూ విలసిస్తున్నది. భూసురులున్నూ అప్పటి నుండీ నానా విధ విభవ విజృంభణములతో విలసిస్తున్నారు. ఈ పద్యము ఉత్తరము వలన ఉన్నేయప్రశ్నకు ఉదాహరణము. దీనిలో ప్రతాపరుద్రుడు ఎపుడు ప్రభువయినాడో అప్పటినుంచి ధర్మ ప్రతిష్ఠ పూర్ణముగా ఉన్నది. బ్రాహ్మణులున్నూ మంచి సంతోషముతో ఉన్నారు. ఇంకా ఏమో అడుగుతావేమి? అనే సమాధానము ఉపనిబద్ధమై ఉన్నది. దీని వలన "ప్రతాపరుద్రరాజ్యములో ధర్మప్రతిపాలనము ఉన్నదా ? బ్రాహ్మణులు సుఖముగా ఉన్నారా ? అని ప్రశ్న సమున్నీతమవుతున్నది.

౨, కిం ను ధనం ? కులవిద్యా, కో లాభః ? సజ్జనేన సహవాసః
కా నగరీ ? ఏకశిలా. కో రాజా ? వీరరుద్రనరనాథః

ధనమేమిటి ? కులవిద్య లాభమేమిటి ? సజ్జనసహవాసము. పట్టణము ఏది ? వరంగలు. రాజు ఎవరు ? ప్రతాపరుద్రుడు. దీనిలో ఇతర పరివర్జనము కాని నియమము కాని లేనందువలన ఇది పరిసంఖ్య కాదు. అనేక ప్రశ్నోత్తరాలు ఉన్నందువలన రెండవ ఉత్తరాలంకారము.

౫౩ వికల్పము

వాక్యన్యాయ ప్రస్థానములో వికల్పము నిరూపణార్హము. సర్వస్వకారునకు ప్రాచీనులు వికల్పాలంకారమును పరిగణించ లేదు. సముచ్చయాలంకారమును అంగీకరించారు. సముచ్చయాలంకారములో రెండు యుగపత్కాలంలో సంప్రాప్తములవుతవి. ఇందులో అట్లా కాదు. అందు

వలన వికల్పమును సముచ్చయప్రతిద్వంది అయిన అలంకార మునుగా సర్వస్వకర్త నిరూపించాడు. విద్యానాథుడు సముచ్చయాలంకారమునే వికల్పప్రతిపక్షభూతముగా భావించి ఇక్కడ ముందుగా వికల్పమును నిరూపిస్తున్నాడు. మీమాంసకుల రచనలో వికల్పము స్వరూప ప్రతిష్ఠితమై ఉన్నది. అటువంటి వికల్పమునె ముందుగా చెప్పి తరువాత సముచ్చయమును చెప్పడములో ఔచిత్యమును పరిశీలించిన విద్యానాథుడు ఈ క్రమమును ఆదరించాడు.

విరోధే తుల్యబలయో ర్వికల్పాలంకృతి ర్మతా.

సమానబలము కల వానికి విరోధమును నిరూపించితే వికల్పాలంకార మవుతుంది. సమానప్రమాణముల చేత అనుశాసింపబడిన రెండు విరుద్ధములకు ఒకేచోట ఒకేసారి, (అవి విరుద్ధములు కనుక) యౌగపద్యము కుదరదు. రెండూ తమ కిది స్థానము అని యుగపత్ప్రాప్తము లవుతవె కాని వాని కక్కడ యౌగపద్యము కుదరదు. పరస్పరవిరుద్ధములలో అది ఉంటే ఇది ఉండదు. ఇది ఉంటే అది ఉండదు. అపుడు అది కాని ఇది కాని ఏదో ఒకటే సంభవిస్తుంది. మరొకటి సంభవించదు. అపుడు వికల్పము అలంకార మవుతుంది. మీమాంసకుల వాస్తవ వికల్పము కూడా ఈ విధముగానే ఉంటుంది కాని అక్కడ ఔపమ్యము ఉండదు. ఇక్కడ ఇది ఔపమ్య గర్భమయినందువలన చారుత్వవిశేషమున్నది. ఔపమ్యగర్భత్వము ఉన్నపుడే వికల్పము అలంకార మవుతుంది. కానపుడు కాదు. ఉదా :—

భూపాలాః! క్రియతాం మూర్ధ్నాం ధనుషాం వా వినమ్రతా
పాదచ్ఛాయాంధ్రనాథస్య విన్ధ్యాద్రే ర్వా నిషేవ్యతాం.

ఓ! భూపాలకులారా! శిరములను వినమ్రములను చేయండి. ఆంధ్రప్రభువు పాదచ్ఛాయను సేవించండి. లేదా వింధ్యపర్వతము పాద (ప్రత్యంతపర్వత) చ్ఛాయ నయినా సేవించండి. ప్రతాపరుద్రునకు లొంగిపొండి. లేదా యుద్ధము చేయండి అని భావము. దీనిలో ప్రతిరాజకార్యములయిన శిరోనమనము ధనుర్నమనమూ తుల్యప్రమాణానుశిష్టములు. శత్రువు ప్రబలుడై ఉన్నపుడు వేతసవృత్తి నవలంబించి తల వంచడము సముచితము. అని సంధిప్రమాణానుశాసనము 'యశో వా మృత్యుర్వా' అనే నియమాన్ని బట్టి ధనువుతో యుద్ధము చేయడము విగ్రహప్రమాణానుశాసనము. ఈ ప్రమాణముల చేత శిరోధనుర్నమనములు ఒకే సారి ప్రాప్తము లవుతున్నవి. కాని ఇవి పరస్పరము విరుద్ధములు కావడము వలన ఏకకాలంలో కుదరవు. శిరోనమనం ఉంటే ధనుర్నమనము ఉండదు. ధనుర్నమనము ఉంటే శిరోనమనము ఉండదు. అందువలన యౌగపద్యము సంభవించదు. కనుక వికల్పము. శిరోధనువులకు నమన కృతమయిన సాదృశ్యము ఉన్నది కాబట్టి అలంకారతను నిశ్చయించాలి. ఈ పద్యములో పాదచ్ఛాయ అనే చోట శ్లేష ఉన్నది. వికల్పము శ్లేష లేకుండగా కూడా ఉంటుంది.

౫౪. సముచ్చయము

వికల్పప్రతిపక్షభూత మయిన సముచ్చయాలంకారము ఇక్కడ నిరూపణార్హము. వికల్పములో యౌగపద్యము (ఒకే సారి ఉండడము) కుదరదు. సముచ్చయములో కుదురుతుంది.

గుణక్రియా యౌగపద్యం సముచ్చయ ఉదాహృతః.

వైమల్యాది గుణములకు దర్శనాదిక్రియలకు యుగపదవస్థానమును వర్ణించితే సముచ్చయాలంకార మవుతుంది. గుణములను క్రియలను వ్యస్తముగా చెప్పవచ్చును. సమస్తముగా చెప్పవచ్చును. ఇవి భిన్నవిషయములుగా ఉండవచ్చును. ఏకవిషయములుగా ఉండవచ్చును. అంటే; సమకాలకథనము ఉన్నా ఒకగుణము ఒకరియందు వేరొకగుణము వేరొకరి యందూ ఉంటే భిన్నవిషయత. ఇట్లాగే క్రియలలో కూడా భిన్నవిషయత్వము ఊహ్యము. అన్నిగుణాలకు అన్నిక్రియలకూ ఒకరే విషయముగా ఉంటే ఏకవిషయత్వము ఇట్లా ప్రథమసముచ్చయము ఆరు విధాలవుతుంది.

౧ భిన్నవిషయ గుణ సముచ్చయము
౨ ,, క్రియా సముచ్చయము
౩ ,, గుణక్రియా సముచ్చయము
౪ ఏకవిషయ గుణ సముచ్చయము
౫ ,, క్రియా సముచ్చయము
౬ ,, గుణక్రియా సముచ్చయము

ప్రతాపరుద్రనృపతౌ భద్రాసన ముపేయుషి
సతాం ప్రసన్నం హృదయ మసతాం కలుషం మనః

ప్రతాపరుద్రుడు సింహాసనమును అధిష్ఠించగా సజ్జనుల హృదయము ప్రసన్నమయింది. అసజ్జనుల మనస్సు కలుషమయింది. ప్రసన్నత్వకలుషత్వ రూపములయిన గుణాలకు భిన్నవిషయక మయిన యౌగపద్యము దీనిలో ఉన్నది.

ప్రేక్షతే ఇమాం నరేంద్రః ప్రవిశతి మదనశ్చ గలతి మానశ్చ
ఘూర్ణతి మనశ్చ శూన్యం కిమేతత్ ? పశ్యత ! సఖ్యః !

ఈమెను ప్రతాపరుద్రుడు చూస్తున్నాడు. మన్మథుడు ప్రవేశిస్తున్నాడు. కోపము జారిపోతున్నది. మనస్సు గాభరా

పడుతున్నది. అంతా శూన్యంగా ఉన్నది. సఖులారా! చూడండి! ఏమిటిది? దీనిలో భిన్నవిషయమయిన క్రియా సముచ్చయము స్పష్టము.

> త్రైలోక్యప్రథమాన కీర్తిమహిత శ్రీవీరరుద్రప్రభోః
> సేవార్థం చిరయత్సు కాకతిపురే భూపేషు తద్యోషితః
> ద్వారం యాంతి విలోకయంతి పురతః నిశ్వాస మాతన్వతే
> శుష్యంతి ప్రలపంతి యాంతి తనుతాం ముహ్యంతి మూర్ఛంతి చ.

మూడులోకాలలో కీర్తిప్రఖ్యాతుడై గొప్పవాడయిన ప్రతాపరుద్రుని సేవించడానికై వెళ్లి కాకతిపట్టణంలో రాజులు ఆలస్యం చేస్తూ ఉంటే వారిస్త్రీలు ద్వారము దగ్గరకు వెళ్లు తున్నారు. ఎదట చూస్తున్నారు. నిట్టూర్చుతున్నారు. ఎండి పోతున్నారు. ప్రలపించుతున్నారు. కృశించిపోతున్నారు. నిశ్చే ష్టలవుతున్నారు. మూర్ఛపోతున్నారు. దీనిలో విషయ భేదము లేదు. అన్నిక్రియలు ఏకవిషయకముగానె ఉన్నవి. ఇది ఏకవిషయక్రియాసముచ్చయాలంకారము.

> దేవే కాకతివీరరుద్రనృపతౌ జైత్రప్రయాణోన్ముఖే
> మాద్యద్దంతి చలత్పదాతి విచలద్వాజి ప్రధావద్రథం
> విచ్ఛాయాననమాకులాక్ష ముదయాత్కార్పణ్య మావిర్భవ
> త్కంపం భ్రామ్యతి సర్వతః ప్రతివనం ప్రత్యర్థిభూభృద్గణః.

గుణక్రియలకు మొత్తముగా యోగపద్యము దీనిలో ఉన్నది. కాకతివీరరుద్రనృపుడు జైత్రప్రయాణోన్ముఖుడు కాగానే శత్రుసమూహమంతా మదించే ఏనుగులు, చలించే పదాతులు, ప్రచలించే అశ్వములు, పరుగెత్తే రథములు, కాంతిలేని ముఖము, వ్యాకులమయిన నేత్రాలు, ఉదయించే కార్పణ్యము, ఆవిర్భవించే కంపము ఉండేటట్లుగా ప్రతి

వనమూ అంతటా భ్రమించుతున్నది. దీనిలో భిన్నభిన్న విషయకములయిన గుణక్రియల సముచ్చయము స్పష్టము.

ద్వితీయసముచ్చయము

ఇది వికల్ప ప్రతిపక్షరూప మని భావించ నక్కర లేదు. పూర్వసముచ్చయము కంటె ఇది భిన్నలక్షణము. అనేకములు సముచ్చితములు కావడమనేది రెండిటిలోనూ సమానము కనుక ఇది ఇక్కడ ప్రసక్త మవుతున్నది.

ఖలే కపోతన్యాయేన బహూనాం కార్యసాధనే
కారణానాం సముద్యోగః స ద్వితీయః సముచ్చయః.

ఖలేకపోతన్యాయానుసారముగా అనేక కారణములు ఒక కార్యసాధనములో ఉద్యతములు అయినట్లయితే ద్వితీయసముచ్చయ మవుతుంది. ఖలే కపోత న్యాయమంటే అది ఒక కథ. ఒకపుడు ఒక కళ్లములో పిట్టల వేటగాడొకడు వలను పన్నినాడు. అక్కడికి చిత్రగ్రీవమనే కపోతరాజు (పావురము) సపరివారముగా వచ్చి వలలో చిక్కుకొన్నది. పరివారమంతా పరస్పరము ఆలోచించి అందరూ కలిసి వలతో ఎగిరిపోయి హిరణ్యకుడు అనే స్నేహితుడయిన మూషికరాజు దగ్గరకు వెళ్లారు. మూషికరాజు పాశములు త్రెంపిన తరువాత కపోతరాజు పరివారముతో సుఖముగా ఉన్నాడు. ఇది పంచతంత్రకథ. వలను ఎత్తుకొని పోవడము అనే ఏకకార్యములో అన్నిపావురములకూ ప్రయత్నము ఉన్నట్లుగా, ఒకకార్యమును సాధించడానికి అనేక కారణాలు అహమహమికతో ప్రవర్తించితే అదిన్నీ (ద్వితీయ) సముచ్చయ మని తేలింది. ఒకే సారి అనేకముల అవస్థానము ఉన్నది కదా ! సద్యోగము అసద్యోగము సదసద్యోగము

అని ఇది మూడువిధాలు. యోగ్యము యోగ్యముతో సం బంధించుట, అయోగ్యము అయోగ్యముతో సంబంధిం చుట యోగ్యము అయోగ్యము సంబంధించుట అన్న మాట. ఉదా:—

శుభ్రం యశః శౌర్యమహచ్చ వృత్తం విద్యానవద్యా విమలం కులం చ
ప్రతాపరుద్రస్య నరేశ్వరస్య లోకోత్తరాం రీతి ముదంచయంతి

ఇది సద్యోగమునకు ఉదాహరణము. శుభ్రమయిన యశస్సు శౌర్యాధికమయిన ప్రవృత్తి, అనవద్యవిద్య, అమలిన కులము ఇవి ప్రతాపరుద్రనరేశ్వరునకు లోకోత్తరమయిన రీతిని ప్రకాశింపచేస్తున్నవి. లోకోత్తరరీతి సంపాదనములో శోభనయశస్సు శోభనవృత్తాదులతో సంబంధించి సము చ్చితమై దీనిలో కనపడుతున్నది. లోకోత్తరరీతి సంపాదన ములో యశస్సు మొదలయినవి ప్రత్యేకము హేతువులయినా ఒకే పర్యాయము ఖలేకపోతన్యాయరీతిగా కూడి ఉన్నవి. ప్రకృతకార్యసిద్ధిలో యశస్సు హేతువుగా ప్రక్రాంతము. వృత్తము మొదలయినవి కూడా తత్స్పర్ధతో కార్యసిద్ధిని కలుగజేస్తున్నవి. అందువలన లక్షణము సుసంగతము. చెప్ప బోయే సమాధ్యలంకారములో ప్రకృతకార్యసిద్ధికొరకయిన కారణము పూర్ణమై అన్యనిరపేక్షముగా ఉంటుంది. కారణాం తరము కాకతాళీయముగా వస్తుంది. ఆకస్మికంగా వచ్చిన ఆ కారణాంతరము సౌకర్యము కలుగజేస్తూ స్వరూపోపచ్ఛయ మును కూర్చుతుంది. అప్పుడు బాగా కార్యనిష్పత్తికలగడము ప్రయోజనము. సముచ్చయములో చాలా కారణాలు స్పర్ధతో ఏకకార్యకారులవుతూ ఉంటవి. అందువలననే ఖలేకపోతిక నిదర్శనము.

౫౫. సమాధి

కార్యకారిత్వసాదృశ్యము ఉన్నది కాబట్టి సము చ్చయము తరువాత సమాధి నిరూపణము సముచితము.

ఏకస్మిన్ కారణే కార్యసాధనేఽన్యత్పరాపతేత్
కాకతాలీయ నియతః స సమాధి రుదీర్యతే.

ఒకకారణము కార్యసాధనమునకై ప్రవృత్తము కాగా వేరొక కారణమున్నూ పరాపతితమయితే సమాధి అలం కార మవుతుంది. ఇది కాకతాలీయన్యాయనియతమై ఉం టుంది. కాకతాలీయముగా వేరొక కారణము వచ్చి ప్రకృత కార్యమును సుకరము చేస్తే సమాధి అన్నమాట. ఇక్కడ ప్రసక్తమయిన కాకతాలీయన్యాయమును ఈ విధముగా గ్రహించాలి. కాకము తాళవృక్షము దగ్గరకు వెళ్లింది. తాటి పండు పడింది. పగిలింది. కాకము అనుభవించింది. ఇట్లాగే ఒకడు ఒక రహః ప్రదేశమునకు వెళ్లినాడు. అక్కడ ఒక పడుచు కన్య ఉన్నది. ఆ కన్య ఈతని చూచి తహతహ లాడింది. ఆతడు ఆమెను అనుభవించినాడు. కాకతాళీయ మన్నప్పుడు కాకి రావడము పండు పడడము కాకి అనుభవించడముతో సమానమయిన తరుణకృత కన్యానుభవము గోచరమవు తుంది. అనుకోకుండా ఆకస్మికంగా ఒకటి సంభవించినప్పుడు కాకతాళీయన్యాయమును స్మరిస్తారు. ప్రకృతక్రియాసిద్ధికై కారణాంతరము ఆకస్మికముగా పరాపతితము కావడము ఇక్కడ ఉన్నది. ఉదా:

రణాంగణే రుద్రనరేంద్రరోష శమాయ రాజ్ఞాం విహితస్తుతీనాం
వక్త్రేషు యద్వాయువశా త్పతంతి తృణాని దేవస్య న పక్షపాతః.

యుద్ధరంగములో ప్రతాపరుద్రుని కోపమును శమింప

జేయడానికి స్తవం చేసిన రాజుల ముఖాలలో వాయువశాన గడ్డిపడుతున్నది అంటే అది దేవుని పక్షపాతము. కోపశాంతి రూపమయిన కార్యసిద్ధికి రాజులు స్తుతిచేస్తూ ఉండగా కాకతాలీయముగా వచ్చిన తృణపతనము కార్యసౌకర్యమును సంపాదిస్తున్నది కనుక సమాధి.

భావికము

ఇక లోకన్యాయ మూలాలంకారములను నిరూపించాలి. లోకన్యాయ మూలకములలో భావికాలంకారము చమత్కారాతిశయ హేతువు.

అతీతానాగతే యత్ర ప్రత్యక్షే ఇవ లక్షితే
అత్యద్భుతార్థకథనా ద్భావికం తదుదాహృతం.

అతీతానాగతములు భూతభవిష్యదర్థములు. అవి అత్యద్భుతార్థకథనము వలన ప్రత్యక్షాయమాణములై ఉపలక్షితము లయినట్లయితే భావికాలంకార మవుతుంది. అని సామాన్యముగా భావము. అతీతానాగతములు ప్రత్యక్షాయమాణములు కావలె నంటే అలౌకికముగా అత్యద్భుతముగా నిరూపణము ఉండాలి. ఇటువంటి నిరూపణము ఉన్నందువలననే సహృదయులు సావధానులవుతారు. ఇక్కడ అనాకులమయిన శబ్దసందర్భముతో ఈ అర్థనిరూపణము అవసరము. సామాన్యంగా ఎక్కడ నయినా శబ్దముల ఆకులపాటు వర్జనీయమె. శబ్దాలు అనాకులములుగా ఉండక విప్రకీర్ణములుగా ఉన్నప్పుడు అర్థములో విశేషము ఏమీ కలగదు. వెంటనే సరైన ప్రతీతి కలగదు. విఘ్నము మాత్రమె అక్కడ ఫలము. విశేషించి ఈ భావికాలంకారములో శబ్దముల వ్యాకులత అతీతానాగతములను ప్రత్యక్షముగా చేయదు కనుక దీనిని

స్పష్టముగా గుర్తించాలి. అపూర్వములయిన అర్థములు కవి వాక్యములో అనుకూలముగా పొదుప బడి ఉంటే వాచ్య వాచకములకు రామణీయకము కలుగుతుంది. కొన్నికొన్ని అర్థములు కవివాక్యములో బాగా కూర్పబడి నప్పటికీ స్వకీయసౌభాగ్యము లేనందు వలన పంచదారలో గడ్డి మాదిరిగా సహృదయులకు అవజ్ఞాస్పదములై అవధానార్హా ములు కావు. కొన్ని అర్థములు సుభగములె అయినా దుర్భగ శబ్దాలలో ఉన్నందు వలన సహృదయులకు ఆవర్జకములు కావు. కనుక ఈ భావికాలంకారములో రెండిటి ఆవశ్యకత ఉన్నదన్నమాట. కవిభావము శ్రోతలో ప్రతిబింబముగా ఉంటుంది. కాబట్టి భావికమనే పేరు తగి ఉన్నది. కవి భావము కవిభావన మాటిమాటికీ చేతోనివేశనము పొంది దీనిలో ఉంటుంది కాబట్టిన్నీ ఇది భావికము.

భూతభవిష్యదర్థములు ప్రత్యక్షములో మాదిరిగా అవభాసించడము విరుద్ధమేమో ? అని శంకించుకో నక్కర లేదు. భావనాబలము వలన ప్రత్యక్షవదవభాసనము కుదురు తుంది. భావన అనేది అన్ని చోట్లా ఉండాలి. అది లేక పోతే ఏమీ కుదరదు. ప్రత్యక్షవిషయములో కూడా భావన ఉండక తప్పదు. అసలు ప్రత్యక్షత్వమనేది కేవలమూ వస్తు ధర్మము కాదు. భావించేవాని యొక్క ప్రతిపత్తి విశేష మును అనుసరించి ఇది ప్రత్యక్షమని ఇది వేరొకవిధ మని నిశ్చయించుతాము. భావకునకు తన జ్ఞానప్రతిభాసము ఉంటే వస్తువు ప్రత్యక్షమవుతుంది. లేకపోతే కాదు. వస్తువు ప్రత్యక్షము కావడములో భావకునకు సామగ్రి ఉపకారి అవుతుంది. భావించేవారి విశేషాన్ని బట్టి ఆ సామగ్రిన్నీ నానావిధాలుగా ఉంటుంది. మామూలు లోకయాత్రలో

నయితే ఆ సామగ్రి చక్షువు మొదలయిన ఇంద్రియముల స్వభావముగా ఉంటుంది. యోగులకు అతీంద్రియార్థదర్శనములో భావనారూపముగా ఉంటుంది. కావ్యార్థవిదులకు ఆభావన స్వభావసిద్ధము. అది వస్తుగతిని అనుసరించి అద్భుతరూపముగా ఉంటుంది. భావనావిషయములయిన పదార్థములను సహృదయులు సమాదరముగా చూస్తారు. వానిని హృదయాన బాగా ధరిస్తారు. వారి హృదయము ఆ పదార్థములందు ఏకతానమై ఉంటుంది. అప్పుడాపదార్థాలు ప్రరూఢములై భావనారూపమును పొందుతవి. సహృదయులు మాటి మాటికీ ఆ పదార్థాలను హృదయములో భావించగా భావించగా ప్రత్యక్షాయమాణత్వము బాగా ఘటిస్తుంది. విరహి పాంథుడు కామినీభావన చేసి ఆమెను ప్రత్యక్షాయమాణముగా చేసికొంటున్నాడు గదా! యోగులకు భావనాబలమువలన భూతభావ్యర్థములు ప్రత్యక్షముగా భాసిస్తున్నట్లు కావ్యార్థవిదులయిన సహృదయులకున్నూ భావనాబలమువలన భూతభావివస్తువులు ప్రత్యక్షాయమాణములు కావడము విరుద్ధము కాదు ప్రత్యక్షాయమాణములు కావడము అంటే ప్రత్యక్షములో ఉన్నట్లుగా అవభాసించడము అన్నమాట. అంతే కాని కేవలము ప్రత్యక్షము కావడమని అభిప్రాయము కాదు. భూతభావి వస్తువులు తమతమ కాలములో ఉన్నవే అయినా భావకులకు అవభాసిస్తున్నవి అని భావము. అప్రస్తుతమయిన ఈ గహనవిషయమును ఇంత కన్న విస్తరించడము సముచితముగా ఉండదు.

ఈ భావికము సర్వోత్తీర్ణమయిన అలంకారము. స్వభావోక్తి, రసవదాద్యలంకారము, ఉత్ప్రేక్ష భ్రాంతిమదలంకారములకు ఇక్కడ ప్రసక్తి ఉంటుందేమో అనే శంక

ఒకప్పుడు కలుగవచ్చును. కనుక ఈ చెప్పబోయే అంశములను బాగా భావించాలి.

౧. సుందరమయిన వస్తువును యథాతథముగా వర్ణించినట్లయితే ప్రత్యక్షాయమాణత సిద్ధ మవుతుంది. సామాన్యముగా ఈ భావికాలంకారానికి ఇది స్వరూప ముగా గోచర మవుతుంది. అందువలన సూక్ష్మవస్తుస్వభావ వర్ణనము ఉన్నది కాబట్టి ఈ భావికము స్వభావోక్త్యలం కారము కావచ్చునేమో? అని శంకించడము ఉచితము కాదు. ఈ రెండింటికీ వైషమ్యము బాగా ఉన్నది. స్వభా వోక్త్యలంకారములో లౌకికవస్తుగతములయిన సూక్ష్మ ధర్మాలను వర్ణించినపుడు హెచ్చుతగ్గులు లేకుండా ఉన్నది ఉన్నట్లుగా వర్ణించడము ఉంటుంది కాబట్టి సాధారణ్యమును అనుసరించి హృదయసంవాదము కలుగుతుంది. ఇతరుల చిత్తవృత్తిని తనచిత్తవృత్తితో అభిన్నముగా పరామర్శించ డమును హృదయసంవాదమని అంటారు. తనది పరునిది అనే విభాగము లేకుండా దేశకాలవిభేదము లేకుండా వ్యాప కముగా గోచరించడము సాధారణ్యము అవుతుంది. ఇంతకూ స్వభావోక్త్యలంకారములో సాధారణ్యముతో హృదయ సంవాదము ఉంటుందని అటువంటి హృదయసంవాది ప్రతీతిలో లౌకికవస్తుగతములయిన సూక్ష్మధర్మాలు భాసిం చును అని చెప్పినట్లయింది. ఈ భావికాలంకారములో ప్రక్రియ ఇంత కన్న భిన్నముగా ఉంటుంది. అత్యద్భుతరూప ముగా లోకోత్తరవస్తువులకు ప్రస్ఫుటముగా ఇక్కడ ప్రతి భానము ఉంటుంది. ఆ ప్రతిభానమున్నూ తాటస్థ్యముతో ఉంటుంది. "దీనిని నేను తెలుసు కొంటున్నాను" అనే సామానాధికరణ్యముతో ప్రతీతి ఉంటుందని పరమార్థము.

సాధారణ్యమున గోచరించడానికి తాటస్థ్యమున గోచరించడానికిన్ని ఉన్న స్వరూపభేదమె స్వభావోక్తి భావికములకు భేదమును సంపాదిస్తున్నది.

౨. రసవదలంకారము కంటే ఈ భావికాలంకారానికి భేదము ఉన్నది. ఎదట స్ఫురించే రూపము ఉండేటట్లుగా వర్ణించడము చమత్కారముతో కూడుకొన్న ప్రతీతి ఉండడమున్నూ ఈ రెండు అలంకారాలలోనూ ఉంటుంది. అందువలన ఇది రసవదలంకారము కాకూడదా? అనే శంకకూడా కలుగవచ్చును. రసవదాద్యలంకారములో విభావానుభావసంచారిభావముల యొక్క అనుసంధానము చేతనే రసాదులకు ఆస్వాద్యత్వము కలుగుతున్నది. విభావాదులను బాగా అనుసంధానము చేయడము చేత పరమాద్వైతజ్ఞానికి వలె "ఇది నాది, ఇది పరునిది, ఇది తటస్థునిది" అనే విశేషసంబంధ నియమము కాని 'ఇది నాది కాదు. ఇది పరునిది కాదు. ఇది తటస్థునిది కాదు' అనే సంబంధవిశేషపరిహారము గాని ఏమీ లేక సాధారణ్యముతో సహృదయులకు హృదయసంవాదమును సంపాదించే అలౌకికమయిన ప్రత్యయము కలుగుతుంది. ఇటువంటి ప్రతీతిలో రత్యాదిచిత్తవృత్తులు గోచరములు అవుతూ ఉండగా రసవదాద్యలంకారమునకు స్వరూపలాభము కలుగుతుంది. ఈ భావికాలంకారములో అట్లా కాదు. రసవదాద్యలంకారములో అత్యద్భుత విధముగా ఆస్వాదము కలుగదు. భావికములో భూతభావి వస్తువులు సర్వజ్ఞుడయిన సకలవిద్యేశ్వరునకు గోచరములయినట్లుగా గోచరము లవుతవి. అంతే కాని సాధారణ్యమున గోచరములు కావు. ఇటువంటి ఈ భేదమును అనుసరించి రెండింటికీ [illegible]

3. ఉత్ప్రేక్షాలంకారమునకు ఈ భావికమునకున్నూ ఈ విధముగా భేదవివేకమును గ్రహించాలి. అప్రత్యక్షము లయిన భూతభావిపదార్థములు ప్రత్యక్షపదార్థములుగా గోచరములు కావడము ఉన్నది. కాబట్టి అధ్యవసాయము ఉన్నట్లు ఊహించవచ్చును కదా! ఉత్ప్రేక్షాలంకారము ఏల కాకూడదు? ఇవాదులు లేవు కాబట్టి ఇది ప్రతీయమానోత్ప్రేక్షయే అగునేమో? అనే శంకకూడా ఇక్కడ అవసరము కాదు. అప్రత్యక్షమును ప్రత్యక్షముగా అధ్యవసాయము చేసి నిరూపించినపుడే ఉత్ప్రేక్షాలంకారమునకు ప్రసక్తి ఉన్నది. ఇక్కడ అతీతానాగతములు ప్రత్యక్షములుగా అధ్యవసితములు కావడము లేదు. కావ్యార్థవిదులయిన సహృదయులు భూతభావివస్తువులను ప్రత్యక్షముగా భావనలో దర్శించడమె ఇక్కడ ఉన్నది. అధ్యవసాయము లేనే లేదు కాబట్టి ఉత్ప్రేక్ష కాదు.

4. భూతభావివస్తువులను ప్రత్యక్షముగా చూడడము ఉన్నందువలన ఇది భ్రాంతిమదలంకారము కాకూడదా? అనే శంకకూడా సముచితము కాదు. కావ్యతత్త్వవేత్త లయినవారు అప్రత్యక్షములయిన భూతభావివస్తువులను భావనావశమున సాక్షాత్కరించుకొంటున్నారు. భావన ఎప్పుడూ భ్రాంతి రూపము కాదు. భూతభావి వస్తువులు భూతభావి వస్తువులుగానే ఇక్కడ ఉన్నవి. భూతభావి వస్తువుగా ఉన్నంతమాత్రాన అది కేవలమూ వస్తుమాత్రము కాదు. భావనావశము వలన భూతభావిగతమూ ప్రత్యక్షత్వాదిగతమూ అయిన ఒక స్ఫుటధర్మము దీనిలో అధికముగా ఉన్నది. భ్రాంతిలో నయితే ఈ విశేషము ఉండదు. అందువలన ఇది భ్రాంతిమదలంకారము కాదు. ఇంకా ఇత

రాలంకారములకంటె భేదవివేకమును ఇక్కడే ప్రదర్శించడము అంతగా యుక్తము కాదు. ఇంతకూ ఈ భావికము సర్వోత్తీర్ణమయిన అలంకారమని భావించాలి. ఉదా:

ధ్వజాగ్రే కాకతీంద్రస్య భాతి క్రోడాకృతి ర్హరిః
మృద్బిందురివ దంష్ట్రాగ్రే యస్యాలక్ష్యత మేదినీ.

కాకతీంద్రుని జండాపై విష్ణువు క్రోడాకారముగా భాసిస్తున్నాడు. ఆతని దంష్ట్రాగ్రమందు భూమి మృద్బిందువు వలె కనపడుతున్నది. దీనిలో అష్టాదశద్వీపసహిత అయిన భూమి దంష్ట్రాగ్రములో మృద్బిందురూపముగా ఉన్నదని అద్భుతముగా వర్ణించడము చేత అటువంటి అద్భుతమయిన భావనలో భూమి ప్రత్యక్షాయమాణ మవుతున్నది కాబట్టి భావికాలంకారము. ఈ భావికాలంకారములో ఒక్కొక్క చోట వర్ణనీయము వర్ణనావశము వలన ప్రత్యక్షాయమాణ మవుతుంది. వేరొకచోట ప్రత్యక్షాయమాణమై వర్ణిత మవుతుంది. ఇంకా దీని విచారవిస్తరమునకు ఇది స్థలముకాదు.

౫౭ ప్రత్యనీకము

బలినః ప్రతిపక్షస్య ప్రతీకారే సుదుష్కరే
య స్తదీయతిరస్కారః ప్రత్యనీకం తదుచ్యతే.

బలవంతుడయిన శత్రువునకు ప్రతీకారము చేయడము సుదుష్కర మయినప్పుడు ఆతనికి సంబంధించిన వానిని తిరస్కరించడము ప్రత్యనీకాలంకారము అవుతుంది. బలవంతుడయిన ప్రతిపక్షునకు దుర్బలుడయిన వాడు ప్రతీకారము చేయలేడు. ఆ బలవంతుని ఏ విధముగా నయినా బంధించడానికై దుర్బలుడు బలవంతునకు సంబంధించిన వానిని తిరస్కరించడము ఉన్నచోట ప్రత్యనీకాలంకారము అవుతుంది.

"అనీకస్య ప్రతినిధిః ప్రత్యనీకం" సేనకు ప్రతినిధిగా ఉంటే ప్రత్యనీకము. తత్సామ్యము వలన ఇది కూడా ప్రత్యనీకము. సేనను ఎదుర్కోవలసి ఉన్నప్పుడు దానిని ఎదుర్కోలేక దానికి ప్రతినిధిగా ఉండే వేరొక దానిని ఎదుర్కొన్నట్లుగా, ప్రబలుడయిన శత్రువు జయింపబడవలసిఉండగా దుర్బలుడయిన తదీయుని తిరస్కరించుట ప్రత్యనీకము. ప్రతిపక్షుని యందున్న బలవత్త్వమును చెప్పడము దీని ప్రయోజనము. ఉదా :—

> కాకతీయపతి శౌర్యమహోష్మ స్యక్కృతస్వమహిమా బడబాగ్నిః
> తద్గభీరిమ సనాభి మజస్రం బాధతే నిధి మపాం బహి రంతః

ప్రతాపరుద్రుని శౌర్యమహోష్మచేత తిరస్కృతమయిన మహిమకలిగిన బడబాగ్ని ప్రతాపరుద్రుని ఏమీ చేయలేక ఆతనితో సమానగాంభీర్యముకలిగిన సముద్రుని నిత్యమూ లోపలా బయటా బాధించుతున్నది. దీనిలో సముద్రము ప్రతాపరుద్రునకు సంబంధించినది అంటే సాదృశ్యము హేతువు.

౫౮. వ్యాఘాతము

వ్యాఘాతాలంకారము కూడా లోకన్యాయమూలకమే.

> యేన యత్సాధితం వస్తు తేనైవ క్రియతేన్యథా
> అన్యేన తదలంకారో వ్యాఘాత ఇతి కథ్యతే.

ఏదో ఒక ఉపాయవిశేషమును అవలంబించి ఒకడు ఒకవస్తువును నిష్పన్నము చేస్తే సాధనరూపమైన ఆ ఉపాయమునే అవలంబించి వేరొకడు ఆ వస్తువును వేరొకవిధముగా చేసినప్పుడు వ్యాఘాతాలంకారమవుతుంది. మొదట నిష్పన్నమైన వస్తువునకు వ్యాహతి హేతువుగా ఉన్నందు వలన

ఇది వ్యాఘాత మవుతుంది. నిష్పన్నమైన వస్తువు యొక్క వ్యాఘాతమే ఇక్కడ ఉంటుందిగాని, నిష్పాదింప దలచిన వస్తువునకు ఇక్కడ ప్రసక్తి లేదు. విఘాతమును సంపాదించిన వానికి వైలక్షణ్యము గోచరించడమే దీనిలో ఫలము. ఉదా:

> కాకతీయాభిజాతోఽయం నాభిజాతాధికస్థితిః
> దోర్భ్యం లబ్ధోదయా న్నృపా న్నాభ్యా మనుదయాన్ సృజన్.

కాకతీయకులములో పుట్టిన ఇతడు నాభిసముత్పన్నుడైన బ్రహ్మకంటె అధికస్థితి కలవాడు. ఎందువల్లనంటే బాహువులనుండి ఉత్పత్తి పొందిన రాజులకు బాహువులతో ఉత్పత్తి లేని వారలనుగా చేస్తున్నాడు కదా! దీనిలో బ్రహ్మ బాహువులను సాధనముగా చేసుకొని క్షత్రియులను సృజించినాడు. ప్రతాపరుద్రుడు ఆ బాహువులనే అవలంబించి ఆ రాజులను ఉత్పత్తి లేనివారలుగా చేస్తున్నాడు. అని ఉన్నందువలన వ్యాఘతసమన్వయము స్పష్టము. నిష్పన్నులైన రాజులకు వ్యాహతి సంపాదించడము దీనిలో స్పష్టముగా నిరూపించబడినది. ఇంతవరకు లోకన్యాయమూలకములైన అలంకారములు నిరూపితములైనవి.

౫౯ పర్యాయము

వ్యాఘాతాలంకారములో వస్తుసాధనము అన్యథాకరణము అనే రెండు క్రమముగా కూర్చబడి ఉన్నవి. ఆ ప్రసంగానుసారముగా పర్యాయాలంకారము కూడ ఇక్కడ నిరూపింప తగి ఉన్నది.

> క్రమేణైకమనేకస్మిన్ ఆధారే వర్తతే యది
> ఏకస్మిన్ అథవానేకం పర్యాయాలంకృతి ర్మతా

పర్యాయాలంకారము రెండు విధాలు. రెండూ రెండు పర్యాయములు. అంతేకాని రెండూ ఒకటికాదు. ఈ రెండింటికి సామాన్య లక్షణము లేదు. ఒకవస్తువు అనేక ఆధారములలో క్రమముగా ఉన్నట్లు వర్ణించినట్లయితే ఒక విధమైన పర్యాయాలంకారము. ఒక ఆధేయము అనేక ఆధారములందు ఉన్నట్లు వర్ణించినా ఒకే వస్తువు అనేకములలో గోచరించడము అనే విశేషాలంకారమునకు ఇక్కడ ప్రసక్తి లేదు. విశేషాలంకారములో ఒక ఆధేయము అనేక ఆధారములందు ఏకకాలములోనే ప్రవర్తించుతుంది. పర్యాయములో ఆ విధముగా యౌగపద్యప్రతీతి ఉండదు. ఒకే ఆధారమందు అనేకాధేయములు ఉన్నట్లు వర్ణించితే అది రెండవ పర్యాయము. ఇక్కడ కూడా ఆధేయ ప్రవృత్తి క్రమముగా ఉంటుంది అనే ఊహించాలి. అందువలననే గుణక్రియాయౌగపద్యము ఉన్న సముచ్చయాలంకారానికి ప్రసక్తి లేదు. సముచ్చయములో యుగపద్వర్తనము ఉండవలసిన అవసరము స్పష్టముగా నిరూపితమైనది. రెండు విధములైన పర్యాయాలంకారములోనూ క్రమాశ్రయణము ఉన్నది. అందువలన పర్యాయము అన్వర్థము. ఉదా:

దంష్ట్రాయాం కుహనాకిటేః భగవతో దేవస్య శౌరేః పురా
పశ్చాన్మస్తకమండలే ఫణభృతః పాతాళలోకేశితుః
అత్ర్యోర్వీపతిశేఖరస్య మహతః శ్రీకాకతీయప్రభోః
బాహౌ విశ్వధురీణసారమహితే బద్ధోత్సవా మేదినీ.

భూదేవి మొదట మాయావరాహమైన ఆది దేవుని దంష్ట్రయందు, తర్వాత పాతాళలోక ప్రభువైన ఆదిశేషువు శిరమందు, ఇప్పుడు రాజశిరోమణియైన ప్రతాపరుద్రుని,

ప్రపంచమును ధరించడములో ప్రఖ్యాతసారముగలబాహువు నందున్నూ ఉత్సవము కలదై ఉన్నది. దీనిలో ఒకే మేదిని అనేకాధారములందు క్రమముగా ఉన్నట్లు నిరూపితమైనది. ఇది మొదటి పర్యాయము.

యేషాం ముఖే నిజవధూసవిధే నృపాణాం
శౌర్యోక్తయః సమభవన్ అభిమానగర్భాః
తేషాం ప్రతాపనృపవీక్షణ కాతరాణాం
తత్రైవ దీనవచనాని సముద్భవంతి.

ఏ రాజులకు తమ భార్యల దగ్గర అభిమాన పరిపూర్ణములైన శౌర్య వచనములు ముఖములో ఉత్పన్నములయినవో ప్రతాపరుద్రుని చూడగానే భయపడిన ఆరాజుల ఆముఖములందే దీనవచనములు పుట్టుతున్నవి. ఆధారమైన ముఖమందు ఆధేయములైనశౌర్యోక్తులు దీన వచనములు క్రమముగా ఉండడము నిరూపితమైనది. ఇది రెండవ పర్యాయము. రెండింటిలోనూ క్రమానుసంధానము ఉన్నది కాబట్టి విశేష సముచ్చయములకు అవకాశము లేదు.

౭౦ సూక్ష్మము

పర్యాయాలంకారములో ఏకాధారమందు అనేకాధేయముల ప్రసక్తి ఉన్నది. వానిలో ఒకటి సంలక్షితము కాకపోవడము అనే సంబంధమును బట్టి పర్యాయాలంకారానంతరము సూక్ష్మాలంకారమును నిరూపించడములో సంగతిగ్రహించాలి. సూక్ష్మాలంకారములో గూఢమైన అర్థ ప్రతీతి ఉంటుంది.

అసంలక్షిత సూక్ష్మార్థప్రకాశః సూక్ష్మ ఉచ్యతే.

బాగా గోచరముకాని సూక్ష్మమైన అర్థమును ప్రకా

శింపచేయడము ఉన్నట్లయితే సూక్ష్మాలంకారమవుతుంది. చతుర సహృదయులు మాత్రము తెలిసికొనే సూక్ష్మార్థ మును ఆకారేంగితములద్వారా ప్రకాశింప చేసినప్పుడు సూక్ష్మమన్నమాట. స్థూలమతులు ఈఅర్థమునుబాగాగ్రహిం చలేరు. కుశాగ్రమతులు ఇంగితాకారముద్వారా ఆ అర్థ మును గ్రహించగలరు. మందబుద్ధులు తెలిసికోలేని అభి ప్రాయమును రసికుడు తెలిసికొనేటట్లుగా ప్రకాశింప చేసి నట్లయితే సూక్ష్మాలంకార మవుతుందని తాత్పర్యము సూక్ష్మార్థమును సంలక్షించినా ప్రకాశము చేసినా సూక్ష్మా లంకారమవుతుందని కొందఱి ఊహ. ఉదా :-

గురుజనసవిధే వధూః దృష్ట్వా నరేంద్రప్రేషితాం దూతీం
సర్వాంగేషు సహాసం కస్తూరీవిలేపనం కరోతి.

పెద్దల సమక్షంలో రాజుగారు పంపిన దూతికను వధువు గుర్తించి తన సర్వావయవములందు నవ్వుతూ కస్తూరీ విలేపనము చేసుకొంటున్నది. దీనిలో కస్తూరీ విలే నము చేత తిమిర సమయము సంకేతకాలము అని సూచిత మైనది. సంకేత సమయమును తెలిసికొనవలెననే ఊహతో దూతిక వచ్చింది. భ్రూభంగము మొదలైన ఇంగితము ద్వారా నాయిక దూతీభావమును గుర్తించింది. రాత్రిసమ యము సంకేతకాలమని దగ్గర ఉన్నవారు తెలిసికోలేని నిపుణురాలైన దూతి మాత్రము తెలుసుకో గలిగిన సూక్ష్మా ర్థమును ప్రకాశింపచేసింది. కనుక సూక్ష్మాలంకారము సమన్విత మవుతుంది.

౬౧ ఉదాత్తము

ఉదాత్తాలంకారము కూడా లోకన్యాయమూలమే

భావికాలంకారములో ఉన్నవస్తువును ఉన్నట్లుగా వర్ణించడము ఉంటుంది. ఆరోపితవస్తు వర్ణనము ఉదాత్తప్రాణము. కనుక భావికాలంకారానికి ఇది ప్రతిపక్షమని ఊహించవచ్చు.

తదుదాత్తం భవేత్ యత్ర సమృద్ధం వస్తు వర్ణ్యతే

సమృద్ధమైన వస్తువర్ణనము ఉన్నట్లయితే ఉదాత్తము. అసంభావ్యమాన మైన మహాసమృద్ధి కలిగిన వస్తువర్ణనము దీనిలో ఉండాలి. కవిప్రతిభాప్రాప్తమైన ఐశ్వర్యము దీనిలో ఉంటుంది. కాబట్టే ఉదాత్తమనే పేరున్నా సార్థకము.

ఉదా:

రమ్యా మేకశిలాభిధాననగరీ మాసేదివాంసో బుధాః
సౌవర్ణేషు గృహేషు రత్నరచిత ద్వారతోరణేషు స్థితాః
ఆరుహ్యాంగణమేదినీషు కలభాన్ క్రీడోత్సుకా నర్భకాన్
మోదంతే యదవేక్ష్య రుద్రనృపతేః తత్త్యాగలీలాయితం.

అందమయిన ఏకశిలానగరమును పొందిన పండితులు రత్నాలు కూర్పబడిన ద్వార తోరణాలు కలిగిన బంగారపు భవనాలలో ఉండి, ముంగటి ప్రదేశములలో ఏనుగు గున్నలను ఎక్కి ఆడుకొనవలెననే అభిలాషకల అర్భకులను చూచి ఆనంద పడుతున్నారు అంటే ఇదంతా ప్రతాపరుద్రుని త్యాగ లీలాచరణము. ఈ పద్యములో మహా సమృద్ధిశాలి అయిన వస్తువు వర్ణితమయింది.

ఉదాత్తులయిన మహాపురుషుల చరితమును వేరొక ప్రధానమునకు అంగభూతముగా వర్ణించిన చోట కూడా ఉదాత్తాలంకారమె అవుతుందని ప్రాచీనులు అంగీకరించుచు తున్నారు. విద్యానాథుడు రెండవ ఉదాత్తాలంకారమును నిబంధించలేదు. నిబంధించక పోవడములో హేతువును ఈ

రీతిగా భావించాలి. రసభావాదులు వాక్యార్థభూతములై ప్రధానముగా ఉన్నచోట రసవదాద్యలంకారత్వము ఉంటుందని అలంకార రసికులయిన భామహాదులు అంగీకరిస్తున్నారు. వారి మతములో, రసభావాదులు అంగిగా ఉన్నప్పుడు రసవదాద్యలంకారమని, అంగముగా ఉన్నప్పుడు ద్వితీయోదాత్తాలంకారమని వ్యవస్థను భావించవచ్చును. కాగా అంగిభూతమయిన వస్త్వంతరమునకు ఒకవిశేషమును సంపాదింపదలచి మహాత్ములు ఉదాత్తచరితమును నిబంధించినప్పుడు ద్వితీయోదాత్త మవుతుందని భావము. ఇది మొదటి ఉదాత్తము కంటె భిన్నము. అర్థభేదము ఉన్నందువలన సామాన్యలక్షణము లేనందువలన ఇది వేరయిన అలంకారమె. శబ్దసామ్యమును బట్టి ఇదిన్నీ ఉదాత్త మనడమె కాని దానికీ దీనికి సంబంధము లేదు. చిరంతనాలంకారికులు ఈ ద్వితీయోదాత్తమును కూడా అంగీకరించు తున్నారని సూచించడానికె అలంకార సర్వస్వకర్త దీనిని నిరూపించినాడు. ధ్వనిదర్శనమును అంగీకరించే వారి దృష్టిలో ఇది ప్రత్యేకాలంకారము కాదు. రసవదాద్యలంకారములలోనే అంతర్భూతము. ధ్వనివాదులు రసభావాదికము అప్రధానముగా ఉన్నపుడు రసవదాద్యలంకార వ్యవహారమును ఆదరిస్తారు. ఈ ఉదాత్తము కూడా అటువంటిదే కాబట్టి వానిలో చేరుతుంది. ప్రత్యేకముగా దీనికి విషయము లేదు. అపుడు ద్వితీయోదాత్తమును పరిగణించ నక్కరలేదు. ఈ అభిప్రాయముతో విద్యానాథుడు ద్వితీయోదాత్తమును ఆదరించి ఉండడని ఊహించ వచ్చును.

మమ్మటాదులు ఈ ద్వితీయోదాత్తమును కూడా లక్షించారు. కొందరు రసాదులు అంగముగా ఉన్నప్పటికీ

సవదాద్యలంకారమని అనరు. వారి మతంలో ద్వితీయో
ాత్తము స్వరూపలాభము పొందుతుంది. ఈ విశేషమును
ాచించ డానికి మమ్మట రచన యత్నించినదని గ్రహిం
ాలి. అప్రసక్తముకాని ఈ విషయమును కూడా ప్రస్తుత
ములో భావించాలి. రసాదులు ఇతరములకు అంగములుగా
రూపింప బడిన చోట సాధారణ్యము ద్వారా చిత్తవృత్తి
శేషము లయిన రతిభావాదులు ఆస్వాదగోచరములు
వుతూ ఉంటవి. ఈ రెండవ ఉదాత్తములో అంగముగా
ర్ణింపబడిన మహాపురుష చరితము తాటస్థ్యముతో
స్వాద్య మవుతుందని అభిమానముఉంటే రసవదాద్యలం
ారము కంటె వీనిని వేరుగానే పరిగణించ వచ్చును. విద్యా
ాథుడు అలంకారాలను నిరూపించేటపుడు తనకు అభీష్టము
యిన కొన్నిటినే నిరూపిస్తూ కొన్నిటిని విడిచి పెట్టడమును
లవాటులో ఉంచుకొన్నాడు. ఈ ద్వితీయోదాత్తము
ాడా ఆ దృష్టితో నిరూపితము కాలేదేమో! ధ్వనివాదా
ుయాయులున్నా దీనిని పృథక్కుగా పరిగణించి నందువలన
ద్యానాథుడు నిరూపించక పోవడములోని భావమును
ంతగా అన్వేషింప వలసివచ్చింది.

౭౨ పరివృత్తి

ఉదాత్తాలంకారములో సమృద్ధి ఉండడము ప్రసక్త
యింది. పరివృత్త్యలంకారములో వినిమయము ఉంటుంది.
ుమయము అంటే మార్పు. ఒకటి ఇచ్చి వేరొకటి పుచ్చు
నుట. వినిమయము సమృద్ధి కార్యము కదా! అందువలన
ాత్తాలంకారము తరువాత పరివృత్తి నిరూపణార్హమై
న్నది.

సమన్యూనాధికానాం చ యదా వినిమయో భవేత్
సాకం సమాధికన్యూనైః పరివృత్తి రసౌ మతా

సమము న్యూనము అధికమూ అయిన పదార్థము లకు క్రమముగా సమాధిక న్యూనములతో వినిమయము ఉన్నట్లయితే పరివృత్తి అలంకార మవుతుంది. ఇది మూడు విధాలు. సమానమును ఇచ్చి సమానమును పుచ్చుకొనుట. తక్కువ ఇచ్చి ఎక్కువ పుచ్చుకొనుట. ఎక్కువ ఇచ్చి తక్కువ పుచ్చుకొనుట అని. వీనినే సమపరివృత్తి న్యూనపరివృత్తి అధిక పరివృత్తి అంటారు. సమపరివృత్తిలో త్యాజ్యమానము ఆదీయమానము రెండున్నూ తుల్యగుణములు కలవిగా ఉంటవి కాబట్టి ఔపమ్యము గమ్యముగా గోచరిస్తుంది. ఉదా:—

౧ సుధారసముచో వాచో దత్వా కాకతి భూభుజే
అతో లభంతే కవయః సహస్రం గంధ సింధురాన్,

ప్రతాపరుద్రునకు కవులు అమృతము చిలుకునట్టి వాక్కు లిచ్చి వేయి గంధ సింధురములను ఆతని నుండి పుచ్చుకొను చున్నారు. దీనిలో వాక్కులు సింధురములూ రెండూ సమానములై ఉన్నవి.

౨. ఉపాయనం గజాశ్వాది కృత్వా సర్వేపి భూభుజః
ప్రతాపరుద్ర దేవస్య లభంతే సుస్థిరాం కృపాం

రాజులందరూ ప్రతాపరుద్రునకు గజాశ్వాదులను ఉపాయనముగా చేసి సుస్థిరమయిన కృపను పొందుతున్నారు. దీనిలో త్యాజ్యమానమయిన ఉపాయనము హీనగుణము. స్వీకరింపబడే ప్రతాపరుద్ర కృపా విలసితము ఉత్కృష్ట గుణము. కాబట్టి ఇది రెండవ పరివృత్తి.

౩. ప్రతాపరుద్రస్య రణే జితాః ప్రత్యర్థిభూభుజః
దత్వా భూషాం కిరాతేభ్యో లభంతే వల్కలాదికమ్

ప్రతాపరుద్రుని యుద్ధములో పరాజితులయిన ప్రత్యర్థి రాజులు వనములో కిరాతులకు అలంకారములిచ్చి నారచీరలను తీసుకొంటున్నారు. దీనిలో అధికము ఇచ్చి తక్కువ తీసికొనడము ఉన్నది.

ఒ౩ కారణమాల

ఇటుపై నాలుగు అలంకారములున్నూ శృంఖలా న్యాయ మూలకములు. కేవలమూ శృంఖలగా ఉండడము అలంకారము కాదు. శృంఖలా బంధముతో ఉపచిత్రతమయిన కార్య కారణ భావము విశేషణ విశేష్య భావము విచ్ఛిత్తి విశేషమును సంపాదించేదిగా ఈ అలంకారములలో ఉంటుంది. ఈ విధముగా అంగీకరించక పోతే సాధర్మ్య మూలకములయిన అలంకారాలలో సాధర్మ్యమునే అలంకారముగా పరిగణింప వలసి ఉంటుంది. విరోధమూలకాలంకారాలలో కేవల విరోధమునే అలంకారముగా పరిగణింప వలసి వస్తుంది. ఈ విధముగా చూస్తే మొత్తము మీద ఏడెనిమిది మాత్రమె అలంకారములు కాదగినవిగా పరిగణనములో సిద్ధములవుతవి. కనుక చెప్పబోయే అలంకారములు శృంఖలా బంధోపచితములయిన చమత్కార విశేషము కలిగి ఉంటవని అభ్యూహించాలి.

పూర్వం పూర్వం ప్రతి యదా హేతుః స్యా దుత్తరోత్తరం
తదా కారణమాలాఖ్య మలంకరణ ముచ్యతే

పూర్వ పూర్వము ఉత్తరోత్తరము గురించి క్రమముగా హేతువుగా నిబంధింపబడి నట్లయితే కారణమాల అనే అలంకార మతువుంది. మాలాన్యాయముగా అనేక కారణములు యోగపద్యముతో ఇక్కడ ఉంటవి కాబట్టి కారణ మాల అనేపేరు సార్థకముగా ఉంటున్నది. శృంఖలా

బంధ చిత్రితములయిన ఇతరాలంకారాలకంటె దీనిలో ఇదే విశేషము. ఈ కారణమాలాలంకారము విపర్యయముగా కూడా ఉండవచ్చును. పూర్వ పూర్వమునకు ఉత్తరోత్తరము కారణముగా ఉన్నప్పటికీ ఈ అలంకారమె అవుతుంది. ఉదా:

విద్యయా వినయోత్కర్షో వినయేన గుణార్జనం
గుణైః ప్రజానురాగశ్చ క్రమోయం కాకతీశ్వరే

విద్యచే వినయాతిశయము వినయముచే గుణార్జనము గుణములచే ప్రజానురాగము ఇది కాకతీశ్వరునియందు క్రమము. విద్యాదులు వినయాదులలో హేతువుగా ఉన్నవి. కనుక కారణమాల.

౭౪ ఏకావళి

యత్రోత్తరోత్తరేషాం స్యాత్పూర్వం పూర్వం ప్రతిక్రమాత్
విశేషణత్వ కథన మసా వేకావళీ మతా.

ఉత్తరోత్తరములకు పూర్వ పూర్వములను గురించి క్రమముగా విశేషణత్వమును చెప్పినట్లయితే అది ఏకావళి అలంకార మవుతుంది. ఉత్తరోత్తరము విశేషణముగా ఉండడము రెండు విధాలు. ఒకటి స్థాపన పద్ధతి. మరొకటి అపోహాన పద్ధతి.

ప్రతాపరుద్రనగరీ సుజనై రుపశోభితా
సుజనాః స్ఫీత విభవైః విభవాః స్థైర్యశాలినః.

ప్రతాపరుద్ర నగరి సుజనులతో శోభ కలిగి ఉన్నది. సుజనులు అతిశయిత విభవులు. విభవములు స్థైర్యము కలిగి ఉన్నవి. దీనిలో పూర్వ పూర్వములయిన నగరాదికములకు ఉత్తరోత్తరములయిన సుజనాదికము స్థాపన విధానముతో విశేషణమై ఉన్నది.

నతద్రాజ్యం ప్రజాయత్ర నభవం త్యూర్జితశ్రియః
నతాః ప్రజాః ప్రభుర్యాసాం నస్వయం కాకతీశ్వరః.

అది రాజ్యమె కాదు; ఎచట ప్రజలు ఊర్జిత శ్రీకులు కారో. వారు ప్రజలే కారు; ఎవరికి కాకతీశ్వరుడు ప్రభువు కాదో. దీనిలో పూర్వ పూర్వమయిన రాజ్యాదికమునకు ఉత్తరోత్తర మయిన ప్రజాదికము అపోహన విధానముతో విశేషణముగా ఉన్నది. ఈ ఏకావళి అలంకారములో పూర్వోత్తరములు పరస్పరమూ కూడుకొని ఏక పంక్తి రూపముగా ఉన్నవి కాబట్టి ఏకావళి అనే పేరు సార్థకము.

౬౫ మాలాదీపకము

యదాతు పూర్వ పూర్వస్య సంభవే దుత్తరోత్తరం
ప్రత్యుత్కర్షా వహత్వం తన్మాలాదీపక ముచ్యతే.

ఉత్తరోత్తరమును గురించి పూర్వ పూర్వము ఉత్కర్షను సంపాదించేదిగా ఉన్నపుడు మాలాదీపకా లంకారము అవుతుంది. ఈ అలంకారములో మాలాశబ్దము శృంఖలను గోచరింప చేస్తుంది. మాలోపమలో మాలా శబ్దము వలె ఇచటి మాలాశబ్దమును గ్రహించరాదు. ఒక ఉపమేయమునకు అనేకోపమానములు దీనిలో నిబంధింప బడడము లేదు. దీనిలో ఔపమ్యమె లేదు కదా! కనుకనె మాలాదీపకము దీపకాలంకారములో ఒక భేదమని అనుకోరాదు. దీపకము ఔపమ్య జీవితము. శృంఖలా విధముగా కూడుకొని ఉండడము దీనిలో చారుత్వమును సంపాదిస్తుంది. ఉదా:—

భాగ్యభూమా మహీం ప్రాప్తః కాకతీంద్ర భుజం మహీ
భుజః ప్రతాపమతులం ప్రతాపశ్చ జగత్త్రయం

భాగ్యాతిశయము భూమిని పొందినది. భూమి కాకతీంద్రుని భుజమును పొందినది. భుజము ప్రతాపమును పొందినది. అసమాన ప్రతాపము జగత్త్రయమును పొంది

నది. దీనిలో భాగ్యాతిశయము మొదలయిన వానిచేత భూమ్యాదులకు ఉత్కర్ష నిరూపిత మయింది.

౭౭ సారము

ఉత్తరోత్తర ముత్కర్షః సారాలంకార ఉచ్యతే.

పూర్వపూర్వము కంటె ఉత్తరోత్తరమునకు ఉత్కర్షను నిబంధించుట సారాలంకారము అవుతుంది ఒకే వస్తువునకు ఉత్తరోత్తర సముత్కర్ష చెప్పడము కాని అనేక వస్తువులకు ఉత్తరోత్తర సముత్కర్ష చెప్పడము కాని దీనిలో ఉంటుంది. మొదటి భేదములో అవస్థావిశేషము ననుసరించి పూర్వపూర్వముకంటె ఉత్తరోత్తరమునకు ఉత్కర్షను ఊహించాలి. కాకపోయినట్లయితే ఒకే పదార్థమునకు పూర్వత్వము ఉత్తరత్వము ఏవిధముగా కుదురుతుంది? ఈ ఉత్తరోత్తరము ఉపచయము ఉండుట కూడా స్వరూపము ననుసరించి కాని, ధర్మము ననుసరించి గాని ఉండవచ్చును. మాలాదీపకములో పూర్వము కంటె ఉత్తరము ఉత్కృష్టముగా ఉండదు. ఉత్తరపదార్థమును గురించి పూర్వము ఉత్కర్ష నిబంధనము కావడమె మాలాదీపకములో ఉంటుంది. దీనిలో ఉత్తరోత్తరమునకు ఉత్కర్షనిబంధనము ఉన్నది కనుక సారము అనే పేరు సార్థకము ఉదా :—

జగత్సు వసుధా భాతి తస్యా మేకశిలా పురీ
కాకతీయాన్వయ స్తత్ర తస్మిన్ రుద్రనరేశ్వరః

లోకాలలో భూమి ప్రకాశిస్తున్నది. భూమిలో ఏకశిలాపట్టణము శోభగా ఉన్నది. ఆ పట్టణములో కాకతీయ వంశము రమణీయముగా ఉన్నది. ఆ వంశములో రుద్రనరేశ్వరుడు విలసించుతున్నాడు. ఈ పద్యములో ఉత్తరోత్తర సముత్కర్ష నిరూపిత మయింది.

మిశ్రాలంకార ప్రకరణము

ఇంతవరకు నిరూపించిన ప్రకరణములో ఏకైకా లంకారములు నిరూపితము లైనవి. ఇక ఇటుమీాదట మిశ్రా లంకారనిరూపణము అవసరప్రాప్త మాతున్నది. ఉపమాద్య లంకారములు కొన్ని ఒకచోట కలసి ఉన్నప్పుడు అవి వేరు వేరుగా పర్యవసానము పొందుతున్నవా? లేక ఆ స్థలములో అలంకారాంతర పరిగణనము చేయవలెనా? అని విచా రించ వలసి ఉన్నది. లౌకికములైన అలంకారములు కొన్ని సువర్ణమయములు, కొన్ని మణిమయములు. అవి పరస్పరము సంబంధము లేకపోయినా వేరు వేరుగా సౌందర్యమును సంపాదించేవి కాగలుగుతూనే ఉన్నవి. అవి ఎక్కడైనా ఒక్కొకచోట పరస్పరము సంబంధము కలవైనప్పుడు చారుత్వాతిశయము కన్పడుతూనే ఉన్నది. కంకణము మొదలయినవి సువర్ణాలంకారాలు. హారములు మొదల యినవి కొన్ని మణిమయాలంకారాలు. సువర్ణప్రత్యుప్త రత్నాలంకారములున్నూ ఉంగరము మొదలయినవి ఉన్నవి. సువర్ణములో పొదుపబడిన రత్నాలంకారములను కేవల సువర్ణాలంకారాలని గాని కేవల రత్నాలంకారాలని గాని అనగూడదు. అదే విధముగా కావ్యాలంకారవిషయములో గూడా గ్రహించాలి. రూపకాలంకారము ఉపమాలంకారము వేరువేరుగా సంబంధము లేకుండా ఉన్నప్పుడు సౌందర్య హేతువు లౌతున్నప్పటికీ ఒకచోట పరస్పరము సంబంధము కలిగి ఉన్నప్పుడు సంఘటనాకృతమైన చారుత్వాంతరము

అవశ్యముగా భాసిస్తుంది. అలంకారములకు అటువంటి సంబంధము రెండు విధములుగా ఉంటుంది. ఒకటి సంయోగ రూపము. వేరొకటి సమవాయరూపము. సంయోగములో తిలతండులన్యాయమును, సమవాయములో క్షీరనీరన్యాయమును గ్రహించాలి. భేదము స్పష్టముగా గోచరమైతే సంయోగమని, స్పష్టముగా గోచరము కాకపోతే సమవాయమని గ్రాహిక. తిలతండులవిధముగా అలంకారములు సంబంధము కలవైనప్పుడు సంసృష్టి అనే భేదమును, క్షీరనీరముల విధముగా సంబద్ధములైనప్పుడు సంకరము అనే భేదమును అంగీకరింపవలసి ఉన్నది. ఈ రెండున్నూ వేరువేరుగా చారుత్వాతిశయ హేతువులవుతూ ఉన్నవి. ఈవిధముగానే సంసృష్టి సంకరములను గ్రహించాలి. అంతే గాని పూర్వము చెప్పిన అలంకారముల కంటె ఇవి శేషరూపము లయిన అలంకారాలు అని అనుకోరాదు. దానిలో మొదటగా సంసృష్టి నిరూపణము సముచితము.

సంసృష్టి

తిలతండుల సంశ్లేష న్యాయా ద్యత్ర పరస్పరం
సంశ్లిష్యేయు రలంకారాః సా సంసృష్టి ర్నిరూప్యతే.

తిలతండులముల న్యాయానుసారముగా రూపకాద్యలంకారములు పరస్పరము సంబంధము కలిగి ఉంటే సంసృష్టి అలంకారము అవుతుంది. నువ్వులు బియ్యము కలిపినపుడు వేని కవి విశదముగా కనపడుతూనే ఉంటవి. ఆ విధముగానే సంసృష్టములైన రూపకోపమాదులు విడివిడిగా గోచరము లవుతవి. శబ్దాలంకారగతము అర్థాలంకారగతము ఉభయాలంకారగతము అని ఈ సంసృష్టి మూడు విధాలు.

౧ క్షుంభత్సంభ్రమ గంధసింధుర ధురా నిర్దారితోర్వీతలాః
త్వంగత్తుంగ తురంగమ ప్రతిభయా ద్రాక్స్యందన స్యందనాః
తీవ్రారంభ సముద్యదుద్భట భటాటోప స్ఫురద్దిక్తటాః
నిస్సీమాః ప్రసరంతి రుద్రనృపతేః జైత్రప్రయాణోద్యమాః.

ప్రతాపరుద్రుని జైత్రప్రయాణప్రయత్నములు నిస్సీమములై ప్రసరిస్తున్నవి. దీప్యమానములైన గంధసింధురముల భారముచేత భూమి బ్రద్దలవుతున్నది. ఎగురుతు ఉన్న ఉన్నతాశ్వములు భయంకరములుగా ఉన్నవి. రథములు శీఘ్రముగా పరుగెత్తుతున్నవి. తీవ్రారంభము కలిగిన మహాభటుల ఆటోపము దిక్తటములను చెదరగొట్టుతున్నది. ఈ పద్యములో ఛేకానుప్రాస వృత్త్యను ప్రాసలకు సంసృష్టి గ్రహించాలి.

౨. కాకతీయచమూ ర్ధత్తే మహిమాన ముదన్వతః
గ్రసతే యా ద్విషద్భూప ధ్వజినీ స్తటినీ రివ

ప్రతాపరుద్రసేన సముద్రమహిమను ధరిస్తున్నది. ఆ సేన శత్రురాజసేనలను సముద్రము నదులను వలె గ్రసిస్తున్నది. పూర్వార్ధములో నిదర్శనాలంకారము, ఉత్తరార్ధములో ఉపమాలంకారము సంసృష్టములై ఉన్నవి. పరస్పరము ఇవి నిరపేక్షములుగా ఉన్నందున తిలతండులన్యాయసాదృశ్యము ఉన్నది. దీనిలో రెండు అర్థాలంకారముల సంసృష్టి భావనీయము.

౩ ప్రతాపరుద్ర దోర్దండో మండలాగ్రేణ మండితః
దృశ్యతే సమరే వీరైః ఉత్ఫణః ఫణవానివ.

ఇది ఉభయసంసృష్టికి ఉదాహరణము. ఖడ్గశోభితమైన ప్రతాపరుద్రుని దోర్దండము పడగతో కూడుకొన్న

పాము వలె యుద్ధములో వీరులచే చూడబడుచున్నది. ఈ పద్యములో వృత్త్యనుప్రాస ఉపమాలంకారములకు సంసృష్టి ఉన్నది.

సంకరము

క్షీరనీరనయా ద్యత్ర సంబంధః స్యా త్పరస్పరమ్
అలంకృతీనా మేతాసాం సంకరః స ఉదాహృతః,

క్షీరనీరన్యాయానుసారముగా అలంకారములకు పరస్పరము భేదము స్పష్టముగా నిరూపితమై ఉన్నట్లయితే సంకరాలంకారము అవుతుంది. నీరు పాలు కలయిక స్పష్టముగా గోచరము కాదు. సంకీర్ణములైన అలంకారముల కలయిక కూడా బాగా భాసించదు. ఈ సంకరము మూడు విధాలు. అంగాంగిభావ సంకరము, సందేహ సంకరము, ఏక వాచకానుప్రవేశ సంకరము అని. అంగాంగిభావసంకరమునే అనుగ్రాహ్యానుగ్రాహకభావ సంకరమని అంటారు. ఒక అలంకారమునకు స్వరూపము సంపాదించడానికి వేరొక అలంకారము అంగముగా ఉండి ఉపకరించుతుంది. ఇటువంటి స్థలములో మొదటి సంకరము. సందేహసంకరములో సంకీర్ణములైన అలంకారములలో నిర్ణయము చేయడానికి అవకాశము ఉండదు. ఆ అలంకారమగునా ? ఈ అలంకారము అగునా ? అని సందేహము కలుగుతుంది. మూడవసంకరములో ఒకే వాచకమునందు రెండు అలంకారములు అనుప్రవేశము పొంది ఉంటవి.

౧. ఉద్యద్బృంహిత గర్జితైః ద్విపఘటా కాదంబినీ సంభ్రమైః
క్షోణీభృత్కటకోపరోధ పటుభిః ప్రావృడ్విహారా ఇవ
శత్రుస్త్రీ బహులాశ్రువృష్టి శమిత క్ష్మాచక్ర తాపోదయాః
యాత్రాః కాకతివల్లభస్య జగతా మానంద మాతన్వతే

ప్రతాపరుద్రుని జైత్రయాత్రలు జగత్తునకు ఆనందమును కలుగజేస్తున్నవి. ఆ యాత్రలు వర్షావిహారముల వలె ఉన్నవి. వర్షమువలెఉన్న శత్రుస్త్రీల కన్నీటి చేత భూమిలోని తాపము శమింపజేయబడినది. గర్జితముల వంటి బృంహితములు కలిగి క్షోణీభృత్కటకములను [రాజులశిబిరములు, పర్వతములచరియలు] అడ్డుపెట్టగల మేఘమాలవంటి గజసమూహముల సంభ్రమములు కలవై యాత్రలు జగదానందకములై ఉన్నవి. దీనిలో రెండు ఉపమాలంకారములకు అంగాంగిభావసంకరము ఉన్నది. ఒకటి సమాసగతోపమ, వేరొకటి వాక్యగతమైన ఉపమ. వాక్యగతోపమ అంగి. సమాసగతోపమ అంగము. "ప్రావృడ్విహారా ఇవ" అనే వాక్యగతమైన ఉపమాలంకారము ఉన్నందు వలననే 'గజఘటాకాదంబినీ' అనే చోట సమాస గత మయిన ఉపమ సాధిత మవుతున్నది. 'గజఘటాకాదంబినీ' అన్నప్పుడు ఉపమితసమాసమును ఆశ్రయించాలి. 'క్షోణీభృత్కటకోపరోధ' అనేస్థలములో శ్లేషమూలక మయిన అతిశయోక్తి ఉన్నది. ఈ అతిశయోక్తి సమాసగతోపమాలంకారమునకు అంగము. ఇట్లా అతిశయోక్త్యనుగృహీత మయిన సమాసగతోపమ వాక్యగతోపమకు అనుగ్రాహకముగా ఉన్నందు వలన ఇది అనుగ్రాహ్యానుగ్రాహక భావ (అంగాంగిభావ) సంకరము. అంగాంగులయిన ఉపమలు రెండూ సజాతీయములు కాబట్టి ఇది సజాతీయ సంకరము.

ప్రతాపరుద్రస్య కృపాణధారా ప్రత్యర్థిఫాలేషు పతత్యమందం
ప్రక్షాళనాయేవ కృతసం ధాత్రా తదీరితో దుర్లిపికలుషసం

ప్రతాపరుద్రుని ఖడ్గధార శత్రురాజుల ఫాలములపై బ్రహ్మ అక్కడ ఏర్పాటు చేసిన దుర్లిపికల్మషమును కడిగి వేయడానికో అన్నట్లు వేగముగా పడుతున్నది. ఈ పద్యములో విజాతీయములయిన అలంకారాలకు అంగాంగిభావ సంకరము ఉన్నది. "ప్రక్షాళనాయేవ" కడగడానికో అన్నట్లు అనేచోట ఉన్న ఉత్ప్రేక్ష 'దుర్లిపికల్మషస్య' అనేరూపకమును ప్రసాధనము చేస్తున్నది. దుర్లిపియందు కల్మషారోపము ఉంటేనే ప్రక్షాళనము ఉపపన్న మవుతుంది. స్పష్టనిరూపిత మయిన ఉత్ప్రేక్ష కల్మషారోపరూపమయిన రూపకమున్నూ పరస్పరమూ సహకారము కలిగి ఉన్నందు వలన విజాతీయ సంకరము.

ఏకవాచకానుప్రవేశ సంకరము

విజితారిపురో మూర్త్యా విలసత్సర్వమంగళః
భువి శంభు రివాభాతి కాకతీయనరేశ్వరః.

విజితారిపురుడూ స్వరూపములో విలసత్సర్వమంగళుడూ అయిన కాకతీయనరేశ్వరుడు భూమియందు శివుని వలె ప్రకాశిస్తున్నాడు. దీనిలో విజితారిపుర అనే చోట అర్థసామ్యము ఉన్నందు వలన ఉపమాలంకారము. విలసత్సర్వమంగళః అని శబ్దసామ్యము వలన శ్లేషాలంకారమున్నూ 'శంభురివ' అనేచోట ఉన్న ఒక 'ఇవ' శబ్దములో అనుప్రవేశము పొంది ఉన్నవి కాబట్టి ఏకవాచకానుప్రవేశ సంకరము.

సందేహ సంకరము

జాతః ప్రతాపరుద్రేందుః కాకతీయాన్వయాంబుధౌ
ధత్తే జనచకోరాణాం ప్రసాదజ్యోత్స్నయామృతం.

కాకతీయకులాంబుధిలో పుట్టిన ప్రతాపరుద్రేంద్రుడు జనచకోరములకు ప్రసాద చంద్రికచే అమృతమును దానము చేస్తున్నాడు. ఈ పద్యము లోని నాలుగు పదాలలో రూపక సమాసమా? ఉపమితసమాసమా? అని సందేహము కలుగుతుంది. "ప్రతాపరుద్ర ఏవ ఇందుః, ప్రతాపరుద్రః ఇందు రివ- కాకతీయాన్వయ ఏవ అంబుధిః, కాకతీయాన్వయః అంబుధి రివ- జనా ఏవ చకోరాః, జనాః చకోరా ఇవ- ప్రసాద ఏవ జ్యోత్స్నా, ప్రసాదః జ్యోత్స్నా ఇవ" అని సమాసద్వయము సంభవించడానికి అవకాశము ఉన్నది కదా! రూపకోపమలలో ఒకే దానిని సాధించడానికి సాధక (అనుకూల) ప్రమాణము కాని, బాధక (ప్రతికూల) ప్రమాణము కాని లేదు. అందువలన సందేహమె పర్యవసన్నమవుతున్నది. దేనినీ నిర్ణంచడానికి వీలులేదు కాబట్టి సందేహ సంకరము. సాధకము కాని బాధకము కాని ఏదయినా ఉంటే సందేహ నివృత్తి కలుగుతుంది.

ప్రతాపరుద్రనృపతేః పారిజాతాత్ సముద్భవాః
వతంసయంతి దిఙ్నార్యో మధురాః కీర్తిమంజరీః

ప్రతాపరుద్రనృపతి అనే పారిజాతము నుండి పుట్టిన మధురములయిన కీర్తులనే మంజరులను దిగంగనలు అవతంసముగా చేసికొంటున్నారు. దీనిలో "కీర్తయ ఏవ మంజర్యః" అనేచోట రూపలంకారమని నిశ్చయించడానికి 'వతంసయంతి' అని సాధకమయిన ప్రమాణము ఉన్నది. అవతంసీకరణమనేది మూర్తమయిన మంజరియందే సంభవ మవుతుంది కాని కీర్తియందు సంభవించదు. రూపకసమాసమును అంగీక

రిస్తేనే మంజరీప్రాధాన్యము ఉంటుంది కాబట్టి వతంసీకరణము కుదురుతుంది. ఉపమితసమాసమయితే కీర్తిప్రాధాన్యము ఉంటుంది. కనుక వతంసీకరణము కుదరదు. ఇక్కడ ఈ అనుకూలప్రమాణమును అనుసరించి రూపకనిర్ణయము చేయవచ్చును. అవతంసీకరణము ఇక్కడ ఉన్నందువలన కీర్తిమంజరులకు అభేదప్రతిపత్తి కలుగు తున్నది. అంతేకాని ఉపమాలంకారములో మాదిరిగా భేదాభేదప్రతీతి కలగడము లేదు.

కాకతీంద్రస్య నిస్సాణధ్వనౌ దిక్షు విజృంభితే
వ్యాకులీకృతసత్త్వోఽభూత్ ప్రతిపక్షబలార్ణవః

కాకతీంద్రుని భేరీధ్వని దిక్కులలో విజృంభించగానే ప్రతిపక్షబలార్ణవము వ్యాకులపడిన సత్త్వములు కలది అయింది. దీనిలో ప్రతిపక్షబలార్ణవః అనే చోట ఉపమా సమాసమును అంగీకరించడానికి వీలులేదు. 'వ్యాకులీకృత సత్త్వః' అనే బాధకప్రమాణము ఉన్నందువలన "ప్రతిపక్ష బలం అర్ణవ ఇవ" అని ఉపమితసమాసము కుదరదు. 'ఉపమితం వ్యాఘ్రాదిభిః సామాన్యాప్రయోగే" అనే వ్యాకరణానుశాసనము వలన సామాన్యధర్మప్రయోగము ఉన్నప్పుడు ఉపమితసమాసమును అంగీకరించ రాదని, సామాన్య ధర్మప్రయోగము లేనప్పుడే ఉపమిత సమాసమును స్వీకరించాలని తేలుతున్నది. కాగా ఇక్కడ సామాన్యధర్మ ప్రయోగము ఉపమాబాధకముగా ఉన్నది కాబట్టి ఉపమను స్వీకరించడానికి వీలులేదు. ఇక మిగిలిన రూపాలంకారమునే ఈ పద్యములో నిశ్చయించాలి. అలంకారాంతరములతో

సంసృష్టి సంకర విశేషాలను వేరుగా ప్రబంధాంతరములలో గ్రహించాలి. వివేకులకు ఇంత మాత్రపు నిరూపణమె చాలు.

యదున్మీలనసంపత్తి
సముల్లాసః శ్రియః కళా
వందే తాం పరాం దేవీం
స్వాత్మభావేన సాహితీం.

★

*P*rinted at Kalyani *P*ress, Tenali. Q. H. G. 79 A
For Navya Sahitya *P*arishat, Guntur Q. H. No. G. 80

శోధిక

1- 20 బాధించేది
2-22 యదప్రయుక్తంకవిభి
రప్రయుక్తంతదుచ్యతే
3-1 ప్రతాపరుద్ర శత్రు
3-24 ప్రయుక్తమయితే
4- 8 వ్యర్థబాహు
4- 9 తము కాగా;
4-13 అసమర్థను
6-18 సందిగ్ధార్థ
7- 7 సమర్థము కానపుడు
9-13 అప్రసిద్ధార్థములో
10-8 పారిభాషికము
14- 25 శంకించవచ్చు
15-13 శాబ్దో వా
20-23 పునరుక్తపదాభాస
22-14 ఉంచుకోలేదో
23- 5 ర్బంధుమత
27-14 పదార్థము
28-10 విచ్ఛేదము
30-19 రసానికి
31-10 లుప్తము
32- 5 ఇటువంటివి
33-12 అందుచేత వాచ్య
35-22 స్త్రియః
39- 5 రార్థము
39- 9 ఉన్నప్పుడు;
40-13 తర్వణం

47- 8 శిఖాటోపఇవే
48-12 అశ్లేష్టుమన్యతో
51-19 జీవించుతున్నారు.
57- 9 ఉంటుంది.
57-1: సరసత
58-15 సుధామధు
61- 2 స్వేచ్ఛగా
63- 6 ధనోర్వోర్వ్యై
64- 7 అవిశ్లాఘ్య
65-17 శ్రీహరి మూడు
65-22 వ్యుత్పత్తి
70-22 స్పష్టముగా
72- 3 చంద్రమకుట
72-22 దృష్టాకమలాసక్తి రాజ్ఞ
స్తథాసుభగ చిత్ర
చరితస్య భాస్వాన
పిత్వంతాం కువలయ
లక్ష్మీం ప్రసాధయసి
73-16 చూస్తున్నాడు
76- 8 సహముకాదు
76-17 అనాలికదా !
78- 5 అంతర్భవింపవని
81- 1 సంఘటనా
81-24 అరవైఆరు
83- 8 నిరూపితాను
83-25 మవృతా
86-20 సాధర్మ్యము

88- 5 భాసిస్తుంది
89-21 ఉండి
92-10 (కులాయము)లో
96-16 తిరుగుతూ ఉంటే
,, కలుగుతుం
97- 3 పౌనరుక్త్యతు
97-11 అవృత్తము కావడము
99- 8 కాకతీంద్రో
100-2 అధికచర్చ
101-8 వ్యంగ్యపర
103-14 అదిఅట్టే
104- 8 మానజ్ఞా-సాధకులు
108-18 లక్షణాధారము
110-21 సమ్మతేన
112 7 చేస్తున్నారు
116-17 కాని వానికి
117-21 వేరొక విధముగా ఉపపన్నముకాక ఈవిధానము వలననే
123-16 లుప్తోపమ
126-21 బాహుశాయయాతే
131-25 కలగదని
132-14 అలకాపురీ
132-16 నమస్కరించుతున్నారు.
137-22 అంగీకరిస్తూ
138- 8 జ్యోత్స్నయంతి
138-10 (ఉపమేయమునకు)
138-18 జ్యోత్స్నయంతి
139- 5 కల్పశాఖి
139- 8 అనేది
139-18 సామాన్య ధర్మ
144-13 ఎవనికి
144-17 భీమసేన
145-17 వ్యుత్పాదకములు
147- 5 కకుత్స్థుల
150- 3 మాననిర్దేశము
150-10 వ్యంగ్యముగా
160-13 ప్రకృతరూపమును (ప్రకృతాంగత్వమును)
161-21 సావయవరూప
162-19 ఆరోపవిషయములు
163-23 కల్పశాఖిత్వము
164-23 కవికి
165-12 ప్రవిదల
165-13 శ్రుత్యైవ
167-10 సాపేక్షరూపకము పరంపరిత రూపకమని అనేక రూపక సాపేక్ష రూపకము సమస్త
170-19 సంపత్తిని సంధానించడములో సమర్థుడయిన ప్రతాపరుద్రుడు అక్షయ స్వర్ణసంపత్తిని సంపాదించే
172- 2 ధూమ్యాదులు
172-11 జిహ్వావాత్యా
174- 8 మాణము పరిణామములో
175- 1 (ప్రకృతాంగత్వమును)
176- 8 సామానాధికరణ్య
177-2 అరిక్షితీ-ద్రాః

178-6 సంబంధించి
178-15 సంపత్ప్రదం
178- 8 వికల్ప్యతే
182- 5 పదార్థమును
183-10 నిషేధించి అన్యారోప
మును నిబంధించితే
184- 5 ఉన్నది కనుక
189- 9 కాకతీంద్ర
187-13 రజ్జువును
193-20 ప్రభరిత
198-21 పరాగరేఖ
201- 3 విస్మారితా
204- 1 దర్శనక్రియా
206-17 సంప్రతి
220-11 అని విద్యాసాధుని
220-29 ధర్మములకు
22;- 7 సాయము అని
221-20 చాత్రాతిశయాఖ్య
221 పుట ప్రారంభములో
"ఇంతగా ఇద"
మొదలు
222 పుటలోని
"మనవి చేస్తున్నాను"
అనేవరకు ఉన్న గ్రంథ
మును 221 పుట చివర
పూరణాంశముగా పఠించ
చాలి.
223-11 సమం మొదలయినవి.
224- 6 వాస్తవము
2.5-15 చెప్పడమనే

228-15 విశేషమును
228-22 కంఠరజ్జువు
235-17 సాలంకారా
237-17 వేరొకడు
240-13 కళవాడుగా
240-22 సామ్యము
240-22 కాబట్టి వ్యాజోక్తికి
254- 1 పాణ్యయోః
264-16 అనర్థప్రాప్తి
265-17 సిద్ధించడము
267- 2 కలనసె
270-24 గతమని
271-18 వాక్యార్థము పదార్థముల
ద్వారా
273-12 ప్రతిష్ఠా
275- 7 ఇది ఇట్లా రెండు
276-12 లాక్షాభ్యాం
278-11 గుణముఖముగా
280- 8 అప్రస్తుతమును
283- 1 సాధుమార్గము
284-15 వ్యంగ్యము
285-25 మవుతుంది
286- 2 సంబంధించి
288-18 ఆభాసరూపము కాగా
289- 1 ఆక్షేపము యొక్క ఒక
భేదము ఉన్నది.
290-10 అభ్యసిస్తున్నానులె.
29,-16 సముద్రాలు ప్రవేశించు
తున్నారు.
292- 4 అదెప్పుడయినా

293-24 భ్రమరగణైః
299-16 కొంత విశేషము ఉన్నది. ఇవి
300- 9 సంబంధించి
300-11 విధముగా
302-24 సమర్థకభావము
305- 2 సమర్థనార్థముగా
305-12 ప్రతాపరుద్రునకు
308-18 మమంస్త
314- 9 గోత్రభిత్కథా
315-21 విశదోధర్మ
316-23 సముచ్చయాలంకార
320-18 విచ్ఛాయానన
329- 6 ప్రతీయమానో
331-15 అనడములో
332-20 బాహువుల నుండి
333-21 ఆద్యోర్వీపతి
335- 5 కారముల ద్వారా
335-16 అని నిరూపిత
336-13 తత్త్వాగలీలా
336-16 ఉండి
337- 8 మహాత్ముల
337-17 కారములలోనే
338-11 దీనిని
339- 5 పరివృత్తి
340- 8 ఉపచిత్రిత
345-14 వీనిలో
345-18 రూప్యతే
346-18 రెండూ సంసృష్ట
348-13 సమాసగత
350-22 రూపకాలంకార
351- 9 విజృంభితే
352- 6 వందేఽహం తాం పరాం దేవీం.